
బుధవారం 13-12-2023

సత్యమేవ జయతే
సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 88


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'


భారత్ అదరహో
జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీలో సెమీస్‌లోకి..
- 12లో


పరిశ్రమలు రయ్.. ధరలు షాక్!
అక్టోబర్‌లో పారిశ్రామిక వృద్ధి 11.7%..
నవంబర్‌లో ద్రవ్యోల్బణం 5.55%
-13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


తొలిసారే సీఎం పదవి
మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన భజన్‌లాల్ శర్మను రాజస్తాన్ నూతన ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నట్లు బీజేపీ ప్రకటించింది.
వివరాలు 6లో ▸


పాక్ ఆర్మీపై ఆత్మాహుతి దాడి
పాకిస్తాన్‌లో ఆర్మీ పోస్టుపై తాలిబన్ ఉగ్రమూకలు జరిపిన ఆత్మాహుతి దాడుల్లో 23 మంది సైనికులు మృతి చెందారు.
వివరాలు 6లో ▸


చరిత్ర తెలియక తిరగరాస్తున్నారు
మాజీ ప్రధాని నెహ్రూపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపణలను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పబట్టారు.
వివరాలు 6లో ▸


...మనీ హేస్ట్ ఎందుకు?
వెబ్‌సిరీస్ 'మనీ హేస్ట్'ను ఐటీ సోదాల్లో దొరికిన రూ. 351 కోట్ల ఉదంతంతో పోలుస్తూ కాంగ్రెస్‌ను మోదీ విమర్శించారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

2040 కల్లా చంద్రుడి పైకి..



చంద్రుడిపై 2040వ సంవత్సరం నాటికి భారత వ్యోమగామి అడుగుపెట్టేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు ఇస్రో చీఫ్ ఎస్.సోమనాథ్ చెప్పారు. వ్యోమగాములుగా తీర్చిదిద్దేందుకు భారత వాయుసేనకు చెందిన నలుగురు పైలట్లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.
వివరాలు 6లో ▸

బదల్తా కశ్మీర్



14 సంవత్సరాల ర్యాపర్ హుమైరా జా విడుదల చేసిన 'బదల్తా కశ్మీర్' పాట మార్పును ఆహ్వానిస్తూ కొత్త ఆశను రేపుతోంది. 'కశ్మీర్ మారుతోంది.. అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది' అంటూ ఆమె పాడిన పాటను భారత ప్రభుత్వం ఇన్‌స్టాలో షేర్ చేసింది.
వివరాలు 11లో ▸

దొంగలు దూరారు!

టీడీపీ సానుభూతిపరులు.. వేర్వేరు చోట్ల ఓటర్లుగా నమోదు

కుప్పం సహా 175 నియోజకవర్గాల్లో 40.76 లక్షలకు పైగా బోగస్ ఓట్లు

అధికార పార్టీ ఓటర్లపై గురి

- కుప్పలు తెప్పలుగా ఫారం 7 దరఖాస్తులు.. విచారణ జరిపి ఆ దరఖాస్తులన్నీ నకిలీవని తేలుస్తున్న బీఎల్వోలు
- దీంతో ఎన్నికల యంత్రాంగంపై దాడులకు తెగబడుతున్న పచ్చమూకలు.. నకిలీ ఓట్లను కొనసాగించేందుకు 8 జిల్లాల్లో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
- కలెక్టర్లపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు
- 2014 ఓటర్ల జాబితాలో సుమారు 35 లక్షలకుపైగా దొంగ ఓట్లు
- వాటిని అడ్డం పెట్టుకుని నాడు ఐదు లక్షల ఓట్ల తేడాతో అధికారంలోకి టీడీపీ

2లో



ఒకే ఇంటి నంబరుపై వందల ఓట్లు

- కర్నూలు జిల్లా ఆదోని మున్సిపాలిటీ పోలింగ్ బూత్ 223 పరిధిలో 17/836 ఇంటి నంబరుతో ఏకంగా 594 ఓట్లను చేర్పించారు.
- నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం తంబాలగుంట (పోలింగ్ బూత్ నంబర్ 34)లో 1-10 ఇంటి నంబరులో 360 ఓట్లను చేర్పించారు.
- ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గంలోని రామన్నగూడెం (పోలింగ్ బూత్ నంబర్ 161)లో 1-26 ఇంటి నంబరుపై 300 ఓట్లు చేర్పించారు.
- అనంతపురం జిల్లా గుంతకల్లు మున్సిపాలిటీలో పోలింగ్ బూత్ నంబరు 73 పరిధిలో ఇంటి నంబరు 13/165లో 154 ఓట్లను చేర్పించారు.

ఉద్దానానికి ఊపిరి



- దశాబ్దాల మహమ్మారికి సీఎం జగన్ శాశ్వత పరిష్కారం
- కిడ్నీ బాధితుల కోసం రూ.742 కోట్లతో వైఎస్సార్ సుజలధార
- ఇక ఇంటింటికీ కుళాయిల ద్వారా సురక్షిత మంచినీరు సరఫరా
- రక్షణ కవచంగా వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి ఏర్పాటు
- అత్యాధునిక పరికరాలతో సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు
- రేపు సీఎం చేతులు మీదుగా ఈ ప్రాజెక్టుల ప్రారంభానికి ఏర్పాట్లు
- గతంలో కిడ్నీ బాధితులపై చిర్రుబుర్రులాడిన చంద్రబాబు
- మరోవైపు.. డ్రామాలకే పరిమితమైన పవన్‌కళ్యాణ్

3లో

ఉదారంగా ఉండాలి

నిబంధనలు సడలించైనా సరే రైతన్నకు న్యాయం చేయాలి



పంట నష్టం, ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలో అధికారులకు సీఎం వైఎస్ జగన్ ఆదేశం

- అన్నదాతలూ ఆందోళన చెందొద్దు..
- ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుంది
- రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేస్తుంది
- ప్రతి గింజనూ కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదే.. 18 వరకు పంట నష్టం లెక్కింపు.. నెలాఖరుకు తుది జాబితాలు
- సంక్రాంతిలోగా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ

5లో

అనకాపల్లి జిల్లా చోడవరంలో జరిగిన సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



బడుగుల రాజసం

- వైఎస్సార్ జిల్లా రాజంపేట, అనకాపల్లి జిల్లా చోడవరంలో ఘనంగా సామాజిక సాధికార బస్సు యాత్ర
- భారీగా తరలివచ్చి కదంతొక్కిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు
- సాధికార యాత్రలో బైక్ ర్యాలీలతో యువత సందడి
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన సభా ప్రాంగణాలు

- వివరాలు 2లో

వైఎస్సార్ జిల్లా రాజంపేట, అనకాపలి జిల్లా చోడవరంలో సాధికార నినాదం హోరెత్తింది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఆర్థికంగా, సామాజికంగా సాధికారత సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు కదం తొక్కి.. వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రలను విజయవంతం చేశాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతూ.. 'చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను మోసం చేస్తే.. సీఎం జగన్ అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడం ద్వారా పేదరికాన్ని రూపుమాపుతున్నారు' అని చెప్పారు.

ఏపీలో సూక్ష్మ సేద్యం భేష్



- దేశంలో నాలుగో స్థానంలో ఏపీ
- చంద్రబాబు హయాంలో దయనీయస్థితిలోకి సూక్ష్మ సేద్యం
- రైతులకు రూ.969 కోట్లు ఎగ్గొట్టిన చంద్రబాబు.. సూక్ష్మ సేద్యాన్ని గాడిలో పెట్టిన సీఎం వైఎస్ జగన్
- చిన్న, సన్నకారు రైతులకు ప్రోత్సాహం.. రాయితీపై పరికరాలు
- పరికరాలపై జీఎస్టీ రూ.60 కోట్లూ భరించిన ప్రభుత్వం
- జగన్ సర్కారు చర్యలతో వేగంగా విస్తరించిన సూక్ష్మ సేద్యం
- దేశంలో మొత్తం సూక్ష్మ సేద్యంలో ఏపీలో 10.96 శాతం.. రాష్ట్రంలో 9.10 లక్షల హెక్టార్లలో సేద్యం
- పార్లమెంట్‌లో ప్రకటించిన కేంద్రం

10లో



పోస్టుకు పది మంది

- వీఏహెచ్‌ఏ పోస్టులకు ముగిసిన దరఖాస్తు గడువు
- 1,896 పోస్టులకు 19,323 మంది దరఖాస్తు
- 27 నుంచి హాల్‌టికెట్లు..
- 31న కంప్యూటర్ ఆధారిత పరీక్ష

- వివరాలు 5లో



ప్రవేశాలు పెరిగాయ్

- రాష్ట్రాలవారీగా గణాంకాలను వెల్లడించిన ఆర్బీఐ నివేదిక
- అన్ని తరగతుల్లోనూ భారీగా పెరిగిన స్థూలనమోదు నిష్పత్తి
- బాలురుతో పాటు బాలికల నమోదు నిష్పత్తిలోనూ పెరుగుదల
- రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా విద్యా సంస్కరణల ఫలితం

- వివరాలు 10లో



కనుల పండువగా 'కొండమెట్ల దీపోత్సవం'



విశాఖ జిల్లా పద్మనాభంలో మంగళవారం అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం వైభవంగా జరిగింది. 1,288 మెట్లకు ఇరువైపులా భక్తులు వెలిగించిన తైల దీప కాంతులతో అనంత పద్మనాభుని గిరి దేదీప్యమానంగా వెలుగొందింది. - పద్మనాభం(విశాఖ)

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మనో నేత్రంతో చూస్తున్నా..

ప్రసవ సమయంలో దురదృష్టం నన్ను వెంటాడింది. ఎందుకో ఏమో తెలియదు గానీ, ఉన్నట్లుండి ఒక కన్ను చూపు కోల్పోయింది. ఒక కన్ను ఉందిలే.. పర్వాలేదు.. దానితో సరిపెట్టుకుందామనుకున్నా. నా దరిద్రం కొద్దీ కొన్నాళ్ల తర్వాత ఆ కన్నూ పోయింది. కర్నూలు జిల్లా హొళగుందలోని పెద్ద మసీదు వీధిలో నేను ఉంటున్నా. నా భర్త మహేశ్. మాకో కూతురు. నాకు కంటి చూపు పోగానే నా భర్త వదిలేశాడు. గతిలేక పుట్టింటికి వచ్చాను. మా అమ్మ బాగానే చూసుకుంది. కానీ, దేవుడు మళ్లీ నా మీద పగ పట్టాడేమో.. నాకు ఉన్న ఏకైక దిక్కు మా అమ్మను కూడా అందని లోకాలకు తీసుకుపోయాడు. ఇప్పుడు నేను, నా కూతురు.. ఒకరికి ఒకరం తోడుగా మిగిలాము. ఇద్దరు సోదరులున్నా, వారి బతుకులు వారివి. రూపాయి ఆదాయం లేదు.. ఎలా బతకాలి? చచ్చిపోతే మేలనుకున్నా. 'తల్లివైన నీవే కుంగిపోతే నీ కూతురు ఐశ్వర్య పరిస్థితి ఏంటి? కూతురు కోసం నువ్వు కష్టాలకు ఎదురీది బతకాలి' అని చుట్టుపక్కల వాళ్లు ధైర్యం నూరిపోశారు. అదే సమయంలో జగనన్న రూపంలో నా కుటుంబానికి పెద్ద దన్ను దొరికింది. పిల్లలను చదివిస్తే డబ్బులిస్తారని చెప్పారు. నా గారాలపట్టి ఐశ్వర్యను ఊర్లోని బడిలో వేశా. ఇప్పుడు ఆరో తరగతి



చదువుతోంది. అమ్మ ఒడి కింద ఏటా 15,000 రూపాయలు ఆర్థిక తోడ్పాటు లభిస్తోంది. వికలాంగ పింఛన్ కింద ప్రతి నెలా రూ.3 వేల పింఛను వస్తోంది. సరిగ్గా 1వ తేదీన వలంటీరే మా ఇంటి వద్దకు తెచ్చి ఇస్తున్నారు. ఐశ్వర్యకు పాఠశాలలోనే మధ్యాహ్నం మంచి భోజనం పెడుతున్నారు. పాఠశాల కూడా చాలా బాగుంటుందని మా పిల్లతో పాటు ఆమె స్నేహితులు చెప్పారు. ఈ ప్రభుత్వం రంగులు వేయించి, కొత్త కుర్చీలు, టేబుళ్లు సమకూర్చిందని తెలిపారు. వాటిని నా మనోనేత్రంతో చూస్తున్నా. చాలా సంతోషంగా ఉంది.

– కె.మహంకాళమ్మ, హొళగుంద, కర్నూలు జిల్లా
(గవిని శ్రీనివాసులు, విలేకరి, కర్నూలు)

కళ్యాణమస్తుతో పెళ్లి జరిపించాం..

అమ్మాయికి పెళ్లీడు వచ్చింది. చేతిలో చిల్లి గవ్వ లేదు. ఏం చేయాలో పాలుపోలేదు. దేవుడిపైనే భారం వేశాం. ఆ సమయంలో కళ్యాణమస్తు పథకం మాకు తోడుగా నిలిచింది. మాది బాపట్ల జిల్లా వేటపాలెం మండలం దేశాయిపేటలోని విజయనగర్ కాలనీ. నా భర్త సత్యాల మరిదాసు రోజూ బేల్దారి పనులు చేసి తీసుకొచ్చిన కూలి డబ్బులతోనే జీవనం సాగిస్తున్నాం. ఒక్కోసారి పనులు దొరక్క ఇంట్లోనే ఉండేవారు. అప్పుడప్పుడు పనులకు వెళ్లేవాడు. ఆ వచ్చే డబ్బులు మా జీవనానికి సరిపోయేవి కావు. మాకు ఇద్దరు పిల్లలు. ఆయన తెచ్చే డబ్బులతో పెద్ద చదువులు చెప్పించలేక ఇబ్బంది పడ్డాం. ఆ సమయంలో అమ్మ ఒడి పథకం భరోసా ఇచ్చింది. పాపను ఇంటర్ వరకు చదివించాను. మంచి సంబంధం రావడంతో పెళ్లి చేయాలని భావించాం. అప్పుడు వైఎస్సార్ కళ్యాణమస్తు పథకంతో మాకు ధైర్యం వచ్చింది.



వలంటీర్ సహాయంతో గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేశాం. వెంటనే ప్రభుత్వం మాకు రూ. లక్ష మంజూరు చేసింది. పెళ్లికి చేసిన అప్పులను ఆ డబ్బులతో తీర్చేశాం. అసలు ఈ పథకమే లేకపోయింటే పెళ్లి ఎలా జరిపించేవాళ్లమో ఊహించుకుంటేనే భయమేస్తోంది.

– సత్యాల పుష్పలీల, దేశాయిపేట
(దగ్గుమాటి శ్రీధర్ రెడ్డి, విలేకరి, వేటపాలెం)

ఎవరి సిఫారసు లేకుండా పింఛన్

మా ఆయన చనిపోయి దాదాపు 14 ఏళ్లయింది. కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాను. ఎంతో కష్టపడి ముగ్గురు పిల్లలను పెంచి పోషించాను. నానా తంటాలు పడి వారి పెళ్లిళ్లు చేశాను. వితంతు పింఛన్‌కు అన్ని అర్హతలూ ఉన్నా, గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. అప్పట్లో టీడీపీ నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాను. జన్మభూమి కమిటీ సభ్యుల ఇళ్లకు వెళ్లి వారిని అభ్యర్థించాను. అయినా వారు ఏమాత్రం కనికరం చూపలేదు. విసిగిపోయాను. నాకు ఇక పింఛన్ రాదు అనుకున్న సమయంలో ఈ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ కొత్త దారి చూపించింది. మా ప్రాంత వలంటీర్ మా ఇంటికి వచ్చి, నాతో దరఖాస్తు చేయించింది. వెంటనే అధికారులు మా ఇంటికి వచ్చి విచారణ చేపట్టి పింఛన్ మంజూరు చేశారు. రెండున్న



రేళ్ల నుంచి ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లారేసరికి పింఛన్ అందుతోంది. వితంతు పింఛన్ రూ.2,750, అభయ హస్తం పింఛన్ మరో రూ.500 అందుతుండటంతో నా బతుక్కు భరోసా దక్కింది. నా జీవనానికి ఎలాంటి ఇబ్బందీ లేదు.

– కోటి ఈశ్వరమ్మ, సీతాపురం, వజ్రపుకొత్తూరు మండలం, శ్రీకాకుళం జిల్లా
(కుసుమూరి చలపతిరావు, విలేకరి, వజ్రపుకొత్తూరు)

విద్యారంగ అభివృద్ధికి సీఎం జగన్ విశేష కృషి



నంద్యాలలో జరిగిన ర్యాలీలో పెద్దఎత్తున పాల్గొన్న విద్యార్థులు

నంద్యాలలో విద్యార్థుల భారీ ర్యాలీ

సాక్షి, నంద్యాల: విద్యారంగంలో సీఎం జగన్ తీసుకు వచ్చిన సంస్కరణలు, పథకాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, నంద్యాల జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్ అన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యారంగం అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. 'వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం నంద్యాలలో 'విద్యా సాధికారిత జగనన్నతోనే సాధ్యం' అని తెలిపేలా విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పద్మావతినగర్‌లోని జ్యోతిబా పూలే విగ్రహం నుంచి శ్రీనివాస్ సెంటర్‌లోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వరకు సాగిన ఈ ర్యాలీలో భారీగా విద్యార్థులు పాల్గొన్నారు. చైతన్య, సురేష్ మాట్లాడుతూ 'నాడు–నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ చర్యలతో విద్యార్థుల డ్రాపౌట్స్ సంఖ్య తగ్గిందన్నారు. ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ విద్యా బోధన, టోఫెల్ శిక్షణ తదితర కార్యక్రమాలతో అంతర్జాతీయ స్థాయి విద్యను పేద విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్ బి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాతపట్నంలో సాధికార యాత్ర

సాక్షి, అమరావతి: సీఎం జగన్ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అభివృద్ధి పథంలో నిలిపిన వైనాన్ని వివరిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర దిగ్విజయంగా కొనసాగుతోంది. బుధవారం శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో సామాజిక సాధికార బస్సు యాత్ర జరగనుంది.

రాజంపేట.. జనంతోట

- ఘనంగా సామాజిక సాధికార బస్సు యాత్ర
- తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- యాత్రకు ఘనస్వాగతం పలికిన రాజంపేట ప్రజలు
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన పట్టణం



అన్నమయ్య జిల్లా రాజంపేటలో జరిగిన బహిరంగ సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



ప్రసంగిస్తున్న ఉపముఖ్యమంత్రి అంజాద్ బాష

సాక్షి రాయచోటి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేయూతతో ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకొన్న బడుగు, బలహీన వర్గాలు అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలో సాధికారతను ప్రదర్శించాయి. నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు మంగళవారం రాజంపేటకు తరలివచ్చారు. వేలాది మంది జై జగన్ నినాదాలు చేస్తుండగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్ర సాగింది. మధ్యాహ్నం మన్నూరు వద్దగల యల్లమ్మ ఆలయంలో నేతలు పూజలు చేసి ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుంచి యాత్ర పాత బస్టాండ్ వరకు సాగింది. వేలాది ప్రజలు హాజరైన సభలో నేతలు ప్రసంగించారు.

బడుగు, బలహీనవర్గాలను వెన్ను తట్టి నడిపించిన నాయకుడు జగన్: డిప్యూటీ సీఎం అంజాద్‌బాష

రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచి వారిని వెన్నుతట్టి నడిపించిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని డిప్యూటీ సీఎం అంజాద్‌బాష చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అభివృద్ధి పథంలో నడిపించి, సామాజిక న్యాయంతో సాధికారత సాధించిన సీఎం దేశంలో వైఎస్ జగన్ ఒక్కరేనని అన్నారు. కేవలం మాటలతో సరిపెట్టక, ఆలోచనలతో ఆగిపోకుండా, ఆచరణలో అనేక పథకాలతో పేదల ఆర్థికస్థాయిని పెంచారని, రాజకీయంగా ఉన్నత పదవులిచ్చి సామాజిక సాధికారతకు అసలైన అర్థం చెప్పారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేబినెట్‌లో 17 పదవులిచ్చారని, ఇతర పదవులు, నామినేటెడ్ పదవుల్లోనే అధికశాతం ఈ వర్గాలకే ఇచ్చారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు మరింతగా అభివృద్ధి సాధించాలంటే జగన్‌ను మరోసారి సీఎంను చేసుకోవాలన్నారు.

మనకు, పిల్లల భవిష్యత్తుకు వైఎస్ జగన్ అవసరం: మంత్రి మేరుగు

మనతోపాటు మన పిల్లల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరికొంత కాలం సీఎంగా ఉండాల్సిన అవసరం ఉందని మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. అనేక సంక్షేమ పథకాలతో బడుగులకు అండగా నిలుస్తున్న నాయకునికి మద్దతు ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు గుండెల మీద చేయి వేసుకుని బతుకుతున్నారంటే అది సీఎం జగన్ చలవేనని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలను అడుగడుగునా అవహేళన చేసి, అవమానించిన చంద్రబాబు ఓ దురహంకారి అని అభివర్ణించారు.

రాష్ట్రంలో బడుగులకే పెద్దపీట: మాజీ ఎంపీ బుట్టా రేణుక

రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకే సీఎం జగన్ పెద్దపీట వేసి, వారిని అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని మాజీ ఎంపీ బుట్టా రేణుక తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రత్యేకంగా బీసీలను ఉన్నత స్థానాల్లో నిలుపుతోందని తెలిపారు.

ప్రతి హామీని నెరవేర్చారు సీఎం జగన్ : ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలంటూ ఈ వర్గాలన్నింటినీ అక్కున చేర్చుకున్న ముఖ్యమంత్రి దేశంలో జగనన్న ఒక్కరేనని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ కొనియాడారు. విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చేసి, బడుగు బలహీనవర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నారన్నారు. ఇంగ్లిష్ చదువులతో పేద, వెనుకబడిన వర్గాల పిల్లలు అంతర్జాతీయస్థాయిలో పోటీపడాలని తపిస్తున్న జగనన్నను 2024లో మరోమారు ముఖ్యమంత్రిని చేసుకొనేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాయలసీమ జిల్లాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, కడప మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, టీటీడీ బోర్డు మెంబర్ అశ్వర్థనాయక్ పాల్గొన్నారు.

చోడవరంలో సాధికార స్వరం

- బడుగుల విజయ యాత్రలా సామాజిక సాధికార యాత్ర
- కదం తొక్కిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు
- బైక్ ర్యాలీతో సందడి చేసిన యువత
- వేలాదిమందితో వడ్డాదిలో భారీ బహిరంగ సభ
- జయహో జగన్ అంటూ ప్రజల నినాదాలు



అనకాపల్లి జిల్లా చోడవరంలో జరిగిన సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



వేదికపై ప్రసంగిస్తున్న మంత్రి కారుమూరి

సాక్షి, అనకాపల్లి: అనకాపలి జిల్లా చోడవరంలో మంగళవారం సాధికార నినాదం హోరెత్తింది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఆర్థికంగా, సామాజికంగా సాధికారత సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు నియోజకవర్గంలో కదం తొక్కాయి. వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేశాయి. ఇది బడుగు, బలహీన వర్గాల విజయయాత్రలా సాగింది. యువత బైక్ ర్యాలీతో సందడి చేశారు. వందలాది బైక్‌లు, కార్లు, ఆటోలతో ప్రారంభమైన బస్సు యాత్రలో నియోజకవర్గంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. కొత్తకోట జెడ్పీ హైస్కూల్లో నాడు–నేడు ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. బుచ్చెయ్యపేటలో జల్‌జీవన్ మిషన్‌ను ప్రారంభించారు. అనంతరం వేలాదిమందితో వడ్డాదిలో భారీ బహిరంగ సభ జరిగింది. జయహో జగన్ అంటూ పెద్ద సంఖ్యలో ప్రజలు నినదించారు.

పేదల స్థితిగతులు మార్చిన సీఎం జగన్: మంత్రి ధర్మాన

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో పేదల స్థితిగతులను మార్చారని, ఆర్థికంగా బలోపేతం చేసి సంఘంలో గౌరవాన్ని పెంచారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల రూపంలో రూ.2.60 లక్షల కోట్లు పేదల ఖాతాల్లో సీఎం జమ చేశారని తెలిపారు. అవినీతికి తావు లేకుండా పాలన అందిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో వ్యవసాయం దయనీయంగా ఉండేదని, వ్యవసాయ వృద్ధి రేట్‌లో 16వ స్థానంలో ఉండేదని తెలిపారు. సీఎం జగన్ వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత నిచ్చి, రైతులకు అండదండలందించారని, దాంతో వ్యవసాయ రంగంలో ఏపీ 4వ స్థానానికి ఎదిగిందని వివరించారు. కోట్లాది రైతులు, పేదల కుటుంబాలలో వెలుగులు నింపిన వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

జగన్ పథకాలతో పేదరికం తగ్గింది : ఎంపీ నందిగం సురేష్

వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో పేదరికం తగ్గిందని ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. అమెరికా అధ్యక్షుడు వస్తే అప్పటి సీఎం చంద్రబాబు బిచ్చగాళ్లను దాచిపెట్టారని, ఇలా పేదరికాన్ని దాచకూడదని, తగ్గించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడం ద్వారా సీఎం జగన్ పేదరికాన్ని రూపుమాపుతున్నారని అన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను సీఎం జగన్ అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తీరు అద్భుతమని చెప్పారు. దళిత రైతు బిడ్డనైన తనను సీఎం జగన్ ఢిల్లీలో ప్రధానమంత్రి పక్కన కూర్చోబెట్టారన్నారు. ఒకప్పుడు ఏ ప్రధానిని చూడాలనుకున్నానో.. అదే ప్రధాని పక్కన కూర్చున్నానంటే ఇది కాదా సామాజిక సాధికారత అని అన్నారు. ఒంటరిగా పోరాటం చేసిన దళిత బిడ్డ బర్రెలక్కకు వచ్చిన ఓట్లు కూడా పవన్‌కు తెలంగాణలో రాలేదని, వారు వచ్చే ఎన్నికల్లో ఏమి సాధిస్తారని ప్రశ్నించారు.

అందరి సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం: మంత్రి కారుమూరి

రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ధ్యేయమని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. సీఎం జగన్ సంక్షేమాన్ని అందించడంలో కుల, మత, పార్టీ, ప్రాంతీయ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పైసా అవినీతికి తావు లేకుండా సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం రాజన్నదొర మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లోని ప్రతి ఒక్కరూ సైనికుల్లా ముందుకు కదిలి మరోసారి జగన్‌ను సీఎంగా ఎన్నుకోవాలన్నారు.

చోడవరంలో రూ.1,900 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి : కరణం ధర్మశ్రీ

ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ.. సీఎం జగన్ చోడవరం నియోజకవర్గంలో 90 శాతం రాజకీయ, నామినేటెడ్ పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే అందించారన్నారు. నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధికి రూ.1,900 కోట్లు ఖర్చు చేశారన్నారు. ప్రధానంగా రూ.80 కోట్లతో రోడ్లు, నాడు – నేడు ద్వారా రూ.87 కోట్లు విద్యా రంగంలో ఖర్చు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్, గొల్ల బాబురావు, తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పాల్గొన్నారు.

దొంగలు దూరారు!

సాక్షి, అమరావతి: నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో ప్రజాస్వామ్య ప్రక్రియపై విశ్వాసం కోల్పోయిన విపక్షం అడ్డదారులు పడుతోంది! రాష్ట్రవ్యాప్తంగా ఓట్ల దొంగలు స్వైర విహారం చేస్తున్నారు! అధికార పార్టీ చేపట్టిన సామాజిక సాధికారయాత్ర, ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాలకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఎదుర్కోవడం అసాధ్యమనే నిర్ణయానికి వచ్చిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జనసేనతో చేతులు కలిపినా ఫలితం శూన్యమని గుర్తించారు. పొత్తుపై అధికారిక ప్రకటన తర్వాత పవన్ పర్యటనలు – లోకేశ్ పాదయాత్రకు స్పందన లేకపోవడమే దీనికి తార్కాణం. ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్న టీడీపీ పెద్దలు 2019 ఎన్నికలకు మించి మరోసారి ఘోర పరాజయం తప్పదని పసిగట్టి దొడ్డిదారి పట్టారు! తమకు మాత్రమే సాధ్యమైన వ్యవస్థలోకి వైరస్‌లా చొరబడి చాపకింద నీరులా ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లను చేర్పిస్తున్నారు.

ఒక్కరే.. రెండు చోట్లా

- కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం రెండో పోలింగ్ బూత్ పరిధిలో ఓటరు గుర్తింపు కార్డు నెంబరు ఎక్స్ఎస్‌సీ 1398916తో పిచ్చుక ఉమాదేవికి (ఇంటి నెంబరు 31–11–29) ఓటు ఉంది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 157వ పోలింగ్ బూత్ పరిధిలోనూ ఓటరు కార్డు నెంబరు టీఎంవో 1763820తో ఆమెకు మరో ఓటు ఉంది.
- విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గం పోలింగ్ బూత్ 127 పరిధిలో యాగంటి ఆదిలక్ష్మికి ఏక్యూడబ్ల్యూ 0892779 గుర్తింపు కార్డు నెంబర్‌తో ఓటు ఉండగా అదే నియోజకవర్గం పోలింగ్‌బూత్ 128 పరిధిలో ఏక్యూడబ్ల్యూ 0308692 గుర్తింపు కార్డు నెంబరుతో ఆమెకు మరో ఓటు ఉంది.

హైదరాబాద్ ఓటర్లు.. ఏపీలోనూ ఓట్లు

సరిహద్దు రాష్ట్రాల్లో ప్రధానంగా తెలంగాణలోని హైదరాబాద్, కర్ణాటక, తమిళనాడు, ఒడిశాలో నివాసం ఉంటూ అక్కడ ఓటు హక్కు ఉన్న టీడీపీ సానుభూతిపరుల పేర్లను ఏపీలోని 175 నియోజకవర్గాల్లోనూ ఓటర్లుగా చేర్చారు. హైదరాబాద్‌లో నివసిస్తూ అక్కడ ఓటర్లుగా నమోదైన 4.50 లక్షల మందికి పైగా ఏపీలోనూ పలు నియోజకవర్గాల్లో ఓటర్లుగా ఉన్నారు.

40,76,580కిపైగా దొంగ ఓట్లు

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అక్టోబర్ 27న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లో 4,02,21,450 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. ఇందులో సుమారు 40,76,580కిపైగా దొంగ ఓట్లను టీడీపీ నేతలు చేర్పించినట్లు ప్రజాసంఘాలు, రాజకీయ పరిశీలకులు గుర్తించారు. తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లను పలు నియోజకవర్గాల్లో ఒకే ఫోటోతో ఇంటి పేర్లు మార్చి జాబితాలో చేర్పించారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న తమ పార్టీ సానుభూతిపరుల పేర్లను సైతం రాష్ట్రంలోని ఓటర్ల జాబితాలో చేర్పించారు. ఒకే డోర్ నెంబర్‌పై వందల ఓట్లను నమోదు చేయించారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 46,165 పోలింగ్ బూత్‌ల పరిధిలోనూ ఇదే కథ. ఇప్పటికీ దొంగ ఓట్లను నమోదు చేయించే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు జీవించి ఉన్నా చనిపోయినట్లు, స్థానికంగా నివాసం ఉంటున్నా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు చిత్రీకరిస్తూ ఆ ఓట్లను తొలగించేందుకు కుప్పలు తెప్పలుగా ఫారం–7 దరఖాస్తులు సమర్పిస్తున్నారు. బీఎల్వోల (బూత్ లెవల్ ఆఫీసర్లు) విచారణలో ఇవన్నీ వెలుగులోకి వస్తున్నాయి.

దాడులు.. బ్లాక్ మెయిల్

మరోవైపు ఫారం 7లపై విచారణ జరిపి దొంగ ఓట్లను ఆధారాలతోసహా తేల్చి ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్న బీఎల్వోలు, తహసీల్దార్లపై టీడీపీ నేతలు దాడులకు దిగుతున్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో శావల్యాపురం తహసీల్దార్‌పై నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఇటీవల దాడికి తెగబడ్డారు. తాము చేర్పించిన దొంగ ఓట్లను తొలగించకుండా ఏకంగా కలెక్టర్లను సైతం టీడీపీ నేతలు బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. అనంతపురం, శ్రీకాకుళం, అంబేడ్కర్ కోనసీమ, గుంటూరు, అన్నమయ్య, బాపట్ల, తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లపై ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడమే అందుకు నిదర్శనం.

63 నియోజకవర్గాల్లో అసాధారణంగా పెరుగుదల

సాధారణంగా ప్రతి వెయ్యి మంది జనాభాకు 18 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసున్న వారు 721 మంది ఉంటారు. కానీ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలిస్తే ప్రతి వెయ్యి మంది జనాభాకు 729 మంది ఓటర్లు ఉన్నారు. అంటే ప్రతి వెయ్యి మంది జనాభాకు సాధారణం కంటే ఎనిమిది ఓట్లు అధికంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. సుమారు 63 నియోజకవర్గాల్లో ఓటర్లు అసాధారణంగా పెరిగారు. ఆ నియోజకవర్గాల్లో ప్రతి వెయ్యి మంది జనాభాకు 800 కంటే ఎక్కువ ఓట్లు ఉండటం గమనార్హం. దీన్ని బట్టి టీడీపీ నేతలు ఏ స్థాయిలో ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడ్డారో ఊహించవచ్చు. ఒకే వ్యక్తికి వేర్వేరు ఓటరు గుర్తింపు కార్డులతో 2019 జాబితాలో రెండు ఓట్లు ఉండగా 2023 ఓటర్ల జాబితాలోనూ వాటిని కొనసాగిస్తున్నారు. ఒకే ఇంటి నెంబరుపై టీడీపీ సానుభూతిపరుల ఓట్లను వందల సంఖ్యలో చేర్చారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఒకే ఇంటి నెంబరుపై 50 కంటే ఎక్కువగా సుమారు 20 లక్షలకుపైగా దొంగ ఓట్లను చేర్పించారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒకరికి ఒక ఓటు మాత్రమే ఉండాలి. అంతకంటే ఎక్కువ ఉండటం చట్టవిరుద్ధం. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఓటూ కీలకమే. ఒకే ఒక్క ఓటు అభ్యర్థుల తలరాతలను మార్చేస్తుంది. గెలుపోటములను నిర్దేశిస్తుంది. ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడాన్ని టీడీపీ 1995 నుంచే అలవాటుగా మార్చుకుంది. దేశంలో దొంగ ఓట్ల కార్ఖానాగా టీడీపీ గణతికెక్కింది. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వ్యవస్థలోకి వైరస్‌లా చొరబడి భారీ ఎత్తున దొంగ ఓట్లు చేర్పించారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలోనూ అదే కథ. ఆ దొంగ ఓట్లు అలాగే కొనసాగుతున్నాయి. వాటిని అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో గట్టెక్కుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు.

నాడు.. ఐదు లక్షల దొంగ ఓట్లతో

రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల నాటికి ఓటర్ల జాబితాలో సుమారు 35 లక్షలకుపైగా దొంగ ఓట్లు ఉన్నట్లు ప్రజాసంఘాలు గుర్తించాయి. ఆ ఎన్నికల్లో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఆ దొంగ ఓట్లను తొలగించి ఉంటే 2014లోనే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి ఉండేదని అప్పట్లోనే ప్రజా సంఘాలు, రాజకీయ పరిశీలకులు తేల్చిచెప్పారు.

కుట్రలు ఛేదించి అధికారంలోకి..

టీడీపీ అధికారంలో ఉండగా ప్రజలకు సంబంధించిన డేటాను చౌర్యం చేసి ప్రైవేట్ సంస్థలకు అప్పగించిన చంద్రబాబు వాటిని సేవామిత్ర యాప్‌తో అనుసంధానం చేసి వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించారు. 2015లో 22,76,714, 2016లో 13,00,613, 2017లో 14,46,238 వెరసి 50,23,565 ఓట్లను చంద్రబాబు తొలగింపజేశారు. తనకు అలవాటైన రీతిలో అమలు చేసిన కుట్రను ప్రజాసంఘాలు బహిర్గతం చేశాయి. దీనిపై వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు మేరకు కేంద్ర ఎన్నికల సంఘం విచారణకు ఆదేశించింది. అర్హుల ఓట్లను కూడా తొలగించినట్లు తేల్చిన ఎన్నికల అధికారులు 2019 ఎన్నికల నాటికి 31,97,473 ఓట్లను జాబితాలో చేర్చారు. దీంతో గత ఎన్నికల్లో 50 శాతానికిపైగా ఓట్లు సాధించి 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించింది.


వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి క్లస్టర్ పరిధిలో బెండికొండపై నిర్మించిన వాటర్ ట్యాంక్‌లు


హిరమండలంలోని రిజర్వాయర్ వద్ద పంపింగ్ పాయింట్


మెళియాపుట్టి వద్ద 84 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్

ఉద్దానానికి ఊపిరి

దశాబ్దాల మహమ్మారికి సీఎం వైఎస్ జగన్ శాశ్వత పరిష్కారం

రేపు వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి, వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టులను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/సాక్షి, అమరావతి: పచ్చటి ఉద్దానం కంట వెచ్చగా జారిన కన్నీటి బొట్లు.. దశాబ్దాలుగా గుండెలు పిండేసే కిడ్నీ బాధలు ఇక్కడెన్నో.. ఐదో తనం కోల్పోయిన తల్లులు, అమ్మనాన్నలకు దూరమైన పిల్లలు అడుగడుగునా కనిపిస్తారు. ఇక్కడ మనుషులకు కన్నీరు శాశ్వత నేస్తం. ఈ ఊళ్లకు ఉమ్మడి ఆస్తి కష్టం. ఈ కిడ్నీ వ్యాధి ఊళ్లకు ఊళ్లను తినేసింది. పరిస్థితి ఎక్కడికి వెళ్లిపోయిందంటే ఎంతకాలం రాసుంటే అంతకాలం బతుకుతాం, అప్పులు చేసి చావడమెందుకు అనే వైరాగ్య పరిస్థితికి ఇక్కడి బాధితులు వెళ్లిపోయారు. నెలనెలా వేలకు వేలు ఖర్చుపెట్టి వైద్య పరీక్షలు, కిడ్నీ వైద్యం చేయించుకోలేక స్థానికంగా దొరికే మందు బిళ్లలో, ఆకులతోనో సరిపెట్టుకునేవారు. ఇది నిన్నటి వరకు ఉన్న పరిస్థితి. ఇప్పుడు ఈ చీకటి బతుకులకు సీఎం వైఎస్ జగన్ చరమ గీతం పాడుతున్నారు. నాడు ప్రతిపక్ష నేత హోదాలో ఇచ్చిన హామీ మేరకు.. మూడు దశాబ్దాల సమస్యకు చెక్ చెబుతూ శాశ్వత పరిష్కారం చూపారు. రూ.742 కోట్లతో వైఎస్సార్ సుజలధార మంచినీటి ప్రాజెక్టు, రూ.85 కోట్లతో 200 పడకల డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రిని ఏర్పాటుచేశారు. ఈ రెండింటినీ ప్రారంభించే మహోన్నత ఘట్టాన్ని గురువారం సీఎం జగన్ ఆవిష్కరించనున్నారు.

కొత్తూరు రూరల్/వజ్రపుకొత్తూరు/మందస: శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత ప్రజలను నాలుగు దశాబ్దాలుగా పీల్చిపిప్పి చేస్తున్న కిడ్నీ సమస్య సృష్టిస్తున్న కల్లోలం అంతాఇంతా కాదు. ఏళ్ల తరబడి నుంచి చాపకింద నీరులా ఈ ప్రాంతాన్ని కబళిస్తోంది. ఇక్కడున్న జనాభాలో 21 శాతానికి పైగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థంచేసుకోవచ్చు. ఇప్పటికే 15 వేల మంది చనిపోయినట్లు అంచనా. ఒక అంచనా ప్రకారం.. జిల్లాలో 112 గ్రామాలు కిడ్నీ బారినపడి విలవిల్లాడుతున్నాయి. సాధారణంగా రక్తంలో సీరం క్రియాటినిన్ 1.2 మిల్లీగ్రామ్/డెసీలీటర్ కంటే ఎక్కువగా ఉంటే కిడ్నీ సరిగా పనిచేయడంలేదని అర్థం. కానీ, ఉద్దానం ప్రాంతంలో సీరం క్రియాటినిన్ లెవెల్స్ చాలామందిలో 25 మిల్లీగ్రామ్/డెసీలీటర్ మేరకు ఉంది. క్రియాటినిన్ 5 దాటితే డయాలసిస్ తప్పనిసరి. ఇటువంటి వారిలో వ్యాధి తీవ్రత పెరుగుతుంది. వీరంతా విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేది. వారానికి రెండుసార్లు కూడా వెళ్లేవారున్నారు. ఇలా రోజుకు 500కి.మీ. దూరం ప్రయాణించాల్సి వచ్చేది. రవాణా, వైద్య ఖర్చులు తలకుమించిన భారంగా మారాయి. ఎంతోమంది డబ్బుల్లేక, వైద్యం చేసుకోలేక ప్రాణాలను కోల్పోయేవారు. మరోవైపు.. ఈ మహమ్మారిని పాలకులెవరూ పట్టించుకోలేదు. ఏళ్లుగా ఇక్కడి బీల నేలలో తెగిపడిన తాళిబొట్లు ఏ నేతనూ కదిలించలేదు. హామీలిచ్చిన వారు కొందరు, అన్నీ చేసేశామని ప్రచారం చేసుకున్న వారు ఇంకొందరు. ఇలాంటి ఆపత్కాలంలో ప్రతిపక్షనేత హోదాలో జగన్ కిడ్నీ బాధితులకు సాంత్వన చేకూర్చే కబురు చెప్పారు. చెప్పినట్లుగానే ఇప్పుడు ఆపన్నహస్తం అందిస్తున్నారు. డబ్బుల్లేక అల్లాడుతున్న అభాగ్యులకు నెలనెలా చేతిలో రూ.10వేలు పెడుతున్నారు. ఎక్కడో ఉన్న వంశధారను ఉద్దానానికి తీసుకొచ్చారు. తగ్గిపోతున్న ఉద్దానం ఆయుష్షు రేఖకు ఊపిరిలూదుతున్నారు. అంతేకాదు.. వందల కోట్లతో మంచినీటి ప్రాజెక్టును.. కిడ్నీ పరిశోధనా ఆస్పత్రిని ఏర్పాటుచేశారు.

గతమంతా పరిశోధనలకే పరిమితం..

నిజానికి.. ఉద్దానంలో కిడ్నీ వ్యాధి ఆనవాళ్లు 1990 దశకంలో కన్పించాయి. కానీ, 2000లో సోంపేటకు చెందిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు వై.కృష్ణమూర్తి, పి.శివాజీ కవిటి ప్రాంతంలో కిడ్నీ వ్యాధి కేసులను గుర్తించారు. 2002 నుంచి వారే వ్యాధి తీవ్రత ఏ స్థాయిలో ఉందనే అంశంపై పరిశోధన ప్రారంభించారు.

- 2004లో నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కేజీహెచ్ హెచ్‌ఓడీ డాక్టర్ రవిరాజ్‌తో కవిటి ప్రాంతంలో పరిశోధన వైద్య శిబిరాలు ప్రారంభించారు.
- 2008 మే 24న నెఫ్రాలజిస్ట్ డాక్టర్ గంగాధర్, హైదరాబాద్ నిమ్స్ ఆర్ఎంఓ శేషాద్రి ఉద్దానంలో పర్యటించారు. అదే ఏడాది నాటి రాష్ట్ర నీటి విశ్లేషణ పరిశోధనా సంస్థ ఇక్కడ నీటి నమూనాలను తీసుకెళ్లింది.
- 2009లో న్యూయార్క్‌కు చెందిన కిడ్నీ వ్యాధుల నిపుణుడు డాక్టర్ శివప్రసాద్ ఈ ప్రాంతంలో పర్యటించి రోగుల ఆహార అలవాట్లు, నీరు, రక్తం తదితర నమూనాలను పరిశోధనకు తీసుకెళ్లారు.
- 2011లో డాక్టర్ రవిరాజ్, డాక్టర్ వెలగల శ్రీనివాస్, డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి, ఎ.వేణుగోపాల్ అనే నెఫ్రాలజీ నిపుణుల బృందం ఉద్దానం ఎండొమిక్ నెఫ్రోపతి (యూఈఎన్) పేరిట ఓ అధ్యయనం చేశారు.


పలాస మండలం రంగోయిలో 40వేల లీటర్ల సామర్థ్యం గల తాగునీటి ట్యాంక్

- 2011లో న్యూయార్క్‌కు చెందిన స్టోనీబ్రూక్స్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ అనూప్ గంగూలీ, డాక్టర్ నీల్ ఓలిక్‌ల నేతృత్వంలో ఓ బృందం వివిధ గ్రామాల ఆహారపు అలవాట్లు తెలుసుకుని రక్త, మూత్ర నమూనాలు తీసుకెళ్లారు.
- 2011లో హైదరాబాద్‌కు చెందిన పరిశోధకురాలు సీఐఎస్ఆర్ సుజాత ఈ ప్రాంతంలో నీటిని తీసుకెళ్లి దాని ద్వారా ఏఏ మార్పులు వస్తున్నాయో పరిశీలించారు.
- ఆ తర్వాత 2012లో జపాన్ బృందం, అమెరికన్ల బృందం పర్యటించింది.
- 2012 అక్టోబరు 1న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికల్ డిసీజెస్ బృందం పరిశీలించింది. 2013లో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి పోతురాజు అనే రీసెర్చ్ స్కాలర్ పరిశోధన చేశారు.
- 2017 నుంచి భారతీయ వైద్య పరిశోధనా మండలి డాక్టర్ వివేక్ ఝా నేతృత్వంలో ప్రస్తుతం పరిశోధన సాగుతోంది.
- అయితే, ఇప్పటివరకు, శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు ఇక్కడి కిడ్నీ వ్యాధులకు ఖచ్చితమైన మూలకారణాన్ని గుర్తించలేకపోయారు.
- కొన్ని అధ్యయనాలు ఈ వ్యాధి నీటిలో అధిక సెలీనియం లేదా సీసం కారణంగా ఉండవచ్చని అనుమానించాయి. మరికొందరు దీనికి నేల స్వభావమే కారణమై ఉండొచ్చని నివేదించారు. ఉష్ణోగ్రత, తక్కువ నీటి వినియోగం, అధిక పెయిన్ కిల్లర్స్ వాడకం, జన్యుపరమైన లోపాలు కూడా వ్యాధికి కారణమని అధ్యయనాలు చెబుతూ ఉన్నాయి. కానీ, ఈ అధ్యయనాలు ఏవీ సరైన స్పష్టత ఇవ్వలేకపోయాయి.
- మరోవైపు.. రాష్ట్ర ప్రభుత్వం జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్, టెక్నాలజీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (టీఆర్ఐ), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)తో 2019లో సంయుక్తంగా సమగ్ర పరిశోధనలు నిర్వహించి వ్యాధిని గుర్తించేందుకు అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకం చేసింది.

కిడ్నీ బాధితులపై ఆగ్రహంతో ఊగిపోయిన బాబు..

చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ ఉద్దానంలోని కిడ్నీ బాధితుల గురించి పట్టించుకోలేదు. తిత్లీ తుపాను సమయంలో మొక్కుబడిగా పర్యటించినప్పటికీ వారికెలాంటి భరోసా ఇవ్వలేదు... సరికదా తుపానుతో సర్వం కోల్పోయిన బాధితులు తమ గోడు చెప్పుకునేందుకు వస్తే ఆగ్రహంతో ఊగిపోయారు.'నాకు 40 ఏళ్ల అనుభవం ఉంది.. నాకు అడ్డొస్తే బుల్డోజర్‌తో తొక్కేస్తా.. తొక్క తీస్తా.. తోలు తీస్తా' అని వ్యాఖ్యానించారు. కొంతమందిపై కేసులు కూడా పెట్టారు.

డ్రామాలకే పవన్ పరిమితం..

ఇక పవన్‌కళ్యాణ్ అయితే 2017లో దీక్ష పేరుతో పెద్ద డ్రామా ఆడారు. టీడీపీతో కలిసి ఐదేళ్లు చెట్టాపట్టాలు వేసుకున్నా దానికొక పరిష్కారం చూపలేదు. ఎవరైనా అడిగితే.. అంతా తానే చేశానని, కిడ్నీ బాధల నుంచి విముక్తి కల్పిస్తానని హడావుడి చేయడం తప్ప నిజానికి ఆయన చేసిందేమీ లేదు.

కిడ్నీ బాధితులకు ఇది పెద్ద ఊరట



ఉద్దానంలో కిడ్నీ బాధితులకు కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పెద్ద ఊరట కలిగిస్తుంది. వీరికోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు ప్రధాన కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయం. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుచేయడంతోపాటు వంశధార నది నుంచి మంచినీటిని అందించేందుకు చర్యలు చేపట్టడం, అది కూడా హామీ ఇచ్చిన ఐదేళ్లలో పనులు పూర్తిచేయడం చరిత్రాత్మకం. ఆస్పత్రి పరంగా మూలాల శోధనకు ప్రాధాన్యత ఇవ్వడం, పరిశోధనతోనే కిడ్నీ ఇబ్బందులకు పరిష్కారం దొరుకుతుంది.

– డాక్టర్ ప్రధాన శివాజీ, రిటైర్డ్ ప్రభుత్వ వైద్యుడు, సోంపేట

వైఎస్ జగన్ సీఎం అయ్యాక తీసుకున్న చర్యలు

వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తర్వాత కిడ్నీ రోగులకు అండగా ఉండేందుకు పింఛను పెంచారు. అప్పటివరకు రూ.3,500 ఉన్న పింఛన్‌ను రూ.10వేలకు పెంచారు. వ్యాధి తీవ్రత ఆధారంగా రెండు రకాలుగా పింఛన్లు అందజేస్తున్నారు. 5కు పైబడి సీరం క్రియాటినిన్ ఉన్న వారికి రూ.5వేలు, డయాలసిస్ రోగులకు రూ.10వేల పింఛను ఇస్తున్నారు. ఈ లెక్కన ప్రస్తుతం రూ.10వేలు చొప్పున 792 మందికి.. రూ.5 వేలు చొప్పున 451 మందికి పింఛన్లు ఇస్తున్నారు. అవసరమైతే ఎంతమందికైనా మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

- ప్రస్తుతం టెక్కలి, పలాస, సోంపేట, కవిటి, హరిపురం ఆసుపత్రుల్లో డయాలసిస్ సెంటర్లు ఉన్నాయి. 63 మెషిన్లతో 68 పడకలపై డయాలసిస్ అందిస్తున్నారు.
- సోంపేట సీహెచ్‌సీ డయాలసిస్ సెంటర్‌లో 13 పడకలుండేవి. వాటిని 21కి పెంచారు.
- కవిటి సీహెచ్‌సీ డయాలసిస్ సెంటర్‌లో 10 పడకలు ఉండగా, 19కి పెంచారు.
- హరిపురంలో కొత్తగా 10 పడకలతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుచేశారు. రెండు కంటైన్డ్ బేస్డ్ సర్వీసెస్ డయాలసిస్ యూనిట్లను ఏర్పాటుచేశారు.
- ఇవికాక.. కొత్తగా గోవిందపురం, కంచిలి, అక్కుపల్లి, బెలగాంలో 25 మెషిన్లతో డయాలసిస్ సెంటర్లు మంజూరయ్యాయి.
- ఇచ్ఛాపురం, కంచిలి సీహెచ్‌సీ, కంచిలి పీహెచ్‌సీలో 25 మెషిన్లతో డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిచ్చింది.
- టీడీపీ హయాంలో డయాలసిస్ రోగులకు 20 రకాల మందులే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు 37 రకాల మందులను అందుబాటులో ఉంచారు. అవసరమైతే ఇంకా మందులు కొనుగోలు చేసే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.
- కిడ్నీ రోగులకు నిరంతరం వైద్య పరీక్షల కోసం సెమీ ఆటో ఎనలైజర్స్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్స్, యూరిన్ ఎనలైజర్స్‌ను ఉద్దానం పరిధిలో ఉన్న 29 ల్యాబ్‌లలో అందుబాటులో ఉంచారు.
- కిడ్నీ సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి, బాధితులకు మెరుగైన వైద్యం అందించడం ద్వారా మరణాలను నియంత్రించేందుకు నిరంతర స్క్రీనింగ్‌ను ప్రభుత్వం చేపడుతోంది. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)లకు ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించారు. ఇప్పటివరకూ ఉద్దానం ప్రాంతంలోని 2.32లక్షల మందిని స్క్రీన్ చేయగా 19,532 మందిలో సీరమ్ క్రియాటిన్ 1.5 ఎంజీ/డీఎల్ కన్నా ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ వైద్య సాయం అందించారు.
- టీడీపీ హయాంలో జిల్లా నెఫ్రాలజీ విభాగమే లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక శ్రీకాకుళం జీజీహెచ్‌లో నెఫ్రాలజీ విభాగం ఏర్పాటుచేశారు. ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. ప్రతి శనివారం పలాస సీహెచ్‌సీకి వెళ్లి రోగులకు వైద్యం అందిస్తున్నారు.
- కిడ్నీ బాధితులకు అత్యంత నాణ్యమైన కార్పొరేట్ వైద్యాన్ని పూర్తి ఉచితంగా చేరువలో అందించడం కోసం రూ.85 కోట్ల అంచనాలతో పలాసాలో రీసెర్చ్ సెంటర్‌తోపాటు 200 పడకలతో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించారు. ఇందులో రూ.60 కోట్లు ఆస్పత్రి నిర్మాణానికి, రూ.25 కోట్లు అధునాతన వైద్య పరికరాలు, ఇతర వసరుల కల్పనకు కేటాయించారు.

రూ.742కోట్లతో భారీ రక్షిత మంచినీటి పథకం

ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులకు ప్రధాన కారణం తాగునీరుగా భావిస్తున్న నేపథ్యంలో నిపుణుల సూచనల మేరకు వంశధార నది జలాలను భూ ఉపరితల తాగునీరుగా అందించేందుకు రూ.742 కోట్లతో వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టును సీఎం జగన్ మంజూరు చేశారు. దీనికింద ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలోని ఏడు మండలాల్లోని 807 గ్రామాలకు ఇంటింటికీ కుళాయిల ద్వారా నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందించనున్నారు. ఈ మంచినీటి పథకానికి 2019 సెప్టెంబరు 6న సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. 2050 నాటికి ఆ ప్రాంతంలో పెరిగే జనాభా అంచనాతో ఒక్కొక్కరికి రోజుకు వందలీటర్ల చొప్పున అందేలా ఈ పథకాన్ని రూపొందించారు. భవిష్యత్‌లో శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లోని 170 గ్రామాలకు కూడా ఈ పైపులైన్ ద్వారా అదనంగా తాగునీరు అందించే వీలుగా ఈ పథకాన్ని డిజైన్ చేశారు. నిజానికి.. ఉద్దానం సమీపంలో ఉన్న బాహుదా, మహేంద్రతనయ నదుల నుంచి తక్కువ ఖర్చుతోనే రక్షితనీటి సరఫరాకు అవకాశమున్నా వేసవిలో ఆ నదులు ఎండిపోతే ఇక్కడి ప్రజలు బోరు నీటిని తాగక తప్పదన్న భావనతో జగన్ సర్కార్ ఆ ప్రతిపాదనను మొదట్లోనే పక్కనపెట్టింది. ఏడాది పొడవునా నీరు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో ఖర్చు ఎక్కువైనా ఈ ప్రాంతానికి 104 కిలోమీటర్ల దూరంలోని హిరమండలం రిజర్వాయర్ నుంచి నీటి తరలింపునకు పూనుకుంది. ఈ ప్రాంతం మొత్తానికి ఏడాది పొడవునా తాగునీటి అవసరాలకు ఒక టీఎంసీ కన్నా తక్కువ నీరు అవసరం ఉండగా.. హిరమండలం రిజర్వాయర్‌లో కనీస నీటిమట్టం స్థాయిలోను 2.67 టీఎంసీల నీరు అందుబాటులో ఉంటుంది. ఇక్కడ నుంచి మూడు భారీ మోటార్ల ద్వారా 32 కిలోమీటర్ల దూరంలోని మెళియాపుట్టి మండల కేంద్రం వద్దకు చేరుతుంది. అక్కడ నీటిని శుద్ధిచేసి ఉద్దానానికి సరఫరా చేస్తారు.


పలాసలో ప్రారంభానికి సిద్ధమైన కిడ్నీ పరిశోధన కేంద్రం


200 పడకల ఇన్‌పేషెంట్ విభాగంలోని ఓ భాగం


సీటీ స్కాన్ యంత్రం


అధునాతన వైద్య పరికరాలు


ఇదీ కిడ్నీ పరిశోధనా కేంద్రం స్వరూపం..

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ సహకారంతో ఈ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటుచేశారు.

- ఇందులో.. మొదటి అంతస్తులో అత్యాధునిక సౌకర్యాలతో ఓపీ విభాగం, రీనల్ ల్యాబ్, పాలనా విభాగం, మీటింగ్ హాల్, మెడిసిన్ స్టోర్సుని..
- రెండో అంతస్తులో నెఫ్రాలజీ విభాగం, పేమెంట్ రూములు, కీలకమైన డయాలసిస్ విభాగాన్ని..
- మూడో అంతస్తులో ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, సీఎస్ఎస్ డి, అదనపు వసతులతో ఉన్న పే రూములు, ప్రీ, పోస్ట్ ఆపరేటివ్ వార్డులు, ఐసోలేషన్ గది, బ్లడ్ బ్యాంకు..
- నాలుగో అంతస్తులో యూరాలజీ వార్డు, పే రూములు, రీసెర్చ్ లేబొరేటరీలు ఏర్పాటు చేశారు.

సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు..

ఈ కేంద్రంలో అందించే వైద్యసేవల్ని పరిశీలిస్తే యూరాలజీ, రేడియాలజీ, ఎనస్థీషియా, నెఫ్రాలజీ, వ్యాస్కులర్ సర్జన్, పల్మనాలజీ, కార్డియాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ లాంటి సూపర్ స్పెషాలిటీస్ సేవలు.. జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్ సేవలు అందిస్తారు. ఈ ఆస్పత్రిలో 41 మంది సూపర్ స్పెషలిస్టులు, స్పెషలిస్టులు, వైద్యాధికారులను రెగ్యులర్ ప్రాతిపదికన నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జూలై 3న ఉత్తర్వులు జారీచేసింది. వీరితోపాటు స్టాఫ్ నర్సు పోస్టులు 60, ఇతర సహాయ సిబ్బంది పోస్టులు కలిపి 154 పోస్టులను కొత్తగా మంజూరు చేసి భర్తీ చేపట్టారు. మరోవైపు.. ఇందులో.. ప్రపంచస్థాయి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్ర పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిద్ధంచేసింది. గత 20 రోజులుగా వీటితో ఇప్పటికే రోగులకు చికిత్స చేస్తున్నారు. ఎక్స్‌రే (300ఎంఎ), సిటీస్కాన్, అల్ట్రా సౌండ్ మెషిన్, ఆటోమెటిక్ టిష్యూ ప్రాసెసర్, క్రయోస్టాట్, ఆటోమేటిక్ బయో కెమిస్ట్రీ ఎనలైజర్, సి–ఆర్మ్ మిషన్, ఐఎస్‌డబ్ల్యూ మిషన్, ఆటోమేటిక్ ఓటి టేబుల్స్, -80 నుంచి -40 సెంటీగ్రేడ్ల డీప్ ఫ్రీజర్లు, వెంటిలేటర్లు ఇప్పటికే సిద్ధంచేశారు.


ఆపరేషన్ థియేటర్


ఆస్పత్రిలోని అత్యాధునిక ఎక్స్‌రే మెషిన్


హిరమండలంలోని పంపింగ్ పాయింట్ వద్ద అతిపెద్ద యంత్రాలు

ఇంటింటికీ కుళాయి ఇచ్చారు.. జగనన్న చల్లగా ఉండాలి



మా ప్రాంత వాసుల కష్టాల తీర్చేందుకు.. కిడ్నీ మహమ్మారి బారినపడిన ఉద్దానం వాసుల్ని రక్షించేందుకు జగనన్న మంజూరు చేసిన వైఎస్సార్ సుజలధార ప్రారంభానికి సిద్ధమయ్యిందనే విషయం తెలియగానే చాలా ఆనందం అనిపించింది. రోజూ కిడ్నీ వ్యాధులకు భయపడి 20 లీటర్ల క్యాన్లను కొనుగోలు చేస్తున్నాం. జగనన్న దయవల్ల ఇంటింటికీ కుళాయిలను ఇప్పటికే అమర్చారు. మా ప్రాంత వాసుల కష్టాలు తీరుస్తున్న జగనన్న చల్లగా ఉండాలి.

– కర్ని సుహాసిని, గృహిణి, అమలపాడు, వజ్రపుకొత్తూరు మండలం

ప్రభుత్వం మాలాంటి వారికి ప్రాణం పోస్తోంది



చికిత్స కోసం నాకు లక్షల రూపాయలు ఖర్చేయ్యేవి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మమ్మల్ని ఆదుకుంది. 108 అంబులెన్స్‌లో ఇంటి దగ్గర నుంచి తీసుకెళ్లి, డయాలసిస్ అయ్యాక మళ్లీ ఇంటి వద్ద దిగబెడుతున్నారు. రూ.10వేలు పింఛను కూడా అందుతోంది. పౌష్టికాహారం, పండ్లు, మందులు కొనడానికి ప్రభుత్వం సహకరిస్తోంది. నాలాంటి ఎంతోమందికి జగన్ ప్రభుత్వం ప్రాణం పోస్తోంది.

– నర్తు సీతారాం, లోహరిబంద, మందస మండలం, శ్రీకాకుళం జిల్లా

జీవితంపై ఆశ కలిగింది..



కూలీ పనిచేసే నాకు భార్య, ఇద్దరు పిల్లలు. ఆరేళ్ల క్రితం కిడ్నీ వ్యాధి బారిన పడ్డాను. అప్పట్లో సరైన వైద్యం అందక డయాలసిస్ కోసం మరొకరి సాయంతో విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేది. బోలెడంత డబ్బు ఖర్చేయ్యేది. ఇక్కడ సరైన వైద్య సదుపాయాల్లేక మా కళ్ల ముందే మా స్నేహితులు, బంధువులు ఎందరో మృత్యువాత పడ్డారు. ఎవ్వరూ పట్టించుకునే వారు కాదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఆయన దయవల్ల ప్రతినెలా రూ.10 వేలు పింఛన్ అందుకుంటున్నాను. విశాఖకు వెళ్లే పని తప్పింది. పలాసలోనే డయాలసిస్, మందులు అందుతున్నాయి. పెద్ద ఆసుపత్రిని కూడా సిద్ధం చేశారు. ఇప్పుడు జీవితంపై ఆశ కలుగుతోంది. సీఎంకు ఉద్దానం వాసులంతా రుణపడి ఉంటారు.

– గేదెల కోదండరావు, చినదోకులపాడు గ్రామం, వజ్రపుకొత్తూరు మండలం, శ్రీకాకుళం జిల్లా



ఏమిటి చెడు? చంపడం చెడు, అబద్ధం చెడు, దూషణ చెడు. అసూయ చెడు, ద్వేషం చెడు. ఈ చెడుకు మూలకారణం ఏమిటి? చెడుకు మూలకారణం కోరిక. చెడుకు మూలకారణం భ్రాంతి.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 13 డిసెంబర్ 2023

లెక్కకు రాని కట్టలు ఎన్నో!

రికార్డులు తిరగరాసిన ఉదంతమిది. అయితే అది వన్నె తెచ్చే రికార్డు కాకపోవడమే విషయం. యాభై మంది బ్యాంక్ అధికారులు, 40 కౌంటింగ్ మిషన్లు, ఆరు రోజుల పాటు అలుపెరగని సోదా, దొరికిన 350 కోట్లకు పైగా నగదు... దేశంలో ఇంతవరకూ ఏ దర్యాప్తు సంస్థ జరిపిన సోదాల్లోనూ కనివిని ఎరుగని కళ్ళు తిరిగే లెక్కలివి. జార్ఖండ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహూ కుటుంబ డిస్టిలరీ సంస్థపై రాంచీ సహా వివిధ ప్రాంతాల్లో ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ అధికారులు నిర్వహిస్తున్న దాడులు వారం రోజులుగా వార్తల్లో ముఖ్యాంశమవడానికి ఇదే కారణం. లెక్కింపు మిషన్లు కూడా మొరాయించేలా, గుట్టలు గుట్టలుగా సంచులకొద్దీ డబ్బు ఒక ప్రజాప్రతినిధికి సంబంధించిన సంస్థల్లో దొరకడం సామాన్య ప్రజానీకాన్ని ముక్కున వేలేసుకొనేలా చేస్తోంది.

మునుపెన్నడూ లేనంతగా ఒకేసారి ఇంత డబ్బు ఐటీ సోదాల్లో దొరకడం సహజంగానే అధికార పక్షానికి అందివచ్చిన అస్త్రమైంది. ప్రతిపక్ష కాంగ్రెస్‌ను ఇరుకునపెట్టడంలో బీజేపీ నేతలు బిజీ అయ్యారు. సాక్షాత్తూ ప్రధాని, పార్లమెంట్ సాక్షిగా హోమ్ మంత్రి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లోని ప్రసిద్ధ 'మనీ హైస్ట్' సిరీస్ తరహాలో కాంగ్రెస్ అవినీతి దోపిడీ సాగుతోందని ప్రధాని వీడియో మీమ్‌లు పెట్టడం కొసమెరుపు. వెరసి, కాంగ్రెస్‌ది కక్కలేని మింగలేని పరిస్థితి. అయిదుగురు సోదరుల సాహూ కుటుంబమంతా తర తరాలుగా పార్టీ విధేయులూ, వివిధ సమయాల్లో చట్టసభ సభ్యులూ కావడంతో ఆ పార్టీ తప్పించు కోలేని దుస్థితి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హిందీ నడిగడ్డ మీద మూడు రాష్ట్రాల్లో ఓటమి పాలై, అందులోనూ రెండు రాష్ట్రాల్లో అధికారం కోల్పోయి డీలా పడ్డ కాంగ్రెస్‌ను ఇది ఇరుకున పడేసింది. ఈ పరిస్థితుల్లో లెక్కలేని ఈ ధనరాశుల మచ్చ తనపై పడకుండేలా ఆ పార్టీ శతవిధాల యత్నిస్తోంది. బాహాటంగా సాహూను ఏమీ అనకున్నా, ఈ సోదా నగదుపై వివరణ కోరిందన్నది వార్త.

సోదాల్లో దొరికిన నగదులో అధిక మొత్తం బౌధ్ డిస్టిలరీస్ గ్రూపులో బయటపడ్డదే. అయితే, సాహూ కుటుంబం తరతరాలుగా సారాయి వ్యాపారంలో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో భారీగా సాగే ఇలాంటి వ్యాపారంలో నగదు చెల్లింపులే ఎక్కువన్నదీ బహిరంగ సత్యమే. పైగా, కుటుంబసంస్థలో కాంగ్రెస్ ఎంపీ సాహూ కనీసం డైరెక్టరైనా కాదు. సాహూ కుటుంబ సంస్థ అయినంత మాత్రాన ఆ డబ్బు సాహూది ఎలా అవుతుంది? అంతకు మించి ఆ డబ్బంతా కాంగ్రెస్‌దెలా అయిపోతుంది? ఇదీ హస్తం పార్టీ సమర్థకుల వాదన. సాంకేతికంగా అది నిజమే! అయితే, ఇందిరా గాంధీ కాలం నుంచి కాంగ్రెస్ వెంట నడిచి, ఒకటికి రెండు మూడు సార్లు ఎంపీలైన సాహూ సోదరుడు, సాహూ... తమ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచేందుకు తమ వ్యాపార రాబడిని ఆసరాగా చేసుకొని ఉంటారనేది ఊహకందని విషయమేమీ కాదు. అది సాక్ష్యాధారాలతో సంబంధం లేని సామాన్య ఇంగితం.

ఆరోపణలు, వివరణల మాటెలా ఉన్నా తాజా సాహూ వ్యవహారం మరింత లోతైన వ్యవహారాన్ని సూచిస్తోంది. సమాజంలో పేరు, పలుకుబడి ఉన్న పెద్దమనుషుల వద్ద లెక్కాజమా లేకుండా పోగుపడుతున్న ధనరాశుల చిట్టాలో ఇది లవలేశమేనన్న స్పృహ కలిగిస్తోంది. దాదాపు నూటికి 42 మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బీద రాష్ట్రంలో, నూటికి 48 మంది ప్రజానీకం పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న రాష్ట్రంలో ఒక మద్యం డిస్టిలరీ సంస్థ వద్ద ఇంత ధనం దొరకడం సమకాలీన సమాజంలోని విరోధాభాస. సామాన్యులు తమ ప్రతి పైసా ఆదాయానికీ, ఖర్చుకూ లెక్కలు పూచీపడుతుంటే, బడా బాబుల వద్ద లెక్కకందని డబ్బుల కట్టలు మూలుగుతుండడం బయటపడ్డ ప్రతిసారీ దిగ్భ్రాంతి కలిగిస్తూనే ఉంది. పెద్ద నోట్ల రద్దు లాంటి ఆలోచనలు పదేపదే నిష్ఫలమైన తీరునూ కళ్ళ ముందుంచుతోంది.

నిజానికి రాజకీయాలకూ, వ్యాపారానికీ మధ్య బంధం కొత్తేమీ కాదు. విజయ్ మాల్యా, అదానీ, అంబానీ అంటూ పేర్లు మారవచ్చేమో కానీ, అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీ అనుకూలురితో అధికార పీఠం బంధాలు పెనవేసుకోవడం దశాబ్దాలుగా దేశంలో చూస్తున్నదే. వందల రెట్లలో ఎదుగుతున్న వ్యాపార లెక్కల పైనే కాదు... పీఎం కేర్ ఫండ్స్ మొదలు పార్టీలకు అందుతున్న విరాళాలు, ఎలక్టోరల్ బాండ్స్‌పైనా రచ్చ రేగుతున్నది అందుకే. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, పన్ను లెక్కల్లో చూపని అక్రమ ధనం స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్ళ తర్వాతా దేశాన్ని పట్టి పీడిస్తూనే ఉండడం విషాదం. ప్రతి 10–15 ఏళ్ళకోసారి స్వచ్ఛంద ఆదాయ వెల్లడి పథకం ప్రకటిస్తున్నా నల్ల డబ్బు చీడ తొలగలేదు. చివరకివి ఆర్థికవ్యవస్థనే తలకిందులుచేసే స్థాయికి పెరిగిపోవడం దిగ్భ్రాంతికరం.

డిజిటల్ చెల్లింపులు ప్రాచుర్యంలో పెట్టామని జబ్బలు చరుచుకొంటే చాలదు. ఆ పరిధిలోకి రాని ఇలాంటి నగదు గుట్టలను అరికట్టే ప్రణాళికలు చేపట్టాలి. రెండో ప్రపంచ యుద్ధానంతరం కొన్ని దేశాల్లో చేసినట్టే... నిర్ణీత పరిమితి దాటి ఎవరైనా అనధికారికంగా నగదు కలిగివుంటే తక్షణ శిక్షార్హ నేరంగా పరిగణించేలా చట్టం తేవాలి. అధికార పార్టీ నేతలపైనా ఆరోపణలు వినిపిస్తున్న వేళ, తరతమ భేదాలు లేని చర్యలు అవసరం. పైగా, వచ్చే ఎన్నికల్లో అవినీతి అంశాన్ని అస్త్రంగా చేసుకొని ఉరకాలని భావిస్తున్న అధికార పార్టీ నుంచి మరింత జవాబుదారీతనం ఆశిస్తాం. ప్రతిపక్షానికి సైతం తామే కాదు... తమ ఎంపీలూ పులు కడిగిన ముత్యాలేనని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఉంది. అవేమీ లేకుండా, సామాన్యులకు చిరకాలం గుర్తుండే ఈ నగదు కట్టల దృశ్యాలు వట్టి వైరల్ వీడియోలుగా, శుష్క ఆరోపణలుగా మిగిలిపోతేనే కష్టం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** శు.పాడ్యమి తె.4.05 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి విదియ, **నక్షత్రం:** జ్యేష్ఠ ప.12.02 వరకు తదుపరి మూల, **వర్జ్యం:** రా.7.54 నుండి 9.24 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.32 నుండి 12.20 వరకు, **అమృత ఘడియలు:** తె.5.14 నుండి 6.48 వరకు (తెల్లవారితే గురువారం).

సూర్యోదయం: 6.25
సూర్యాస్తమయం: 5.24
రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

సరైన 'నియంత్రణ'తోనే దివ్యౌషధం

విశ్లేషణ



సుబీర్ రాయ్

భారత్‌లో తయారైన మందులు తీసుకోవడం వల్ల గాంబియా, ఉజ్బెకిస్తాన్ వంటి దేశాల్లో కొంతమంది మరణించినట్లు గత ఏడాది వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ దేశ ఫార్మా రంగంలో నాణ్యతా ప్రమాణాలపై సర్వే ప్రారంభించింది. విమర్శకులు చాలాకాలం నుంచి చేస్తున్న ఆరోపణలు కఠిన వాస్తవమని ఈ సర్వే ద్వారా ప్రభుత్వానికీ స్పష్టంగా తెలిసింది. దీనివల్ల వాస్తవ పరిస్థితులపై ప్రభుత్వ సంస్థల కళ్లు విచ్చుకున్నాయని చెప్పాలి. లేదా చాలాకాలంగా తెలిసిన విషయాలను వీరు అసలు పట్టించుకోలేదని అయినా అనుకోవాలి. సర్వే చెప్పిన అంశాల్లో ఒకటి – దేశంలో నాణ్యత ప్రమాణాలను పాటించడంపై అస్సలు శ్రద్ధ లేదు అన్నది. నిబద్ధత, తగిన శిక్షణ లేకపోవడం అన్నవి సరేసరి.

నాణ్యతా ప్రమాణాల లోపాల ఫలితంగానే నాసిరకం ఔషధాలు భారత్‌లో పెద్ద ఎత్తున ఉత్పత్తి అవుతున్నాయి. మందులు చౌకగా లభిస్తాయన్న ఢంకా బజాయింపునకూ ఇవే కారణాలయ్యాయి.

పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నాలు ఇంకా మొదలు కావాల్సి ఉన్నా, సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ సర్వే జరపడమే కొంత ప్రభావం చూపుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణ సంస్థలు ఇప్పుడు ఒక్కతీరుగా ఆలోచించడం మొదలుపెట్టాయి. చేయాల్సిన పనులు, చేపట్టాల్సిన చర్యలపై స్పష్టతా ఏర్పడింది.

మితిమీరిన జోక్యం...

దేశ ఫార్మా రంగాన్ని పట్టిపీడిస్తున్న అంశం ఏదైనా ఉందీ అంటే అది మితిమీరిన ప్రభుత్వ జోక్యమనే చెప్పాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలు సంస్థలు ఫార్మా రంగంలో జోక్యం చేసుకుంటూంటాయి. ఈ క్రమంలో ఎవరికి వారు తమ ప్రయోజనాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తూంటారు. తద్వారా అసలు ప్రయోజనం దెబ్బతింటూ ఉంటుంది. స్థానికంగా తయారయ్యే మందులకు కేంద్ర ప్రభుత్వ సంస్థలు కాకుండా రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు లైసెన్సులు జారీ చేస్తూంటాయి. దీనివల్ల చాలా మందుల నాణ్యత అనేది రాష్ట్రాన్ని బట్టి మారిపోతూంటుంది.

ఫార్మా రంగంపై నియంత్రణ సుస్పష్టంగా ఉన్నప్పుడే నాణ్యతను కాపాడేందుకు అవకాశం ఉంటుంది. నాణ్యమైన మందులు లేకపోతే ఈ ఆధునిక యుగంలో మరింత ఎక్కువ కాలం జీవించడం అసాధ్యం. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలోనూ ఫార్మా రంగం ప్రాముఖ్యత ఏమిటన్నది కొత్తగా చెప్పుకోవాల్సిన అవసరమూ లేదు. భారత్‌కు ప్రపంచ ఫార్మా రాజధాని అనే పేరుంది. జెనెరిక్ మందులతో అన్ని దేశాల్లోనూ అవస రార్థులకు మందులు (పేటెంట్ హక్కులు లేనివి) అందుబాటులో ఉండేందుకు కారణమైంది భారత్! ప్రాణాంతక హెచ్ఐవీ నియంత్రణలో ఈ జెనెరిక్ ఔషధాలది చారిత్రాత్మక పాత్ర. భారతీయ ఫార్మా కంపెనీల జెనెరిక్ ఉత్పత్తుల్లేకపోతే ఈ రోజు అమెరికా సహా పలు దేశాల్లో పరిస్థితులు భిన్నంగా ఉండేవి.

చరిత్రను తరచి చూస్తే...

భారతీయ ఫార్మా రంగం సాధించిన ఘన విజయాలకు ఇందిరా గాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి క్రెడిట్ ఇవ్వాల్సి వస్తుంది. 1970లలో ప్రాసెస్ పేటెంట్లకు కట్టుబడుతూనే... ప్రాడక్ట్ పేటెంట్లకు భారత్ 'నో' చెప్పిన విషయం తెలిసిందే. ఈ ఏర్పాటు వల్ల పశ్చిమ దేశాల్లో పేటెంట్ హక్కులున్న ఖరీదైన మందులను కూడా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చౌకగా తయారు చేసే వీలేర్పడింది. ఫలితంగానే భారత్ మోతాదుల పరంగా ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఫార్మా పరిశ్రమగా అవతరించగలిగింది. విలువ ఆధారంగా చూస్తే మాత్రం మనది 14వ స్థానం. భారత ఫార్మా రంగం మార్కెట్ విలువ



5,000 కోట్ల డాలర్లు కాగా ఇందులో సగం ఎగుమతుల ద్వారా లభిస్తోంది. ప్రపంచ టీకా డిమాండ్‌లో 60 శాతాన్ని భారత్ పూరిస్తోందంటే పరిస్థితి ఏమిటన్నది తెలుస్తుంది. అమెరికా జెనెరిక్ మందుల డిమాండ్‌లో 40 శాతం భారత్ ద్వారా తీరుతోంది. యూకే ఔషధాలన్నింటిలో 25 శాతం ఇక్కడి నుంచే వెళుతున్నాయి.

ఈ పరిస్థితుల్లో భారత్‌లో తయారయ్యే మందుల నాణ్యతపై ఎలాంటి ప్రశ్నలు ఉత్పన్నం కారాదు. ఈ రకమైన నమ్మకం ఉన్నందునే గాంబియాలో మన మందుల వాడకం వల్ల పిల్లలు కొందరు మరణించారన్న వార్త కలకలం రేపింది. ఆ వెంటనే ఉజ్బెకిస్తాన్, శ్రీలంక... చివరకు అమెరికా నుంచి కూడా ఇదే రకమైన ఆరోపణలు రావడం పరిస్థితిని మరింత దిగజారేలా చేసింది.

మనకు మాత్రం నష్టం లేదా?

మందుల కంపెనీల్లో చాలా సందర్భాల్లో కల్తీలను గుర్తించేందుకు అవసరమైన పరికరాలు, తగిన అర్హతలున్న సిబ్బంది కొరత ఉంటుంది. డైఎథిలీన్ గ్లైకాల్ వంటివి అంధత్వానికి కారణమవుతాయి. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఎగుమతుల కోసం ఉద్దేశించిన అన్ని దగ్గుమందులను ప్రభుత్వ పరిశోధన శాలల్లో పరీక్షించాలని ఒక ఆదేశం జారీ చేసింది. కానీ ఇదేమంత సత్ఫలితాలు చూపలేదు. ఎందుకంటే ఫార్మా విషయాలను వాణిజ్య శాఖ పర్యవేక్షించే పరిధి లేకపోవడం. అంతేకాకుండా... వాణిజ్య శాఖ ఇంకో ప్రశ్న కూడా లేవనెత్తింది. అదేమిటంటే, ఇలాంటి కల్తీ దగ్గు మందుల కారణంగా భారతీయ రోగులకు హాని జరగడం లేదా అని! జమ్మూలో అదే జరిగింది. 2019 డిసెంబరు 2020 జనవరి మధ్య కాలంలో కల్తీ దగ్గుమందు వేసుకోవడం వల్ల దాదాపు 12 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారు.

గత ఏడాది ఇంకో చిత్రమైన ఘటన జరిగింది. 1940 నాటి డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ స్థానంలో డ్రగ్స్, మెడికల్ డివైజెస్ అండ్ కాస్మోటిక్స్ బిల్ 2023ను ప్రవేశపెట్టాలని ప్రయత్నించారు. ఇప్పుడున్న వివాదాస్పద అంశాలు వేటికీ ఇందులో చోటు లేకుండా పోయింది.

ఫార్మా రంగం సంస్కరణలు లక్ష్యంగా తీసుకొచ్చే ఏ కొత్త చట్టమైనా లైసెన్సింగ్ ప్రక్రియను కేంద్రీకృతం చేయాల్సిన అవసరం ఉంది. అలాగే దేశవ్యాప్తంగా ఔషధ నియంత్రణ ఏకరీతిలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం 28 రాష్ట్రాల్లో డ్రగ్ రెగ్యులేటర్స్ ఉన్నారు. జాతీయ స్థాయిలో ఒకే ఒక్క డ్రగ్ రెగ్యులేటింగ్ వ్యవస్థ... ఈ వ్యవస్థకు సలహా సూచనలు అందించేందుకు రెండు స్టాట్యుటరీ వ్యవస్థలు ఉంటే సరిపోతుంది. డ్రగ్ కంట్రోలర్ కార్యాలయం కూడా స్వతంత్ర సంస్థగా ఉండాలి. దీనివల్ల మంత్రుల ఆమోదం లేకుండానే డ్రగ్ కంట్రోలర్ అవసర మైనప్పుడు నిపుణులను నియమించుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ఇప్పటికే వ్యతిరేక పవనాలు...

ఫార్మా రంగానికి సంబంధించి ఇప్పటికే కొన్ని వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ఫార్మా దిగుమతుల విషయంలో అమెరికా కొన్ని కఠినమైన చర్యలకు సిద్ధమవుతోంది. భారతీయ ఫార్మా కంపెనీలకు నాణ్యత విషయంలో ఇప్పటికే అగ్రరాజ్యం బోలెడన్ని సార్లు హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఈ పరిణామం కీలకం కానుంది. ఆఫ్రికా దేశాలు కొన్ని కూడా అమెరికా మాదిరిగానే ఆలోచిస్తూండటం గమనార్హం.

ఇంకో ముఖ్య విషయం... ఫార్మా రంగ పరీక్షలకు సంబంధించి అందరికీ అందుబాటులో ఉండేలా ఒక ఐటీ వేదిక సృష్టి వెంటనే జరగాలి. గత సమాచారం, ప్రస్తుత పరిణామాలన్నింటికీ ఈ వేదిక ఒక రెఫరెన్స్ పాయింట్‌లా ఉండాలి. పరిశ్రమ వర్గాలతోపాటు నియంత్రణ సంస్థలు, ఈ అంశంపై పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు ఈ వేదికను ఉపయోగించుకుని తమ సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు. ఆన్‌లైన్ ప్రభుత్వ సేవల రంగంలో భారత్‌కు ఉన్న అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఇదేమంత పెద్ద సంగతి కానేకాదు.

ఫార్మా రంగ సంస్కరణల విషయంలో వాంఛనీయమైన పరిణామం ఏదైనా ఉందంటే అది ఇటీవలి కాలంలో సంబంధిత మంత్రి చేసిన ఒక ప్రకటన. ''ఫార్మా రంగ నియంత్రణ అనేది సహకార సమాఖ్య తీరులో సాగాలి'' అన్న ఆయన మాటలు ఆచరణలోకి వస్తే వ్యవస్థలోని లోపాలను సరిదిద్దుకోవడమే కాకుండా... ఒకరికి ఒకరు ఆసరాగా నిలవడం ద్వారా మరింత బలోపేతం కావచ్చు కూడా. పార్టీల మధ్య తీవ్రమైన వైరం నెలకొన్న... త్వరలోనే పార్లమెంటరీ ఎన్నికలు ఇంకో ఆరు నెలల్లో జరగబోతున్న నేపథ్యంలో ఈ మాత్రం మార్పు ఆహ్వానించదగ్గదే!

వ్యాసకర్త సీనియర్ ఆర్థిక విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇష్టం - కష్టం



ఆర్టికల్ 370 రద్దు సబబేనని అత్యున్నత న్యాయస్థానం తీర్పిచ్చింది. చాలామందికి ఇది కొత్తదారులు వేసేది, ఇంకొందరికి గుండెలు పగిలిపోయేది.

– కపిల్ సిబల్, న్యాయవాది

సరైన ఎంపు?



తర్వాతి హార్వర్డ్ (విశ్వవిద్యాలయ) అధ్యక్షుడిని వారి మేధా విజయాల ప్రాతిపదికన ఎంపిక చేసే అవకాశం ఉందా? తెలివైనవాళ్లు చాలామంది ఆ పదవిని కోరుకోరన్నది నిజమే అయినా, ఎవరైనా ఉండొచ్చు కదా!

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ శాస్త్రవేత్త

అన్నీ చూసుకుని...



భజన్ లాల్ శర్మ రాజస్థాన్‌కు కొత్త ముఖ్యమంత్రి అవుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనుడు, మధ్యప్రదేశ్‌లో ఓబీసీ సీఎం అయ్యాక రాజస్థాన్‌కు బ్రాహ్మణుడు వచ్చారు. సామాజిక కూర్పు పూర్తయింది. (లింగ అంతరం అలాగే ఉంది: దేశంలో ఇప్పుడు ఒకే మహిళా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ). నచ్చనీ, నచ్చకపోనీ... ఎంపికలోనూ, గతం నుంచి బయటపడటంలోనూ కులం అనేది ఇప్పటికీ గణనీయమైన అంశమే.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ఇంట్లో వండేదే...



నా డైట్‌ను నా భార్య గానీ, అమ్మగానీ నిర్ణయిస్తుంది. ప్రస్తుతం నాకే స్పెషల్ డైట్ చార్ట్ లేదు. వాళ్లు ఏం వండుతారో అదే తింటాను. ఇంట్లో భోజనం అందరికీ ఒకటే – నాకేం ప్రత్యేకంగా ఉండదు.

– సుధీర్ కుమార్, న్యూరాలజిస్ట్

స్థాయికి తగవు...



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ: మీ పాత పద్ధతిలోనే పోస్టులు పెట్టండి. అటూయిటుగా ఒక వారం నుంచి, మీ కొన్ని పోస్టులకు వాడుతున్న భాష, గొంతు, ఎమోజీలు మీ కార్యాలయానికి తగినట్టుగా లేవు. మీ కార్యాలయంలో మీ ఆలోచనలు పోస్టు చేస్తున్న మనిషిని మార్చాలి.

– డి. ముత్తుకృష్ణన్, ఫైనాన్షియల్ ప్లానర్

ముందే చెప్పాద్దా?



గణతంత్ర దినోత్సవాలకు అతిథిగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ రాకపోవచ్చునని ఒక వార్త. అది నిజమే అయితే, ఇది బైడెన్ ప్రభుత్వపు వైఫల్యం. ఆహ్వానాన్ని వాళ్లు బహిరంగపరిచి, ఇండియాను దానికి కట్టుబడి ఉండేలా చేశారు. కేవలం ఆరు వారాల వ్యవధి మాత్రమే ఉండటంతో ప్రత్యామ్నాయం కోసం ఇండియా ఇప్పుడు ఘర్షణ పడాల్సి ఉంటుంది. 'రెండో ఎంపిక' కావడం మరొక ఇబ్బంది అవుతుంది. యూఎస్ అస్తవ్యస్త దౌత్యానికి ఇదొక నిదర్శనం. కొంత ప్రాథమిక విచక్షణ, తంత్రం పాటించివుంటే ఈ డ్రామా లేకుండాపోయేది.

– సదానంద్ ధూమే, కాలమిస్ట్

ఇరు వైపులా...



'ఇజ్రాయిల్ అనుకూల', 'పాలస్తీనా అనుకూల' లాంటి పదాలు నాకు నచ్చవు. ఎందుకంటే, ఎంపిక ఏదో ఒకవైపు ఉండాలన్న భావనను అవి కలిగిస్తున్నాయి. ఇజ్రాయిల్ ఉనికిలో ఉండే హక్కుకు సానుకూలంగా ఉంటూనే, పాలస్తీనా అనుకూల స్వేచ్ఛ కోసం నిలబడొచ్చు.

– జెమీమా గోల్డ్‌స్మిత్, స్క్రీన్‌రైటర్

ఇన్ బాక్స్

బహుముఖ సేవకుడు

కల్లూరి సత్యనారాయణ శాస్త్రి (కేఎస్ శాస్త్రి) స్వాతంత్ర్య యోధులు, గాంధేయవాది, కార్మిక పోరాట నాయకుడు, లోక్ నాయక్ జయప్రకాష్ సంపూర్ణ క్రాంతి కోసం పాటుపడిన త్యాగశీలి, పుస్తకాల ప్రచురణకర్త, లైబ్రరీ వ్యవస్థాపకులు, పర్యావరణ పరిరక్షణాశీలి. ఆయన 1922 నవంబర్ 16న జన్మించారు.

విజయనగరంలో 1942 ఆగస్టు 9న 'క్విట్ ఇండియా' ఉద్యమ సమయంలో కళాశాల విద్యార్థుల సమ్మెకు గాంధీజీ స్ఫూర్తితో నాయకత్వం వహించి నాలుగు నెలల పాటు కఠిన జైలు శిక్ష కూడా అనుభవించారు. 'ఆంధ్రా నేతాజీ'గా కొనియాడబడిన మద్దూరి అన్నపూర్ణయ్య వీరికి స్వయానా బావ. స్వాతంత్ర్య సమర యోధ వెంకట రమణమ్మకు భర్త. ప్రఖ్యాత కవి ఆరుద్ర ఆయనకు సహాధ్యాయి కాగా, ప్రసిద్ధ ఇంగ్లీషు జర్నలిస్టు జీఎస్ భార్గవ కళాశాలలో సీనియర్. జస్టిస్ పున్నయ్య వీరికి మిత్రులు. ఆయన విద్యార్థి దశలోని మిత్రులైన ఎందరో తర్వాతి కాలంలో ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా మంత్రులుగా రాణించారు, కానీ శాస్త్రి మాత్రం అధికారానికి దూరంగా కార్మికరంగానికీ, సేవారంగానికీ దగ్గరగా ఉంటూ వచ్చారు.

సుమారు నాలుగు దశాబ్దాల కాలం (1947 నుంచి 1987) బొబ్బిలి, సీతానగరం, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ కార్మిక సంఘాలకూ; భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెసల్స్ కార్మిక సంఘానికీ, గరివిడిలోని ఫెర్రో ఎల్లాయిస్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్‌కూ; ఆంధ్ర షుగర్స్ వర్కర్స్ ఫెడరేషన్‌కూ, ఆల్ ఇండియా ఎన్ఎండీసీ వర్కర్స్ ఫెడరేషన్ వంటి కార్మిక సంఘాలకూ నాయకుడిగా ఎంతో కృషి చేసి మంచి ఫలితాలు సాధించారు. అలాగే 'కార్మిక జగత్' అనే పక్షపత్రికకు దాదాపు ఏడేళ్ల పాటు సంపాదకత్వం వహించారు.

విద్యార్థి దశలో విజయనగరంలో కస్తూర్బా గాంధీ పేరున రీడింగ్ రూమ్ ప్రారంభించిన కేఎస్ శాస్త్రి 1985లో విశాఖలో 'గాంధీ సెంటర్'నూ, దానికి అనుబంధంగా గాంధీ సాహిత్యపు గ్రంథాలయాన్నీ వృద్ధి చేశారు. గాంధీ భావజాలాన్ని ప్రచారం చేసినందున ప్రజలు ఆయనను 'గాంధీ శాస్త్రి'గా పిలిచేవారు. విశాఖపట్నంలో స్వల్ప అనారోగ్యం తర్వాత 94 ఏళ్ల వయసులో 2016 డిసెంబర్ 13న కన్నుమూశారు.

– డా నాగసూరి వేణుగోపాల్ | 94407 32392
(నేడు కె.ఎస్. శాస్త్రి వర్ధంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

పరివర్తనా కేంద్రాలుగా మన కారాగారాలు

అభిప్రాయం



చిలుకూరి శ్రీనివాసరావు

ఇంతవరకూ శిక్షా కేంద్రాలుగా ఉన్న కారాగారాలు ఇక పరివర్తన కేంద్రాలుగా మారనున్నాయి. అందు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జైళ్ళలో భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. శిక్షాకాలం పూర్తయినా చాలామంది ఖైదీల మానసిక స్థితిలో మార్పు రావడం లేదు. జైలు నుంచి బయటకు వచ్చాక వారికి సరైన ఉపాధి దొరక్కపోవడంతో మళ్లీ నేరాలకు పాల్పడి తిరిగి జైలుకు చేరుతున్నారు. కొందరు న్యూనతతో ఆత్మహత్యలు చేసుకోవడం కూడా కనిపిస్తుంది.

రాష్ట్రంలో రాజమహేంద్రవరం, విశాఖపట్నం, కడప, అనంతపురం కేంద్ర కారాగారాలతో పాటు మొత్తం 80 జైళ్లు ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టు నాటికి 8,499 మంది ఖైదీలు రాష్ట్రంలో వివిధ జైళ్లలో ఉన్నారు. నాలుగు కేంద్ర కారాగారాలతో కలిపి 15 జైళ్లను తొలి దశలో పరివర్తనా కేంద్రాలుగా మార్చడానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. మూడు కేటగిరీలుగా ఖైదీలను గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తారు. ఏడాదిలోపు శిక్ష పడిన ఖైదీలు, ఏడాది కంటే ఎక్కువ శిక్ష పడిన ఖైదీలు, రిమాండ్ ఖైదీలు అనే కేటగిరీలుగా వర్గీకరించి వాళ్లకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. వీటి కోసం జైళ్లలో ప్రత్యేక ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.



ఈ పరివర్తన కార్యక్రమం కోసం ప్రతి జైల్లోనూ ప్రత్యేక నిపుణుల బృందం ఏర్పాటవుతోంది. మానసిక వైద్య నిపుణులు, సంక్షేమ శాఖ అధికారులు, సామాజిక సేవకులు, స్వచ్ఛంద సేవా సంస్థ (ఎన్జీవో), సామాజిక కౌన్సిలర్, ఆర్థిక రంగ నిపుణుడు, చిన్న తరహా పరిశ్రమల శాఖ అధికారులు, విద్యావేత్తలు తదితరులు ఈ బృందంలో సభ్యులుగా ఉంటారు. ఖైదీల్లో హింస, నేర ప్రవృత్తి రూపుమాపటం, చట్టానికి బద్ధుడయ్యే పౌరుడిగా తీర్చిదిద్దడం; తన జీవితానికీ, కుటుంబానికీ అవసరమయ్యే ఆర్థిక ప్రణాళికలను వేసుకోగలగటం; విద్య, వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం; కుటుంబ సమస్యలను పరిష్కరించుకోగలగటం, ప్రేమ తత్వాన్ని నింపటం, సామాజికంగా గౌరవ జీవనం ఆవశ్యకతను తెలియజేయడం, న్యూనతా భావాన్ని తొలగించడం, ఆత్మస్థైర్యాన్ని కలిగించటం, ఉత్సాహాన్ని నింపడం తదితర అంశాలపై ఖైదీలకు కౌన్సిలింగ్, శిక్షణ ఇస్తారు. క్యాటగిరీల వారీగా వారానికి, 15 రోజులకూ, నెలకూ, ఆ తర్వాత 45 రోజులకూ కౌన్సెలింగ్ ఇస్తూ ఉంటారు. ప్రతి ఖైదీని అక్షరాస్యునిగా తీర్చిదిద్ది కనీసం సంతకం చేసే స్థాయికి తీసుకురావాలనేది ఈ పరివర్తన సంకల్పం.

వారి అభివృద్ధి నివేదికను ఎప్పటికప్పుడు ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేస్తారు. వారి సామాజిక పరివర్తన తీరును విశ్లేషించి తదనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటారు. ఖైదీలకు సంబంధించిన తుది నివేదిక కాపీని వాళ్లు జైలు నుంచి విడుదలయ్యాక సంబంధిత పోలీస్ స్టేషన్‌కు పంపుతారు. అక్కడ పోలీసులు వాళ్ల సామాజిక ప్రవర్తనపై ఒక కన్నేసి ఉంచుతారు. అవసరమైతే మంచి మార్పుతో బయటకు వచ్చిన ఖైదీల స్వీయ అనుభవాలతో పలువురికి కౌన్సిలింగ్ ఇప్పించే విధానాలు కూడా కార్యచరణలో ఉన్నాయి.

ఇప్పటికే పెద్ద జైళ్లలో ఖైదీలకు డైరెక్ట్ టెన్త్ ఇంటర్మీడియట్, దూర విద్యా విధానం ద్వారా డిగ్రీ, పీజీ చదువులు కొనసాగుతున్నాయి. 'స్కిల్ ఇండియా' ద్వారా ప్లంబింగ్, వెల్డింగు, వీవింగ్, టైలరింగ్ తదితర వృత్తుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఏపీ ప్రభుత్వం జైళ్లలో తలపెట్టిన పరివర్తన తొలి దశా కార్యక్రమం విజయవంతం అయితే మలిదశలో మిగతా అన్ని జైళ్లకూ విస్తరించడం సాధ్యమవుతుంది. నేరాల సంఖ్య తగ్గి, శాంతి భద్రతలు కట్టుదిట్టమై, జైళ్ల నిర్వహణలో మన రాష్ట్రం దేశానికే స్ఫూర్తిగా నిలవనుంది.

వ్యాసకర్త జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత | 89859 45506

సర్వాంతర్యామి

అతనొక రైతు. భగవంతుడి పట్ల ఎనలేని భక్తి. పేదవాడే అయినప్పటికీ తృప్తిగా బతుకుతున్నాడు. అతనికి భార్య, కొడుకు ఉన్నారు. ఓ రోజు దేవుడికి నమస్కరిస్తూ తనకు దర్శనమిచ్చి అనుగ్రహించమని కోరాడు. అతని ప్రార్థన ఫలించి భగవంతుడు అతని కలలో కనిపించి 'వచ్చే బుధవారం నాడు నేను మీ ఇంటికి వస్తా'నన్నాడు. కాస్సేపటికి కల చెదిరి అతను లేచి కూర్చున్నాడు. ఈ విషయాన్ని భార్యాబిడ్డలతో చెప్పి ఆనందించాడు. దేవుడు వచ్చినప్పుడు ఏదైనా ఒక తీపి పదార్థం చేసి పెట్టాలనీ, ఓ కొత్త చెప్పుల జత ఇవ్వాలనీ, ఓ శాలువ కప్పి సత్కరించాలనీ భావించి అన్నింటినీ సిద్ధం చేసుకొన్నారు.



దేవుడు వస్తానన్న బుధవారం రానే వచ్చింది. ఓ స్త్రీ తన కొడుకుతో వీరింటికేసి వస్తూ ఆకలితో సొమ్మసిల్లి పడిపోయింది. రైతు ఆ ఇద్దరినీ ఇంట్లోకి తీసుకుపోయి దేవుని కోసం వండిన తీపి పదార్థాన్ని వారికి తినిపించాడు. ఆమె వెళ్ళిపోయింది. మిట్ట మధ్యాహ్న సమయానికి ఓ బిచ్చగాడు అతనింటి ముందు కొచ్చి 'పాత చెప్పులు ఉంటే ఇవ్వండి' అని అడిగాడు. రైతు దేవుడి కోసం ఉంచిన చెప్పుల జతను అతనికిచ్చాడు. 'మీరెప్పుడూ చల్లగా ఉండాల'ని దీవించి బిచ్చగాడు వెళ్లిపోయాడు. చీకటి పడి చలి మొదలైంది. ఓ పెద్దాయన అతనింటి ముందరకొచ్చి వణుక్కుంటూ నిలబడ్డాడు. అతని పరిస్థితి గమనించిన రైతు దేవుడికి కప్పాలనుకున్న శాలువను కప్పి పంపాడు. కానీ దేవుడి జాడ లేదు. రైతు ఎంతో బాధపడ్డాడు. మాటిచ్చిన దేవుడెందుకు రాలేదని బాధపడ్డాడు. అప్పుడు ఓ అశరీర వాణి వినిపించింది. 'ఈ రోజు నేను మూడు సార్లు మీ ఇంటికి వచ్చి నీ సేవలు అందుకున్నాను' అని చెప్పాడు. రైతు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాడు. 'మానవ సేవే మాధవ సేవ' అంటే ఇదే మరి. దేవుడి తలంపుతోనే మనమందరం ఇక్కడ ఉంటున్నాం. ఓ కుక్కకు పిడికెడు అన్నం పెట్టేటప్పుడు దానిని దేవుడిగా తలచి ఆకలి తీర్చాలి. దేవుడు సర్వాంతర్యామి అన్నది మరచిపోకూడదు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

తలలో తూటాతో 18 ఏళ్లు

- ఆపరేషన్ చేసి తొలగింపు
- బెంగళూరులో యెమెన్‌వాసికి పునర్జన్మ

బనశంకరి: అంతర్యుద్ధంతో అట్టుడుకుతున్న అరబ్ దేశం యెమెన్‌లో ఓ బాలునికి తలలోకి బుల్లెట్ దూరింది. 18 ఏళ్లపాటు అలాగే ఉండిపోయింది. చివరికి దానిని బెంగళూరు వైద్యులు విజయవంతంగా తొలగించారు. వివరాలు.. బాధితుడు (29) 11 ఏళ్ల వయసులో తండ్రితో కలిసి పొలం పని చూసుకుని ఇంటికి తిరిగి వస్తున్నారు. ఆ సమయంలో రెండు ముఠాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. ఒక తూటా బాలుని తల ఎడమ భాగంలోకి చొరబడింది. స్థానిక వైద్యులు చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. కానీ తూటా తల లోపల భాగంలో చిక్కుబడి అలాగే ఉండిపోయింది. అతడు పెరిగి పెద్ద వాడై పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. కానీ తల లోపలి తూటా వల్ల తల నొప్పి, చెవిలో చీము వంటి సమస్యలు పీడించాయి. ఈక్రమంలో బెంగళూరులోని ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో చేరాడు. గత వారం వైద్యులు శస్త్రచికిత్స చేసి మూడు సెంటీమీటర్ల పొడవున్న తూటాను బయటకు తీశారు. ఆరోగ్యం కుదుటపడడంతో అతడు స్వదేశానికి వెళ్లిపోయాడు.

చిలికా తీరంలో కొత్త ఉభయచర జీవి



డెమోర్చెస్టియా అలనెన్సిస్

భువనేశ్వర్: ఒడిశాలోని బరంపురం విశ్వవిద్యాలయం చిలికా తీరంలో కొత్త ఉభయచర జీవిని గుర్తించింది. వర్సిటీ మెరైన్ సైన్స్ విభాగ సహాయ ప్రొఫెసర్ శేషదేవ పాత్రో పర్యవేక్షణలో పరిశోధకులు గీతాంజలి భోయ్, లిపికా తరఫ్దర్ ఈ ఏడాది జనవరి 22న దీనిని కనుగొన్నారు. అనంతరం ప్రొఫెసర్ అలాన్ మైయర్స్ సహకారంతో వర్సిటీలో వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. తీరప్రాంతాల్లో సంచరించే ఈ ఉభయచర జీవి రొయ్య ఆకారంలో ఉంటుందని పరిశోధకులు తెలిపారు. ఆడ జాతి 6 నుంచి 7 వరకు గుడ్లు పెడతాయని పరిశోధకులు తెలిపారు. ఇవి విషపూరితం కావని.. వీటిని చేపలు, పక్షులు ఆహారంగా తీసుకుంటాయని పేర్కొన్నారు. ఈ కొత్త ఉభయచరజీవికి ప్రొఫెసర్ అలాన్ మైయర్స్ పేరు మీద 'డెమోర్చెస్టియా అలనెన్సిస్' అని పేరు పెట్టారు. ఈ వివరాలను ప్రఖ్యాతి గాంచిన 'జూ టాక్సా' జర్నల్‌లో ప్రచురించారు.


అర్ధరాత్రి.. మీరు గాఢ నిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా ఫోన్ మోగడంతో ఉలిక్కిపడి లేచారు. ఈ టైంలో ఫోనా?! ఎవరికి ఏమైందోనన్న ఆందోళనతో మంచం పక్కనే ఉన్న ఫోన్ అందుకుని కంగారుగా స్క్రీన్ వైపు చూశారు. అంతే, ఆశ్చర్యం, కాసింత గందరగోళం.. ఎందుకంటే మీకు అస్సలు ఫోనే రాలేదు.

జన సమ్మర్థం ఉన్న ప్రాంతం.. అక్కడ మీరూ ఉన్నారు. అంతలో ఎవరిదో ఫోన్ రింగవుతోంది. ఆ వెంటనే మీ చేయి కూడా మీ జేబులో ఉన్న ఫోన్ మీదికి వెళ్లింది. మీ పక్కనే ఉన్న వ్యక్తి 'హలో..' అనడంతో మీకు అర్థమైంది.. రింగైంది మీ ఫోన్ కాదని. అసలు ఆ రింగ్ టోన్ కూడా మీ ఫోన్‌ది కాదు. ఆ విషయం మీకూ తెలుసు.. అయినా రింగ్ వినపడగానే మీ చేయి అలా మీ ఫోన్ మీదికి వెళ్లిపోయింది.

ఫుల్ ట్రాఫిక్.. బైక్‌పై వెళుతున్నారు. జేబులో ఉన్న మీ ఫోన్ అప్పటికే రెండు మూడు సార్లు రింగైంది. కానీ ఫోన్ బయటకు తీసి మాట్లాడలేని పరిస్థితి. ఎవరు ఎందుకు కాల్ చేస్తున్నారో అని ఆలోచిస్తూ.. వేగంగా ట్రాఫిక్‌ను దాటి వెళ్లి బైక్‌ను అలా రోడ్డు పక్కన నిలిపి ఫోన్ బయటకు తీసి చూసి షాకయ్యారు. అక్కడ ఎలాంటి కాల్ రాలేదు. మరి రెండు మూడు సార్లు మీరు విన్న ఆ రింగ్ ఎక్కడిది?

- తమనంపల్లి రాజేశ్వరరావు, ఏపీ సెంట్రల్ డెస్క్

అరచేతిలో అడిక్షన్



ఇల్లు.. ఇల్లాలు.. పిల్లలు..

ఓ అందమైన ఇల్లు.. ఆ ఇంట్లో మీరూ, మీ భార్య, ఇద్దరు పిల్లలు. మీరు బయటికి వెళ్లింది మొదలు.. ఇంట్లో ఎదురు చూపులు మొదలవుతాయి. ఉండబట్టలేక పిల్లలు అడిగేస్తారు.. నాన్న ఇంకెప్పుడొస్తారమ్మా? అని. ఆ నాన్న కోసమే ఎదురుచూస్తున్న అమ్మ.. 'కాసేపట్లో వచ్చేస్తారులే' అంటూ పిల్లలను సముదాయిస్తుంది. మీరు ఇంట్లోకి అడుగు పెట్టగానే.. ఇక ఆ ఇంట్లో సందడే సందడి. పిల్లల అల్లరితో అది తార స్థాయికి చేరుతుంది. అప్పుడు ఆ ఇల్లు.. నందనవనాన్ని తలపిస్తుంది. గృహమే కదా స్వర్గసీమ అన్న నానుడిని మరిపిస్తుంది.

అలాకాకుండా, మీరు ఇంట్లోకి వచ్చీ రావడంతోనే జేబులోంచి మొబైల్ తీసి దానికి అంకితమైపోతే.. గంటల తరబడి దానికే దాసోహమైతే.. మీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మరిచిపోయేంతగా మీ ఫోనే మీకు ప్రపంచమైతే.. మీ ఇల్లాలి సంగతేంటి? నాన్నతో కలిసి అల్లరిచేయడం కోసం ఎదురుచూస్తున్న ఆ పసిబిడ్డల పరిస్థితేంటి? అటు మొబైల్‌తో మీరు.. ఇటు మీ పలకరింపు కోసం నిరీక్షిస్తూ మీ ఇల్లాలు, మీకు బోలెడన్ని కబుర్లు చెప్పాలని పరితపిస్తూ మీ పిల్లలు. ఇంట్లో నలుగురు ఉన్నా.. అంతా నిశ్శబ్దం! మీకు, మీ భార్యాపిల్లలకు మధ్య అంతులేని అగాథం!



కుటుంబానికి టైం కేటాయించడానికి, మొబైల్‌తో టైంపాస్ చేయడానికి మధ్య ఎంత తేడా ఉందో చూడండి..

మనల్ని మనకు కాకుండా చేస్తుంది..

మన చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉందంటే యావత్ ప్రపంచం మన గుప్పిట్లో ఉన్నట్టే. అవసరం మేరకు దానిని వినియోగించుకుంటే.. అరచేతిలో అద్భుతమవుతుంది. అంతకు మించి అదే పనిగా దానితో కాలక్షేపం చేస్తే మాత్రం అనర్థాలకు మూలమవుతుంది. ఇలా అతిగా ఫోన్ వాడేవారు దానికి బానిసలవుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు, యువత పలు మానసిక సమస్యల బారిన పడుతున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్మార్ట్ ఫోన్ వ్యసనం చాలా ప్రమాదకరం. మన జీవితంపై, మానవ సంబంధాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. మనల్ని మనకు కాకుండా చేస్తుంది. మన వారిని మనకు దూరం చేస్తుంది. సెల్‌ఫోనే మనకు జీవితమైనప్పుడు.. ఒంటరితనాన్ని ఆశ్రయిస్తాం. స్నేహితులకు, బంధువులకు దూరమవుతాం. భార్యాబిడ్డలతోనే ఉంటున్నా.. వారికి అందనంత దూరంలో సెల్‌ఫోన్‌తో సేదదీరుతాం. నిద్ర రాదు.. ఆకలి వేయదు. కళ్లకు తప్ప మెదడుకు పని లేకపోవడంతో మెదడు మొద్దుబారి జ్ఞాపకశక్తి తగ్గడమేగాక.. పలు మానసిక రుగ్మతలకు ద్వారాలు తెరుస్తుంది.

ఇలా అయితే బానిస అయినట్టే!

మీరు అదే పనిగా ఫోన్ చెక్ చేసుకుంటున్నారా? ఎలాంటి కాల్ రాకుండానే.. వచ్చినట్టు, ఏ నోటిఫికేషన్ రాకుండానే ఏదో మెసేజ్ వచ్చినట్టు భ్రమపడుతున్నారా? మీకు ఎలాంటి కాల్ వచ్చే పరిస్థితి లేకున్నా.. ఎవరైనా కాల్ చేస్తారేమోనని ఎదురు చూస్తున్నారా? ఫోన్‌కు మెసేజ్ రావడమే ఆలస్యం.. చేస్తున్న పనిని ఉన్నఫళంగా వదిలేసి క్షణాల్లోనే వాటిని చూసేస్తున్నారా? సోషల్ మీడియాలో గంటల తరబడి గడుపుతున్నారా? అవసరం ఉన్నా లేకున్నా ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారా? ఈ లక్షణాలు, లేదా వీటిలో కొన్ని అయినా మీలో కనిపిస్తే.. మీరు స్మార్ట్‌ఫోన్‌కు బానిస అయినట్టే లెక్క.

ఒక్కసారి పరీక్షించుకుందాం..

మనం బయటికి వెళ్లేటప్పుడు ఎప్పుడైనా ఓ సారి మొబైల్‌ను ఇంట్లోనే ఉంచుదాం. ఆ తర్వాత మన ఫీలింగ్స్ ఎలా ఉంటాయో గమనిద్దాం. ఏదో పోగొట్టుకున్నట్టు.. దేని మీదా ధ్యాస లేనట్టు.. చేసే పనిమీద ఏకాగ్రత కుదరనట్టు.. ఫోన్‌లో మునిగిఉన్న వాళ్లను చూస్తే ఉక్రోషం తన్నుకొస్తున్నట్టు.. ఆకలేస్తున్నా అన్నం తిన బుద్ధికానట్టు.. చికాకు.. చిరాకు.. పిచ్చెక్కుతున్నట్టు.. వెంటనే ఇంటికి వెళ్లి ఫోన్ తీసుకోవాలని తెగ ఆరాటపడిపోతున్నట్టు.. ఇలా మనలో మెదులుతున్న ఆలోచనల స్థాయిని బట్టి తెలుసుకోవచ్చు.. మనం ఏ స్థాయిలో మొబైల్‌కు బానిసయ్యామో. ఫోన్‌కు బానిసవ్వడం అన్నది తీవ్రంగా ఉందనిపించినప్పుడు వెంటనే మానసిక నిపుణుడిని సంప్రదించాలి.

సైకలాజికల్ కౌన్సెలింగ్ అవసరం



ప్రతి దానికి సెల్ ఫోన్ మీద ఆధారపడటం ఎక్కువైంది. ఈ అడిక్షన్ అనేది.. సెల్‌ఫోన్ లేకుంటే రోజు గడవదేమో అన్న స్థితికి చేరుకుంది. కొద్దిసేపు మొబైల్ కనపడకపోయినా, చార్జింగ్ పెట్టుకునే సౌకర్యం లేకపోయినా ఆందోళనకు గురవుతున్నారు. ఫోన్ రింగ్ కాకున్నా రింగ్ టోన్ వినిపిస్తున్నట్టు అనిపించడాన్ని రింగ్సైటీ అంటారు. అదేపనిగా ఫోన్ వినియోగించడం వల్ల, ఇన్ఫర్మేషన్ ఓవర్ లోడ్ వల్ల ఈ సమస్య సంభవిస్తుంది. ఈ సమస్యకు సైకలాజికల్ కౌన్సెలింగ్ అవసరం. - ఎం.లహరి, సైకాలజిస్ట్

ఇలా బయటపడదాం..

☛ **నోటిఫికేషన్‌లు ఆపేద్దాం..**

మన పనిలో మనం తలమునకలై ఉన్నప్పుడు ఫోన్‌కు వచ్చే అనవసర నోటిఫికేషన్లు మన ఏకాగ్రతను దెబ్బతీస్తాయి. వాటి ప్రభావం మన పనితీరుపైనా పడుతుంది. ఫోన్‌కు నోటిఫికేషన్ రాగానే ఏదైనా ముఖ్యమైన మెస్సేజ్ వచ్చిందేమోనని తెగ ఆరాటపడిపోతాం. అందుకే సోషల్ మీడియా యాప్‌లకు సంబంధించిన అన్ని నోటిఫికేషన్లను ఆఫ్‌లో పెట్టుకోవడం ఉత్తమం.

☛ **అంతకు మించి సమయం ఇవ్వొద్దు..**

రోజుకు ఎంత సేపు స్మార్ట్ ఫోన్ వాడుతున్నాం.. ఏయే యాప్‌లలో ఎక్కువసేపు గడుపుతున్నామో స్పష్టంగా తెలుసుకోవాలి. ఇందుకోసం మన మొబైల్లోనే ఆప్షన్‌లుంటాయి. మొబైల్ స్క్రీన్‌పై మనం గడుపుతున్న సమయాన్ని వాటి సాయంతో అంచనా వేస్తూ.. మన అవసరం మేర మాత్రమే ఫోన్‌ను వినియోగిస్తూ.. ఫోన్ వాడకం సమయాన్ని క్రమంగా తగ్గించుకుందాం.



☛ **ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుందాం..**

సాధారణంగా మనం ఖాళీగా ఉన్నప్పుడే స్మార్ట్ ఫోన్‌కు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తాం. అలాగే వీకెండ్‌లలో వీడియోలు చూస్తూనో, గేమ్‌లు ఆడుతూనో లేదా ఫ్రెండ్స్‌తో చాటింగ్‌లు చేస్తూనో గంటల తరబడి గడిపేస్తాం. అలా కాకుండా ఖాళీ వేళల్లో, సెలవులు, వీకెండ్‌లలో విశ్రాంతి తీసుకోవడం, స్నేహితులను కలవడం, లేదా కుటుంబ సభ్యులతో బయటకు వెళ్లడం వంటి కార్యక్రమాలు పెట్టుకోవాలి. ప్రతి సమాచారానికి ఫోన్ల మీదే ఆధారపడకుండా.. పుస్తకాల నుంచీ పొందుతుండాలి.

☛ **బెడ్‌కు దూరంగా..**

మొబైల్ మనకు పక్కనే ఉంటే దానిని వాడాలనిపిస్తుంది. నిద్రపట్టకపోయినా, మెలకువ వచ్చినా.. పక్కన ఫోన్ ఉంటే ఇట్టే అందుకుంటాం. ఈ అలవాటును అధిగమించాలంటే మన బెడ్‌కు దూరంగా.. మన చేతికి అందనంత దూరంలో ఫోన్ పెట్టుకోవడం ఉత్తమం. అసలు స్విచ్ఛాఫ్ చేసుకుంటే మరీ మేలు.



నేడు సీఎం జగన్ తిరుపతి పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తిరుపతిలో పర్యటించనున్నారు. ఇందుకోసం బుధవారం మధ్యాహ్నం 3.45 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి తిరుపతికి సీఎం చేరుకుంటారు. అక్కడ తాజ్ హోటల్‌లో నిర్వహిస్తున్న శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు ముఖ్యమంత్రి హాజరవుతారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

గెలుపు వ్యూహం మాకు తెలుసు

- టీడీపీ – జనసేన ముందు వాటి ఇల్లు చక్కదిద్దుకోవాలి: సజ్జల



సాక్షి, అమరావతి: టీడీపీ – జనసేన ముందు వాటి ఇల్లు చక్కదిద్దుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి హితవు పలికారు. ఇంతవరకూ ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలో వారికే స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. టీడీపీ శిథిలావస్థకు చేరిన సౌధమని, పవన్‌ను నమ్ముకొని చంద్రబాబు ప్రయాణం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తాడేపల్లిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గెలుపు అవకాశాలను మెరుగుపరుచుకుని మరింత మెరుగైన ఫలితాలను సాధించేందుకే మార్పుచేర్పులు చేపట్టామని, అది తమ పార్టీ అంతర్గత వ్యవహారమన్నారు. నియోజక వర్గాల్లో నాయకుడిని మార్చినప్పుడు క్యాడర్ కొత్త ఇబ్బంది పడటం సహజమేనని, అందరినీ పిలిచి మాట్లాడతామని చెప్పారు. అందరినీ సమన్వయ పరుచుకుంటూ, సముచిత స్థానం కల్పిస్తూ ముందుకు వెళ్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలా గెలవాలో.. అందుకు ఏ వ్యూహం అనుసరించాలో తమకు తెలుసన్నారు. కుప్పం సహా 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు.

నిరంతరం ప్రజాసేవలోనే..

బీసీల జనాభా అధికంగా ఉన్న నియోజక వర్గాల్లో బలహీన వర్గాలకు చెందిన అభ్యర్థులను బరిలోకి దింపకుండా చంద్రబాబు, లోకేశ్ ఎందుకు పోటీ చేస్తున్నారని సజ్జల ప్రశ్నించారు. 3 వేల కి.మీ. పాదయాత్ర పూర్తి చేశాడని టీడీపీ గొప్పలు చెప్పుకుంటున్న లోకేశ్ ఎక్కడ నడిచాడో ఎవరికీ తెలియటం లేదని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ పేరు ప్రస్తావించే అర్హత కూడా లోకేశ్‌కు లేదన్నారు. ఇప్పటివరకు 99.5 శాతం హామీలను నెరవేర్చి సీఎం జగన్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని తెలిపారు. రెండేళ్ల ముందు నుంచే ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ నిరంతరం ప్రజాసేవలో నిమగ్నం చేశారని చెప్పారు. ప్రజల ఆశలు నెరవేర్చే నేతగా సీఎం జగన్ ఆదరణ చూరగొన్నారని, పాజిటివ్ ఓటు తమ బలమని పేర్కొన్నారు.

ఉదారంగా ఉండాలి

- నిబంధనలు సడలించైనా సరే రైతన్నకు న్యాయం జరగాలి
- పంట నష్టం, ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలో అధికారులకు సీఎం జగన్ ఆదేశం



ఎన్యూమరేషన్‌పై అధికారులు, కృష్ణాజిల్లా ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఇటీవల తుపాను కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, ఇదే విషయాన్ని రైతు సోదరులందరికీ తెలియజేసి వారిలో భరోసా నింపాలని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు సూచించారు. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఉదారంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. తుపానుతో పంట నష్టం, రంగు మారిన వరి ధాన్యం కొనుగోలుపై ముఖ్యమంత్రి జగన్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు.

ఆర్బీకేల వారీగా కొనుగోళ్లు..

కొన్ని నిబంధనలు సడలించైనా సరే రైతులకు న్యాయం చేయాలని అధికార యంత్రాంగానికి సీఎం జగన్ స్పష్టం చేశారు. రైతుల వద్దనున్న ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు పంపే బాధ్యతను పౌరసరఫరాల శాఖ అధికారులు తీసుకుంటారని, ఆర్బీకేల వారీగా కొనుగోళ్లు జరుగుతాయని సీఎం జగన్ పేర్కొన్నారు. ఈమేరకు సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి అప్పటికప్పుడే ఆదేశాలు జారీచేశారు. నష్టపోయిన రైతన్నలకు సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే అన్నిరకాల చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పంట నష్టపోయిన వారికి వైఎస్సార్ ఉచిత బీమా కింద వారికి పరిహారం అందించేందుకు అనుసరించాల్సిన ప్రక్రియను సమర్థంగా చేపట్టి ఆదుకోవాలని ఆదేశించారు.

ఎన్యూమరేషన్‌పై ఆరా

రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ (పంట నష్టం అంచనాలు) ప్రక్రియను ప్రారంభించారా? అని ఈ సందర్భంగా అధికారులను సీఎం జగన్ ఆరా తీశారు. ఈ నెల 11 నుంచి మొదలైన ఎన్యూమరేషన్ 18 వరకు జరుగుతుందని అధికారులు తెలిపారు. 19వతేదీ నుంచి 22 వరకు సామాజిక తనిఖీల కోసం జాబితాలను ఆర్బీకేలలో అందుబాటులో ఉంచనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. ఆ తరువాత అభ్యంతరాల స్వీకరణ, సవరణల అనంతరం ఈ నెలాఖరుకు జిల్లా కలెక్టర్లు తుది జాబితాలను ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. సంక్రాంతి లోగా ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందాలని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ సూచించారు. ఈ సమావేశంలో మంత్రి జోగి రమేష్, ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మెల్యేలు కొడాలి నాని, పేర్ని నాని, వల్లభనేని వంశీ, సామినేని ఉదయభాను, సింహాద్రి రమేష్, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ సి.హరికిరణ్, పౌరసరఫరాల శాఖ ఎండీ వీరపాండ్యన్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్, సీఎంవో అధికారులు పాల్గొన్నారు.

అటవీశాఖలో వెయ్యి పోస్టులు భర్తీ

అటవీశాఖ పీసీసీఎఫ్ మధుసూదనరెడ్డి



బి.కొత్తకోట: అటవీశాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) వై.మధుసూదనరెడ్డి మంగళవారం వెల్లడించారు. హార్సిలీహిల్స్‌పై జరుగుతున్న అటవీశాఖ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. మధుసూదనరెడ్డి మాట్లాడుతూ అటవీశాఖలో 50 రేంజర్లు, 200 సెక్షన్ ఆఫీసర్లు, 750 బీటు అధికారుల పోస్టుల భర్తీకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, అనుమతులు వచ్చాక నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. రూ.200 కోట్లతో రాష్ట్రంలో 100చోట్ల నగరవనాలను నిర్మిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో హార్సిలీహిల్స్, మారేడుమిల్లి, అరకు, కోరంగి, హ్యాపీహోమ్, గువ్వలచెరువు ఘాట్, తలకోన తదితరచోట్ల అటవీశాఖ రిసార్ట్స్ నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. కాగా, 400 టన్నుల ఎర్రచందనం విక్రయాల ద్వారా రూ.230 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. మరో 5వేల టన్నుల విక్రయం కోసం చర్యలు తీసుకుంటున్నామని, దీనిద్వారా మరో రూ.2వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశామని తెలిపారు.

ఒక్కో పోస్టుకు పది మంది

వీఏహెచ్‌ఏలకు ముగిసిన దరఖాస్తు గడువు
1,896 పోస్టులకు 19,323 మంది దరఖాస్తు
27 నుంచి హాల్‌టికెట్లు.. 31న కంప్యూటర్ ఆధారిత పరీక్ష



సాక్షి, అమరావతి: సచివాలయాలకు అనుబంధంగా ఉన్న వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న గ్రామ పశు సంవర్ధక సహాయకుల (వీఏహెచ్‌ఏ) పోస్టుల కోసం 19,323 మంది దరఖాస్తు చేశారు. ఆర్బీకేల్లో ఖాళీగా ఉన్న 1,896 వీఏహెచ్‌ఏ పోస్టుల భర్తీకి గత నెల 20వ తేదీన ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 11వ తేదీతో దరఖాస్తు గడువు ముగియగా, ఒక్కో పోస్టుకు సగటున 10 మంది దరఖాస్తు చేశారు. అనంతపురం జిల్లాలో 473 పోస్టులకు 1,079 మంది దరఖాస్తు చేసుకున్నారు. విజయనగరం జిల్లాలో 13 పోస్టులకు 1,539 మంది దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తుదారుల అర్హతలను పరిశీలించి ఈ నెల 27వ తేదీ నుంచి హాల్‌టికెట్లు జారీ చేస్తారు. డిసెంబర్ 31వ తేదీన జిల్లా కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష రెండు విభాగాలుగా మొత్తం 150 మార్కులకు ఉంటుంది. పార్ట్ 'ఏ'లో జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ 50 మార్కులకు, పార్ట్ 'బీ' పశు సంవర్ధక సంబంధిత సబ్జెక్టు 100 మార్కులకు ఉంటుంది. పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కుల నిబంధన కూడా ఉంది. ఒక్కో తప్పు సమాధానానికి 1/3వ వంతు చొప్పున మార్కులు తగ్గిస్తారు. ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తున్న వారికి వెయిటేజ్ మార్కులు కూడా కేటాయిస్తారు. గోపాలమిత్ర, గోపాలమిత్ర సూపర్‌వైజర్లు, 1,962 వెట్స్, ఔట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారికి ప్రతి ఆర్నెల్ల సర్వీసుకు ఒకటిన్నర మార్కుల చొప్పున గరిష్ఠంగా 15 మార్కుల వరకు కేటాయిస్తారు. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా జిల్లాల వారీగా జాబితాలను విడుదల చేస్తారు. కలెక్టర్ నేతృత్వంలో జిల్లా ఎంపిక కమిటీల ఆధ్వర్యంలో రిజర్వేషన్ల దామాషా ప్రకారం తుది జాబితాలను రూపొందించి నియామక పత్రాలు జారీ చేస్తారు.

ఉమ్మడి జిల్లా	పోస్టుల	దరఖాస్తులు సంఖ్య
శ్రీకాకుళం	34	1,442
విజయనగరం	13	1,539
విశాఖపట్నం	28	1,512
తూర్పుగోదావరి	15	1,779
పశ్చిమగోదావరి	102	1,473
కృష్ణా	120	1,239
గుంటూరు	229	1,448
ప్రకాశం	177	2,654
నెల్లూరు	143	962
కర్నూలు	252	2,076
వైఎస్సార్ కడప	210	1,072
అనంతపురం	473	1,079
చిత్తూరు	100	1,048

ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టంతోనే యాజమాన్య హక్కులు

- రైతులకు, ఇతర ఆస్తుల యజమానులకు ఎంతో ప్రయోజనం
- నల్సార్ యూనివర్సిటీ సలహాదారు సునీల్‌కుమార్
- భూ సమస్యలకు చెక్ పెట్టొచ్చు
- న్యాయవాదులు కూడా ఈ విషయాన్ని గ్రహించాలి
- ఈ చట్టంపైన ప్రజలకు అవగాహన కల్పించాలి
- దేశంలోనే తొలిసారిగా ఏపీలో చట్టం తేవడం గొప్ప విషయం
- ఆదోని బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సెమినార్‌లో పలువురు నిపుణులు



సునీల్‌కుమార్

ఆదోని రూరల్: ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో రైతులు, ఇతర ఆస్తుల యజమానులకు యాజమాన్య హక్కులు లభిస్తాయని రెవెన్యూ లా నిపుణులు, నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా సలహాదారు సునీల్‌కుమార్ తెలిపారు. ఎంతో ప్రయోజనం ఉన్న ఈ చట్టంపై ప్రజలకు అపోహలు వద్దన్నారు. మంగళవారం కర్నూలు జిల్లా ఆదోనిలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై సెమినార్ నిర్వహించారు. దీనికి సునీల్‌కుమార్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మెంబర్ రవి గువేరా, పలువురు న్యాయవాదులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం మంచిదని.. దానివల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ప్రస్తుతం భూములు, ఇతర ఆస్తులకు సంబంధించి అడంగల్, ఆర్‌వోఆర్, ఆర్‌హెచ్, వెబ్‌ల్యాండ్ అంటూ పలు రికార్డులను రెవెన్యూ శాఖ నిర్వహిస్తోందని గుర్తు చేశారు. వీటన్నింటి స్థానంలో ఒకే రికార్డుగా ఆస్తి వివరాలు ఉండేలా ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందన్నారు. ప్రస్తుతం ఉన్న రికార్డులతో యాజమాన్య హక్కులు ఆస్తిదారులకు లేవని.. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో యాజమాన్య హక్కులు లభిస్తున్నాయని వెల్లడించారు. దీంతో భూసమస్యలకు చెక్ పెట్టొచ్చన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో తీసుకురావడం గొప్ప విషయమన్నారు. ఈ చట్టం అమలుతో రానున్న కాలంలో చాలా మార్పులు వస్తాయని చెప్పారు. ఈ చట్టంతో ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగదన్న విషయాన్ని న్యాయవాదులు కూడా గ్రహించాలన్నారు. అయితే కొన్ని సందేహాలను ప్రభుత్వం నివృత్తి చేయాలని కోరారు. ఈ చట్టం అమలుకు స్పష్టమైన విధి విధానాలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాలన్నారు.

ఇలాంటి చట్టం గతంలో ఎప్పుడూ లేదు..

ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ రవి గువేరా మాట్లాడుతూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. న్యాయవాదులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేశాకే ఈ చట్టాన్ని అమల్లోకి తేవాలన్నారు. ఆదోని బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు అనితాబాయి మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే చట్టం మంచిదేనని, ల్యాండ్ టైటిలింగ్ చట్టం గతంలో ఎప్పుడూ లేదన్నారు. ప్రజలకు మేలు చేసే చట్టంపై తాము కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వై.రామిరెడ్డి, జయరాజు, గిరిరాజులు, మన్సూర్ అహ్మద్, మజర్ ఉల్‌హక్ పాల్గొన్నారు.

చూపంతా లోక్‌సభపైనే...

అన్ని కులాల్లోనూ ఆదరణే లక్ష్యం రూటు మారుస్తున్న బీజేపీ

అద్దం పట్టిన సీఎంల ఎంపిక

గిరిజన, ఓబీసీ నేతలకు అవకాశం

లోక్‌సభ ఎన్నికల దృష్టితో నిర్ణయాలు





తాజాగా జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మూడింటిని తన ఖాతాలో వేసుకున్న బీజేపీ, వాటి ముఖ్యమంత్రులను ఎంపిక చేసిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ విషయంలో కుల సమీకరణాలకు పెద్దపీట వేసిన తీరు ఆసక్తికరమైన రాజకీయ చర్చకు తెర తీసింది. ఈ విషయంలో బీజేపీ ఆచితూచి, అన్ని అంశాలనూ లోతుగా వడపోసి మరీ వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంది. ఇందుకోసం ఏకంగా వారం రోజులకు పైగా మేధోమథనం చేయడం విశేషం! దాని ఫలితాలు సీఎంల ఎంపికలో కొట్టొచ్చినట్టుగానే కన్పించాయి. గిరిజన ప్రాబల్య ఛత్తీస్‌గఢ్‌లో గిరిజన నేతను, ఓబీసీలు గణనీయంగా ఉన్న మధ్యప్రదేశ్‌లో అదే సామాజిక వర్గ నాయకున్ని ఎంపిక చేసి చతురత ప్రదర్శించింది. రాజస్తాన్‌లో బ్రాహ్మణ నేతకు అవకాశమిచ్చింది. సీఎంల ఎంపిక కసరత్తు పూర్తిగా రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్నట్టుగా స్పష్టమవుతోంది. అగ్రవర్ణ పార్టీగా తనకున్న ముద్రను చెరిపేసుకునే క్రమంలో రాష్ట్రపతిగా ఎస్సీని, అనంతరం ఎస్టీని ఎంపిక చేసిన కమలం పార్టీ, సీఎంల ఎంపికలోనూ అదే పోకడ కనబరిచింది. ఆ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో దిగ్గజాల వంటి నేతలను కూడా ఎలాంటి శషభిషలూ లేకుండా పక్కన పెట్టడం విశేషం! మధ్యప్రదేశ్‌లో సీఎంగా పార్టీని విజయ తీరాలకు చేర్చిన శివరాజ్‌సింగ్ చౌహాన్ అంతటి సీనియర్ మోస్ట్ నాయకునికి మరో చాన్సివ్వలేదు. రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌ల్లో పలుమార్లు సీఎంలుగా చేసిన వసుంధరా రాజె సింధియా, రమణ్‌సింగ్ పేర్లనైతే పరిశీలించనే లేదని తేటతెల్లమైంది. అగ్రవర్ణ ముద్రను వదిలించుకుని అందరి పార్టీగా మారే దిశగా కొన్నేళ్లుగా బీజేపీ చేస్తున్న ప్రయత్నాలకు సీఎంల ఎంపిక మరోసారి అద్దం పట్టిందని చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్త కులగణనను ప్రధానాంశంగా చేసుకునేందుకు కాంగ్రెస్, జేడీ(యూ) వంటి విపక్షాలు సిద్ధమవుతున్న నేపథ్యంలో దానికి గట్టిగా చెక్ పెట్టే దిశగా కమలనాథులు చేస్తున్న ప్రయత్నాలు కూడా తాజా నిర్ణయాల్లో ప్రతిఫలించాయి.

మధ్యప్రదేశ్‌లో 'బీసీ' రూటు...

మధ్యప్రదేశ్‌లో సీఎంగా పూర్తి ఆరెస్సెస్ నేపథ్యమున్న ఓబీసీ నేత మోహన్ యాదవ్ ఎంపిక కూడా బీజేపీ ప్రాథమ్యాలకే అద్దం పట్టింది. ఇది సరిహద్దు రాష్ట్రమైన యూపీతో పాటు బిహార్లోనూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బాగా కలిసొస్తుందని పార్టీ భావిస్తోంది. అక్కడి ప్రధాన పార్టీలైన సమాజ్‌వాదీ, ఆర్జేడీల సారథ్యం యాదవ్‌ల చేతుల్లోనే ఉండటం తెలిసిందే. పైగా 80 లోక్‌సభ స్థానాలున్న యూపీలో మరోసారి క్లీన్‌స్వీప్ చేయడం, 40 సీట్లు బిహార్లోనూ భారీగా సీట్లు నెగ్గడం బీజేపీకి చాలా కీలకం. ఈ నేపథ్యంలో అక్కడ సంఖ్యాధికులైన యాదవులను ఆకట్టుకునేందుకు కూడా ఓబీసీ సీఎం ఎంపిక ఉపయోగపడుతుందన్నది బీజేపీ అంచనా. ఎందుకంటే ఏకంగా 120 లోక్‌సభ స్థానాలున్న యూపీ, బిహార్లలో ఓబీసీల ఓట్లు అతి కీలకం. వారిలోనూ యాదవులు యూపీలో దాదాపుగా 10 శాతం, బిహార్లో ఏకంగా 14 శాతమున్నారు. ఇక దళితుడైన జగదీశ్ దేవ్డా, బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన రాజేంద్ర శుక్లాలను ఉప ముఖ్యమంత్రులను చేయడం యూపీలోనూ బాగా కలిసొస్తుందని బీజేపీ నమ్ముతోంది. ఉత్తరాది అంతటా రాజకీయంగా గట్టి ప్రభావం చూపే రాజ్‌పుత్ సామాజిక వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని నరేంద్రసింగ్ తోమర్‌ను స్పీకర్‌గా ఎంచుకుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఛత్తీస్‌గఢ్‌లో 'గిరిజన' జపం

గిరిజన రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లో వారి ప్రాబల్యం సహజంగానే ఎక్కువ. ఇక్కడ గిరిజన జనాభా ఏకంగా 32 శాతం! దాంతో గిరిజన ఎమ్మెల్యే విష్ణుదేవ్ సాయ్‌ని ముఖ్యమంత్రిగా బీజేపీ ఎంచుకుంది. ఓబీసీ నేతకు చాన్సివ్వాలన్న ప్రతిపాదన కూడా ఒక దశలో తెరపైకి వచ్చినా అసెంబ్లీ ఎన్నికల్లో గిరిజన ప్రాబల్య ప్రాంతాలైన సర్గుజా, బస్తర్‌ఆ గుండుగుత్తగా బీజేపీకే జైకొట్టిన నేపథ్యంలో ఆ సామాజిక వర్గంవైపే మొగ్గినట్టు సమాచారం. ఆ ప్రాంతాల్లోని 26 ఎస్టీ ఎమ్మెల్యే స్థానాల్లో బీజేపీ ఏకంగా 22 సీట్లు నెగ్గింది. ఈ నేపథ్యంలో సాయ్ ఎంపిక దేశవ్యాప్తంగా గిరిజన ప్రాబల్య ప్రాంతాల్లో కలిసొస్తుందని భావిస్తోంది. సరిహద్దు రాష్ట్రాలైన మధ్యప్రదేశ్‌లో 22 శాతం, జార్ఖండ్‌లో 26 శాతం గిరిజన జనాభా ఉండటం తెలిసిందే. ఇక రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్వరాష్ట్రమైన ఒడిశాలోనూ 23 శాతం గిరిజనులున్నారు. ఈ మూడు రాష్ట్రాల్లో 20 ఎస్టీ లోక్‌సభ స్థానాలున్నాయి. మరో 10 స్థానాల్లోనూ గిరిజన ఓట్లు కీలకంగా ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకునే సాయ్ ఎంపిక జరిగినట్టు కనిపిస్తోంది.

రాజస్తాన్‌లో కుల సమతౌల్యం...

రాజస్తాన్‌లో తొలిసారి ఎమ్మెల్యే అయిన బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన భజన్‌లాల్ శర్మకు సీఎంగా జాక్‌పాట్ దక్కడం కూడా బీజేపీ కుల సమీకరణల వ్యూహంలో భాగమేనంటున్నారు. నిజానికి రాజస్తాన్‌లో 7 శాతం దాకా ఉన్న బ్రాహ్మణ జనాభా రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలను గణనీయంగా ప్రభావితం చేయదు. కానీ శర్మ ఎంపిక వెనక ఆంతర్యం రాజస్తాన్‌తో పాటు సరిహద్దు రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, హరియాణాల్లో గణనీయంగా ఉన్న బ్రాహ్మణ వర్గాలను ఆకట్టుకోవడంగా కనిపిస్తోంది. బ్రాహ్మణులు హరియాణాలో 12 శాతం, యూపీలో 10 శాతానికి పైగా ఉంటారు. అదే సమయంలో మిగతా సామాజిక వర్గాలను దృష్టిలో ఉంచుకుంటూ రాచ కుటుంబీకురాలైన దియా కుమారి, దళిత నేత ప్రేమ్‌చంద్ బైర్వాలను ఉప ముఖ్యమంత్రులుగా ఎంపిక చేసింది. రాష్ట్రంలో శర్మ, మధ్యప్రదేశ్‌లో డిప్యూటీ సీఎంగా శుక్లా ఎంపిక ఉత్తరాది అంతటా బీజేపీకి పెట్టని కోటగా నిలుస్తూ వస్తున్న అగ్ర వర్ణ ఓటర్లను మరింత ఆకట్టుకునే ప్రయత్నాల్లో భాగంగా కన్పిస్తోంది.



లాడ్లీ లక్ష్మీ పథకం లబ్ధిదారులను ఓదారుస్తున్న మాజీ సీఎం శివరాజ్ సింగ్

ఆశించడం కంటే చనిపోవడం మేలు

మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్

భోపాల్: సీఎం పదవి నుంచి దిగిపోయినవేళ మధ్యప్రదేశ్ బీజేపీ నేత శివరాజ్ సింగ్ చౌహాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఎంగా మోహన్ యాదవ్ బుధవారం బాధ్యతలు చేపట్టనుండగా, మంగళవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ వెళ్లి తనకు ఏదో ఒక పదవి కావాలని అధిష్టానాన్ని కోరుకోవడం కంటే చనిపోవడం మేలని పేర్కొన్నారు. అలా తాను అడగలేనని చెప్పారు. తన ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాలను కొత్త సీఎం కొనసాగిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఆయనకు తన మద్దతు ఉంటుందని చెప్పారు. బీజేపీ అధిష్టానం ఎలాంటి బాధ్యతలు అప్పగించినా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న మహిళా కార్యకర్తలు కొందరు కంటనీరు పెట్టుకోవడం, శివరాజ్‌సింగ్ భావోద్వేగానికి గురైనట్లుగా ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్రానికి నాలుగు పర్యాయాలు సీఎంగా పనిచేశారు. ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.



ఉగ్రదాడిలో దెబ్బతిన్న పోలీస్ స్టేషన్ లోపలి భాగం

పాక్ ఆర్మీ పోస్ట్‌పై ఆత్మాహుతి దాడి

23 మంది సైనికులు మృతి

పెషావర్: పాకిస్తాన్‌లో తాలిబన్ ఉగ్రమూకలు రెచ్చిపోయాయి. ఆర్మీ పోస్టుపై వెంటవెంటనే జరిపిన ఆత్మాహుతి దాడుల్లో 23 మంది సైనికులు మృతి చెందారు. ఈ ఘటన ఖైబర్ పంక్తున్వా ప్రావిన్స్‌లోని డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలో చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం దారాబన్ ఏరియాలోని ఆర్మీ కార్యాలయంలోకి కొందరు ఉగ్రవాదులు చొచ్చుకు వచ్చేందుకు ప్రయత్నించారు. ఆర్మీ వారి ప్రయత్నాలను తిప్పికొట్టింది. కొద్దిసేపటి తర్వాత ఉగ్రవాదులు పేలుడు పదార్థాలు నింపిన ట్రక్కుతో వేగంగా వచ్చి గేటును ఢీకొట్టారు. అనంతరం మరోసారి ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. రెండు దాడుల్లో ఆర్మీ కార్యాలయ భవనం కుప్పకూలింది. అనంతరం ఆర్మీకి, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పుల్లో మొత్తం ఆరుగురు ఉగ్రవాదులను హతమార్చినట్లు సైన్యం ప్రకటించింది. ఈ ఘటనలో మొత్తం 23 మంది సైనికులు చనిపోగా మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా మారడంతో మృతుల సంఖ్య పెరగొచ్చని భావిస్తున్నట్లు ఆర్మీ ప్రతినిధి తెలిపారు. ఈ ఆత్మాహుతి దాడులకు తమదే బాధ్యతంటూ తెహ్రీక్-ఇ- తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ)అనుబంధంగా కొత్తగా ఏర్పడ్డ తెహ్రీక్-ఇ-జిహాద్ పాకిస్తాన్(టీజేపీ)ప్రకటించుకుంది. ఇలా ఉండగా, ఇదే జిల్లాలోని దారాజిందా, కులాచి ప్రాంతాల్లో సైన్యం జరిపిన దాడుల్లో 21 మంది ఉగ్రవాదులు హతమైనట్లు ఆర్మీ తెలిపింది. ఇద్దరు సైనికులు కూడా చనిపోయినట్లు పేర్కొంది.

సీబీఎస్ఈ పరీక్షల తేదీలు ఖరారు

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) మంగళవారం 10, 12వ తరగతుల పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 15వ తేదీ నుంచి 10, 12వ తరగతుల పరీక్షలు మొదలవుతాయి. పదో తరగతి పరీక్షలు మార్చి 13న, 12వ తేదీ పరీక్షలు ఏప్రిల్ 2వ తేదీన ముగియనున్నాయి. ప్రతి రెండు సబ్జెక్టులకు మధ్య సరిపోను విరామం ఉండేలా చూడటంతోపాటు, జేఈఈ వంటి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని 12వ తరగతి పరీక్షల షెడ్యూల్‌ను రూపొందించామని పరీక్షల కంట్రోలర్ సన్యం భరద్వాజ్ తెలిపారు.

చరిత్ర తెలియక ఊరకే తిరగరాస్తున్నారు

నెహ్రూపై అమిత్ షా విమర్శలకు రాహుల్ కౌంటర్




న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ పునర్‌వ్యవస్థీకరణ (సవరణ)బిల్లు, జమ్మూకశ్మీర్ రిజర్వేషన్(సవరణ)బిల్లులపై చర్చ సందర్భంగా మాజీ ప్రధాని నెహ్రూపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపణలు గుప్పించడాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. '' జమ్మూకశ్మీర్‌లోకి పూర్తిగా భారత బలగాలు వెళ్లేలోపే కాల్పుల విరమణకు నెహ్రూ ఆదేశాలిచ్చారు. అనవసరంగా కశ్మీర్ అంశాన్ని ఐక్యరాజ్యసమితి దృష్టికి తీసుకెళ్లారు. నెహ్రూ చారిత్రక తప్పిదాల కారణంగానే కశ్మీర్ సమస్య అపరిష్కృతంగా తయారై అక్కడి ప్రజలు కష్టాలపాలయ్యారు'' అని సోమవారం రాజ్యసభలో ఆరోపణలుచేయడం తెల్సిందే. దీనిపై మంగళవారం రాహుల్ పార్లమెంట్ ప్రాంగణంలో ఘాటుగా స్పందించారు. '' పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఈ దేశం కోసం తన జీవితం మొత్తాన్నీ ధారపోశారు. స్వాతంత్ర్య పోరాటంలో చాలా సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. ఇంకా ఇలాంటి చరిత్ర అంతా అమిత్ షాకు తెలీదనుకుంటా. అందుకే పదేపదే చరిత్రను తిరగరాస్తున్నారు. ఇదంతా అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే. కుల గణన వంటి సమస్యల సంగతేంటి? అసలు ప్రజాధనం ఎవరి చేతుల్లోకి వెళ్తోంది?. ఈ అంశాలను బీజేపీ అస్సలు చర్చకు స్వీకరించదు. భయంతో పారిపోతోంది. బీసీలను పట్టించుకోవట్లేదు' అని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు.

ఓబీసీల ప్రాధాన్యం పెరగాలి

గిరిజన వ్యక్తిని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా, ఓబీసీ నేతను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా బీజేపీ ప్రకటించిందికదా ? అన్న మీడియా ప్రశ్నకు రాహుల్ బదులిచ్చారు. ''మేం కూడా ఛత్తీస్‌గఢ్‌లో ఓబీసీ నేతను ముఖ్యమంత్రిని చేశాం. వాళ్లు కూడా మధ్యప్రదేశ్‌లో ఓబీసీ నేతను సీఎంగానే చేశారు. బీసీలకు ఒకే ఒక్క కీలక పదవి ఇస్తే సరిపోదు. ఇక్కడ పదవి ముఖ్యం కాదు. మరింత మంది ఓబీసీలకు ప్రాధాన్యత దక్కాలి. వారి ప్రాతినిధ్యం మరింత పెరగాలి. మోదీ సర్కార్ ప్రధానాంశాలను పక్కనబెట్టి ప్రజల దృష్టికి మరల్చుతోంది'' అని రాహుల్ ఆరోపించారు.

గణతంత్ర వేడుకలకు బైడెన్ రావడం లేదు



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భారత పర్యటన వాయిదా పడినట్లు తెలుస్తోంది. జనవరిలో ఢిల్లీలో గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు ఆయన భారత్ రావడం లేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గణతంత్ర వేడుకలప్పుడే క్వాడ్ సమిట్ కూడా జరపాలని భారత్ భావించినా, దాన్ని తర్వాత నిర్వహించాలని తాజాగా నిర్ణయానికొచ్చింది. ఇదే పర్యటన వాయిదాకు కారణమని సమాచారం.

సియాచిన్‌లో 'నారీ పర్వం'

తొలి మహిళా వైద్యాధికారిగా కెప్టెన్ ఫాతిమా ఘనత

లేహ్/జమ్మూ: ప్రపంచంలోనే ఎత్తయిన యుద్ధ క్షేత్రం సియాచిన్‌లో ప్రప్రథమ మహిళా వైద్యాధికారిగా కెప్టెన్ ఫాతిమా వసీమ్ రికార్డు సృష్టించనున్నారు. మొదటిసారిగా ఆపరేషనల్ పోస్టులో భారత ఆర్మీ ఈమెను నియమించింది. కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లోని సియాచిన్‌లో బాధ్యతలు చేపట్టనున్న రెండో వైద్యాధికారి ఫాతిమా అని భారత ఆర్మీకి చెందిన ఫైర్ అండ్ ఫ్యూరీ కార్ప్స్ మంగళవారం తెలిపింది. సైన్యంలో లింగసమానత్వం పెంచేందుకు తీసుకుంటున్న చర్యల్లో కెప్టెన్ ఫాతిమా నియామకం ఒకటని తెలిపింది. సియాచిన్ బ్యాటిల్ స్కూల్‌లో కఠోర శిక్షణ పొందిన ఆమె 15,200 అడుగుల ఎత్తులో ఉన్న సియాచిన్ పోస్టులో బాధ్యతలు చేపడతారని వివరించింది. అత్యంత కఠినమైన వాతావరణ పరిస్థితుల మధ్య ఈమె బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. కెప్టెన్ గీతికా కౌల్‌ను సియాచిన్‌లో మొదటి మహిళా వైద్యాధికారిగా నియమించినట్లు ఈ నెల మొదటి వారంలో ఆర్మీ ప్రకటించింది.

తొలిసారే సీఎం పదవి

రాజస్తాన్‌లో భజన్‌లాల్ శర్మకు జాక్‌పాట్

డిప్యూటీ సీఎంలుగా దియా కుమారి, ప్రేమ్‌చంద్ బైర్వా



జైపూర్: మధ్యప్రదేశ్‌లో రేస్‌లోలేని వ్యక్తిని ముఖ్యమంత్రిగా ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచిన బీజేపీ అధిష్టానం మరోసారి అలాంటి అనూహ్య నిర్ణయమే తీసుకుంది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన భజన్‌లాల్ శర్మను రాజస్తాన్ నూతన ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నట్లు బీజేపీ మంగళవారం ప్రకటించింది. దీంతో ఇటీవల బీజేపీ విజయబావుటా ఎగరేసిన మూడు రాష్ట్రాలు.. ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లలో కొత్త ముఖాలే సీఎం పీఠంపై కనిపించనున్నాయి. మంగళవారం జైపూర్‌లో 115 మంది బీజేపీ ఎమ్మెల్యేలు సమావేశమై భజన్‌లాల్‌ను తమ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ భేటీకి బీజేపీ అధిష్టానం తరఫున పార్టీ సీనియర్ నేతలు రాజ్‌నాథ్ సింగ్ తదితరులు హాజరయ్యారు. సమావేశం తర్వాత భజనలాల్ వెంటనే రాష్ట్ర గవర్నర్ కల్‌రాజ్ మిశ్రాను కలిశారు. నూతన ప్రభుత్వం ఏర్పాటుచేయాల్సిందిగా భజన్‌లాల్‌కు గవర్నర్ ఆహ్వానం పలికారు. పదవుల్లో కులాల సమతుల్యం పాటిస్తూ బ్రాహ్మణ వర్గానికి చెందిన భజన్‌లాల్‌ను సీఎంగా, రాచరిక వారసురాలైన మహిళా ఎమ్మెల్యే దియా కుమారిని డిప్యూటీ సీఎంగా, దళిత నేత ప్రేమ్‌చంద్ బైర్వాలను డిప్యూటీ సీఎంగా, సింధ్ వర్గానికి చెందిన వాసుదేవ్ దేవ్నానీని స్పీకర్‌గా ఎంపికచేశారు. కాంగ్రెస్ అభ్యర్థి మరణంతో వాయిదాపడిన కరణ్‌పూర్ అసెంబ్లీ స్థానంలో జనవరి 5న పోలింగ్ జరగనుంది

నేడు మోహన్‌కు పట్టం

భోపాల్: మధ్యప్రదేశ్ సీఎంగా మోహన్ యాదవ్ బుధవారం ప్రమాణం చేయనున్నారు. కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ నడ్డా, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు, ముఖ్య నేతలు హాజరవుతారు.

సంస్థాగతం నుంచి సీఎం దాకా...

భజన్‌లాల్ చాలా సంవత్సరాలుగా బీజేపీ పార్టీలో సంస్థాగత పదవుల్లోనే కొనసాగారు. మొట్టమొదటిసారిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి తొలి ప్రయత్నంలోనే విజయం సాధించారు. వెనువెంటనే ఆయన్ను సీఎం పదవి వరించడం విశేషం. భరత్‌పూర్ జిల్లాకు చెందిన 56 ఏళ్ల భజన్‌లాల్.. సంగనేర్ నియోజకవర్గం నుంచి 48,000కుపైగా భారీ మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థిపై ఘన విజయం సాధించారు. గతంలో ఈయనకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)తో మంచి అనుబంధం ఉంది. విద్యార్థి దశలో రాజనీతి శాస్త్రంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

కాంగ్రెస్ ఉండగా మనీ హేస్ట్ ఎందుకు?


ప్రధాని మోదీ ఎద్దేవా

న్యూఢిల్లీ: జార్ఖండ్‌లో కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహూకు చెందిన ప్రదేశాల్లో ఐటీ సోదాల్లో వందల కోట్ల నగదు బయటపడిందన్న కథనాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు ఎక్కుపెట్టారు. ఇందుకు తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'ను వేదికగా చేసుకున్నారు. బ్యాంకుల దోపిడీ కథతో ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన వెబ్ సిరీస్ 'మనీ హేస్ట్'ను ఇటీవల బయటపడిన రూ.351 కోట్ల ఉదంతంతో పోలుస్తూ కాంగ్రెస్‌ను విమర్శించారు. '' దేశంలో కాంగ్రెస్ ఉండగా మళ్లీ మనీ హేస్ట్ అవసరమా ?. 70 ఏళ్లుగా కాంగ్రెస్ దోపిడీ(హేస్ట్) జరుగుతోంది. ఇంకా కొనసాగుతోంది కూడా'' అని మోదీ 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. '' కాంగ్రెస్ ప్రాయోజిత మనీ హేస్ట్ '' అంటూ మనీ హేస్ట్ వెబ్ సిరీస్ టైటిల్ సాంగ్‌తో ఉన్న ఒక వీడియోను బీజేపీ తాజాగా ఎక్స్‌లో పోస్ట్‌చేసింది. కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలు కలసి దిగిన ఒక ఫొటోకు మనీ హేస్ట్ పాటను జతకలుపుతూ బీజేపీ విడుదలచేసిన ఆ వీడియోను మోదీ షేర్‌చేశారు. మోదీతోపాటు బీజేపీ నేతలూ కాంగ్రెస్‌పై విమర్శల ధాటి పెంచారు. ఈ మేరకు బీజేపీ నేతలు కిరెణ్ రిజిజు, సంగీత సింగ్‌దేవ్, రామేశ్వర్ తేలి, నిశిత్ ప్రామాణిక్ మీడియాతో మాట్లాడారు. 'అవినీతిపై ఉక్కుపాదం మోపుతూ మోదీ సర్కార్ చేస్తున్నయుద్ధం ధాటికి తట్టుకోలేకే విపక్షాలు 'ఇండియా' కూటమిగా ఒక్కతాటి మీదకొచ్చి నిల్చున్నాయి'' అని కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు వ్యాఖ్యానించారు. '' రూ.351 కోట్లు బట్టబయలైన కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహూ ప్రదేశం ఒక్కటే కాదు. ఇలాంటివి చాలా ఉన్నాయి. కాంగ్రెస్ నేతలపైనే కాదు బిహార్, పశ్చిమబెంగాల్, రాజస్తాన్, ఢిల్లీల్లోనూ విపక్ష పార్టీల నేతలపై చాలా అవినీతి కేసులున్నాయి. కాంగ్రెస్ నడుపుతున్న ఈ అవినీతి దుకాణాలన్నీ మూసేస్తాం. వీరిపై మోదీ సర్కార్ కఠిన చర్యలు తీసుకుంటుంది'' అని అన్నారు.

మీ మనీ హేస్ట్ సంగతేంటి: కాంగ్రెస్

కాంగ్రెస్ దోపిడీ అంటూ మోదీ చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ వెంటనే స్పందించింది. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని ఉద్దేశిస్తూ.. ' ఆఫ్‌షోర్ ఫండ్ల ద్వారా భారీ లబ్ధి పొందిన తైవాన్ వ్యాపారి చాంగ్ చుంగ్ లింగ్‌తో గౌతమ్ అదానీకి ఉన్న సంబంధాలేంటి? ఆస్తిపాస్తులులేని గౌతమ్ అదానీ ఒక్కసారిగా ప్రపంచ కుబేరుడెలా అయ్యాడు? అదానీ గ్రూప్ అసాధారణ సంపద వృద్ధికి సాయపడిందెవరు?. మోదీజీ.. 1947 నుంచి దేశం ఎన్నడూ చూడని అతిపెద్ద మనీ హేస్ట్ గురించి మీరు వివరణ ఇవ్వాలని యావద్దేశం ఎదురుచూస్తోంది'' అంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

పటిష్ట ఏఐ నిబంధనలు



ప్రపంచవ్యాప్తంగా విస్తృతస్థాయిలో వినియోగంలోకి వచ్చిన కృత్రిమ మేధ(ఏఐ)పై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. ఏఐ ఉగ్రవాదుల చేతిలో పడకుండా అంతర్జాతీయంగా పటిష్ట నిబంధనలు అవసరమని నొక్కిచెప్పారు. ఢిల్లీలో 'గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(జీపీఏఐ) ' సదస్సులో ప్రధాని ప్రసంగించారు. ''డీప్‌ఫేక్, సైబర్ సెక్యూరిటీ, డేటా చోరీలు పెచ్చరిల్లుతున్నందున ఏఐ పరిజ్ఞానం ఉగ్రవాదుల చేతికి చిక్కితే అత్యంత ప్రమాదకం. ఏఐతో పనిచేసే ఆయుధాలు ఉగ్రసంస్థల చేతికొస్తే ప్రపంచ భద్రతకే ప్రమాదం. దీన్ని అడ్డుకోవాలంటే ఏఐ సాంకేతికత నైతిక వినియోగంపై అంతర్జాతీయ ఉమ్మడి ప్రణాళిక అవసరం. దేశాలన్నీ సమష్టిగా పటిష్ట నిబంధనావళిని రూపొందించుకోవాలి'' అని పిలుపునిచ్చారు. ''దేశాల మధ్య అంతర్జాతీయ ఒప్పందాలున్నట్లే ఈ నూతన సాంకేతికత నైతిక వినియోగం విషయంలోనూ ప్రపంచస్థాయి మార్గదర్శకాలు, నిబంధనలు ఉండాలి. నిబంధనల చట్రాన్ని వీలైనంత త్వరగా అమల్లోకి తేవాలి. ఏఐ పరిజ్ఞానాన్ని సంతరించుకున్న పరికరాలు, ఆయుధాల పరిశోధన, అభివృద్ధి, పరీక్ష, తయారీలపై ప్రోటోకాల్‌ను అమల్లోకి తేవాలి. ఈ అంశంలో భారత్ తనవంతు బాధ్యత నెరవేర్చేందుకు సదా సిద్ధంగా ఉంది'' అని మోదీ ప్రకటించారు.

సంజయ్ రౌత్‌పై దేశద్రోహం కేసు

యావత్మాల్: శివసేన(బాల్‌ఠాక్రే)కు చెందిన 'సామ్నా' పత్రికలో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా కథనం రాసినందుకు ఎంపీ సంజయ్ రౌత్‌పై దేశద్రోహం కేసు నమోదైంది. యావత్మాల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నితిన్ భుటాడా ఫిర్యాదు మేరకు సామ్నా ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూడా అయిన రౌత్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు చెప్పారు. ఈ నెల 10న ప్రధాని మోదీపై ప్రచురితమైన కథనం అభ్యంతరకరంగా ఉందని భుటాడా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉమర్‌ఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రౌత్‌పై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు.

సీఈసీ, ఈసీల బిల్లుకు రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన కీలకమైన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీలు) బిల్లు–2023ని కేంద్రం మంగళవారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు బిల్లును తెచ్చామని న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ చెప్పారు. ''1991 నాటి చట్టంలో సీఈసీ, ఈసీల నియామక నిబంధనలు లేవు. తాజా బిల్లులో వాటిని పొందుపరిచాం. సీఈసీ, ఈసీ నియామకాలను ఇప్పటిదాకా ప్రభుత్వమే చేపట్టేది. ఇకపై వాటిని ప్రత్యేక కమిటీ చూసుకుంటుంది. వారి వేతనాలు తదితరాలను బిల్లులో పొందుపరిచాం. సీఈసీ, ఈసీలకు చట్టపరమైన రక్షణలను కల్పించాం'అని వివరించారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం

బిల్లులోని అంశాలు ఈసీ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీసేలా ఉన్నాయని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఆరోపించాయి. ప్రధాని, ఆయన నామినేట్ చేసే సభ్యులు సీఈసీ, ఈసీలను నియమించడమంటే ఎన్నికల సంఘాన్ని నామమాత్రంగా మార్చడమేనని రణదీప్ సూర్జేవాలా (కాంగ్రెస్) అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎంపిక కమిటీలో చేర్చకపోవడమేమిటని ఆప్ సభ్యుడు రాఘవ్ చద్దా ప్రశ్నించారు. సీఈసీ, ఈసీల హోదాను కేబినెట్ సెక్రటరీ స్థాయికి కేంద్రం దిగజార్చిందని జవహర్ సర్కార్ (టీఎంసీ) మండిపడ్డారు. బీజేడీ, డీఎంకే సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది.

ఒమర్ విడాకుల పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: వేరుగా ఉంటున్న భార్య నుంచి విడాకులు కోరుతూ నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా పెట్టుకున్న పిటిషన్ ఢిల్లీ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. భార్య పాయల్ తన పట్ల క్రూరంగా వ్యవహరించారనేందుకు ఒమర్ ఎలాంటి ఆధారాలు చూపలేకపోయారని జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ, జస్టిస్ వికాస్ మహాజన్‌ల ధర్మాసనం అభిప్రాయపడింది. ''క్రూరత్వ ఆరోపణలు అస్పష్టంగా ఉన్నాయని, ఆమోదయోగ్యం కాదని కుటుంబ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు సరైందే. భార్య తన పట్ల శారీరకంగా, మానసికంగా క్రూరంగా వ్యవహరించినట్లు చూపడంలో పిటిషనర్‌విఫలమయ్యారు' అని పేర్కొంది.

2040 కల్లా చందమామపై భారత వ్యోమగామి: ఇస్రో

తిరువనంతపురం: 2040 ఏడాదికల్లా చంద్రుడిపై భారతీయ వ్యోమగామి అడుగుపెట్టేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు ఇస్రో చీఫ్ ఎస్.సోమనాథ్ మంగళవారం చెప్పారు. ''వ్యోమగాములుగా తీర్చిదిద్దేందుకు నలుగురు భారత వాయుసేన పైలట్లను ఎంపికచేశాం. వారికి శిక్షణలో కొనసాగుతోంది. వ్యోమగాములను ముందు లోయర్ ఎర్త్ ఆర్బిట్ (ఎల్ఈఓ)లోకి ప్రవేశపెట్టి సురక్షితంగా హిందూ మహాసముద్ర జలాల్లో దించుతాం'' అని వెల్లడించారు. ''గగన్‌యాన్ కోసం మనుషులు ప్రయాణించే హెచ్ఎల్‌వీఎం3 వ్యోమనౌక, క్రూ మాడ్యూల్ ఉండే ఆర్బిటల్ మాడ్యూల్, సర్వీస్ మాడ్యూల్, ప్రాణాధార వ్యవస్థలు కావాలి. ముందు మానవరహిత ప్రయోగాలను పూర్తిచేయాలి. ఒకే పోలికలు ఉండే రెండు మానవరహిత మిషన్‌లు(జీ1, జీ2), ఎయిర్ డ్రాప్ టెస్ట్, ప్యాడ్ అబార్ట్ టెస్ట్, టెస్ట్ వెహికల్ పరీక్ష తదితరాలను విజయవంతంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. చంద్రుడిని చేరాక సురక్షితంగా తిరిగొచ్చేందుకు వ్యోమగాములు ఉండే క్రూ మాడ్యూల్(సీఎం) తయారీ, అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది తప్పించుకునే క్రూ ఎస్కేప్ సిస్టమ్(సీఈఎస్)లనూ అభివృద్ధిచేసుకోవాల్సి ఉంది'' అని సోమనాథ్ చెప్పారు.

గాజాపై ఆగని ఇజ్రాయెల్ దాడులు

రఫా: గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి, మంగళవారం జరిపిన వైమానిక దాడుల్లో రఫా, డెయిర్ అల్ బలాహ్‌ల్లో పలు నివాస భవనాలు నేలమట్టం కాగా, పదుల సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోయారు. రఫాలోని నాలుగు భవనాలపై జరిగిన దాడుల్లో ఏడుగురు చిన్నారులు, ఆరుగురు మహిళలు సహా 23 మంది చనిపోయారు. డెయిర్ అల్ బలాహ్‌లో జరిగిన దాడుల్లో 33 మంది మరణించారు. మఘాజి శరణార్థి శిబిరంపైనా దాడులు జరిగినట్లు చెబుతున్నారు. మరణాల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తర గాజాలోని కమాల్ అద్వాన్ ఆస్పత్రిలోని వారందరినీ ఇజ్రాయెల్ బలగాలు ఖాళీ చేయించినట్లు ఆరోగ్య శాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు. అనంతరం హమాస్ మిలిటెంట్ల కోసం ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టినట్లు తెలిపారు. ఆ ఆస్పత్రిలోని 65 మంది రోగుల్లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోని 12 మంది చిన్నారులు, ఆరుగురు శిశువులు ఇంకుబేటర్లలో ఉన్నారన్నారు. వీరుకాకుండా మరో 3 వేల మంది అక్కడ ఆశ్రయం పొందుతున్నట్లు ఐరాస తెలిపింది. ఇలా ఉండగా, గాజాలో హమాస్ మిలిటెంట్లతో పోరు మరికొన్ని వారాలపాటు కొనసాగుతుందని, ఆ ప్రాంతంలో సైనిక చర్య నెలలపాటు సాగవచ్చని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గల్లాంట్ చెప్పారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం । 13 । డిసెంబర్ । 2023

నమో చంద్రమౌళీశ్వర

తుమకూరు: తుమకూరు జిల్లాలోని హులి యూరు దగ్గర జోడి తిరుమలాపురంలో నున్న శ్రీచంద్రమౌళీశ్వర స్వామి ఆలయం లో కార్తీక మాసం చివరి సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. మంగళవారం అమావాస్య పూజలు సైతం విశేషంగా నిర్వ హించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను భాజాభజంత్రీల మధ్య ఊరేగించారు.


స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

న్యూస్‌రీల్

17 ఏళ్లకే 17 బైక్‌ల చోరీ


ద్విచక్ర వాహనాలతో ఎస్పీ, పోలీసులు

శివమొగ్గ: రాష్ట్రంలోని వివిధ చోట్ల సుమారు 17 బైకులను చోరీ చేసిన కేసులో 17 సంవత్సరాల మైనర్‌ ను శివమొగ్గలోని దొడ్డపేటె పోలీసులు అరెస్టు చేశారు. దొడ్డపేటె పరిధిలోనే ఇతనిపై నాలుగు బైక్‌ చోరీ కేసులున్నాయి. అలాగే సాగర, మైసూరు, హాసన్‌, దావణగెరె తదితర ప్రాంతాల్లో ఒక్కొక్కటి చొప్పున కేసులు ఉన్నాయి. బైక్‌ దొంగతనాలపై తరచూ ఫిర్యాదులు రావడంతో పోలీసులు నిఘా పెట్టని నిందితున్ని అరెస్టు చేశారు. ఈ బైక్‌ల విలువ రూ.10.55 లక్షలు అని తెలిపారు. బైక్‌లను జిల్లా ఎస్పీ పరిశీలించారు.

కుక్క దాడి.. దర్శన్‌కు క్లీన్‌చిట్‌

యశవంతపుర: ప్రముఖ నటుడు దర్శన్‌ పెంపుడు కుక్క ఒక మహిళను కరిచిన ఘటనపై బెంగళూరు ఆర్‌ఆర్‌నగర పోలీసులు విచారణను పూర్తి చేశారు. ఇందులో దర్శన్‌కు క్లీన్‌ చిట్‌ ఇచ్చారు. చార్జిషీట్‌ను రూపొందించి కోర్టుకు సమర్పించాలని నిర్ణయించారు. అమితా జిందాల్‌ అనే మహిళ తాను ఆ ఇంటి ముందు నుంచి వెళ్తుండగా కుక్క కరిచిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ సమయంలో దర్శన్‌ షూటింగ్‌ నిమిత్తం బయట రాష్ట్రంలో ఉన్నారు. అయితే బాధిత మహిళ.. దర్శన్‌, పనిమనిషిపై ఫిర్యాదు చేయటంతో పోలీసులు వీరిద్దరికీ నోటీసులిచ్చి విచారించారు. ఇందులో దర్శన్‌ మొబైల్‌ఫోన్‌ లొకేషన్‌ ఆధారంగా ఆయనకు సంబంధం లేదని తేల్చారు. పనిమనిషిపై కేసు నమోదు చేసి విచారణ జరిపారు.

సీఎంపై చర్యలు తీసుకోవాలి

దొడ్డబళ్లాపురం: సాక్ష్యాధారాలతో పాటు ముఖ్యమంత్రిపై ఫిర్యాదు చేసినా రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోలేదని కేంద్ర ఎన్నికల సంఘానికి బెళగావికి చెందిన ఆర్టీఐ కార్యకర్త భీమప్ప గడాద్‌ ఫిర్యాదు చేశారు. ఇటీవలి ఎన్నికల్లో సీఎం సిద్దరామయ్య వరుణ నియోజకవర్గంలో ఓటర్లకు ఇస్త్రీ పెట్టెలు, కుక్కర్‌లు పంచిపెట్టారని, దీనిపై సాక్ష్యాధారాలతో రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశానని మంగళవారం నాడు బెళగావిలో చెప్పారు. ఎన్నికల్లో కుక్కర్‌, ఐరన్‌ బాక్సులు పంచామని సిద్దరామయ్య తనయుడు యతీంద్ర చెప్పిన వీడియో ఎన్నికల అధికారికి ఇచ్చానన్నారు. ఇంతవరకూ తన ఫిర్యాదుని రాష్ట్ర ఎన్నికల అధికారి పట్టించుకోలేదన్నారు. సీఎంతో పాటు ఆయనపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని, లేదంటే తాను న్యాయ పోరాటం చేస్తానన్నారు.

స్కూటర్‌పై రూ.1.34 లక్షల చలాన్లు


ఏళుమలైకి చలాన్లు అందజేస్తున్న దృశ్యం

బనశంకరి: బెంగళూరులో ఒక స్కూటర్‌పై ఒకటీ రెండు కాదు 225 ట్రాఫిక్‌ చలానాలు ఉన్నాయి. జయనగర నివాసి ఏళుమలైకి స్కూటర్‌ ఉండగా, ఇష్టానుసారం తిరగడంతో ట్రాఫిక్‌ ఉల్లంఘనలు రికార్డయ్యాయి. మంగళవారం జయనగర ట్రాఫిక్‌ పోలీసులు ఆ వాహనదారుని పట్టుకుని చలానాల చిట్టా అందజేశారు. జరిమానాల మొత్తం రూ 1.34 లక్షలుగా తేలింది. ఏళుమలై నుంచి రూ.10 వేలు కట్టించుకుని మిగిలిన మొత్తం త్వరగా చెల్లించాలని సూచించారు. కాగా, అతని వద్ద ఉన్న స్కూటర్‌ను అమ్మినా జరిమానాలంత విలువ చెయ్యదు.

అక్రమ నీటి కనెక్షన్‌ ఉంటే జైలు గ్యారంటీ

శివాజీనగర: నగరంలో అధికమవుతున్న అక్రమ నీటి కనెక్షన్‌ కేసులను తీవ్రంగా పరిగణించిన జల్‌బోర్డు నీటి దొంగలపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. అక్రమ నీటి కనెక్షన్‌ ఉంటే సిలికాన్‌ సిటీ ప్రజలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జల్‌బోర్డు చైర్మన్‌ రామ్‌ప్రసాత్‌ మనోహర్‌ తెలిపారు. ఇకపై అక్రమ నీటి కనెక్షన్‌ ఉన్నట్లయితే జరిమానాతో పాటు జైలుశిక్ష కూడా విధించే తీర్మానం తీసుకున్నట్లు సమాచారం ఇచ్చారు. దీంతో అనధికారికంగా కనెక్షన్‌ ఉన్న వారిపై చట్టపరమైన చర్యలకు జలమండలి సిద్ధమైంది.
నగరంలో వేలాది మంది అనధికారిక నీటి కనెక్షన్లు పొందారు. దీంతో రాజధానిలో 35 శాతం నీరు లెక్కలోకి రావడం లేదు. అనధికార కనెక్షన్ల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను నియమించినా కేవలం జరిమానాకు పరిమితమైంది. తాజాగా అనధికారిక నీటి కనెక్షన్‌ ఉంటే ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేయాలని జలమండలి ఇంజినీర్లకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

ఇంత ఘోరం ఎప్పుడైనా జరిగిందా?



- మహిళపై దాడి, ఊరేగింపు ఘటనపై అసెంబ్లీలో తీవ్ర చర్చ
- సర్కారును నిలదీసిన బీజేపీ
- కారకులపై కఠిన చర్యలు: హోంమంత్రి


విధానసభలో మాట్లాడుతున్న హోంమంత్రి పరమేశ్వర్‌

బనశంకరి: బెళగావి నగర రూరల్‌ పరిధిలోని వంటమూరి గ్రామంలో ఓ మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటన సువర్ణసౌధలో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. దీనిపై ప్రతిపక్షాలు సర్కారును గట్టిగా నిలదీశాయి. నిందితులపై సర్కారు కఠిన చర్యలు తీసుకుంటుందని హోంమంత్రి పరమేశ్వర్‌ హామీ ఇచ్చారు.
మంగళవారం బెళగావి అసెంబ్లీలో విధానసభలో జీరో అవర్‌లో బీజేపీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ మహిళపై దాడి ఘటనను ప్రస్తావించారు. మన రాష్ట్రంలో మహిళను వివస్త్రను చేసి దౌర్జన్యం చేసిన ఘటనలు గతంలో జరగలేదన్నారు. పోలీసులపై భయం తగ్గిందని, అందుకే ఇలాంటివి జరుగుతున్నాయని, కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. బెళగావి జిల్లా ఎమ్మెల్యే శశికళా జొల్లె, అశోక్‌ పట్టణ్‌ మద్దతు పలికారు.

సమాజంలో మార్పు రావాలి: హోంమంత్రి

హోంమంత్రి పరమేశ్వర్‌ సమాధానమిస్తూ ఆదివారం అర్ధరాత్రి 12.30 సమయంలో బెళగావి నుంచి 15 కిలోమీటర్ల దూరంలో గల గ్రామంలో ఘటన జరిగింది. అశోక్‌ గటికేరి (24) అనే యువకుడు ప్రియాంక అనే అనే యువతిని ప్రేమించాడు. ఇందుకు యువతి కుటుంబం నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఆదివారం రాత్రి 12.30 సమయంలో ఇద్దరు ఇంటి నుంచి పారిపోయారు. కోపోద్రిక్తులైన యువతి కుటుంబసభ్యులు 20 మంది యువకుని ఇంటిని ధ్వంసం చేసి అతని తల్లి కమలమ్మని నుంచి ఇంట్లో నుంచి లాక్కువచ్చి గ్రామంలో ఊరేగించి వివస్త్రను చేసి కరెంటు స్తంభానికి కట్టివేశారు. పోలీసులకు తెలిసిన వెంటనే వెళ్లి మహిళకు దుస్తులు ఇచ్చి రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఇలాంటి అమానవీయ ఘటన కు పాల్పడిన వారిని క్షమించేది లేదు. ప్రేమజంటను కనిపెట్టి భద్రత కల్పిస్తామన్నారు. పరువు పేరుతో సొంత కూతురును చంపుతున్నారు. పోలీసులు, చట్టంతో అన్నింటినీ సరిదిద్దటం సాధ్యం కాదు, సమాజంలో మార్పు రావాలి అని ఆయన అన్నారు.

గ్రామంలో నిశ్శబ్దం

- ప్రేమ జంట కోసం గాలింపు

హుబ్లీ: వంటమూరిలో మహిళపై దాడి ఊరేగింపు ఘటనతో ఆ గ్రామంలో ఉద్రిక్తత కొనసాగుతోంది. ఎక్కువమంది గ్రామం వదిలి వెళ్లిపోవడంతో నిశ్శబ్దం తాండవిస్తోంది. పారిపోయిన ప్రేమ జంట వరుసకు అన్నా చెల్లి అవుతారని యువతి కుటుంబీకులు వారి ప్రేమకు అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. దాడి కేసులో ఇప్పటివరకు 9 మందిని అరెస్ట్‌ చేశారు. నిందితులను ఘటనాస్థలికి తీసుకెళ్లి విచారించారు. ప్రేమ జంట ఎక్కడ ఉన్నా రక్షణ కల్పించాలని పోలీసులకు కలెక్టర్‌ నితీష్‌ పాటిల్‌ ఆదేశించారు. ప్రేమ జంట కోసం పోలీసులు ముమ్మరంగా వెతుకుతున్నారు. మరోవైపు మహిళను స్తంభానికి కట్టేసిన ఘటనపై రాష్ట్ర హైకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. సంఘటన గురించి నివేదిక సమర్పించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది.


వంటమూరి గ్రామంలో దాడి జరిగిన ప్రదేశం ఇదే

4 వేల అడుగుల ఎత్తు నుంచి దూకి..


రాణిజరి జలపాతం పాయింట్‌.. ఇక్కడి నుంచే దూకింది

- బెంగళూరు టెక్కీ మిస్సింగ్‌ కేసు విషాదాంతం

యశవంతపుర: మిస్సింగ్‌ అయిన నగర టెక్కీ కథ విషాదంతామైంది. చిక్కమగళూరు జిల్లా మూడిగెరె తాలూకా రాణిజరి జలపాతం వద్ద బెంగళూరు టెక్కీ భరత్‌ మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. కొండ నుంచి నాలుగు వేల అడుగుల దిగువన మృతదేహాన్ని గుర్తించి అతికష్టంపై తాళ్ల సాయంతో వెలికితీశారు. ఆపై 14 కిలోమీటర్లు దూరం దట్టమైన అడవులు, లోయలను కాలినడకన దాటుకుంటూ తరలించారు.

ఉద్యోగం పోయిందనే బాధతో..

ఈ నెల 6న భరత్‌ చిక్కమగళూరు రాణిజరి జలపాతం వద్దకు వెళ్లి మొబైల్‌ఫోన్‌, బైక్‌, ఐడీ కార్డు, బట్టలను గుట్టపై విడిచి కనిపించకుండాపోయాడు. బెంగళూరులో టెక్కీగా పనిచేసే భరత్‌.. కంపెనీ ఉద్యోగం నుంచి తీసేయడంతో విరక్తి చెంది ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మూడు రోజులైనా జాడ లేకపోవడంతో కుటుంబ సభ్యులు చిక్కమగళూరుకు చేరుకొని బణకల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మొబైల్‌ఫోన్‌ లొకేషన్‌ ఆధారంగా రాణిజరి వద్ద ఉన్నట్లు గుర్తించి గాలింపు చేపట్టారు. 25 మంది పోలీసు సిబ్బంది గాలింపులో పాల్గొన్నారు. అంత పై నుంచి భరత్‌ దూకడంతో మృతదేహం ఛిద్రమై, ఈ వారంరోజుల్లో కుళ్లిపోయింది. కుమారుడు ఇక లేడని తెలిసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.


టెక్కీ భరత్‌ (ఫైల్‌)

రూ.3,542 కోట్ల వ్యయ ప్రస్తావన

శివాజీనగర: విధానసభలో 2023–24వ సంవత్సరపు వ్యయాల ప్రస్తావనను సీఎం సిద్దరామయ్య సమర్పించారు. మొత్తం రూ.3,542 కోట్లతో ప్రస్తావనలున్నాయి. ఎమ్మెల్యేలకు కొత్త కార్ల కొనుగోలుకు అదనంగా రూ.4 కోట్లు, సీఎం, మంత్రుల కార్యాలయాల ఖర్చులకు రూ.2.71 కోట్లు, నటుడు విష్ణువర్థన్‌ స్మారకానికి అదనంగా రూ.75.47 లక్షలు, దసరా ఖర్చులు అదనంగా రూ.8.5 కోట్లు, దసరా సీఎం కప్‌ నిర్వహణకు రూ.4.85 కోట్లు, ఆత్మహత్య చేసుకొన్న రైతుల కుటుంబాలకు రూ.7.30 కోట్లు తదితరాలు ఇందులో ఉన్నాయి. అలాగే వచ్చే జనవరిలో దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనే సీఎం బృందం ఖర్చులకు రూ. 12 కోట్లు, భారీ పరిశ్రమల మంత్రి అమెరికా యాత్రకు రూ.14.25 కోట్లు కేటాయించారు. స్పీకర్‌కు కొత్తకారు కొనుగోలు అదనంగా రూ.32 లక్షలు కేటాయించారు.

ల్యాబ్‌ టెక్నీషియన్‌ క్రూరత్వం?

- విషపూరిత ఇంజక్షన్‌ ఇచ్చి భార్య హత్య!


భర్త దర్శన్‌తో శ్వేత (ఫైల్‌)

యశవంతపుర: అత్తింటిలో వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన చిక్కమగళూరు జిల్లా మూడిగెరె తాలూకా దేవవృందంలో జరిగింది. వివరాలు... మూడేళ్ల క్రితం శ్వేత (31), దర్శన్‌ వివాహం జరిగింది. బాగా కట్నకానుకలు ఇచ్చారు. దర్శన్‌ బెంగళూరులో ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో ల్యాబ్‌ టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులేవు. నాలుగు రోజుల క్రితం ఇద్దరు బెంగళూరు నుంచి దేవవృందంకు చేరుకున్నారు. సోమవారం రాత్రి శ్వేత అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. శ్వేతకు గుండెపోటు వచ్చి చనిపోయిందని దర్శన్‌ అత్తమామలకు సమాచారం ఇచ్చాడు. అత్తమామలు వచ్చేలోపు దర్శన్‌ కుటుంబం శ్వేతకు అంత్యక్రియలకు సిద్ధం చేశారు.

అంత్యక్రియలను అడ్డుకున్న బంధువులు

అంత్యక్రియలు ఎందుకు అంత త్వరగా ముగించాలని చూస్తున్నారని మృతురాలి బంధువులు ప్రశ్నించటంతో దర్శన్‌ కుటుంబంలో భయం నెలకొంది. దీంతో మృతురాలి తల్లిదండ్రులకు అనుమానం వచ్చింది. ఆమెకు విషపూరిత ఇంజక్షన్‌ ఇచ్చి హత్య చేసినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని పట్టుబట్టి ఆస్పత్రికి తరలించారు. దర్శన్‌ అక్రమ సంబంధం మోజులో పడి శ్వేతను అడ్డు తొలగించటానికి ఇంజక్షన్‌ ఇచ్చి హత్య చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శ్వేత మృతదేహాన్ని చిక్కమగళూరు మల్లేగౌడ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గోణిబీడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి పైశాచికత్వం

- పశువులపై యాసిడ్‌ దాడి

దొడ్డబళ్లాపురం: ఇంటి ముందు జీవాలు గడ్డి మేస్తున్నాయన్న కోపంతో ఒక వృద్ధురాలు యాసిడ్‌ పోసిన సంఘటన బెంగళూరు ఉత్తర తాలూకా గుణి అగ్రహార గ్రామంలో చోటుచేసుకుంది. గ్రీస్‌ జోసెఫ్‌ అనే వృద్ధురాలు ఈ అఘాయిత్యానికి పాల్పడింది. నాగరాజు, హనుమంతు, రాజు, శ్రీరామ్‌ అనే పాడిరైతులకు చెందిన 15 ఆవులు తరచూ గ్రీస్‌ జోసెఫ్‌ ఇంటి ముందు గడ్డి మేసేవి. ఆమె వాటిని తరిమేసేది.
అయితే గత కొన్ని రోజులుగా జీవాల ఒంటిపై కాలిన గాయాలు కనిపిస్తుండడంతో రైతులు పశువైద్యుడికి చూపించారు. పరీక్షించిన వైద్యుడు యాసిడ్‌ పోయడంతో అయిన గాయాలని తేల్చారు. అదే సమయంలో గంగమ్మ అనే గ్రామస్తురాలు వృద్ధురాలు యాసిడ్‌ పోయడం చూసానని చెప్పింది. గ్రీస్‌ జోసెఫ్‌ ఇంటికి వెళ్లి రైతులు నిలదీయగా ఆమె నిర్లక్ష్యంగా సమాధానమిచ్చింది. దీంతో రైతులు ఆమెపై సోలదేనహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసారు.


యాసిడ్‌ దాడి చేసిన వృద్ధురాలు, దాడిలో జీవాలకు గాయాలు


జాతరోయ్‌ జాతర
మంగళవారం బెంగళూరు బసవనగుడిలో వేరుశెనగ ఉత్సవంలో నగరవాసుల రద్దీ

బీజేపీలో యత్నాళ్‌ ముళ్లు

- యడియూరప్ప, విజయేంద్రపై ఆరోపణల వర్షం
- పార్టీ నేతల ఓటమికి విజయేంద్ర యత్నించారని ధ్వజం
- కాషాయంలో తీవ్రమైన కుమ్ములాటలు

శివాజీనగర: అధికారం కోల్పోయి సతమతమవుతున్న బీజేపీకి యత్నాళ్‌ రూపంలో అసమ్మతి జ్వాల సెగ తగిలిస్తోంది. పార్టీకి మూలస్తంభంగా ఉన్న యడియూరప్పను ఆయన విమర్శలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఈసారి యడ్డి, ఆయన తనయునిపై యత్నాళ్‌ బాణాలు ఎక్కుపెట్టారు.
ఈ ఏడాది మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బసవరాజ బొమ్మై, పార్టీ సీనియర్‌ నాయకులు ఓడిపోయేలా బీవై విజయేంద్ర కుట్ర చేశారని బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్‌ యత్నాళ్‌ ఆరోపించారు. ఆయన తండ్రి యడియూరప్ప హైకమాండ్‌ నాయకులను బ్లాక్‌మెయిల్‌ చేసి కుమారున్ని బీజేపీ రాష్ట్రాధ్యక్షున్ని చేశారని విమర్శించారు. మంగళవారం బెళగావిలో విలేకరులతో మాట్లాడిన యత్నాళ్‌.. బొమ్మై, వీ.సోమణ్ణతో పాటుగా పలువురు నాయకులను ఓడించడానికి విజయేంద్ర కుట్ర పన్ని ఆ నియోజకవర్గాల్లో ప్రత్యర్థి అభ్యర్థులకు నగదు పంపారని ఆరోపించారు. బొమ్మై ఈ విషయం నాకు చెప్పారు, రాష్ట్రంలో తండ్రి–కుమారులు ఏమి చేశారనేది అందరికీ తెలియాలి. సోమణ్ణను ఓడించారు. కుమారునికి పదవి ఇవ్వకపోతే లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కడికీ ప్రచారానికి వెళ్లను అని యడియూరప్ప హైకమాండ్‌ని బెదిరించారని అన్నారు. ఎన్నికల్లో విజయేంద్రకు వ్యతిరేకంగా బలహీనమైన అభ్యర్థిని పోటీలో నిలిపారు. అదే రీతిలో వరుణలో సీఎం సిద్దరామయ్యకు సహకారం అందించారని దుయ్యబట్టారు. తండ్రి – కుమారుని గురించి హైకమాండ్‌కు అన్ని విషయాలను తెలియజేస్తానని యత్నాళ్‌ ధ్వజమెత్తారు.


తిరుగుబాటు ధోరణిలో యత్నాళ్‌


విజయేంద్రకు తండ్రి యడ్డి మిఠాయి (ఫైల్‌)

ఉత్తర కుమారుడు కావద్దు: ఈశ్వరప్ప

శివమొగ్గ: నేను శాసనసభకు వెళ్లనని చెప్పడం, ఉత్తర కుమారుని పౌరుషం ఉన్నట్లు ప్రవర్తించడం సరికాదని బీజేపీ మాజీ మంత్రి కె.ఎస్‌ ఈశ్వరప్ప ఎమ్మెల్యే యత్నాళ్‌పై విమర్శలు గుప్పించారు. శివమొగ్గలో ఆయన మీడియాతో మాట్లాడుతూ యత్నాళ్‌ నాకు మంచి స్నేహితుడని, అలాగే హిందుత్వ, జాతీయ వాదిగా ఉన్నారు. మనసులో ఏముంటే దానిని బయటికి చెప్పడం ఆయన నైజం. మనసులో బాధ, అసంతృప్తి ఉంటే గదిలో కూర్చుని మాట్లాడాలనేది బీజేపీ నియమం. ప్రతి ఒక్కరూ ఈ నియమాన్ని పాటించాలని సూచించారు. యత్నాళ్‌కు సరైన స్థానం లభించక ఆవేదనలో ఉన్నారని, ఆ కోపంతో యడియూరప్ప, కుమారునిపై మాట్లాడడం సరికాదన్నారు.

బీమా పేరుతో దంపతుల మోసాలు

బనశంకరి: బీమా పాలసీల పేరుతో మోసాలకు పాల్పడుతున్న దంపతులను నగర సీసీబీ పోలీసులు అరెస్ట్‌ చేశారు. బి.ఉదయ్‌, తీర్థ గౌడ నిందితులు, వీరిద్దరూ గతంలో ఇన్సూరెన్సు కంపెనీలో పనిచేసేవారు, కోవిడ్‌ సమయంలో ఆర్థిక ఇబ్బందులు వచ్చి అడ్డదార్లు తొక్కారు. ఇందిరానగరలో శ్రీనిధి ఇన్సూరెన్స్‌ అనే ఆఫీసు తెరిచారు. 5 మంది టెలికాలర్లను నియమించి, ల్యాప్స్‌ పాలసీలు, బీమా క్లెయిమ్స్‌ వంటి పనులు చేసేవారు. మరోవైపు సీనియర్‌ సిటిజన్లు పాలసీచేస్తే పెద్దమొత్తంలో తిరిగి వస్తుందని నమ్మించి అనేకమందితో పాలసీలు చేయించి ఆ డబ్బును సొంత ఖాతాలో వేసుకునేవారు. ఇలా 1.80 కోట్లు వంచనకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. వీరిపై ఇదివరకే 290 వరకూ కేసులు ఉండడం గమనార్హం.

కుల గణనకు మద్దతు: డీకే

శివాజీనగర: తాను కుల గణనను వ్యతిరేకించలేదని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ చెప్పారు. కర్ణాటకలో కుల గణన నివేదికను విడుదల చేయరాదని ఒక్కలిగుల సంఘాలు ఇచ్చిన వినతిపత్రంపై డీకే శివకుమార గతంలో సంతకం చేశారు. కాంగ్రెస్‌ చీఫ్‌ మల్లికార్జున ఖర్గే రాజ్యసభలో కుల గణనకు మద్దతుగా మాట్లాడడంతో డీకే హఠాత్తుగా మాట మార్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కుల గణనను వ్యతిరేకించలేదని, నా ఇంటి నుంచే సక్రమంగా కుల గణన జరగాలి. అయితే కుల గణన నివేదికలో అప్పటి కార్యదర్శి సంతకం చేయలేదనే చెప్పానన్నారు.

శెనక్కాయలతో అమ్మవారికి అలంకారం



బనశంకరి: కార్తీకమాస అమావాస్య సందర్భంగా బనశంకరీదేవి శనక్కాయలు, శెనగింజల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్‌ బనశంకరీదేవికి అర్చనలు, అభిషేకం నిర్వహించి శనక్కాయలు, శనగింజలతో అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేశారు.

మైసూరులో వెంటాడి హత్యాయత్నం



మైసూరు: పర్యాటక నగరి మైసూరులో నేరాలు పెరిగిపోతూ నగరవాసులకు ప్రశాంతత లేకుండా చేస్తున్నాయి. నిత్యం ఏదో ఒక చోట ఘర్షణ, చోరీలు, హత్య వంటివి జరుగుతున్నాయి. తాజాగా కొందరు దుండగులు సినిమాలో మాదిరిగా ఒక వ్యక్తి వెంటాడి నరికారు. మంగళవారం మైసూరు నగరంలోని దేవరాజు మొహల్లాలోని బిడారాం కృష్ణప్ప రోడ్డులో అంబేద్కర్‌ భవనం వద్ద జరిగింది. ఉదయగిరికి చెందిన నిహాబీబ్‌ అలియాస్‌ సూక్కా ... మరిమల్లప్ప అరసు రోడ్డులోని క్యాంటీన్‌లో టీ తాగుతున్నాడు. ఇంతలో ఇన్నోవా కారులో వచ్చిన ఎనిమిది మంది దుండగులు కొడవళ్లతో దాడి చేశారు. అతడు పారిపోతుండగా వెంటాడి నరికి పరారయ్యారు. రక్తపు మడుగులో పడి ఉన్న బాధితున్ని స్థానికులు కేఆర్‌ ఆస్పత్రికి తరలించారు. దేవరాజ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. పాత కక్షలే కారణం కావచ్చని అనుమానాలున్నాయి.

క్లుప్తంగా

కనకదాస ప్రతిమ ఊరేగింపు



కనకదాస ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

సిరుగుప్ప: తాలూకాలోని బాగేవాడి గ్రామంలో మంగళవారం దాస శ్రేష్ఠ కనకదాస జయంతిని నిర్వహించారు. ముందుగా కనకదాస ప్రతిమతో గ్రామంలోని ప్రముఖ వీధుల్లో డోలు, తప్పెట్లను వాయిస్తూ కనకదాస కీర్తనలు ఆలపించి, భజన చేసిన కళాబృందాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, హాలుమతస్తులు, కురబ సమాజ సోదరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం



మాట్లాడుతున్న అయ్యన్న

రాయచూరు రూరల్: రాయచూరు థర్మల్ విద్యుత్ కేంద్రం(ఆర్‌టీపీఎస్)లో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న కార్మికులకు అన్యాయం జరిగిందని కాంట్రాక్ట్ కార్మికుల సంఘం అధ్యక్షుడు అయ్యన్న పేర్కొన్నారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25–30 ఏళ్ల పాటు కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయడానికి నియమించిన ఉప సమితి నేడు చేతులెత్తేసిందని ఆరోపించారు. పీఎఫ్, జీపీఎఫ్ వంటివి ఇచ్చిన పాలక మండలి నేడు వారిని పర్మినెంట్ చేసుకునే అవకాశం లేదని చెప్పడంతో వారి కుటుంబాలు వీధిన పడతాయన్నారు. రాజకీయ నాయకుల కుట్రలతో కార్మికుల భవిష్యత్తు అంధకారం అయిందన్నారు.

తాగునీటిని అందించరూ



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరవాసులకు సక్రమంగా తాగునీటిని అందించడంలో నగరసభ విఫలమైందని, నగరంలో తాగునీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని దళిత సంఘర్ష సమితి పేర్కొంది. మంగళవారం నగరసభ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి సమితి సంచాలకుడు నరసింహులు మాట్లాడారు. తాలూకాలో కృష్ణా, తుంగభద్ర నదులు ప్రవహిస్తున్నా నగరసభ తాగునీటిని సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. నగర ప్రజలకు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతూ నగరసభ కమిషనర్ గురుసిద్దయ్యకు వినతిపత్రం సమర్పించారు.


జ్వరంతో బాలిక మృతి



రోషిణి మృతదేహం

గుత్తి రూరల్: మండలంలోని ఊటకల్లు గ్రామంలో తీవ్ర జ్వరంతో రోషిణి (11) అనే బాలిక మృతి చెందింది. బాలిక కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బళ్లారికి చెందిన జాఫర్‌వలి అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలసి ఊటకల్లు గ్రామంలో జరిగే బంధువుల దినకర్మకు వచ్చాడు. అయితే వారు బళ్లారి నుంచి వచ్చేటప్పటికే రోషిణికి జ్వరం ఉండేది. దీంతో సోమవారం ఉదయం గ్రామంలో ఓ వైద్యునితో చికిత్స చేయించి సూది వేయించారు. రాత్రి 10 గంటల సమయంలో రోషిణిని తల్లిదండ్రులు నిద్రలేపగా ఎంతకీ లేవలేదు. అనుమానం వచ్చిన వారు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రోషిణి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రోషిణి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

తపాలా ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

రాయచూరు రూరల్: తపాలా ఉద్యోగుల వేతన బకాయిలను చెల్లించాలని భారతీయ గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం ప్రధాన తపాలా శాఖ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు దొడ్డయ్యస్వామి మాట్లాడారు. ప్రధానంగా రోజుకు 5 గంటలు పని, పెన్షన్, సీనియారిటీ, పీఎఫ్, జీపీఎఫ్ అమలు చేయాలన్నారు. బీమా పాలసీ పరిమితిని రూ.5 లక్షల వరకు పెంచాలని, కింది స్థాయి ఉద్యోగులపై పని భారాన్ని తగ్గించాలని, వైద్య ఖర్చులు భరించాలని కోరుతూ తపాలా శాఖాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ఎమ్మెల్యేల వాగ్వాదంతో దద్దరిల్లిన అసెంబ్లీ

- గాలి జనార్ధనరెడ్డి వర్సెస్ నారా భరత్‌రెడ్డి
- విధానసభ సమావేశంలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం



ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి



ఎమ్మెల్యే గాలి జనార్ధనరెడ్డి

సాక్షి,బళ్లారి: గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన రెడ్డి, బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఇద్దరూ అసెంబ్లీలో తీవ్రంగా వాగ్వాదం చేసుకున్నారు. మంగళవారం బెళగావిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఇరువురు ఎమ్మెల్యేలు ఏకవచనంతో సంభోదించుకుని ఒకరిపై మరొకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడంతో వారి వ్యాఖ్యలు పతాకస్థాయికి చేరాయి. బళ్లారిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు సాకుతో నాడు రైతులపై కాల్పులు జరిపి అప్పటి బీజేపీ ప్రభుత్వ హయాంలో బలవంతంగా భూములను స్వాధీనం చేసుకున్నారని, బ్రాహ్మణి స్టీల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తామని భూములు కొనుగోలు చేసి, మళ్లీ అమ్ముకున్నారని నగర ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. బళ్లారి వాస్తవాలను తెలియజేసి అసెంబ్లీలో మీ అవినీతి చిట్టాను విప్పుతానని, పరిశ్రమల స్థాపన పేరిట భూములు స్వాధీనం చేసుకుని రైతులను మోసం చేశారని ఘాటుగా ఆరోపణలు చేశారు. దీనిపై ఎమ్మెల్యే గాలి జనార్ధనరెడ్డి స్పందిస్తూ నారా భరత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

సెంటు భూమి ఉన్నా చూపాలని సవాల్

తనకు గాని, తన కుటుంబ సభ్యులకు గాని ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల ఒక సెంటు భూమి ఉన్నా చూపించాలని సవాల్ విసిరారు. తల, తోక లేకుండా మాట్లాడుతున్నారని భరత్‌రెడ్డిపై మండిపడ్డారు. అసెంబ్లీలో మాటల యుద్ధం పతాకస్థాయికి చేరుకుని ఇరువురు ఎమ్మెల్యేలు ఒకరిపై ఒకరు ఏకవచనంతో సంభోదించుకోవడంతో స్పీకర్ కలగజేసుకుని ఇరువురు ఎమ్మెల్యేలకు నచ్చజెప్పి కూర్చోవాలని, ఏకవచనంతో సంభోదించుకోకూడదని సూచించారు. గాలి జనార్ధన రెడ్డి మాట్లాడుతూ సుప్రీంకోర్టులో ఉన్న విషయాలపై అసెంబ్లీలో మాట్లాడుతున్నారని, బళ్లారి నగర ఎమ్మెల్యేను కట్టడి చేయాలని స్పీకర్‌కు విన్నవించారు. ఇంతలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర కలగజేసుకుని మాట్లాడుతూ ప్రతి ఒక్క ఎమ్మెల్యే తన హయాంలో అభివృద్ధి చేయాలని భావిస్తారన్నారు. ప్రస్తుతం తాము అధికారంలో ఉన్నందున ఖచ్చితంగా బళ్లారిని సర్వతోముఖాభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. అయితే వ్యక్తిగత ఆరోపణలు చేసుకోవడం సరికాదని, ఈ విషయంలో స్పీకర్ కలగజేసుకుని తగిన విధంగా సూచించాలని కోరారు. దీంతో వ్యక్తిగతంగా ఒకరిపై మరొకరు వ్యాఖ్యలు చేసుకోకూడదని స్పీకర్ ఖాదర్ ఘాటుగా హెచ్చరించారు.

చట్టసభను చూడాలని



బెళగావిలో అసెంబ్లీ సమావేశాలు విద్యార్థులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఉత్తర కర్ణాటక జిల్లాల నుంచి పాఠశాలల విద్యార్థులు సమావేశాలను చూడాలని తరలివస్తున్నారు. మంగళవారం ఓ దివ్యాంగ బాలున్ని అసెంబ్లీ వద్దకు ఎత్తుకెళ్తున్న వ్యక్తి(పైన). అలాగే సువర్ణ సౌధ ఆవరణలో భోజనాలు చేస్తున్న బాలికలు (కింద).



తరగతులు బహిష్కరించి నిరసన



కళాశాల గేట్ ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు

హొసపేటె: అతిథి అధ్యాపకుల డిమాండ్లను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని ఒత్తిడి చేస్తూ తరగతులను బహిష్కరించి సోమవారం వేలాది మంది శంకర్ ఆనంద్‌సింగ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు కాలేజీ ముందు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కాలేజీ అతిథి ఉపన్యాసకులు తమకు సేవా భద్రత కల్పించాలని తరగతులను బహిష్కరించి ధర్నా చేపట్టడంతో తరగతుల్లో పాఠాల బోధన నిలిచిపోయిందన్నారు. గత 15 రోజులుగా తరగతులు జరగడం లేదని మండిపడ్డారు. విద్యార్థులు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

కొండచిలువ పట్టివేత



మండ్య: కుమటా తాలూకా బాలిగా కళాశాల రోడ్డులోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట భారీ కొండ చిలువను స్థానికులు గుర్తించారు. స్నేక్ నిపుణుడు పవన్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి చేరుకుని కొండచిలువను చాకచక్యంగా పట్టుకుని అడవిలో సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టారు.

విద్యార్థులకు జాగృతి జాతా



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, పోలీసులు, సిబ్బంది

శ్రీనివాసపురం: ముళబాగిలులోని సెయింట్ జాన్ పాఠశాలలో మంగళవారం అపరాధ మాసోత్సవంలో భాగంగా జాతాను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 112 సేవలు, పోక్సో, ట్రాఫిక్ నియమాలు, మాదక వస్తువుల వినియోగంపై జాగృతి కల్పించారు. కార్యక్రమంలో నగర పోలీసులతో పాటు విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



మాట్లాడుతున్న మమతా పాటిల్

రాయచూరు రూరల్: రక్తహీనత బారిన పడిన యువత, బాలింతలకు పౌష్టికాహారం అవసరమని కలబుర్గి వైద్య కళాశాల రక్తనిధి అధికారిణి మమతా పాటిల్ అభిప్రాయపడ్డారు. మంగళవారం కలబుర్గిలోని వీరమ్మ గంగసిరి మహిళా జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తహీనత రహిత పౌష్టిక కర్ణాటక అనే చర్చాగోష్టిని ప్రారంభించి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలను అపౌష్టికత బారిన పడకుండా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సిద్దరామ, ప్రిన్సిపాల్ సంగమేశ, ఎన్ఎస్ఎస్ అధికారి మహేష్, సుష్మ, సుమతి, నందిని, లక్ష్మీకాంత్, మోహన్‌రాజ్, రేణుక, జ్యోతిలున్నారు.



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

● ఘనంగా లక్ష దీపోత్సవం

మాలూరు: తాలూకాలోని లక్కూరు గ్రామంలో ఉన్న ప్రసన్న సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి లక్ష దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయానికి వచ్చి దీపాలను వెలిగించారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ప్రసాద వితరణ జరిపారు.

వేసవిని తలపిస్తున్న తాగునీటి ఎద్దడి




తాగునీటి కోసం ట్యాంకర్ వద్ద గుమికూడిన ప్రజలు

రాయచూరు రూరల్: నగరంలో తాగునీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వేసవిని తలపించే రీతిలో ఎదురైన తాగునీటి సమస్య నివారణకు ప్రభుత్వం, నగరసభ యంత్రాంగం చర్యలు తీసుకుంటామని ఒక వైపు చెబుతుండగా మరో వైపు నీటి ఎద్దడి మరింత అధికమైంది. నగరంలో జలనిర్మల పథకం కింద రూ.వందల కోట్లు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయింది. నగరంలో ఐదు రోజులకొకసారి తాగునీటిని వదులుతున్నారు. 1వ వార్డు నుంచి 10వ వార్డుకు తుంగభద్ర ఎడమ కాలువ నీటిని రాంపూర్ జలాశయం నుంచి విడుదల చేస్తారు. 11వ వార్డు నుంచి 33వ వార్డు వరకు కృష్ణా నది నుంచి నేరుగా చిక్కసూగూరు నీటి ట్యాంక్‌కు నీరు వదులుతారు. నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో 16వ వార్డు నగరసభ సభ్యురాలు గాయత్రి స్వంత ఖర్చుతో మంగళవారం వార్డు ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరడంతో కాంగ్రెస్ నేతలు ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని నగరసభ కమిషనర్ గురుసిద్దయ్యతో చర్చించారు.

సత్యసాయి విగ్రహంపై సర్పరాజు

- భక్తుల్లో అమితాశ్చర్యం



సత్యసాయి విగ్రహం మెడలో నాగుపాము

పుట్టపర్తి రూరల్: శ్రీసత్యసాయి బాబా పాలరాతి విగ్రహం మెడలో నాగుపాము చుట్టుకుని అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి రహదారి వద్ద గల ఆర్గ్ సంగ్ విల్లాస్ గృహ సముదాయంలో సోమవారం కన్పించిన ఈ దృశ్యం ఒకరోజు ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. అమెరికాకు చెందిన ప్యాటీ క్రైన్ మెన్ అనే భక్తురాలు సాయిబాబా విగ్రహాలతో మందిరాన్ని నిర్మించింది. నిత్యం ఆమె పూజలు నిర్వహిస్తూ ఉంటుంది. అనుకోకుండా ఒక పెద్ద నాగుపాము తన ఇంటి ఆవరణలోని మందిరంలోకి ప్రవేశించింది. సత్యసాయి బాబా విగ్రహం మెడకు చుట్టుకుని విగ్రహాన్ని ముద్దాడుతూ కనిపించింది. దీంతో ఆమె ఈ విషయాన్ని సమీపంలోని ప్రజలకు తెలియజేసింది. వారు అక్కడకు చేరుకుని నాగుపాముకు పాలు, నీళ్ల తాపి.. పసుపు, కుంకుమ, పూలు చల్లుతూ పూజలు చేశారు. నాగుపాము కొన్ని గంటల పాటు విగ్రహాన్ని చుట్టుకుని పడగవిప్పి ఆరాధిస్తున్నట్లుగా అక్కడే ఉండి పోయింది. ఈ దృశ్యాన్ని చూడటానికి భక్తులు ఎగబడ్డారు.

కోలారు వార్తలు...

చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: తాలూకాలోని నీలటూరు గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథకంలో భాగంగా అమృత్ సరోవర్ పథకం కింద సుమారు రూ.60 లక్షల వ్యయంతో చెరువు అభివృద్ధి పనులను మంగళవారం పీడీఓ మంగళాంబ ప్రారంభించారు. సుమారు 10 వేల క్యూసెక్కుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన చెరువుగా అభివృద్ధి పరుస్తున్నట్లు తెలిపారు. తద్వారా గ్రామంలో తాగునీటి సమస్య తీరుతుందన్నారు. ఈ చెరువులో నీరు చేరి అంతర్జలాల స్థాయి పెరిగితే రైతుల వ్యవసాయానికి ఎంతో అనుకూలం అవుతుందన్నారు. జీపీ ఉపాధ్యక్షుడు ఎస్.మోహన్‌బాబు, అధ్యక్షురాలు విజయలలిత, సభ్యులు రూపా రామాంజి తదితరులు పాల్గొన్నారు.

బెమెల్‌లో స్థానికుల నియామకానికి వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే రూపా

కోలారు: కేజీఎఫ్ నగరంలోని బెమెల్ సంస్థ నియామకాల్లో స్థానిక అర్హులైన అభ్యర్థులను నియమించాలని ఎమ్మెల్యే రూపా శశిధర్ మంగళవారం కేంద్ర ముఖ్య కార్యదర్శి రజనీష్ గోయల్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలోని కేజీఎఫ్‌లో ఉన్న ఏకైక పబ్లిక్ రంగ బెమెల్ సంస్థలో చాలా ఏళ్లుగా ఉద్యోగాలను భర్తీ చేయలేదన్నారు. బెమెల్‌లోని అన్ని విభాగాల్లో సుమారు 2 వేల మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. బెమెల్‌లో 119 ఉద్యోగాల భర్తీకి రాత పరీక్ష నిర్వహించారని, ఈ నియామకాల్లో స్థానిక అభ్యర్థులకే ప్రాధాన్యత నివ్వాలని ఆమె కోరారు.

రీఫిల్లింగ్ దందాపై జాగృతి అభియాన్



మాట్లాడుతున్న చేతన్‌కుమార్

కోలారు: గ్యాస్ రీఫిల్లింగ్ దందాకు వ్యతిరేకంగా జనజాగృతి అభియాన్ నిర్వహిస్తున్నట్లు వినియోగదారుల సంక్షేమ ఫౌండేషన్ కర్ణాటక విభాగం అధ్యక్షుడు ఎస్ చేతన్ కుమార్ తెలిపారు. మంగళవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వాహనాల్లో ఉపయోగిస్తున్న గృహోపయోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించడం నేరమన్నారు. దీనిపై ప్రజలను జాగృతం చేయడం కోసమే ఈ అభియాన్‌ను ప్రారంభించామన్నారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధర అధికంగా ఉండడం వల్ల గృహోపయోగ సిలిండర్లు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. కోట్ల రూపాయల్లో ఈ దందా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రేషన్ పంపిణీకి మాదిరిగా సిలిండర్ల పంపిణీకి కూడా బయోమెట్రిక్ పద్ధతి ఉండాలన్నారు. గ్యాస్ సిలిండర్లను దుర్వినియోగపరిస్తే ఐదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా తప్పదన్నారు. ఈసందర్భంగా ఫౌండేషన్ పాలనాధికారి ప్రశాంత్, పీఆర్ఓ అరుణ మనగండి, యశ్ దేశ్ పాండే ఉన్నారు.

నివేదిక తిరస్కరించాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు: కాంతరాజు నివేదికను ప్రభుత్వం తిరస్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నగరంలోని కేఎస్ఆర్టీసీ బస్టాండు సర్కిల్ వద్ద బలిజ సముదాయ ప్రముఖులు ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులు మాట్లాడుతూ కాంతరాజ్ నివేదికను ప్రభుత్వం ఎట్టి పరిస్థితిలోను అంగీకరించరాదన్నారు. సంఘం జిల్లా మహా ప్రధాన కార్యదర్శి కేవీ సురేష్‌కుమార్ మాట్లాడుతూ శాశ్వత వెనుకబడిన వర్గాల కమిషన్ మాజీ అధ్యక్షుడు కాంతరాజు నివేదిక వివాదాస్పదంగా, అశాస్త్రీయంగా, విద్యా, సామాజిక, ఆర్థిక పరమైన రిజర్వేషన్‌ను ఇవ్వకుండా బలిజ సముదాయానికి అన్యాయం చేసేలా ఉందన్నారు. ఆందోళనలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె ఎస్ రవికుమార్, సంఘం మాజీ అధ్యక్షుడు పుష్టి నారాయణస్వామి, బలిజ న్యాయవాదుల వేదిక అధ్యక్షుడు ఎల్‌నాగరాజ్ తదితరులు ఈసందర్భంగా పాల్గొన్నారు.

స్వసహాయ సంఘాలకు రుణాలు ఇవ్వద్దు



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: మహిళా స్వసహాయ సంఘాలకు ఇస్తున్న రుణాలను ఆపివేయాలని కరునాడు రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ మహబూబ్ పాషా డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాధికారి అక్రం పాషాకు వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. పేదలు అవసరాల కోసం ధర్మస్థళ క్షేత్రాభివృద్ధి సంఘం, డీసీసీ బ్యాంకు, పొరుగు రాష్ట్రాల పలు ప్రైవేటు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని తిరిగి చెల్లించలేక పరువు కోసం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, పోలీసులు దృష్టి పెట్టి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మీటర్ వడ్డీతో ప్రజలను దోచుకుంటున్న వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ ముజాహిద్, కార్మిక విభాగం అధ్యక్షుడు మోక్ధన్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

మనిషికి స్వార్థం తగదు



పుస్తకాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: బలిష్ట సమాజ నిర్మాణానికి మానవుడు స్వార్థాన్ని విడనాడాలని కలబుర్గి సీనియర్ సాహితీవేత్త ఆర్.జి.హుడికి పేర్కొన్నారు. మంగళవారం కన్నడ భవనంలో పురుషోత్తం కలాల్ బండి స్మరణార్థం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పుస్తకాన్ని విడుదల చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కళలను ప్రోత్సహించాలన్నారు. సామాజిక, విద్యా, సంగీత రంగానికి చేసిన సేవలను గుర్తించాలన్నారు. సమావేశంలో పురుషోత్తం కలాల్ బండి అభిమానుల సంఘం అధ్యక్షుడు బసవరాజ్ కళస, బసవరాజ్, రాఘవేంద్ర కుష్టిగి, మీనాక్షి బాళే, రమేష్, దేవేంద్రగౌడ తదితరులు ఈసందర్భంగా పాల్గొన్నారు.

అధికారిని సస్పెండ్ చేయండి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా సాంఘీక సంక్షేమ శాఖ హాస్టల్‌లో భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యేందుకు కారకుడైన సాంఘీక సంక్షేమ శాఖాధికారిని సస్పెండ్ చేయాలని దళిత సంఘర్ష సమితి డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనసుద్దేశించి అధ్యక్షుడు శరణప్ప దిన్ని మాట్లాడారు. విద్యార్థుల సంక్షేమం పట్ల సాంఘీక సంక్షేమ శాఖాధికారి మహేష్ పోతేదార్ నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. గతంలో రాయచూరు, లింగసూగూరు తాలూకాల్లో ఇలాంటి సంఘటనలు జరిగినా సరిగా స్పందించక పోవడాన్ని తప్పుబట్టారు. విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు సమకూర్చడంలో అసమర్థుడైన అలాంటి అధికారిని సస్పెండ్ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

అంగన్‌వాడీ పనుల పూర్తికి సూచన

కోలారు: జిల్లాలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లాధికారి అక్రం పాషా సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 2,180 అంగన్‌వాడీలు ఉండగా, ఇందులో 462 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారన్నారు. తాలూకా వారు స్థలాలు ఉన్న, స్థలాలు లేని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను అందించాలని అధికారులకు సూచించారు. తమ పాఠశాల పరిధిలోని అంగన్‌వాడీ భవనాలపై విద్యాశాఖతో చర్చించి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. నగర పరిధిలో సంబంధిత అధికారులతో చర్చించి కొత్త కట్టడాల నిర్మాణానికి ఖాళీ స్థలాలను ఇవ్వాలని, నిర్మాణ పనులు పూర్తయిన కట్టడాలను సంబంధిత అధికారులకు అప్పగించాలని సూచించారు. ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో నిర్మించిన సముదాయ భవనాల జాబితాను తయారు చేసి వచ్చే సమావేశానికి తీసుకురావాలన్నారు. ఈసందర్భంగా జెడ్పీ సీఈఓ పద్మా బసవంతప్ప, స్త్రీ శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వంశీకృష్ణ, డీఈఓ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజ్యసభ సభ్యుడు సాహును అరెస్టు చేయాలి


ధర్నా చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

దొడ్డబళ్లాపురం: పెద్ద మొత్తంలో అక్రమ సంపద కూడబెట్టుకున్న కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ధీరజ్ ప్రసాద్ సాహును తక్షణం అరెస్టు చేయాలని డిమాండు చేస్తూ బీజేపీ, జేడీఎస్ కార్యకర్తలు రామనగరలో ధర్నా చేపట్టారు. మంగళవారం రామనగర పట్టణంలోని ఐజూరు సర్కిల్‌లో చేరిన బీజేపీ, జేడీఎస్ కార్యకర్తలు సాహు రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేసి అరెస్టు చేయాలన్నారు. ఐటీ దాడిలో వందలాది కోట్లు పట్టుబడడం కాంగ్రెస్ వారి అవినీతికి అద్దం పడుతోందన్నారు. సాహు, రాహుల్ గాంధీకి ఎంతో దగ్గరివాడని, పట్టుబడ్డ డబ్బుతో ఎవరెవరికి సంబంధం ఉందో దర్యాప్తు చేసి తేల్చాలని డిమాండు చేసారు. ఇంత జరిగినా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

మిమ్స్‌లో డార్మెటరీ నిర్మాణం!

మండ్య: మండ్య నగరంలోని మిమ్స్ ఆస్పత్రిలో సీఎస్ఆర్ నిధుల ద్వారా వసతులను కల్పిస్తామని కలెక్టర్ డాక్టర్.కుమార తెలిపారు. మంగళవారం మిమ్స్‌లో ఆయన తనిఖీలు చేసి మాట్లాడారు. రోగుల వెంట ఉండేవారు చోటు లేక ఆస్పత్రి బయట, రోడ్డు పక్కన కూర్చుంటున్నారు. వారికి విశ్రాంతి తీసుకోవడానికి డార్మెటరీలు, మరుగుదొడ్ల అవసరం ఉందన్నారు. సుమారు 30 లక్షల రూపాయల సీఎస్ఆర్ నిధుల ద్వారా ఈ నిర్మాణాలను కట్టిస్తామని, 15 రోజుల్లో పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మండ్య: మండ్య జిల్లా పంచాయతీ ముఖ్య కార్య నిర్వహణ అధికారి షేక్ తన్వీర్ ఆసీఫ్ మంగళవారం తాలూకాలోని గోపాలపుర, బీ హొసూరు, దడ్డొగురుడనహళ్లి బసరాళు గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గోపాలపుర గ్రామానికి చేరుకుని మత్స్యకారుల శాఖ భవనం అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఇక బసరాలు గ్రామంలో పశుసంవర్ధక శాఖ భవనం నిర్మాణ పనులను పరిశీలించారు. అదే విధంగా హొసూరు గ్రామంలో తాగునీటి పైప్ పనులను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్టు దుర్మరణం


బోల్తా పడిన వాహనం

బొమ్మనహళ్లి: సిమెంటు కాంక్రీట్ మిక్సింగ్ లారీ అదుపుతప్పి బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కుమారస్వామి లేఔట్‌లో పరిధిలోని కోళిఫామ్ వద్ద చోటుచేసుకుంది. మృతుడిని సత్యేంద్ర సింగ్ (53)గా గుర్తించారు. ఇతను బెంగళూరు నగరంలోని పుట్టెనహళ్లిలో నివాసం ఉంటున్నాడు. వీవర్స్ కాలనీ నుంచి బన్నేరుఘట్ట రోడ్డు కోళిఫామ్ గేట్ వైపు వెళ్తున్న సమయంలో ఆర్ఎంసీ సిమెంట్ మిక్సింగ్‌లారీ సత్యేంద్ర బైక్‌ను ఢీకొని సమీపంలోని దుకాణంలోకి దూసుకెళ్లింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గంగాధరేశ్వరునికి పూజలు



బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా పరిధిలోని ఆనేకల్ పట్టణం సంతె మాళల వద్ద చరిత్ర ప్రసిద్ధ గంగాధరేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసం చివరి సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు బెల్లంతో స్వామివారికి దీపారాధన చేశారు.

దొడ్డలో శెనక్కాయల పరుష


భక్తులకు శెనక్కాయలు పంపిణీ చేస్తున్న దృశ్యం

దొడ్డబళ్లాపురం: దొడ్డ పట్టణంలోని కరేనహళ్లిలో ఉన్న బయలు బసవన్న దేవాలయంలో చివరి కార్తీక సోమవారం సాయంత్రం శెనక్కాయల పరుష కన్నుల పండువగా జరిగింది. 27 సంవత్సరాలుగా దేవాలయంలో శెనక్కాయల పరుష జరుపుతున్నారు. దేవాలయం వద్ద 22వ కన్నడ రాజ్యోత్సవం నిర్వహించారు. మంగళవారం స్వామికి ఉయ్యాలోత్సవం జరిపించారు. పరుషకు విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ వారు ఉచితంగా శెనక్కాయలు పంపిణీ చేసారు. ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది పరుషకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు.

రూ.21 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

- కొత్త ఏడాది విక్రయానికి పెద్ద ఎత్తున నిల్వ
- నైజీరియన్ అరెస్ట్

శివాజీనగర: కర్ణాటకలో డ్రగ్స్ భూతం చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఐటీ నగరి బెంగళూరులో కొత్త సంవత్సరం, క్రిస్మస్ సందర్భంగా విక్రయించేందుకు నిల్వ చేసిన రూ. 21 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకుని ఓ నైజీరియా దేశానికి చెందిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు నగర సీపీ దయానంద్ మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 16 కిలోల ఎండీఎంఏ క్రిస్టల్, 500 గ్రాముల కొకైన్, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు.

బిజినెస్ వీసాపై వచ్చి దందా

పోలీసులకు పట్టుబడిన నైజీరియన్ లియోనార్డ్ బిజినెస్ వీసాపై ఇండియా వచ్చాడు. నగరంలోని రామమూర్తి నగరలో అద్దెకు ఉంటున్నాడు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌కు పెద్ద ఎత్తున ఇతను డ్రగ్స్ సేకరించాడు. ఢిల్లీ, ముంబై ఇతర రాష్ట్రాల్లో ఉన్న విదేశీయుల నుంచి డ్రగ్స్ సేకరించి వాటిని ఎవరికి అనుమానం రాకుండా చుడీదారు క్లాత్‌లు, బెడ్‌షీట్ కవర్లు, సబ్బు పెట్టెలు, చాక్లెటు బాక్సుల్లో తీసుకువచ్చాడు. వీటిని నగరంలో నూతన సంవత్సర వేడుకల్లో పార్టీలకు, కస్టమర్లకు, కళాశాల విద్యార్థులు, ఐటీ, బీటీ ఉద్యోగులకు అధిక ధరలకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశ్యంతో డ్రగ్స్ రహస్యంగా సేకరించినట్లు పోలీసుల విచారణలో తేలింది. సీసీబీ మాదక ద్రవ్య నిరోధక దళం రామమూర్తినగరలో పూర్తి సమాచారం మేరకు కార్యచరణను చేపట్టి నైజీరియన్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ. 21 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంది. నిందితుడిపై రామమూర్తి నగర పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ చట్టం, విదేశీ చట్ట రీత్యా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అదనపు పోలీస్ కమిషనర్, సతీశ్‌కుమార్ మార్గదర్శనంలో సీసీబీ డీసీపీ శ్రీనివాసగౌడ నేతృత్వంలో సిబ్బంది నిందితుడిని అరెస్ట్ చేయటంలో విజయం సాధించారని దయానంద తెలిపారు.


స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను పరిశీలిస్తున్న నగర సీపీ దయానంద

పర్యావరణాన్ని పరిరక్షించాలి

గౌరిబిదనూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పారిశ్రామికవేత్తలు ఈ విషయంగా మరింత శ్రద్ధ చూపాలని చిక్కబళ్లాపురం జిల్లాధికారి రవీంద్ర అన్నారు. మంగళవారం కుడుములకుంటె పారిశ్రామిక వాడలో పారిశ్రామికవేత్తలు, పర్యావరణవేత్తలతో జరిగిన సమావేశంలో జిల్లా అధికారి మాట్లాడుతూ... పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు, రీసైక్లింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా భారీ వాహనాలు గ్రామీణ ప్రాంతాల్లో తిరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాన్నారు. పరిసర వాది చౌడప్ప మాట్లాడుతూ... పరిశ్రమలు పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని, పరిశ్రమల వ్యర్థాల వల్ల ఈ ప్రాంతంలో పలువురు అనారోగ్యానికి గురవుతున్నారని, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. సమావేశంలో కెఐడిబి అధికారులు, సామాజిక కార్యకర్త సిద్ధగంగప్ప తదితరులు పాల్గొన్నారు.


జిల్లాధికారికి వినతిపత్రం అందజేస్తున్న చౌడప్ప

16న సెమీ క్రిస్మస్

శివాజీనగర: కర్ణాటక క్రిస్టియన్ మైనార్టీ కౌన్సిల్ బోర్డు బృందంచే ఈ నెల 16న సెమీ క్రిస్మస్ వేడుకలను జరపనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని శేషాద్రిపురం గ్లోరి ప్రేయర్ హాల్‌లో జరిగే ఈ సెమి క్రిస్మస్ వేడుకల్లో యేసుక్రీస్తు పుట్టుక గురించి ప్రత్యేక సందేశాన్ని దైవ సేవకులు వినిపిస్తారు. అలాగే క్రైస్తవ భక్తి గీతాలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వంచకుడు అరెస్ట్

బనశంకరి: ఎన్‌జీఓ పేరుతో రైతులు, ప్రజలను ప్రలోభాలకు గురి చేసి లక్షలాది రూపాయలు వసూళ్లు చేసుకుని మోసగించిన నిందితుడిని మంగళవారం సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రతాప్ సింహ (39) పట్టుబడిన నిందితుడు. ఇతను తొమ్మిదేళ్లుగా మోసాలు చేస్తూ మూడేళ్లుగా పరారీలో ఉంటున్నాడు. ఇతనిపై పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను దర్యాప్తు చేసి ప్రతాప్ సింహను అరెస్ట్ చేశారు. మండ్య, తుమకూరు, మైసూరు జిల్లాల్లో అమాయక రైతులను టార్గెట్ చేసుకుని భూమి అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం అందించే స్కీముల ద్వారా సబ్సిడీలు ఇస్తామని రైతులు పండించే కొబ్బరి బొండాలు, కొబ్బరికాయలు బయటి రాష్ట్రాల్లో అధిక ధరకు విక్రయిస్తామని డబ్బులు తీసుకుని వంచనకు పాల్పడినట్లు పోలీసులు దర్యాప్తులో తేలింది.

15 నుంచి కళా మేళా


అర్బన్‌హాత్‌లో కళాకారుడు (ఫైల్)

మైసూరు: మైసూరు నగరంలోని జేఎస్ఎస్ మైసూరు అర్బన్ హాత్‌లో గాంధీ శిల్ప బజార్ పేరుతో 15వ తేదీ నుంచి 24 వరకు కళాకృతుల ఎగ్జిబిషన్ జరుగుతుందని అధికారులు తెలిపారు. కళాకారులు తయారు చేసిన వస్తువులు, అలంకరణ సామగ్రి, దుస్తులను నేరుగా ప్రజలు కొనుగోలు చేయవచ్చని చెప్పారు. దేశం నలుమూలల నుంచి కళాకారులు, విక్రేతలు స్టాళ్లు ఏర్పాటు చేస్తారన్నారు.

పాఠశాలలో బెంచీలు ధ్వంసం

తుమకూరు: తుమకూరు జిల్లా శిర పట్టణంలోని సంతెపేటప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దుండగులు విధ్వంసం సృష్టించారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పాఠశాలలోకి ప్రవేశించి బెంచీలు, టేబుళ్లు, కుర్చీలు ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం ప్రధానోపాధ్యాయుడు విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శెనక్కాయల జాతర



బెంగళూరు బసవనగుడిలో దొడ్డ బసవణ్ణ ఆలయం వద్ద జరుగుతున్న శెనక్కాయల జాతరలో మంగళవారం రాత్రి జన సందోహం, (కింది ఫొటో) వేరుశనక్కాయలు విక్రయాలు

గొర్రెల షెడ్‌లో అగ్ని ప్రమాదం

- 80 గొర్రెలు, ఆరు ఆవులు సజీవ దహనం

తుమకూరు: తోటలో ఉన్న షెడ్‌లో అగ్ని ప్రమాదం జరగడంతో అందులో ఉన్న 80 గొర్రెలు, ఆరు ఆవులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటన తుమకూరు జిల్లా చిక్కనాయకనహళ్లి తాలూకా హందనకెరె సమీపంలోని రామఘట్టలో చోటు చేసుకుంది. రామఘట్ట గ్రామానికి చెందిన చేతన్ కుమార్ అనే వ్యక్తి షెడ్ ఏర్పాటు చేసి అందులో గొర్రెలు, ఆవులు సాకుతున్నాడు. అయితే సోమవారం రాత్రి ఆకస్మికంగా షెడ్‌లో అగ్ని ప్రమాదం జరగడంతో ఈ ఘోరం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే నష్టం జరిగిపోయింది. హందనకెరె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేట్టారు.


షెడ్‌లో చెలరేగుతున్న మంటలు

కానిస్టేబుల్ ఇంటికే కన్నం

మైసూరు: కానిస్టేబుల్ ఇంటిలో చోరీ జరిగిన ఘటన మైసూరు నగరంలోని లాల్‌బహదూరు శాస్త్రి నగరలో చోటు చేసుకుంది. కానిస్టేబుల్ మహాదేవ స్వామి సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసుకుని మరో ప్రాంతానికి వెళ్లిన సమయంలో దొంగలు ఇంటి తాళం బద్దలు కొట్టి బీరువాలో ఉన్న బంగారు చైన్‌ను ఎత్తుకెళ్లారు. రాత్రి ఇంటికి వచ్చిన మహాదేవ చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చెరువులోకి మురుగు నీరు

- పీడీఓకు వ్యతిరేకంగా స్థానికుల ధర్నా


చెరువులో చేరుతున్న మురుగు నీరు

దొడ్డబళ్లాపురం: చెరువులోకి మురుగు నీరు వదులుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ స్థానికులు పీడీఓకు వ్యతిరేకంగా ధర్నా చేసిన సంఘటన యలహంక తాలూకా చిక్కజాలలో మంగళవారం చోటుచేసుకుంది. చిక్కజాల చెరువు సమీపంలోని కమర్షియల్ కాంప్లెక్స్ నుండి వెలువడే మురుగు, వృథా నీరు నేరుగా చెరువులోకి వదలడం జరుగుతోంది. ఇందుకు సంబంధించి పంచాయతీ పీడీఓ వెంకటేశ్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆగ్రహించిన స్థానికులు చెరువు వద్ద చేరి ధర్నా చేపట్టారు. పీడీఓ వెంకటేశ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెన్నపట్టణలో రౌడీల పరేడ్


రౌడీలను హెచ్చరిస్తున్న డీవైఎస్పీ గిరి

దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణలో కొత్తగా వచ్చిన డీవైఎస్పీ కేసీ గిరి రౌడీల పరేడ్ నిర్వహించారు. మంగళవారం ఉదయం వందమందికి పైగా రౌడీలను కార్యాలయానికి రప్పించి వారు ప్రస్తుతం ఏం చేస్తున్నారు, ఎక్కడ ఉన్నారు అనే వివరాలు తెలుసుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని, మంచి ప్రవర్తన కలిగి ఉంటే రౌడీషీట్ ఎత్తివేస్తామని డీవైఎస్పీ అన్నారు. అయితే ప్రముఖ రౌడీలను పిలిపించకుండా వీధిరౌడీలను పిలిపించి పరేడ్ నిర్వహించారని విమర్శలు వినిపిస్తున్నాయి.

చెరువు ప్రవేశ ద్వారాలకు మూత

బనశంకరి: బెంగళూరు నగర చరిత్రలో మొదటిసారిగా చెరువును నగర జిల్లా అధికారులు, పోలీసులు సీజ్ చేశారు. ప్రైవేటు కంపెనీ జిగణి హెన్నాగర చెరువు ఆక్రమించింది. చెరువు లోపల మట్టివేసి ఆక్రమించడానికి ప్రయత్నించింది. హెన్నాగర చెరువు ఆక్రమణ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆనేకల్ తహశీల్దార్ జిగణి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు పరిశీలించి ప్రైవేటు కంపెనీపై చర్యలు తీసుకున్నారు. చెరువులోకి ఎలాంటి ప్రవేశం లేకుండా చెరువు ప్రవేశ ద్వారాలు వద్ద బ్యారికేడ్లు, ఇనుపకంచె వేసి మూసివేశారు.

పెంపుడు కుక్క మొరిగిందని కత్తితో దాడి

- నలుగురు అరెస్టు


మధుకుమార్ ఒంటిపై కత్తిపోట్లు

దొడ్డబళ్లాపురం: పెంపుడు కుక్క మొరిగిందనే కారణంతో యజమానిపై నలుగురు వ్యక్తులు కత్తితో దాడి చేసిన సంఘటన దేవనహళ్లి తాలూకా దొడ్డచీమనహళ్లిలో చోటుచేసుకుంది. మధుకుమార్ (34) కత్తిపోట్లకు గురైన కుక్క యజమాని. ఇదే గ్రామానికి చెందిన సునీల్, అనిల్, దేవరాజు, అజయ్ అరెస్టయిన నిందితులు. నిందితులు వీధిలో వెళ్తుండగా మధుకుమార్ పెంపుడు కుక్క వారిని చూసి మొరిగింది. దీంతో నలుగురూ మధుకుమార్‌తో గొడవ పడ్డారు. ఈక్రమంలో మధుకుమార్‌పై కత్తితో దాడి చేసి వెన్ను భాగంలో విచక్షణారహితంగా పొడిచారు. అడ్డు వచ్చిన మధుకుమార్ భార్య మమతపై కూడా దాడి చేసారు. తీవ్రంగా గాయపడ్డ మధుకుమార్‌ను దొడ్డబళ్లాపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విశ్వనాథపుర పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులను అరెస్టు చేసారు.

బేకరీలో చోరీ

దొడ్డ తాలూకా దొడ్డబెళవంగలలో సోమవారం రాత్రి ఒక బేకరీలో చోరీ చేసిన దుండగులు మరో రెండు దుకాణాల్లో చోరీ యత్నం చేసిన సంఘటన చోటుచేసుకుంది. దాబస్‌పేట–దొడ్డబళ్లాపురం జాతీయ రహదారి మార్గంలోని దొడ్డబెళవంగలలో ఎల్.జే.బేకరిలో చోరీ చేసి నగదు దోచుకున్న దుండగులు పక్కనే ఉన్న మెడికల్ స్టోర్, మద్యం దుకాణాల షెట్టర్లు తెరవడానికి విఫలయత్నం చేసారు. దుండగులు మాస్కు, గ్లౌజ్‌లు ధరించినట్టు బేకరిలోని సీసీటీవీ కెమెరాల ద్వారా తెలిసింది. దొడ్డబెళవంగల పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

లైంగిక వేధింపుల కేసులో వృద్ధుడి అరెస్ట్

మైసూరు: బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన వృద్ధుడిని టి.నరసిపుర పోలీసులు అరెస్ట్ చేశారు. మైసూరు జిల్లా టీ నరసిపుర పట్టణంలోని విద్యానగర లేఔట్‌కు చెందిన జగదీష్ మూర్తి (63) నిందితుడు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి అయిన ఇతను ఓ పాఠశాలలో చదువుతున్న 4వ తరగతి బాలిక ట్యూషన్ వెళ్తున్న సమయంలో చాక్‌లెట్ ఇప్పిస్తానని ఆశ చూపి లైంగిక వేధింపులకు గురిచేశాడు. అనంతరం బాలికను బెదిరించాడు. బాలిక బెదురుగా ఉండటంతో తల్లిదండ్రులు నెమ్మదిగా విషయం ఆరా తీయగా అసలు విషయం తెలియడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేశారు.

హోసూరు వార్తలు..

ధర్మస్థలకు బియ్యం తరలింపు


సామగ్రితో బయల్దేరిన లారీ

హోసూరు: కర్ణాటకలోని ప్రసిద్ధ ధర్మస్థల మంజునాథస్వామి ఆలయంలో అన్నదానం అవసరాల కోసం హోసూరు తాలూకా బాగలూరు సమీపంలోని చూడాపురం, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు 15 టన్నుల బియ్యం, 15 టన్నుల కాయగూరలను పంపారు. ప్రతి సంవత్సరం ధర్మస్థల ఆలయంలో కార్తీక మాసంలో జరిగే లక్షదీపోత్సవంలో భక్తులకు అన్నదానం కోసం బియ్యం, కూరగాయలను పంపుతున్నారు. బాగలూరు, చూడాపురం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులచే సేకరించిన బియ్యం, కాయగూరలను ఆలయానికి తరలించారు.

లారీని ఢీకొన్న బైక్.. ఇద్దరు యువకుల మృతి

క్రిష్ణగిరి: ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి బైక్ ఢీకొని ఇద్దరు యువకుల మృతి చెందారు. ఈ ఘటన సూళగిరి పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకొంది. వివరాల మేరకు డెంకణీకోట తాలూకా ఇరుదుకోట పంచాయతీ కూసువాడికి చెందిన సుభాష్ (22), అదే గ్రామానికి చెందిన వేలన్ (21)లు కలిసి బైక్‌లో హోసూరు– క్రిష్ణగిరి జాతీయ రహదారిపై వెళ్తున్నారు. వద్దేనూరు వద్ద ముందు వెళుతున్న లారీ ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో యువకులు దానిని ఢీకొన్నారు. తీవ్ర గాయాలేర్పడిన వేలన్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా సభాష్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు.

వృద్ధుడు ఆత్మహత్య

హోసూరు: అనారోగ్యంతో బాధపడుతూ ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు హోసూరు పారిశ్రామికవాడ చిన్నయలసగిరి ప్రాంతానికి చెందిన రామమూర్తి (65) ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చాడు. నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన అతను రెండు రోజుల క్రితం అధిక మోతాదులో మాత్రలు తిని స్పృహకోల్పోయాడు. బంధువులు వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించాడు.

ఇద్దరు దొంగల పట్టివేత

క్రిష్ణగిరి: ఉద్దనపల్లి ప్రాంతంలో దారిదోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను స్థానిక ప్రజలు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సోమవారం సాయంత్రం సమీపంలోని ఉద్దనపల్లిలో ఒక కార్మికుడు కూరగాయలను తీసుకెళుతుండగా ఇద్దరు యువకులు అతన్ని అడ్డగించి కత్తితో బెదిరించి రూ. 500 నగదు, సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. బాధితుడు కేకలు వేయడంతో స్థానికులు వెంటాడి దొంగలను పట్టుకొని ఉద్దనపల్లి పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారించగా ఉద్దనపల్లికి చెందిన శ్రీనివాస్ (24), కెలమంగలంవాసి గిరి(23) అని తెలిసింది.

పెరుగుతున్న గజ గోల

- భారీగా వలసలు

కెలమంగలం: హోసూరు, డెంకణీకోట, సూళగిరి, అంచెట్టి తాలూకాల్లో ఏనుగుల సంచారం రోజురోజుకూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. నెలరోజుల క్రితం బెంగళూరు బన్నేరుఘట్ట అటవీ ప్రాంతం నుంచి 150కి పైగా ఏనుగులు జవళగిరి అటవీ ప్రాంతానికి చేరుకొన్నాయి. అక్కడి నుంచి గుంపులుగా విడిపోయి డెంకణీకోట సమీపంలోని నగనూరు, బేవనత్తం, రాయకోట సమీపంలోని ఉడేదుర్గం, హోసూరు సమీపంలోని శ్యానమావు అటవీ ప్రాంతాల్లో సంచరిస్తూ రైతుల పంటపొలాలను తొక్కి ధ్వంసం చేయడంతో పాటు ప్రజలను భయానికి గురిచేస్తున్నాయి. ఏనుగుల నుంచి రక్షణ కల్పించాలని, దాడుల్లో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని స్థానిక ప్రజలు అటవీశాఖాధికార్లను డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం ఉదయం డెంకణీకోట సమీపంలోని బేవనత్తం అటవీ ప్రాంతంలో 50 ఏనుగుల మంద తిరుగుతుండగా అటవీ శాఖ సిబ్బంది చేరుకొని టపాకాయలు పేల్చి అటవీ ప్రాంతానికి మళ్లించారు. ఎక్కువ సంఖ్యలో ఏనుగులు సంచరిస్తుండడంతో అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, రాత్రి వేళల్లో పొలాల వద్దకు కాపలా వెళ్లరాదని హెచ్చరించారు.


బేవనత్తం వద్ద సంచరిస్తున్న ఏనుగుల మంద

రూ.12 లక్షల గుట్కా, 6 కార్లు సీజ్

హోసూరు: బెంగళూరు నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న రూ. 12.50 లక్షల విలువ చేసే గుట్కాతో పాటు ఆరు కార్లను స్వాధీనపరుచుకొన్నారు. హోసూరు సమీపంలోని జాతీయ రహదారిపై పేరండపల్లి వద్ద బెంగళూరు నుంచి ఆరు కార్లలో నిషేధిత గుట్కాతో పాటు మత్తు పదార్థాలను తరలిస్తున్నారు. అక్కడ పోలీసులు అడ్డుకుని కార్లను తనిఖీ చేశారు. రూ. 12.50 లక్షల విలువ చేసే గుట్కా బస్తాలు దొరికాయి. ఈ కార్లలో రెండు మహారాష్ట్ర, ఒకటి కేరళ, ఒకటి గుజరాత్, మరొకటి తమిళనాడుకు చెందినదని పోలీసులు తెలిపారు. మొత్తం ఈ కార్ల విలువ రూ. 1.10 కోట్లు ఉంటుందని చెప్పారు. కాగా, తనిఖీలకు ముందే దుండగులు పరారయ్యారు. వారి కోసం గాలింపు చేపట్టారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

బొమ్మనహళ్లి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని బొమ్మనహళ్ళి ఎమ్మెల్యే సతీష్ రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని బొమ్మనహళ్లి హొంగసంద్ర గ్రామంలో ఉన్న తన నివాసంలో ఆయన పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. స్థానిక హొంగసంద్ర నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఆక్స్‌ఫర్డ్ మెడికల్ కళాశాల, పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయనను స్థానిక కార్యకర్తలు సన్మానించారు. ఈ సందర్భంగా సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ...నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ ఒత్తిళ్ల మధ్య జీవనం సాగిస్తుంటారని, పేద, మధ్య తరగతి ప్రజలు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా పేదలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, మంజునాథ్, (మంజు) బీ.వై. రమేష్, సునందప్పతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

పసిమొగ్గపై దాష్టీకం

మండ్య: మండ్య జిల్లాలోని శ్రీరంగ పట్టణం తాలూకాలోని కెఆర్ఎస్ పోలీస్ స్టేషన్ పరిధిలో కామాంధుడు పసిమొగ్గని చిదిమేశాడు. శివణ్ణ (55) అనే వ్యక్తి మూడేళ్ల పసిపాపపై లైంగిక దాడికి ఒడిగట్టాడు. ఇంటి దగ్గర ఆడుకుంటున్న చిన్నారిని శివణ్ణ బిస్కెట్లు ఇస్తానని తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక కనబడక పోవడంతో తల్లి వెతుక్కుంటూ రాగా శివణ్ణ ఇంటిలో పాప ఏడుపు వినిపించింది. పరుగున వెళ్లి చూడగా దాష్టీకం బయటపడింది. తల్లి ఫిర్యాదు మేరకు కెఆర్ఎస్ పోలీసులు గ్రామానికి వచ్చి విచారించి కామాంధున్ని అరెస్టు చేశారు. పోక్సో కేసును నమోదు చేశారు.

క్లుప్తంగా...

గుండ్లకమ్మ రెండో గేట్‌ను పరిశీలించిన సీఈ


గేటును పరిశీలిస్తున్న సీఈ నారాయణరెడ్డి

మద్దిపాడు: ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలోని గుండ్లకమ్మ రిజర్వాయర్ రెండో గేటును మంగళవారం సాయంత్రం ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజినీర్ సీ నారాయణరెడ్డి పరిశీలించారు. స్టాప్‌లాగ్‌లను పరిశీలించిన ఆయన లీకులు అరికట్టడానికి జాకీలు వాడాలని సూచించారు. స్టాప్‌లాగ్‌లు ఏర్పాటు చేసుకుని త్వరగా నీటిని ఆదా చేస్తూ గేట్ల మరమ్మతులు చేయించుకోవాలని జిల్లా అధికారులకు సూచించారు. ఉదయం సెంట్రల్ డిజైన్ ఆఫీస్ సీఈ శ్రీనివాస యాదవ్ రిజర్వాయర్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

వైఎస్సార్‌సీపీ సగం ఎమ్మెల్యేలు టీడీపీలోకి..

టీడీపీ నేత బొండా ఉమామహేశ్వరరావు

సాక్షి, అమరావతి: చంద్రబాబు కనుసైగ చేస్తే వైఎస్సార్‌సీపీ నుంచి సగం మంది ఎమ్మెల్యేలు టీడీపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 75 మంది ఎమ్మెల్యేలు గోడ దూకడానికి సిద్ధంగా ఉన్నారని.. టికెట్లు ఇవ్వకపోయినా పరవాలేదు.. టీడీపీలో చేర్చుకోవాలని చంద్రబాబును బతిమాలుతున్నారని బొండా చెప్పుకొచ్చారు. ఉత్తరాంధ్రలోని ఒక మంత్రి కుటుంబం టీడీపీతో టచ్‌లో ఉందని.. జనసేనలో చేరేందుకు కూడా పలువురు ఎమ్మెల్యేలు రెడీగా ఉన్నారన్నారు. ఓడిపోతామనే భయంతోనే రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఏ పార్టీ చేయని విధంగా సీఎం జగన్ రాజకీయ బదిలీలకు తెర తీశారని బొండా ఉమా విమర్శించారు.

కాపులను మరోసారి మోసం చెయ్యొద్దు

లోకేశ్‌కు కాపు ఐక్యవేదిక బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: కాపులను నమ్మించి 2014లో మోసం చేశారని, అందుకు ప్రతిఫలంగా 2019 ఎన్నికల్లో ఓటమిని చవిచూశారని.. మరోసారి ఈడబ్ల్యూఎస్‌లో 5 శాతం రిజర్వేషన్‌లు అంటూ మోసం చెయ్యొద్దని నారా లోకేశ్‌కు కాపు ఐక్యవేదిక హితవు పలికింది. యువగళం పాదయాత్ర సందర్భంగా తునిలో సోమవారం కాపులతో నిర్వహించిన సమావేశంలో ఈడబ్ల్యూఎస్‌లో 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని లోకేశ్ ఇచ్చిన హామీపై కాపు ఐక్యవేదిక నాయకులు మంగళవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కాపులకు బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 5 శాతం బీసీ రిజర్వేషన్ల హామీని అమలు చేయకపోగా.. కేంద్రం ఇచ్చిన ఈడబ్ల్యూఎస్ 10 శాతంలో 5 శాతం కాపులకు ఇస్తామని హంగామా చేసి అమలు చేయలేదని గుర్తు చేశారు. 'మీ రిజర్వేషన్లకు ఒక దండం. మీకు అనేక దండాలు. మా బతుకులు మమ్మల్ని బతకనీయండి' అంటూ ఘాటుగా స్పందించారు. బహిరంగ లేఖ విడుదల చేసిన వారిలో కాపు ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ రావి శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్ పెద్దిరెడ్డి మహేష్, రాష్ట్ర కన్వీనర్ బోడపాటి పెదబాబు, కో–కన్వీనర్లు కాకిలేటి హరనాథ్, పంచాది రంగారావు, నల్లజర్ల వెంకట రామారావు ఉన్నారు.

ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో నిరసన

సాక్షి, న్యూఢిల్లీ: ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం నిరంతరం పార్లమెంట్‌లో పోరాడతానని వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ప్రత్యేక హోదా విద్యార్థి యువజన ఐక్యకార్యాచరణ సమితి అధ్యక్షుడు షేక్ జిలాని ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టారు. విద్యార్థి జేఏసీ చేపట్టిన ఈ కార్యక్రమానికి పలు పార్టీల ఎంపీలు, నేతలు హాజరై మద్దతు తెలిపారు.

జనం లేక ఆలస్యంగా యువగళం

నక్కపల్లి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో నారా లోకేశ్ యువగళం పాదయాత్ర మంగళవారం జనం లేక ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం 8 గంటలకే పాదయాత్ర ప్రారంభించాల్సి ఉండగా.. పార్టీ శ్రేణులు మొహం చాటేయడంతో రెండు గంటలు ఆలస్యంగా మొదలైంది. అయినప్పటికీ పాదయాత్రలో జనం కనిపించలేదు. వచ్చిన జనం కంటే పాదయాత్ర బృందం, సెక్యూరిటీ సిబ్బంది సంఖ్యే ఎక్కువగా ఉంది. ప్రత్యేకంగా ఆటోలు ఏర్పాటు చేసి దేవవరం, చినరామభద్రపురం, గొడిచర్ల, ఉద్దండపురం, వేంపాడు, చినదొడ్డిగల్లు జంక్షన్ల నుంచి కార్యకర్తలను తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. తమ ప్రాంతాల నుంచి యాత్ర ముందుకు సాగిన వెంటనే వీరంతా వెళ్లిపోయారు. యాత్రలో టీడీపీ సీనియర్లు ఎవరూ కనిపించలేదు. చినదొడ్డిగల్లులో భోజన విరామం అనంతరం మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, మాకవరపాలెం, నర్సీపట్నం మండలాల నుంచి మహిళలను తీసుకువచ్చి ఈ కార్యక్రమం నిర్వహించారు. అక్కడి నుంచి కాగిత, నక్కపల్లి మీదుగా సారిపల్లిపాలెం చేరుకుని రాత్రి బసకు వెళ్లిపోయారు.

ప్రవేశాలు పెరిగాయ్

అన్ని తరగతుల్లోనూ భారీగా పెరిగిన స్థూల నమోదు నిష్పత్తి



- బాలురుతో పాటు బాలికల నమోదు నిష్పత్తిలోనూ పెరుగుదల
- రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా విద్యా సంస్కరణల ఫలితం
- రాష్ట్రాలవారీగా గణాంకాలను వెల్లడించిన ఆర్బీఐ నివేదిక

స్థూల నమోదు నిష్పత్తి ఇలా .. 2018-19 విద్యా సంవత్సరం

	బాలురు	బాలికలు	మొత్తం
ప్రైమరీ (1 నుంచి 5 వరకు)	98.8	93.6	96.3
అప్పర్ ప్రైమరీ (6 నుంచి 8 వరకు)	88.5	86.6	87.5
ఎలిమెంటరీ (1 నుంచి 8 వరకు)	94.8	90.9	92.9
సెకండరీ (9 నుంచి 10 వరకు)	80.0	79.4	79.7
ఉన్నత విద్య (11 నుంచి 12 వరకు)	45.4	48.5	46.9

2021-22లో స్థూల నమోదు నిష్పత్తి పెరుగుదల ఇలా

	బాలురు	బాలికలు	మొత్తం
ప్రైమరీ (1 నుంచి 5 వరకు)	101.7	101.6	101.6
అప్పర్ ప్రైమరీ (6 నుంచి 8 వరకు)	100.0	95.2	97.6
ఎలిమెంటరీ (1 నుంచి 8వ రకు)	101.1	99.1	100.1
సెకండరీ (9 నుచి 10 వరకు)	86.3	84.5	85.4
ఉన్నత విద్య (11 నుంచి 12 వరకు)	55.2	58.3	56.7

సాక్షి, అమరావతి

విద్యా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యతతో సాకారమైన మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత సర్కారు హయాంతో పోలిస్తే అన్ని తరగతుల్లోనూ స్థూల నమోదు నిష్పత్తి పెరిగినట్లు ఇటీవల విడుదలైన ఆర్బీఐ నివేదిక వెల్లడించింది. రాష్ట్రాల వారీగా స్థూల నమోదు నిష్పత్తి వివరాలను రూపొందించింది. 2018–19తో పోలిస్తే 2021–22లో ఉన్నత విద్యలో బాలురు, బాలికల నమోదు నిష్పత్తి భారీగా పది శాతం మేర పెరగడం గమనార్హం. ఇందుకు ప్రధాన కారణం విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలేనని స్పష్టం అవుతోంది. విద్యార్థులు చదువుకునేలా ప్రోత్సహిస్తూ అమ్మ ఒడితోపాటు జగనన్న గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక లాంటి పథకాలతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధనను ప్రభుత్వం అందుబాటులోకి తేవటమేనని స్పష్టమవుతోంది. మన బడి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్లలో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించగా ఇంగ్లిష్ మీడియం చదువులను సైతం అందుబాటులోకి తెచ్చింది. 2018–19లో ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి 46.9 శాతం ఉండగా 2021–22లో 56.7కి పెరిగింది. బాలుర స్థూల నమోదు నిష్పత్తి 45.4 నుంచి 55.2కు పెరగగా బాలికల స్థూల నమోదు నిష్పత్తి 48.5 నుంచి 58.3కి పెరిగింది.

పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం

- గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి దేవన్‌రెడ్డి స్పష్టీకరణ
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో భేటీ


వైవీ సుబ్బారెడ్డితో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి దేవన్‌రెడ్డి

మధురవాడ (విశాఖ):తాము వైఎస్సార్‌సీపీ నిర్ణయానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి చెప్పారు. మంగళవారం మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ వద్ద వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని అతని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ.. తాము ఎల్లప్పుడూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నమ్మకస్తులుగా, పార్టీకి విధేయులై ఉంటామన్నారు. సీఎం జగన్ ఏ నిర్ణయం తీసుకున్నా పార్టీ శ్రేయస్సు కోసం కట్టుబడి ఉంటామని చెప్పారు. మళ్లీ ఆయన ముఖ్యమంత్రి కావాలన్నదే తమకు ముఖ్యమని చెప్పారు. గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ.. సోమవారం తాను వ్యక్తిగత పనులపై బయటకు వెళ్లానని, వెళ్లేముందు పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో కూడా మాట్లాడానన్నారు. తాను వెళ్లిన ప్రదేశంలో సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేవని, తాను తిరిగి సిటీకి వచ్చేలోపే తనపై చాలా పుకార్లు పుట్టుకొచ్చాయన్నారు. తన తండ్రి ఎమ్మెల్యేగా ఉండగా.. తానెందుకు పార్టీకి రాజీనామా చేస్తానని ప్రశ్నించారు. తాము వైఎస్సార్‌సీపీతోనే ఉన్నామని, పార్టీ పెద్దలు వైవీ సుబ్బారెడ్డికి వివరణ ఇచ్చేందుకే ఇక్కడకి వచ్చామని చెప్పారు. వారివెంట వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఉన్నారు.

బీసీలకు రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించండి

కేంద్ర మంత్రిని కోరిన బీసీ నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: బీసీల సంక్షేమానికి కేంద్రం రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ పథకం దేశమంతటా అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కేంద్రమంత్రి రాందాస్ అథ్‌వాలేకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలో వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరుల బృందం కేంద్ర మంత్రిని కలిసి బీసీ సమస్యలపై చర్చించింది. కేంద్రం దేశంలోని 75 కోట్ల మంది బీసీలకు రూ.1,400 కోట్లు ఏమేరకు సరిపోతుందని కేంద్ర మంత్రిని ప్రశ్నించారు.

సీఎం నిర్ణయం శిరోధార్యం

- ఆయన ఆదేశాల మేరకు నడుచుకుంటా
- ప్రతి ఒక్కరూ పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలి
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



సాక్షి, ప్రతినిధి, బాపట్ల: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట తనకు శిరోధార్యమని, ఆయన ఆదేశాల మేరకే నడుచుకుంటామని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడారు. రేపల్లె నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా ఈవూరు గణేష్‌ను నియమించడం తనను మనస్తాపానికి గురిచేసిందన్నారు. అయినప్పటికీ అధినేత నిర్ణయానికి, పార్టీకి కట్టుబడి ఉంటానన్నారు. తనను తప్పించారన్న బాధతో రేపల్లె నియోజకవర్గంలో పలువురు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పదవులకు రాజీనామా చేసే ప్రయత్నం చేశారన్నారు. రెండురోజులుగా హైదరాబాద్‌లో ఉన్న తనకు ఈ విషయం తెలిసిందన్నారు. ఎవరి అభిప్రాయం ఎలా ఉన్నా ప్రతి ఒక్కరూ పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలని సూచించారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించకూడదని పార్టీ శ్రేణులకు స్పష్టం చేశారు. అందరూ అధినేత నిర్ణయాన్ని గౌరవించాల్సిందేనన్నారు. సీఎం తనకు ఏ బాధ్యత అప్పగించినా సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు.

అందరి సహకారంతోనే విద్యారంగ ప్రగతి

మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. దేశంలో ఎక్కడా లేనంతగా పెద్ద ఎత్తున అనేక విద్యాభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి నాణ్యమైన విద్యను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. విజయవాడలో మంగళవారం పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఆర్జేడీలు, డీఈవోలు, డీవీఈవోలు, ఏపీసీలకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్రస్థాయి సమీక్షల్లో కూడా ఏపీ విద్యావ్యవస్థ ముందంజలో ఉందని, మన విద్యాసంస్కరణలను ఆచరించేందుకు ఇతర రాష్ట్రాలు సైతం ముందుకొచ్చాయని చెప్పారు. ఈ ప్రగతి అధికారులు, ఉపాధ్యాయుల సహకారంతోనే సాధ్యమైందన్నారు.వేగంగా మారుతున్న ప్రపంచంలో మన రాష్ట్ర విద్యార్థులు కూడా విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అన్ని రంగాల్లోను ముందుండేలా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమని చెప్పారు.

త్వరలో 200 స్టెమ్ ల్యాబ్‌ల ఏర్పాటు

విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే సంకల్పంతో రాష్ట్రంలో 200 స్టెమ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసేందుకు ఈ వర్క్‌షాప్‌లో కనెక్ట్ ఆంధ్రాతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం 'పాఠశాల తనిఖీ, పర్యటన'కు సంబంధించిన మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు.

ఏపీలో సూక్ష్మ సేద్యం భేష్

- దేశంలో నాలుగో స్థానంలో ఆంధ్రప్రదేశ్
- చంద్రబాబు హయాంలో దయనీయ స్థితిలోకి సూక్ష్మ సేద్యం
- రైతులకు రూ.969 కోట్లు ఎగ్గొట్టిన చంద్రబాబు
- సూక్ష్మ సేద్యాన్ని గాడిలో పెట్టిన సీఎం వైఎస్ జగన్
- బాబు ఎగ్గొట్టిన సొమ్మునూ చెల్లించిన జగన్ సర్కారు
- చిన్న, సన్నకారు రైతులకు ప్రోత్సాహం.. రాయితీపై పరికరాలు
- పరికరాలపై జీఎస్టీ రూ.60 కోట్లూ భరించిన ప్రభుత్వం
- జగన్ సర్కారు చర్యలతో వేగంగా విస్తరించిన సూక్ష్మ సేద్యం
- దేశంలో మొత్తం సూక్ష్మ సేద్యంలో ఏపీలో 10.96 శాతం
- రాష్ట్రంలో 9.10 లక్షల హెక్టార్లలో సేద్యం
- సూక్ష్మ సేద్యంతో నీరు, ఎరువులు ఆదా.. రైతుకు ఆదాయం వృద్ధి
- పార్లమెంట్‌లో ప్రకటించిన కేంద్రం



సాక్షి, అమరావతి: నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచి, రైతులకు అధిక లాభాలనిచ్చే సూక్ష్మ సేద్యం విస్తరణకు వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. రాష్ట్రంలో సూక్ష్మ సేద్యం వేగంగా విస్తరిస్తూ దేశంలో నాలుగో స్థానానికి చేరింది. చంద్రబాబు ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడంతో రైతులు కుదేలైపోయారు. సూక్ష్మ సేద్యం చేసే చిన్న, సన్నకారు రైతులు మరింత దయనీయ స్థితిలోకి వెళ్లారు. పైగా, బిందు, తుంపర సేద్యం చేసే రైతులకు చంద్రబాబు ప్రభుత్వం రూ.969.40 కోట్లు ఎగ్గొట్టింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టగానే వ్యవసాయ రంగం అభివృద్ధిపై దృష్టి సారించారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కుదేలైపోయిన సూక్ష్మ సేద్యాన్ని తిరిగి గాడిలో పెట్టారు. బిందు, తుంపర సేద్యం చేసే రైతులకు చంద్రబాబు ఎగ్గొట్టిన రూ. 969.40 కోట్లను చెల్లించారు. పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై తుంపర, బిందు సేద్యం పరికరాలను అందిస్తున్నారు. అంతే కాకుండా ఈ పరికరాలపై జీఎస్టీ భారం రైతులపై పడకుండా ఆ మొత్తాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. ఇలా ఇప్పటివరకు రూ.60 కోట్లకు పైగా జీఎస్టీని వైఎస్ జగన్ ప్రభుత్వమే భరించింది. దీంతో సూక్ష్మ సేద్యం రాష్ట్రంలో ఊపందుకొని, ఇప్పుడు 9.10 లక్షల హెక్టార్లకు విస్తరించింది. దేశంలో కర్ణాటక, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల తర్వాత నాలుగో స్థానాన్ని పొందింది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా మంగళవారం పార్లమెంట్‌లో ఈ విషయాన్ని ప్రకటించారు. పర్ డ్రాప్ మోర్ క్రాప్ (పీడీఎంసీ) పథకం కింద దేశం మొత్తంలో ఆంధ్రప్రదేశ్‌లో 10.96 శాతం మేర సూక్ష్మ సేద్యం సాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో 9.10 లక్షల హెక్టార్లలో రైతులు సూక్ష్మ సేద్యం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కర్ణాటక తొలి స్థానంలో, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలు రెండు, మూడు స్థానాల్లో ఉన్నట్లు చెప్పారు. డ్రిప్, స్ప్రింక్లర్ వినియోగం ద్వారా సూక్ష్మ సేద్యాన్ని కేంద్రం ప్రోత్సహిస్తోందని, నీటి వినియోగం సామర్థ్యాన్ని పెంచుతోందన్నారు. సూక్ష్మ సేద్యం చేసే చిన్న, సన్న కారు రైతులకు 55 శాతం, ఇతర రైతులకు 45 శాతం ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కొన్ని రాష్ట్రాలు అదనపు ఆర్థిక సాయాన్ని ఈ రైతులకు అందిస్తున్నాయన్నారు. సూక్ష్మ సేద్యం విస్తరణకు, ప్రోత్సహించేందుకు రాష్ట్రాలు తీసుకునే రుణాలపై 3 శాతం మేర వడ్డీ రాయితీని కూడా కేంద్ర ప్రభుత్వం ఇస్తోందని చెప్పారు.

పీడీఎంసీ కింద దేశంలో మొత్తం 83.06 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ జరుగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. ఖర్చును తగ్గించే ప్రభావవంతమైన శాస్త్రీయ సాంకేతికలను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐసీఏఆర్) అభివృద్ధి చేసిందని తెలిపారు. వర్షపు నీటి సంరక్షణ, రీసైక్లింగ్, నీటి బహుళ వినియోగం వంటి స్మార్ట్ సాంకేతికలను అభివృద్ధి చేసిందన్నారు. మైక్రో ఇరిగేషన్‌తో వ్యవసాయ నీటి వినియోగ సామర్థ్యం మెరుగుపడుతుందని, పంట ఉత్పాదకత పెరుగుతుందని తెలిపారు. ప్రధానంగా నీటి ఆదాతో పాటు ఎరువుల వినియోగం తగ్గుతుందని, అలాగే కూలీలు, ఇతర వ్యయం తగ్గి రైతుల ఆదాయం పెరుగుతుందని పలు అధ్యయనాలు వెల్లడించాయని మంత్రి చెప్పారు.

పీడీఎంసీ ద్వారా తొలి నాలుగు రాష్ట్రాల్లో సూక్ష్మ సేద్యం ఇలా

రాష్ట్రం	విస్తీర్ణం (హెక్టార్లలో)	దేశంలో విస్తీర్ణం శాతం
కర్నాటక	18,01,629	21.69
తమిళనాడు	10,83,784	13.05
గుజరాత్	10,71,399	12.90
ఆంధ్రప్రదేశ్	9,10,546	10.96

సుప్రీంకోర్టులో తెలంగాణ విద్యుత్ బకాయిల కేసు

రాజ్యసభలో విజయసాయి రెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

రాజ్యసభ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలకు సంబంధించిన కేసు ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉందని, కోర్టు తీర్పు ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు రాజ్యసభలో మంగళవారం లిఖితపూర్వక సమాధానమిస్తూ.. విద్యుత్ బకాయిలు చెల్లింపులపై తెలంగాణకు ఆ రాష్ట్ర హైకోర్టులో అనుకూలంగా వెలువడిన తీర్పును సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 జూన్ 2వ తేదీ నుంచి 2017 జూన్ 10వ తేదీ వరకు ఏపీ జెన్‌కో తెలంగాణ డిస్కంలకు విద్యుత్ సరఫరా చేసిందని చెప్పారు. ఈ మేరకు తెలంగాణ చెల్లించాల్సిన రూ.6,756.92 కోట్ల బకాయిలను 30 రోజుల్లోగా చెల్లించాలని పేర్కొంటూ ఏపీ రాష్ట్ర పునర్విభజన చట్టం 2014 సెక్షన్ 92 లోబడి కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ 2022 ఆగస్టు 29న ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. ఏపీకి తెలంగాణ చెల్లించాల్సిన రూ.3,441.78 కోట్లను అసలుతో పాటు రూ.3,315.14 కోట్ల లేట్ పేమెంట్ సర్‌చార్జీల రూపంలో చెల్లించాలని మంత్రిత్వశాఖ ఆదేశించినట్టు వివరించారు. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. ఈ మేరకు 2022 ఆగస్టు 29న ఏపీకి తెలంగాణ చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలపై కేంద్రం జారీ చేసిన ఆదేశాలను కొట్టేస్తూ హైకోర్టు 2023 అక్టోబర్ 19న తీర్పు వెలువరించిందని కేంద్రమంత్రి తెలిపారు.

ఎంబీబీఎస్ కొత్త పాఠ్య ప్రణాళిక



ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం జాతీయ మెడికల్ కమిషన్ కొత్త బోధన ప్రణాళికకు సంబంధించిన మార్గదర్శకాలను ఈ ఏడాది ఆగస్ట్ 1న జారీ చేసినట్టు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్ పేర్కొన్నారు. కొత్త బోధన ప్రణాళిక కింద వృత్తిపరంగా మొదటి సంవత్సరంలో 'కుటుంబ దత్తత కార్యక్రమం–లక్ష్యాలు అందుకోవడం' అనే పాఠ్యాంశంలో భాగంగా విద్యార్థులు ఆయా ప్రాంతాలకు సంబంధించిన గ్రామీణ స్థితిగతులను అర్థం చేసుకోవలసి ఉంటుందని తెలిపారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీలో 45,84,548 కిసాన్ క్రెడిట్ కార్డులు



ఏపీలో సెప్టెంబర్ 2023 నాటికి రూ.60,576.14 కోట్లతో కో–ఆపరేటివ్ కిసాన్ క్రెడిట్ కార్డులు 45,84,548 ఉన్నాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి భగవంత్ కరాడ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఎన్నికల కమిషనర్ల బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు



కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్ల నియామక బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తోందని ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. మంగళవారం రాజ్యసభలో బిల్లుపై చర్చలో ఆయన మాట్లాడుతూ.. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా నిర్వహించే బాధ్యతను రాజ్యాంగ నిర్మాతలు ఎన్నికల సంఘానికి అప్పగించారన్నారు. ప్రధాని అధ్యక్షతన లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత, కేంద్ర మంత్రివర్గ సభ్యుడితో ఏర్పాటు చేసే కమిటీ ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకంపై రాష్ట్రపతికి సిఫార్సు చేస్తారని బిల్లు చెబుతోందన్నారు. అదే సమయంలో ఎన్నికల ప్రక్రియ ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా, ప్రజలు పరిరక్షించేలా బిల్లు ఉందని బోస్ పేర్కొన్నారు.

ఉద్యాన రంగానికి మద్దతు ఇవ్వండి



ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యాన రంగానికి కేంద్రం మద్దతు ఇవ్వడంతోపాటు అభివృద్ధి చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తానరావు కోరారు. మంగళవారం రాజ్యసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ.. ఉద్యాన పంటల ఉత్పత్తిలో ఏపీ పలు సవాళ్లు ఎదుర్కొంటోందన్నారు. రాష్ట్రంలో ఉద్యాన రంగం వేగంగా అభివృద్ధి చెందుతూ ముఖ్యమైన కేంద్రంగా మారిందన్నారు. పూర్ సాయిల్ మేనేజ్‌మెంట్ తోపాటు రవాణా, కోల్డ్ స్టోరేజీలు సరిగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉద్యానరంగ అభివృద్ధికి కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు.

హార్టికల్చర్ హబ్ అభివృద్ధికి ఏపీ కృషి

ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ



సాక్షి, న్యూఢిల్లీ: హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్ కృషి చేస్తోందని కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా తెలిపారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ సంజీవ్‌కుమార్ మంగళవారం అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. 2022–23 ముందస్తు అంచనాల ప్రకారం ఏపీలో ఉద్యాన పంటల ఉత్పత్తి 276 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చినట్టు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని వైఎస్సార్ యూనివర్సిటీలో ఉద్యాన పంటల సాగులో అగ్రికల్చర్ డ్రోన్ల పరిశోధన, ప్రదర్శనలపై దృష్టి సారిస్తూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అదే యూనివర్సిటీ ప్రత్యేకంగా రోబోటిక్ స్ప్రేయర్‌ను అభివృద్ధి చేయడం విశేషమని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

ఏపీ రైతుల్ని ఆదుకోండి



మిచాంగ్ తుపాను కారణంగా అతలాకుతలమైన ఆంధ్రప్రదేశ్ రైతులను రూ.5 వేల కోట్లతో ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్రాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, సుమారు రూ.7 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని మంగళవారం లోక్‌సభ దృష్టికి తీసుకొచ్చారు. వరి, మిరప, పసుపు, పొగాకు వంటి పంటలపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, పండ్లు, పూల తోటలు కూడా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సవరణ బిల్లులకు వైఎస్సార్‌సీపీ మద్దతు



కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన జమ్మూ కశ్మీర్ పునర్‌వ్యవస్థీకరణ (రెండో సవరణ), కేంద్రపాలిత ప్రాంతాల (సవరణ) బిల్లులకు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపింది. బిల్లులపై వైఎస్సార్‌సీపీ ఎంపీ చింతా అనూరాధ మాట్లాడుతూ.. ప్రతిపాదిత బిల్లులో అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయించడం అభినందనీయమన్నారు. పుదుచ్చేరిలో మహిళలకు రిజర్వేషన్లతోపాటు షెడ్యూల్డ్ కులాల మహిళలకు రిజర్వేషన్లు, అట్టడుగు వర్గాలకు అధికారం కల్పించడం వంటివి ఉన్నాయని.. అందుకే బిల్లుకు మద్దతు ఇస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో నామినేటెడ్ పోస్టుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కిందన్నారు.

ఎస్‌డీసీఎఫ్‌పీఓ పథకం కింద ఏపీకి సాయం



'సపోర్టింగ్ డెయిరీ కో–ఆపరేటివ్స్ అండ్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్' (ఎస్‌డీసీఎఫ్‌పీఓ) పథకం కింద ఏపీకి కేంద్రం ఆర్థిక సాయం అందించినట్టు కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాలా తెలిపారు. కోవిడ్–19 కారణంగా ఎదురైన ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించేందుకు కేంద్రం 20 20–21లో 'వర్కింగ్ క్యాపిటల్ లోన్‌పై వడ్డీ రాయితీ' అనే అంశాన్ని ప్రవేశపెట్టిందని వైఎస్సార్‌సీపీ సభ్యుడు మిథున్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఏపీలోని 'కృష్ణా మిల్క్ యూనియన్, కర్నూలు మిల్క్ యూనియన్, సంగం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లకు తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చినట్టు వివరించారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా బైరెడ్డి

ముగ్గురు ఉపాధ్యక్షులు, ఇతర కార్యవర్గం నియామకం


బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని పార్టీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన యువజన విభాగం కమిటీని పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటించింది. ఉపాధ్యక్షులుగా కొండా రాజీవ్‌గాంధీ (విశాఖపట్నం), పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి (పల్నాడు), తొప్పెట సాహిత్‌రెడ్డి (అన్నమయ్య) నియమితులయ్యారు. ఇతర కార్యవర్గాన్ని కూడా నియమించారు.

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షులుగా సునీత, కళ్యాణి

ముగ్గురు ఉపాధ్యక్షులు, ఇతర కార్యవర్గం నియామకం


పోతుల సునీత


వరుదు కళ్యాణి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షులుగా ఎమ్మెల్సీలు పోతుల సునీత, వరుదు కళ్యాణిలను పార్టీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు మంగళవారం మహిళా విభాగం కమిటీని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉపాధ్యక్షులుగా మంతెన మాధవీవర్మ (విశాఖ), బండి పుణ్యశీల (ఎన్టీఆర్), డాక్టర్ శశికళ (నంద్యాల) నియమితులయ్యారు. అలాగే ఇతర కార్యవర్గాన్ని కూడా నియమించారు.

నవ దిశ


హుమైరా జా

ఆర్టికల్ 370 ఎత్తివేతను సుప్రింకోర్ట్ సమర్థించింది. జమ్ము-కశ్మీర్‌లకు రాష్ట్రహోదా ఇచ్చి ఎన్నికలు నిర్వహించమంది. మరోవైపు అక్కడ యువగళాలు మారుతున్న కశ్మీర్‌ను గానం చేస్తున్నాయి. 14 ఏళ్ల ర్యాపర్ హుమైరా జా విడుదల చేసిన పాట 'బదల్తా కశ్మీర్' మార్పును ఆహ్వానిస్తూ కొత్త ఆశను రేపుతోంది. హుమైరా జా పాటను భారత ప్రభుత్వం ఇన్‌స్టాలో షేర్ చేసింది. 'నేను ఇలాగే ముందుకెళ్తాను' అంటున్న హుమైరా పరిచయం.

బదల్తా కశ్మీర్

'బద్‌లా జో కశ్మీర్... బద్‌లా హై సారా దౌర్' అని పాడుతోంది హుమైరా జా.

'కశ్మీర్ మారుతోంది... కశ్మీర్ ధోరణి మారుతోంది... అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది' అంటూ ఆమె పాడిన పాట ఇప్పుడు కశ్మీర్‌వాసులనే కాదు, దేశాభిమానులను కూడా ఆకర్షిస్తోంది. హుమైరా ఈ పాటను ఎం.సి.రా అనే మరో ర్యాపర్ కలిసి పాడింది. కశ్మీర్‌లో తాజా అభివృద్ధి పరిణామాలను పాటలో మిళితం చేస్తూ వీరు విడుదల చేసిన 'బదల్తా కశ్మీర్' పాట కశ్మీర్ భవిష్యత్తు మీద ఆశను కలిగిస్తోంది.

'మా నానమ్మ, తాతయ్యల కాలంలో కశ్మీర్ ఎలా ఉండేది... (ఆర్టికల్ 370 ఎత్తేశాక) ఇప్పుడు ఎలా ఉందనేది నేను వారి మాటల్లో విన్నాను. నా కళ్లారా చూశాను. ఇక్కడ జరిగిన జి 20 సమ్మిట్, శ్రీనగర్‌ను స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దడం, కొత్త టన్నెల్స్ ఏర్పాటు... ఇంతకు ముందు చూడ లేదు. మా ఊరు కంగన్ నుంచి శ్రీనగర్‌కు వెళ్లాలంటే గతంలో గంటన్నర పట్టేది. ఇప్పుడు గండర్‌బల్ దగ్గర బ్రిడ్జి కట్టాక ముప్పై నిమిషాల్లో వెళ్లిపోతున్నాము. ఇదంతా మారుతున్న కశ్మీరే' అంటుంది హుమైరా జా.

తొమ్మిదో తరగతి చదువుతున్న హుమైరా అలవోకగా ర్యాప్ సాంగ్స్ రాసి పాడుతుంది. హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్ పదాలను టక్కున పట్టేట్టుగా వాడుతూ పాటలు రాసి పాడటం వల్ల గతంలోనే గుర్తింపు పొందినా 'బదల్తా కశ్మీర్' పాటతో ప్రపంచానికి తెలిసింది.

'నేను రెండో క్లాస్‌లో ఉండగా యోయో హనీసింగ్ రాప్ ఆల్బమ్ విన్నాను. అది నాకు చాలా నచ్చింది. ఆ వయసులోనే అలా ర్యాప్ పాటలు ట్రై చేసేదాన్ని. అప్పుడే బజ్‌రంగి భాయ్‌జాన్ (2015) సినిమా షూటింగ్ మా ఏరియాలో జరిగితే అందులోని బాల నటి హర్షాలికి నేను బాడీ డబుల్ (డూప్)గా నటించాను. అలా నేను కూడా సినిమాల్లో నటించాలనుకున్నానుగానీ మా కశ్మీర్‌లో సినిమా పరిశ్రమ లేదు. అందుకని ర్యాపర్‌గా రాణించాలని నిశ్చయించుకున్నాను' అంటుంది హుమైరా.

కశ్మీర్‌లో ప్రతి ఏటా జరిగే 'ర్యాప్ బ్యాటిల్' పోటీల్లో పాల్గొని 2022, 2023 సంవత్సరాల్లో టైటిల్ గెలిచింది హుమైరా. '2022లో 15 మంది అబ్బాయిలు నాకు పోటీగా వచ్చారు. నేను ఒక్కదాన్నే ఆడపిల్లను. నేనే గెలిచాను' అంటుంది హుమైరా. 'కశ్మీర్‌లో అమ్మాయిలు స్పోర్ట్స్‌లో, కళల్లో, చదువులో, ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. ఆ విషయాన్ని నా పాటలో చెప్పాను' అందామె.

ఈ పాటలోనే మేల్ వాయిస్ ఇచ్చిన ఎం.సి.రా 'ఇక్కడ ఇప్పుడు జీన్స్ ప్యాంట్ అమ్మాయిలు తొడుక్కుంటున్నారు. బట్టల్ని బట్టి వారిని జడ్జ్ చేసే రోజులు పోయాయి' అనే లైన్‌లు పాడాడు. హుమైరా, ఎం.సి.రా కలిసి 'మై కశ్మీరి... మేరా దేశ్ హై హిందూస్తాన్' అని పాటను ముగిస్తారు.


హుమైరా జా

ఈ పాటలో హుమైరా 'టెర్రరిస్టులకు ఇక్కడ చోటు లేదు. అనవసరంగా ఎవరి రక్తం పారడానికి వీల్లేదు' అనే లైన్లు పాడింది. 'నువ్వు చూపుతున్న అభివృద్ధి ఉత్తుత్తదే. అసలు వాస్తవం వేరే ఉంది అని కొందరంటున్నారుగా' అని విలేకరులు ప్రశ్నిస్తే 'అది వారి దృష్టికోణం. ఇది నా దృష్టికోణం' అంటుంది హుమైరా.

'కొంతమంది నన్ను ట్రోల్ చేస్తున్నారు. నేను పట్టించుకోను. నేను ఇలాగే ముందుకెళతాను. నా వెనుక ఒక్కరు నిలబడినా చాలు' అందామె.

కశ్మీర్ వెనుక హుమైరా వెనుక ఇప్పుడు చాలామంది ఉన్నారు. కశ్మీర్ అభివృద్ధికి అందరూ ప్రయత్నిస్తే 'నయా కశ్మీర్' దగ్గరిలోనే సాధ్యమవుతుంది.

ఛావీ రాజావత్ రాజస్థాన్‌లోని సోడా గ్రామంలో పుట్టి పెరిగింది. పట్నంలో ఉన్నత చదువులు చదివి, కళ్లు చెదిరే ప్యాకేజీతో కార్పొరేట్ ఉద్యోగంలో చేరింది. కానీ, చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి గ్రామానికి వెళ్లింది. సర్పంచ్‌గా ఎన్నికల్లో నిలబడి గెలిచింది. పదేళ్లపాటు సర్పంచ్‌గా పనిచేసింది. మొదటి ఎంబీయే మహిళా సర్పంచ్‌గా వార్తల్లో నిలిచి, యుఎన్‌లో ప్రసంగం చేసింది. గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దింది. ఇప్పుడు గ్రామాభివృద్ధికి కృషి చేస్తూనే, హోటల్ వ్యాపారం చేస్తోంది. ఆసక్తి గలవారికి గుర్రపు స్వారీలో శిక్షణ ఇస్తోంది.

ఊరు రమ్మంది..!

ఒక ఎంబీయే సర్పంచ్.. ఒక మోడల్ గ్రామం

"2010లో తొలిసారి సర్పంచ్ అయినప్పుడు గ్రామ పరిస్థితి ఏ మాత్రం బాగా లేదు. గ్రామం తీవ్ర కరువుతో అల్లాడిపోయింది. సాగునీరు లేదు. 13–14 సంవత్సరాలుగా రుతుపవనాలు లేవు. భూగర్భ జలాలను వాడుకోలేకపోయేవారు. 3–4 గంటలకు మించి విద్యుత్ సరఫరా లేదు. రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉంది. ఈ సవాళ్లతో సోడా పంచాయితీ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టాను. మొదటి టర్మ్‌లో కొన్ని పనులు పూర్తయ్యాయి.

మా ఊరు తనవైపు లాగింది..

మా తాత బ్రిగేడియర్ రఘుబీర్‌సింగ్ 1990 వరకు సర్పంచ్‌గా చేశారు. నాకు మా ఊరు అంటే ఎప్పుడూ ఇష్టమే. బెంగుళూరులోని రిషి వ్యాలీ స్కూల్, జైపూర్‌లోని మాయో కాలేజీ గర్ల్స్ స్కూల్‌లో చదువుకున్నాను. వేసవి సెలవులు వచ్చినప్పుడల్లా మా ఊరిలోనే ఉండేదాన్ని. ఢిల్లీలోని మహిళా శ్రీరామ్ కాలేజీ నుండి డిగ్రీ తీసుకున్నాక, పూణెలోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మోడ్రన్ మేనేజ్‌మెంట్ నుండి ఎంబీయే పూర్తి చేశాను. ఏడేళ్లపాటు కార్పొరేట్ సెక్టార్‌లో వర్క్ చేశాను. లక్షల రూపాయల జీతం. కానీ, మా ఊరు వైపు నన్ను తన వైపు లాగింది.

■ మహిళకు రిజర్వ్ అని..

2010లో మా గ్రామ పంచాయితీ మహిళలకు రిజర్వ్ చేయబడింది. అప్పుడు మా ఊరి పెద్దలు నన్ను ఎన్నికల్లో నిలబడమని అడిగారు. ఆ సమయంలో సర్పంచ్‌ని అవ్వాలనే ఆలోచన కూడా చేయలేదు. గ్రామస్తులు మా అమ్మనాన్నలను అడిగారు. 'ఏం చేయాలనుకున్నా తన ఇష్టం, మా బలవంతం ఉండదు' అని చెప్పారు. నాకు అప్పటి వరకు గ్రామ సభలు ఎలా జరుగుతాయి, పంచాయితీలకు నిధులు ఎలా వస్తాయో తెలియదు. ఆ విషయాలను గ్రామస్తులే చెప్పారు. ఆ విధంగా పంచాయితీ ఎన్నికల్లో నిలబడి, గెలిచాను. మా ఇంట్లో మా తాత తర్వాత నేను సర్పంచ్‌ని అయ్యాను.

■ వర్షపు నీటి సంరక్షణ

ముందుగా ఊరి భవితవ్యాన్ని ఒంటరిగా మార్చలేమని, ప్రజలంతా కలిసికట్టుగా కృషి చేస్తేనే గ్రామం అభివృద్ధి చెందుతుందని అందరికీ స్పష్టంగా చెప్పాను. నేను వ్యూహంతో పనిచేయడం ప్రారంభించాను. ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, గ్రామాలను అనుసంధానించడం, కరువును ఎదుర్కోవడం నేను ఎదుర్కొన్న అతిపెద్ద సవాళ్లు. గ్రామంలోని నీటివనరులన్నీ పూడికతో నిండిపోయాయి. సుమారు 100 ఎకరాల్లో విస్తరించి ఉన్న నీటి వనరుల్లో పూడిక మట్టిని తొలగించేందుకు లక్షల రూపాయలు సేకరించి, ఖర్చు చేశాం.

■ మహిళలు ముందు

గ్రామపంచాయితీ నా కుటుంబం లాంటిది. నేను మీటింగులు పెట్టడం మొదలు పెట్టగానే ఏయే ప్రాజెక్టుల్లో ఎలా పనిచేస్తున్నానో చెప్పేదాన్ని. ఈ ప్రాజెక్టుల గురించి వారు ఏమనుకుంటున్నారో అందరి అభిప్రాయాలు తెలుసుకునేదాన్ని. అలాగే,


ఛావీ రాజావత్





ఎంత డబ్బు ఖర్చు అవుతుందో కూడా వివరించేదాన్ని. పనులు సజావుగా అయ్యేలా అధికారులను కలిసి ఆరా తీయమని గ్రామస్తులకు చెప్పేదాన్ని. మహిళల బృందం డిజైనర్ ల్యాంప్‌లు, కొవ్వొత్తులు, మసాలా దినుసులు వంటి ఉత్పత్తులు తయారు చేయడం మొదలుపెట్టారు. ఇవి మంచి ధరకు అమ్ముడు పోవడం మొదలయ్యింది. దీంతో మహిళల జీవితం మెరుగుపడింది. రెండేళ్లలో 950 ఇళ్లకు గాను 800 మరుగుదొడ్లు నిర్మించాం. 24 గంటలూ కరెంట్ అందుబాటులోకి వచ్చింది.

■ రోడ్ల ప్రాధాన్యత

నా ఎజెండాలో రోడ్ల ప్రాధాన్యత స్పష్టంగా ఉంచాను. ముందు ప్రైవేట్ బస్సుల సహాయం తీసుకున్నాను. బాలికల కోసం పాఠశాల, మహిళల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశాను. మూతపడిన బి.ఎడ్ కాలేజీని స్వాధీనం చేసుకొని దానిని బాలికల చదువుకోసం కేటాయించాను. ఓ ప్రైవేట్ కంపెనీ 200 టేబుళ్లు, బెంచీలను అందజేసి మా వెన్ను తట్టింది.

■ అందరికీ బ్యాంకు ఖాతా..

సర్పంచ్ అయిన ఐదేళ్లలోనే రోడ్లు, డ్రైన్లు, అందరికీ బ్యాంకు ఖాతా తెరిపించాను. ఎప్పుడూ ఫీల్డ్ వర్క్‌లోనే ఉండేదాన్ని. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాల, చదువు ప్రాముఖ్యతను వివరించేదాన్ని.. నా స్వభావం అందరినీ కలుపుకొని ఉంటుంది. ఐక్యరాజ్య సమితి 11వ ఇన్ఫో పావర్టీ వరల్డ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించినప్పుడు మొదటిసారి భారతదేశం నుండి ఒక మహిళా సర్పంచ్‌గా దేశం తరపున ప్రాతినిధ్యం వహించాను. ఇది నాకు గర్వంగా అనిపించింది. అక్కడ వారందరి మదిలో సర్పంచ్ అంటే తలపై ముసుగు వేసుకుని ఉన్న గ్రామస్థురాలు అనుకున్నారు. కానీ, నన్ను కార్పొరేట్ లుక్‌లో చూసి అందరూ ఆశ్చర్యపోయారు. సోడా విలేజ్ అభివృద్ధికి డబ్బు కంటే వ్యక్తులు, అందరి సమష్టి కృషి అవసరం అని ఫోరమ్‌లో చెప్పాను.

రెండుసార్లు సర్పంచ్‌గా నా విధులను నిర్వర్తించాను. తర్వాతి వారికి అవకాశాలు ఇవ్వాలని నేను మళ్లీ పోటీ చేయలేదు. ఇప్పుడు హోటల్‌ని నిర్వహిస్తున్నాను. గుర్రపు స్వారీ వచ్చు కాబట్టి, ఆసక్తి గలవారికి శిక్షణ ఇస్తున్నాను' అని వివరిస్తుంది ఈ యంగ్ లీడర్.

"ఎదుటి వారు చెప్పేది శ్రద్ధగా వింటే మనకు తెలియని ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి. ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీబాత్ కార్యక్రమంలో అనేక విషయాలను ప్రస్తావిస్తుంటారు. వాటిలో ఒకటి నన్ను ఏకంగా ఎంట్రప్రెన్యూర్‌గా మార్చింది. ఈరోజు నేను ఆర్గానిక్ ఎంట్రప్రెన్యూర్‌గా ఎదిగాను. అదే మన్‌కీ బాత్ కార్యక్రమంలో నన్ను ప్రశంసించడం ఎంతో సంతోషంగా ఉంది" అని చెబుతూ తెగ మురిసిపోతోంది వర్ష.

బాత్ చూపిన బాట


వర్ష

కర్ణాటకలోని చామరాజ్‌నగర్ జిల్లా ఆలహళ్లీ గ్రామానికి చెందిన వర్ష ఎమ్‌టెక్ చదివింది. చదువు పూర్తి కాగానే అందరిలా ఉద్యోగం కోసం చూడకుండా సరికొత్తగా ఏదైనా చేయాలనుకుంది. ఈ క్రమంలోనే ఏం చేయాలా అని ఆలోచిస్తున్న వర్ష.. ఓ రోజు అనుకోకుండా మన్‌కీబాత్ వినింది. ఆ కార్యక్రమంలో అరటి ఆకులను ఉపయోగపడే వనరులుగా ఎలా మారుస్తున్నారో మోదీ ప్రస్తావించారు. ప్రకృతిని ఇష్టపడే వర్షకు ఇది బాగా నచ్చడంతో.. అరటి బోదె, ఆకులతో హ్యాండిక్రాఫ్ట్స్ తయారు చేయాలని నిర్ణయించుకుంది.



వీడియో చూసి...

అరటి కాండాలను ఉపయోగపడే వస్తువులుగా ఎలా మార్చాలో వర్షకు తొలుత అర్థం కాలేదు. తరువాత యూట్యూబ్‌లో వెతికి ఒక వీడియో ద్వారా కొంత సమాచారం తెలుసుకుంది. కోయంబత్తూరు, తమిళనాడులోని మరికొన్ని ప్రాంతాల్లో అరటి వ్యర్థాలను అందమైన వస్తువులుగా ఎలా మారుస్తున్నారో వివరంగా తెలుసుకుంది. ఆ తరవాత వ్యాపారానికి కావాల్సిన యంత్రాలను కొనుగోలు చేసి ఉమ్మతూరు సమీపంలో 'ఆకృతి ఇకోఫ్రెండ్లీ' పేరిట ఎంటర్‌ప్రైజ్‌ను ఏర్పాటు చేసింది.

అరటికాండాలు, ఆకులను సేకరించి యంత్రాలతో ప్రాసెస్ చేసి నారతీసి, ఫ్లోర్‌మ్యాట్స్, బ్యాగ్స్, పర్సులు, హ్యాండీ క్రాఫ్ట్స్, అరటి గుజ్జు నుంచి తీసిన రసంతో సహజసిద్ధమైన ఎరువులు తయారు చేసి విక్రయిస్తోంది. కష్టమర్ల నుంచి మంచి ఆదరణ లభించడంతో ఆర్గానిక్ షాపులు, గూగుల్, ఫ్లిప్‌కార్ట్, అమేజాన్ వంటి ఆన్‌లైన్ షాపుల్లో సైతం ఆకృతి వస్తువుల విక్రయాలు జరుగుతున్నాయి. ఇలా అరటి వ్యర్థాలను అందమైన వస్తువులుగా మారుస్తూ కొంతమందికి ఉపాధి కల్పించడంతోపాటు.. రైతులకు ఆదాయం వచ్చేలా చేస్తోంది వర్ష.

వర్ష తన భర్త శ్రీకాంత్ సాయంతో చేస్తున్న ఈ ఇకో–ఫ్రెండ్లీ బిజినెస్ గురించి తెలియడంతో కొన్ని కంపెనీల నుంచి భారీగా ఆర్డర్లు వస్తున్నాయి. "భవిష్యత్‌లో తన వ్యాపారాన్ని మరింత విస్తరించి ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తాను" అని వర్ష చెబుతోంది. గ్రామాల్లోని మహిళలు సైతం వ్యాపారవేత్తలుగా మారేందుకు, ఉద్యోగం దొరకనివారు ఉపాధిని ఇలా సృష్టించుకోవచ్చని చెప్పడానికి ఉదాహరణగా నిలుస్తోంది వర్ష. నవంబర్ నెల మన్‌కీ బాత్ కార్యక్రమంలో వర్ష ఎంట్రప్రెన్యూర్ జర్నీ గురించి మోదీ ప్రస్తావించడం విశేషం.

కొత్త సంవత్సరం దగ్గరలో ఉంది.
కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ 'హ్యాపీ న్యూ ఇయర్' పాట పాడగానే సరిపోతుందా?
'పాటతోపాటు ప్రణాళిక కూడా ఉంది' అంటుంది మన జెన్ జెడ్.
కొత్త సంవత్సరంలో జెన్ జెడ్ లక్ష్యాలు, ప్రణాళికలు, అభిరుచులకు సంబంధించి 'ట్రెండ్ టాక్ రిపోర్ట్-2024' అద్దం పడుతోంది.

యూత్ పల్స్

Generation Z భవిష్యత్ చిత్ర 'వర్ణ'మాల

ఇండియా, యూఎస్, యూకే, బ్రెజిల్, సౌత్ కొరియా దేశాలలోని జెన్ జెడ్ ట్రెండ్స్‌కు సంబంధించి 'ట్రెండ్ టాక్ రిపోర్ట్'ను విడుదల చేసింది ఇన్‌స్టాగ్రామ్. వర్త్ గ్లోబల్ స్టైల్ నెట్‌వర్క్ (డబ్ల్యూజీఎస్ఎన్)తో కలిసి నిర్వహించిన ఈ సర్వేలో 2024 సంవత్సరానికి సంబంధించి ఫ్యాషన్, బ్యూటీ, సోషల్ మీడియా, ఫ్రెండ్‌షిప్‌కు సంబంధించిన ప్రశ్నలు జెన్ జెడ్‌ను అడిగారు.

ఈ రిపోర్ట్ ప్రకారం ఫ్యాషన్ ట్రెండ్స్, బ్యూటీ అండ్ ఫుడ్ విభాగాలలో మన దేశం ట్రెండ్ సెట్టర్‌గా ఉంది. ఫుడ్ విషయానికి వస్తే కొత్త రుచులను ఆస్వాదించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇతరుల కంటే భిన్నంగా కనిపించే వస్త్రధారణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొత్త హెయిర్‌స్టైల్‌ను ఎంపిక చేసుకుంటున్నారు.

2024కు సంబంధించి 'జెన్ జెడ్' ప్రాధాన్యతలలో హెల్త్, ట్రావెల్, కెరీర్‌లు మొదటి స్థానంలో ఉన్నాయి.

తమ కెరీర్‌పై ప్రధానంగా దృష్టి పెట్టబోతున్నట్లు 43 శాతం మంది తెలియజేశారు. ఇతర దేశాలతో పోల్చితే మన 'జెన్ జెడ్' వ్యాపారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. సంపద సృష్టికి వ్యాపారమే మార్గం అని చెబుతోంది.

మన దేశంలో 'జెన్ జెడ్'లో ఎక్కువ మంది స్పోర్ట్స్‌కు సంబంధించి సూపర్ ఫ్యాన్స్ ఉన్నారు.

లైఫ్ అడ్వైజ్, తమ ప్రొఫెషన్‌కు సంబంధించి కంటెంట్‌కు ప్రాధాన్యత ఇచ్చేవారి సంఖ్య ఎక్కువగానే ఉంది.

జీఆర్‌డబ్ల్యూఎం(గెట్ రెడీ విత్ మీ)లాంటి క్రియేటివిటీతో కూడిన ఫ్యాషన్ ట్రెండ్స్‌పై అమిత ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. మన దేశంలో జెన్ జెడ్‌లో 44 శాతం మంది సొంత ఆలోచనలకు ప్రాధాన్యత ఇచ్చే డీఐవై(డూ-ఇట్-యువర్ సెల్ఫ్) విధానాన్ని ఇష్టపడుతున్నారు.

సంగీతం విషయానికి వస్తే ఏఆర్ రెహమాన్, శ్రేయా ఘోషల్, అనిరుథ్ నుంచి సౌత్ కొరియన్ మ్యూజిక్ బ్యాండ్ 'బీటీఎస్ ఆర్మీ' వరకు ఇష్టపడుతున్నారు. వారికి నచ్చిన వీడియో గేమ్స్‌లో ఫోర్ట్ నైట్, కాల్ ఆఫ్ డ్యూటీ, రాబ్లక్స్... మొదలైనవి ఉన్నాయి.

గుడ్ ప్లానింగ్

2024లో యువతరం ఆసక్తి చూపుతున్న రంగాలలో ట్రావెల్ ఒకటి. ట్రావెల్ ప్రేమికులకు టాన్యాలాంటి ట్రావెల్ వ్లోగర్‌ల సలహాలు ఉపయోగపడుతున్నాయి. అడ్వర్‌టైజింగ్ రంగంలో ఉద్యోగం చేసిన టాన్యా సోలోగా ట్రావెలింగ్ మొదలు పెట్టి తాను వెళ్లిన ప్రదేశాలకు సంబంధించి వ్లోగింగ్ మొదలు పెట్టింది. యూట్యూబ్, ఎయిర్‌టెల్‌లాంటి పెద్ద కంపెనీలతో కలిసి పనిచేసింది. ట్రావెలింగ్‌పై ఆసక్తి ఉన్నవారికి గుడ్ ప్లానింగ్ అనేది ముఖ్యం అంటుంది టాన్యా. 'గుడ్ ప్లానింగ్'కు సంబంధించి టిప్స్ చెబుతుంటుంది.



జెన్ జెడ్‌లోని పదిమందిలో తొమ్మిదిమంది వారు ఇష్టపడే రంగాలకు సంబంధించి సెలబ్రిటీల అభిమానగణంలో ఉన్నారు. తమ అభిమాన సెలబ్రిటీలు, అథ్లెట్లు, క్రియేటర్ నుంచి జెన్ జెడ్ రాబోయే కాలంలో ఆశిస్తున్నది ఏమిటి? అనే ప్రశ్నకు వినిపించే జవాబు... లైఫ్ అడ్వైజెస్, వారి ప్రొఫెషన్‌కు సంబంధించిన కంటెంట్... ఇక మీమ్స్ విషయానికి వస్తే మూడింట ఒక వంతు మంది 'బ్యాడ్ టేస్ట్ మీమ్స్'ను తమ 'టాప్ టర్న్ ఆఫ్'గా ఎంచుకున్నారు.



ప్రణాళిక ఉండాలి

ఢిల్లీకి చెందిన మోనికా మాలిక్ బిజినెస్ అండ్ ఫైనాన్స్‌కు సంబంధించి కంటెంట్ క్రియేటర్‌గా చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకుంది. పర్సనల్ ఫైనాన్స్ నుంచి స్టాక్‌మార్కెట్ వరకు ఎన్నో విషయాలను సులభంగా అర్థమయ్యేలా చెబుతోంది. 'ఒక రంగంపై ఇష్టం ఉన్నంత మాత్రాన విజయం చేరువ కాదు. భవిష్యత్ ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలి. పరిశ్రమకైనా, వ్యక్తికైనా ఇది ముఖ్యం' అంటుంది మాలిక్.

గతం సంగతి ఎలా ఉన్నా భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి నిర్ణయాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో యువతరం ముందు ఉంటుంది. అభిరుచుల నుంచి కెరీర్ ఆప్షన్స్ వరకు కొత్తగా ఆలోచిస్తోంది.

'కాలేజీ చదువు పూర్తయిన తరువాత వైట్-కాలర్ జాబ్ తెచ్చుకోవాలి' అనేది సంప్రదాయ ఆలోచన. అయితే యువతరంలో అందరూ ఇలాగే ఆలోచించడం లేదు.'కంఫర్టబుల్ లైఫ్‌స్టైల్'కు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దీనికి కారణం జెనరేటివ్ ఏఐ. జెనరేటివ్ ఏఐ ప్రభావంతో వైట్-కాలర్ జాబ్స్‌కు ఉద్యోగభద్రత తక్కువ అనే అభిప్రాయం ఉంది. పియర్సన్ రిపోర్ట్ ప్రకారం జెనరేటివ్ ఏఐ వల్ల వైట్-కాలర్ ఉద్యోగాలలో 30 శాతం రిప్లేస్‌మెంట్ జరుగుతుంది.

వైట్-కాలర్ జాబ్‌లతో పోల్చితే బ్లూ-కాలర్ జాబ్‌లకు అధిక ఉద్యోగ భద్రత ఉంది. రోబోట్స్ చేయలేని పనులు వీటిలో ఉండడమే కారణం. ఈ పనులు చేయడానికి ప్రత్యేక శిక్షణ, నైపుణ్యం అవసరం. అయితే జెన్ జెడ్‌లో ఎక్కువమంది ఈ హై-డిమాండ్ ఫీల్డ్‌పై ఆసక్తి ప్రదర్శించడం లేదు.

వైట్-కాలర్ జాబ్, బ్లూ-కాలర్ జాబ్ అనేదానితో సంబంధం లేకుండా ప్రతి ఉద్యోగికి విశ్లేషణాత్మక ఆలోచన విధానం, సమస్య పరిష్కార నైపుణ్యం, సమర్థవంతమైన కమ్యూనికేషన్, స్ట్రెస్ మెనేజ్‌మెంట్ స్కిల్స్... మొదలైన వాటికి సంబంధించి ప్రొఫెషనల్ స్కిల్స్ అవసరం. వీటిపై జెన్ జెడ్ ఆసక్తి ప్రదర్శిస్తోంది.

నిర్ణయాలు తీసుకోవడంలో 'లైఫ్‌స్టైల్' అనేది కీలకపాత్ర పోషిస్తోంది. డబ్బు నుంచి ఫ్రీ టైమ్ అండ్ ఫ్లెక్సిబిలిటీ వరకు ఎన్నో విషయాలను దృష్టిలో పెట్టుకుంటుంది జెన్ జెడ్.



ఆసియా చాంపియన్‌షిప్ పోటీలకు మీరాబాయి దూరం

భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను గాయం నుంచి ఇంకా కోలుకోలేదు. దాంతో ఫిబ్రవరిలో తాష్కెంట్‌లో జరిగే ఆసియా చాంపియన్‌షిప్ పోటీలకు ఆమె దూరం కానుంది. అక్టోబర్‌లో జరిగిన హాంగ్జౌ ఆసియా క్రీడల సందర్భంగా ఆమె తుంటికి గాయమైంది. దీంతో అప్పటి నుంచి ఆమె మరే టోర్నీ బరిలోనూ దిగలేకపోయింది. ప్రపంచ మాజీ చాంపియన్, టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత అయిన మీరాబాయి మార్చిలో థాయ్‌లాండ్‌లో పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీల్లో భాగమైన ప్రపంచకప్ టోర్నీతో పునరాగమనం చేసే అవకాశముంది.

అప్పుడు సెరెనా... ఇప్పుడు స్వియాటెక్!



పోలాండ్ టెన్నిస్ స్టార్ ఇగా స్వియాటెక్ వరుసగా రెండో ఏడాది ‘ప్లేయర్ ఆఫ్ ద ఇయర్’ అవార్డును గెలుచుకుంది. మహిళల టెన్నిస్ సంఘంలో ఈ ఘనత సాధించిన రెండో ప్లేయర్‌గా ఆమె నిలిచింది. 22 ఏళ్ల స్వియాటెక్ 2023లో ఆరు టైటిళ్లను సాధించింది. గతంలో వరుసగా రెండేళ్లు, అంతకుమించి ‘ప్లేయర్ ఆఫ్ ద ఇయర్’గా నిలిచిన రికార్డు అమెరికన్ దిగ్గజం సెరెనా విలియమ్స్ పేరిట ఉంది. సెరెనా 2012 నుంచి నాలుగేళ్ల పాటు ఆ అవార్డు సాధించింది.

భారత్ అదరహో

- జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీలో సెమీస్‌లోకి ప్రవేశం
- క్వార్టర్ ఫైనల్లో నెదర్లాండ్స్‌పై గెలుపు
- రేపు జర్మనీతో సెమీఫైనల్ పోరు



కౌలాలంపూర్: ఆద్యంతం అద్భుతమైన పోరాట పటిమ కనబరిచిన భారత జట్టు జూనియర్ పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఉత్తమ్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టు 4–3 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్ జట్టును ఓడించింది. భారత్ తరఫున ఆదిత్య అర్జున్ లలాగే (34వ ని.లో), అరిజిత్ సింగ్ హుందల్ (35వ ని.లో), సౌరభ్ ఆనంద్ కుష్వా (52వ ని.లో), ఉత్తమ్ సింగ్ (57వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. నెదర్లాండ్స్ జట్టుకు టిమో బోర్స్ (5వ ని.లో), వాన్ డెర్ హెజ్డెన్ (16వ ని.లో), ఒలివియర్ హోర్‌టెన్‌సియస్ (44వ ని.లో) ఒక్కో గోల్ అందించారు. మిగతా క్వార్టర్ ఫైనల్స్‌లో జర్మనీ 2–1తో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాపై, ఫ్రాన్స్ 3–2తో ఆస్ట్రేలియాపై, స్పెయిన్ 4–2తో పాకిస్తాన్‌పై విజయం సాధించాయి. గురువారం జరిగే సెమీఫైనల్స్‌లో ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ జర్మనీతో భారత్; స్పెయిన్‌తో ఫ్రాన్స్ తలపడతాయి.

జూనియర్ స్థాయిలో చివరిసారి 2005లో నెదర్లాండ్స్‌పై గెలిచిన భారత జట్టుకు ఈసారీ గట్టి పోటీ ఎదురైంది. అయితే మ్యాచ్‌లో మూడుసార్లు వెనుకబడ్డ భారత్ ఏమాత్రం ఆందోళన చెందకుండా పోరాడింది. రెండు క్వార్టర్‌లు ముగిసేసరికి 0–2తో వెనుకబడిన భారత్ ఆ తర్వాత నిమిషం వ్యవధిలో రెండు గోల్స్ చేసి స్కోరును సమం చేసింది. మూడో క్వార్టర్‌లో నెదర్లాండ్స్ మూడో గోల్ చేసి మరోసారి ఆధిక్యంలోకి వచ్చింది. మ్యాచ్ ముగిసేందుకు ఎనిమిది నిమిషాలు ఉన్నాయనగా భారత్ మళ్లీ స్కోరును సమం చేసింది. అదే జోరులో మ్యాచ్ ముగియడానికి మూడు నిమిషాలముందు నాలుగో గోల్‌తో తొలిసారి ఆధిక్యంలోకి వచ్చింది. చివర్లో నెదర్లాండ్స్ జట్టు స్కోరును సమం చేసేందుకు విశ్వప్రయత్నాలు చేసింది. నెదర్లాండ్స్ ఏకంగా ఆరు పెనాల్టీ కార్నర్‌లు సంపాదించినా... భారత జట్టు గోల్‌కీపర్ మోహిత్‌తోపాటు రక్షణపంక్తి ఆటగాళ్లు అప్రమత్తంగా ఉండి నెదర్లాండ్స్‌కు గోల్ చేసే అవకాశం ఇవ్వలేదు. చివరి పది సెకన్లలోనూ నెదర్లాండ్స్‌కు పెనాల్టీ కార్నర్ లభించినా భారత ఆటగాళ్లు దానిని నిర్వీర్యం చేసి చిరస్మరణీయ విజయం అందుకున్నారు. మ్యాచ్ మొత్తంలో నెదర్లాండ్స్‌కు 12 పెనాల్టీ కార్నర్‌లు రాగా వాటిలో మూడింటిని గోల్స్‌గా మలిచింది. భారత జట్టుకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు లభించగా... ఒక దానిని భారత్ లక్ష్యానికి చేర్చింది.

6 జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత్ సెమీఫైనల్ చేరడం ఇది ఆరో సారి. గతంలో భారత జట్టు 2001, 2016లలో విజేతగా, 1997లో రన్నరప్‌గా నిలిచింది. 2005, 2021లలో సెమీఫైనల్‌తోపాటు మూడో స్థానం కోసం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో భారత జట్టు ఓడిపోయింది.

దక్షిణాఫ్రికాదే రెండో టి20

- 5 వికెట్లతో ఓడిన భారత్
- రింకూ, సూర్య మెరుపులు వృథా



సూర్య

రింకూ సింగ్

పోర్ట్ ఎలిజబెత్: భారత్‌తో టి20 సిరీస్‌లో దక్షిణాఫ్రికా పైచేయి సాధించింది. మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. టాస్ ఓడిన టీమిండియా బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై ముందుగా 19.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. రింకూ సింగ్ (39 బంతుల్లో 68 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (36 బంతుల్లో 56; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో చెలరేగారు. సఫారీ బౌలర్లలో గెరార్డ్ కొయెట్జీకి 3 వికెట్లు దక్కాయి. భారత్ ఇన్నింగ్స్‌లో మరో 3 బంతులు మిగిలి ఉండగానే వర్షం రావడంతో ఆట ఆగిపోగా... వాన తగ్గిన తర్వాత భారత ఇన్నింగ్స్‌ను కొనసాగించకుండా అక్కడితో ముగించారు. అనంతరం దక్షిణాఫ్రికా విజయలక్ష్యాన్ని (డక్‌వర్త్ లూయిస్ ప్రకారం) 15 ఓవర్లలో 152 పరుగులుగా నిర్దేశించారు. చివరకు సఫారీ టీమ్ 13.5 ఓవర్లలో 5 వికెట్లకు 154 పరుగులు సాధించి గెలిచింది. రీజా హెన్‌డ్రిక్స్ (27 బంతుల్లో 49; 8 ఫోర్లు, 1 సిక్స్), మార్క్‌రమ్ (17 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. తొలి టి20 వర్షంతో రద్దు కాగా, తాజా ఫలితంతో సఫారీ 1–0తో పైచేయి సాధించింది. చివరిదైన మూడో టి20 రేపు జొహన్నెస్‌బర్గ్‌లో జరుగుతుంది.

కీలక భాగస్వామ్యాలు...

ఫామ్‌లో ఉన్న రుతురాజ్ అనారోగ్యం కారణంగా ఈ మ్యాచ్‌కు దూరం కాగా... ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (0), శుబ్‌మన్ గిల్ (0) డకౌట్ కావడంతో 6 పరుగులకే భారత్ 2 వికెట్లు కోల్పోయింది. అయితే మూడో స్థానంలో వచ్చిన తిలక్ వర్మ (20 బంతుల్లో 29; 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి స్కోరుబోర్డును పరుగెత్తించాడు. సూర్య కూడా తనదైన శైలిలో జోరు ప్రదర్శించాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 24 బంతుల్లోనే 49 పరుగులు జోడించారు. 10 ఓవర్లలో స్కోరు 84 పరుగులకు చేరగా, 29 బంతుల్లో సూర్య అర్ధ సెంచరీ పూర్తయింది. తన తొలి 20 బంతుల్లో 6 ఫోర్లు బాది రింకూ కూడా ధాటిని కొనసాగించాడు. సూర్య, రింకూ నాలుగో వికెట్‌కు 48 బంతుల్లో 70 పరుగులు జత చేశారు. సూర్య వెనుదిరిగిన తర్వాత జితేశ్ శర్మ (1) విఫలం కాగా, 30 బంతుల్లో రింకూ కెరీర్‌లో తన తొలి హాఫ్ సెంచరీని అందుకున్నాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) మిల్లర్ (బి) జాన్సెన్ 0; గిల్ (ఎల్బీ) (బి) విలియమ్స్ 0; తిలక్ (సి) జాన్సెన్ (బి) కొయెట్జీ 29; సూర్యకుమార్ (సి) జాన్సెన్ (బి) షమ్సీ 56; రింకూ (నాటౌట్) 68; జితేశ్ (సి) స్టబ్స్ (బి) మార్క్‌రమ్ 1; జడేజా (ఎల్బీ) (బి) కొయెట్జీ 19; అర్ష్‌దీప్ (సి) ఫెలుక్వాయో (బి) కొయెట్జీ 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.3 ఓవర్లలో 7 వికెట్లకు) 180. వికెట్ల పతనం:** 1–0, 2–6, 3–55, 4–125, 5–142, 6–180, 7–180. **బౌలింగ్:** జాన్సెన్ 3–0–39–1; విలియమ్స్ 3–0–32–1; కొయెట్జీ 3.3–0–32–3; ఫెలుక్వాయో 3–0–29–0; షమ్సీ 4–0–18–1; మార్క్‌రమ్ 3–0–29–1. **దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్:** బ్రీట్‌జె (రనౌట్) 16; హెన్‌డ్రిక్స్ (సి) సూర్యకుమార్ (బి) కుల్దీప్ 49; మార్క్‌రమ్ (సి) సిరాజ్ (బి) ముకేశ్ 30; క్లాసెన్ (సి) యశస్వి (బి) సిరాజ్ 7; మిల్లర్ (సి) సిరాజ్ (బి) ముకేశ్ 17; స్టబ్స్ (నాటౌట్) 14; ఫెలుక్వాయో (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (13.5 ఓవర్లలో 5 వికెట్లకు) 154. వికెట్ల పతనం:** 1–42, 2–96, 3–108, 4–108, 5–139. **బౌలింగ్:** సిరాజ్ 3–0–27–1, అర్ష్‌దీప్ 2–0–31–0, జడేజా 2.5–0–28–0, ముకేశ్ 3–0–34–2, కుల్దీప్ 3–0–26–1.

రాజ్ 9.1-3-13-7

- ఏడు వికెట్లతో హడలెత్తించిన పేసర్
- ఆసియా కప్ అండర్–19 టోర్నీ సెమీస్‌లోకి టీమిండియా



దుబాయ్: భారత టీనేజ్ సీమర్ రాజ్ లింబాని (7/13) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో నేపాల్‌ను కూల్చేశాడు. దీంతో అండర్–19 ఆసియా కప్‌లో యువ భారత్ అలవోక విజయంతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన గ్రూప్ ‘ఎ’ చివరి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 10 వికెట్ల తేడాతో నేపాల్‌పై ఘనవిజయం సాధించింది. రెండు విజయాలతో భారత్ గ్రూప్ ‘ఎ’లో రెండో స్థానంలో... ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన పాకిస్తాన్ గ్రూప్ టాపర్‌గా నిలిచి సెమీఫైనల్ చేరాయి. మొదట బ్యాటింగ్‌కు దిగిన నేపాల్‌ను 18 ఏళ్ల రాజ్ లింబాని స్పెల్ హడలెత్తించింది. దీంతో నేపాల్ 22.1 ఓవర్లలో 52 పరుగులకే కుప్పకూలింది. రాజ్ 9.1 ఓవర్లలో 3 మెయిడెన్లు వేసి 13 పరుగులిచ్చి 7 వికెట్లు తీశాడు. నేపాల్ ఓపెనర్ల నుంచి ఆఖరి వరుస బ్యాటర్ వరకు అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అనంతరం భారత జట్టు 7.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 57 పరుగులు చేసి ఛేదించింది. అర్షిన్ కులకర్ణి (30 బంతుల్లో 43 నాటౌట్; 1 ఫోర్, 5 సిక్స్‌లు) భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. అర్షిన్, ఆదర్శ్ సింగ్ (13 నాటౌట్; 2 ఫోర్లు) అబేధ్యమైన ఓపెనింగ్ భాగస్వామ్యంతో జట్టును గెలిపించారు.

భారత జట్టులో అవినాశ్, అభిషేక్

అండర్–19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీ



అవినాశ్



అభిషేక్

ముంబై: అండర్–19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో పాల్గొనే భారత జట్టును మంగళవారం బీసీసీఐ జూనియర్ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. ప్రస్తుతం దుబాయ్‌లో అండర్–19 ఆసియా కప్‌లో పాల్గొంటున్న జట్టునే ఒక్క మార్పూ లేకుండా ఈ మెగా టోర్నీ కోసం కూడా ఎంపిక చేయడం విశేషం. 15 మంది సభ్యుల వరల్డ్‌కప్ టీమ్‌కు పంజాబ్‌కు చెందిన ఉదయ్ సహరన్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, సౌమీ కుమార్ పాండే వైస్ కెప్టెన్‌గా ఉంటాడు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు క్రికెటర్లు అరవెల్లి అవినాశ్ రావు, మురుగన్ అభిషేక్‌లకు ఈ జట్టులో చోటు దక్కింది. వికెట్ కీపర్ అవినాశ్, ఆఫ్‌స్పిన్ ఆల్‌రౌండర్ అభిషేక్ ఇద్దరూ ఆసియా కప్‌లో భారత్ ఆడిన 3 మ్యాచ్‌లలోనూ బరిలోకి దిగారు. దక్షిణాఫ్రికా వేదికగా జనవరి 19 నుంచి ఫిబ్రవరి 11 వరకు వరల్డ్‌కప్‌ను నిర్వహిస్తారు.

భారత జట్టు: ఉదయ్ (కెప్టెన్), సౌమీ కుమార్ (వైస్‌కెప్టెన్), అర్షిన్, ఆదర్శ్, రుద్రమయూర్ పటేల్, సచిన్, ప్రియాన్షు, ముషీర్ ఖాన్, అవినాశ్ రావు, మురుగన్ అభిషేక్, ఇనేశ్ మహాజన్, ధనుశ్ గౌడ, ఆరాధ్య శుక్లా, రాజ్ లింబాని, నమన్ తివారి.

వారియర్స్ ఘనవిజయం



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో బెంగాల్ వారియర్స్ జట్టు మూడో విజయం నమోదు చేసింది. పట్నా పైరేట్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 60–42తో గెలిచింది. వారియర్స్ తరఫున కెప్టెన్ మణీందర్ సింగ్ 15 పాయింట్లు, నితిన్ 14 పాయింట్లు స్కోరు చేశారు. ఈ గెలుపుతో వారియర్స్ జట్టు 18 పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో తమిళ్ తలైవాస్‌తో తెలుగు టైటాన్స్; బెంగళూరు బుల్స్‌తో జైపూర్ పింక్ పాంథర్స్ తలపడతాయి.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
బెంగాల్ వారియర్స్	4	3	0	1	18
గుజరాత్ జెయింట్స్	5	3	2	0	17
యూపీ యోధాస్	4	2	2	0	12
పుణేరి పల్టన్	2	2	0	0	10
పట్నా పైరేట్స్	3	2	1	0	10
హరియాణా స్టీలర్స్	3	2	1	0	10
జైపూర్ పింక్ పాంథర్స్	3	1	1	1	9
బెంగళూరు బుల్స్	5	1	4	0	9
దబంగ్ ఢిల్లీ	3	1	2	0	6
యు ముంబా	3	1	2	0	6
తమిళ్ తలైవాస్	2	1	1	0	5
తెలుగు టైటాన్స్	3	0	3	0	1

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

సినిమా

ఎర పడాల్సిందే!



● రజనీకాంత్

‘గురి పెడితే ఎర పడాల్సిందే..’ అని అంటున్నారు రజనీకాంత్. ‘జై భీమ్’ ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రానికి ‘వేట్టయాన్’ (వేటగాడు అని అర్థం) టైటిల్‌ను ఖరారు చేసి, ఈ సినిమా టైటిల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. మంగళవారం రజనీకాంత్ బర్త్ డే. ఈ సందర్భంగా ‘వేట్టయాన్’ టైటిల్ వీడియోను విడుదల చేశారు. ‘గురి పెడితే ఎర పడాల్సిందే..’ అని రజనీకాంత్ చెప్పే డైలాగ్, విజువల్స్‌తో ఈ వీడియో సాగుతుంది. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్, దుషారా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై ఈ చిత్రాన్ని సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. అలాగే లైకా ప్రొడక్షన్స్ సంస్థలో రజనీకాంత్ ఓ లీడ్ రోల్ చేస్తున్న చిత్రం ‘లాల్ సలామ్’. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మొయిద్దీన్ భాయ్ పాత్రలో రజనీకాంత్ నటిస్తున్నారు. రజనీ బర్త్ డే సందర్భంగా మొయిద్దీన్ భాయ్ పాత్రకు సంబంధించిన యాక్షన్ టీజర్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా నటిస్తున్న ఈ సినిమా జనవరిలో సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది. ఈ సినిమాలే కాకుండా.. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగ రాజ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే.



● శ్రుతీహాసన్



● అడివి శేష్

కాంబినేషన్ సెట్

అడివి శేష్, శ్రుతీహాసన్ ప్రధాన పాత్రధారులుగా ఓ యాక్షన్ డ్రామా తెరకెక్కనుంది. అడివి శేష్ హీరోగా నటించిన ‘క్షణం’, ‘గూఢచారి’ చిత్రాలకు ఛాయాగ్రాహకుడిగా చేసిన షానీల్ డియో ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారు. కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు అధికారికంగా ఎంపికైన ‘లైలా’ అనే షార్ట్ ఫిల్మ్‌కు షాన్ దర్శకత్వం వహించారు. శేష్, శ్రుతి కాంబినేషన్‌లో ఆయన దర్శకత్వం వహించనున్న తాజా చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మించనున్నారు. ‘‘ఈ సినిమాలోని ప్రతి సీన్, డైలాగ్‌లను హిందీతో పాటు తెలుగులో కూడా చిత్రీకరించనున్నాం. ప్రతి భాషకు ఉన్న ప్రత్యేకతకు ప్రాధాన్యం ఇస్తూ, ఈ సినిమాను విభిన్నంగా చేస్తున్నాం. ఇతర వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: సునీల్ నారంగ్.



● సంయుక్తా మీనన్, కల్యాణ్ రామ్, మాళవికా నాయర్

రాసుకోండి... సినిమా బాగుంటుంది

\- కల్యాణ్ రామ్

‘‘మంచి కథ, విజువల్స్, మ్యూజిక్ ఉండి.. దానికి తగ్గ టీమ్ వర్క్ చేసినప్పుడు ప్రేక్షకులు థియేటర్స్‌కి వద్దన్నా వస్తారని ‘బింబిసార’ సినిమా టైమ్‌లో చెప్పాను. దాన్ని మీరు (ఫ్యాన్స్, ఆడియన్స్) నిజం చేశారు. అదే కోవలో ‘డెవిల్’ మంచి కథా కథనాలతో వస్తోంది. రాసుకోండి.. సినిమా చాలా బావుంటుంది. ఈ చిత్రం సరికొత్త కథతో ఉంటుంది’’ అని హీరో కల్యాణ్ రామ్ అన్నారు. ఆయన హీరోగా, మాళవికా నాయర్, సంయుక్తా మీనన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘డెవిల్’. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను మంగళవారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా కల్యాణ్ రామ్ మాట్లాడుతూ– ‘‘ఖర్చుకి వెనకాడకుండా ‘డెవిల్’ని రూపొందించిన అభిషేక్ నామాగారికి థ్యాంక్స్. సినిమా అనేది టీమ్ ఎఫర్ట్. దాన్ని ప్రేక్షకులు ఆదరిస్తే వచ్చే ఆనందమే వేరు. ‘బింబిసార 2’ను వచ్చే ఏడాది ఏప్రిల్ లేదా మేలో మొదలుపెడతాం. తమ్ముడు ఎన్టీఆర్ ‘దేవర’ సినిమా గ్లింప్స్‌ని త్వరలో రిలీజ్ చేస్తాం’’ అన్నారు. ‘‘డెవిల్’ కోసం రెండేళ్ల పాటు కల్యాణ్ రామ్‌గారు మరో సినిమా చేయకుండా పని చేశారు. ఇందులో ఆయన యాక్షన్, నటన అదిరిపోతాయి. మా ‘డెవిల్’ హిట్‌తో 2023 ముగుస్తుంది’’ అన్నారు అభిషేక్ నామా.

హారర్ అంటే ఉలిక్కిపడేలా ఉండాలి

\- శ్రీరామ్

‘‘హారర్ సినిమాల విషయంలో నాకు ఓ భయం ఉంటుంది. పేరుకి హారర్ సినిమా అంటారు కానీ అందులో అనవసరమైన కామెడీ, రొమాన్స్, సాంగ్స్‌ను ఇరికిస్తుంటారు. హారర్ అంటే థియేటర్‌లో సినిమా చూస్తున్నప్పుడు ఉలిక్కిపడేలా ఉండాలి. సాయికిరణ్ దైదా ‘పిండం’ మూవీ కథ చెప్పినప్పుడు ప్రేక్షకులు ఉలిక్కి పడతారనిపించింది’’ అని హీరో శ్రీరామ్ అన్నారు. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలో నటించిన చిత్రం ‘పిండం’. యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీరామ్ చెప్పిన విశేషాలు.



● నేను నటించిన తొలి తెలుగు చిత్రం ‘ఒకరికి ఒకరు’ రిలీజై 20 ఏళ్లయింది. ఇన్నేళ్లయినా అలాగే ఉన్నారు. ఆరోగ్య రహస్యం ఏంటి? అని అడుగుతుంటారు. ఆహారం విషయంలో శ్రద్ధ తీసుకుంటాను. ఎక్కువగా ఇంటి భోజనం తింటాను. బయటకు వెళ్లినా ఎక్కువగా పప్పు, సాంబారు వంటి ఆహారమే తీసుకుంటాను. ఉన్న దాంతో సంతృప్తి చెంది, ఆనందంగా ఉంటాను. ● సాయి కిరణ్ దైదా తీసిన ‘స్మోక్’ అనే షార్ట్ ఫిల్మ్ చూసి తన ప్రతిభపై నమ్మకం కలిగింది. చెప్పిన బడ్జెట్, టైమ్‌కి ‘పిండం’ పూర్తి చేశారు. యశ్వంత్ ఈ కథను నమ్మి సినిమా నిర్మించారు. ఇది థియేటర్‌లో చూసి అనుభూతి చెందాల్సిన హారర్ సినిమా. 1930, 1990, ప్రస్తుతం.. ఇలా మూడు కాలాల్లో ఈ చిత్రకథ జరుగుతుంది. ● నా దృష్టిలో ఇప్పటిదాకా తెలుగులో భయంకరమైన హారర్ సినిమా అంటే రామ్‌గోపాల్ వర్మగారు తీసిన ‘రాత్రి’. ఆ మూవీని చాలాసార్లు చూశాను. ‘పిండం’ అనేది కేవలం హారర్ సినిమా కాదు... ఇందులోని బలమైన కథ, భావోద్వేగాలకు ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. ● నేను చేసిన ‘రెక్కీ’ వెబ్ సిరీస్ సంతృప్తినిచ్చింది. ప్రస్తుతం ఓటీటీ కోసం ‘నెట్ వర్క్, హరికథ’ అనే ప్రాజెక్ట్‌లు చేస్తున్నాను. నేను, జీవీ ప్రకాశ్ తమిళ్‌లో ‘బ్లాక్ మెయిల్’ అనే మూవీ చేస్తున్నాం. అలాగే ‘సంభవం’ చిత్రం చేస్తున్నా. ప్రస్తుతం ఆరు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాను.



● అను ప్రసాద్, నిరీష్, సాయి కుమార్, పూజితా పొన్నాడ, విరాజ్ అశ్విన్

మా సినిమా చేనేత కార్మికులకు అంకితం

\- సాయి కుమార్

‘‘జోరుగా హుషారుగా’లో చేనేత కార్మికుడిగా నటించడం నా అదృష్టం. పోచంపల్లి చేనేత కార్మికుల గురించి చక్కగా చూపించాడు అను ప్రసాద్. ఈ చిత్రాన్ని చేనేత కార్మికులకు అంకితం ఇస్తున్నాం’’ అన్నారు సాయి కుమార్. విరాజ్ అశ్విన్, పూజితా పొన్నాడ జంటగా అను ప్రసాద్ దర్శకత్వం వహించిన చిత్రం ‘జోరుగా హుషారుగా’. నిరీష్ తిరువీధుల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి అతిథిగా హాజరైన దర్శకుడు మల్లిడి వశిష్ఠ మాట్లాడుతూ– ‘‘బెక్కం వేణుగోపాల్‌గారు కొత్త దర్శకులను, కొత్త కథలను, చిన్న సినిమాలను బాగా ప్రోత్సహిస్తారు. ‘జోరుగా హుషారుగా’ సక్సెస్ అవ్వాలి’’ అన్నారు. ‘‘ఈ మూవీలో తండ్రీ కొడుకుల మధ్య వచ్చే సీన్స్ ఆకట్టుకుంటాయి’’ అన్నారు నిర్మాత బెక్కం వేణుగోపాల్. ‘‘ఇదొక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్’’ అన్నారు విరాజ్ అశ్విన్. ‘‘ఇది నా మొదటి చిత్రం’’ అన్నారు అను ప్రసాద్. ‘‘సినిమా రిలీజ్‌కి బెక్కం వేణుగోపాల్‌గారు అందించిన సపోర్ట్ మర్చిపోలేను’’ అన్నారు నిరీష్ తిరువీధుల.

పాన్ ఇండియా కంటెంట్ ఉన్న చిత్రం శాంతల

\- కేఎస్ రామారావు



● ఇర్రంకి సురేష్, కేయస్ రామారావు, అశ్లేషా ఠాకూర్, నిహాల్ కోదాటి, శేషు పెద్దిరెడ్డి

నిహాల్ కోదాటి, అశ్లేషా ఠాకూర్ జంటగా నటించిన పాన్ ఇండియన్ చిత్రం ‘శాంతల’. క్రియేటివ్ కమర్షియల్ సూపర్ విజన్‌తో శేషు పెద్దిరెడ్డి ఈ సినిమాను తెరకెక్కించారు. ఇండో అమెరికన్ ఆర్ట్స్ పతాకంపై ఇర్రంకి సుబ్బలక్ష్మి సమర్పణలో డా. ఇర్రంకి సురేష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిహాల్ మాట్లాడుతూ– ‘‘ఈ కథతో రెండున్నరేళ్లు ప్రయాణం చేశారు మా దర్శకుడు శేషు. సంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్ మా సినిమాకు ప్రాణం పోశారు. నటీనటులందరూ అద్భుతంగా నటించారు. ఈ సినిమాను ప్రేక్షకులు విజయవంతం చేయాలి’’ అన్నారు. ‘‘జైలర్, జవాన్, యానిమల్ వంటి హెవీ డోస్ ఉన్న సినిమాలతో పాటు, ‘బలగం’, ‘బేబీ’ వంటి చిత్రాలనూ ప్రేక్షకులు ఆదరించారు. ఇలా ‘శాంతల’ సినిమాను కూడా ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాను. నేను ‘శాంతల’ చూశాను. సినిమా బాగా వచ్చింది. పాన్ ఇండియాకు సరిపడా కంటెంట్ ఉంది కాబట్టి ఆ స్థాయిలో రిలీజ్ చేస్తున్నాం’’ అన్నారు నిర్మాత కేఎస్ రామారావు. ‘‘సవాల్‌గా తీసుకుని ఈ సినిమాను పూర్తి చేశాం’’ అన్నారు అశ్లేషా ఠాకూర్. ‘‘మాకు సపోర్ట్‌గా నిలిచిన కేఎస్ రామారావుగారికి థ్యాంక్స్. ప్రేక్షకులకు నచ్చే విధంగా ఈ సినిమా ఉంటుంది’’ అన్నారు ఇర్రంకి సురేష్.

కరావళి ఊరి కథ

● ప్రజ్వల్ దేవరాజ్



కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించిన తాజా చిత్రం ‘కరావళి’. స్వీయ దర్శకత్వంలో గురుదత్త గనిగ నిర్మించిన ఈ మూవీ త్వరలోనే థియేటర్లోకి రానుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్, ప్రోమోలను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాత గురుదత్త గనిగ మాట్లాడుతూ–‘‘కరావళి అనేది కర్ణాటకలోని ఓ ప్రాంతం. కంబాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. కరావళిలోని కన్నడ భాష, సంస్కృతి, ఆచార సంప్రదాయాలు, మూలాల్లోంచి ఓ కథని తీసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రజ్వల్ దేవరాజ్ నటించిన 40వ సినిమా ఇది. ఈ సినిమా అన్ని ప్రాంతాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది’’ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సచిన్ బస్రూర్, కెమెరా: అభిమన్యు సదానందన్.

సాక్షి బిజినెస్
బుధవారం
13-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
378	91
69,551	20,906

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

● నాస్‌డాక్	14,463	△	31
● డోజోన్స్	36,554	△	158
● ఎఫ్‌టీఎస్ఈ 100	7,543	▽	2
● డాక్స్	16,792	▽	3
● షాంఘై	3,003	△	12
● నికాయ్	32,844	△	52

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,277	▽	175
బంగారం (99.5 స్వచ్ఛత)	61,032	▽	174
వెండి (కిలో)	71,575	△	173

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.97	83.99
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.45	106.00
€	యూరో	ఒకటి	88.72	91.07
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.67	57.96
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.06	55.99
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.38	63.37
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.22	21.98
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.79	23.58
¥	చైనా యువాన్	పదింటికి	10.45	12.56

రూ. లక్షకు యూపీఐ ఆటోమేటిక్ చెల్లింపుల పరిమితి



ముంబై: యూపీఐ ద్వారా ఆటోమేటిక్ చెల్లింపు లావాదేవీ పరిమితిని ఆర్‌బీఐ రూ. లక్షకు పెంచింది. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్స్ చందా తదితర కొన్ని విభాగాలకు ఆటోమేటిక్ లావాదేవీ పరిమితి రూ.15,000గా ఉంది. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి, బీమా ప్రీమియం, క్రెడిట్‌కార్డు బిల్లు చెల్లింపుల ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.15,000 నుంచి రూ.లక్షకు పెంచాలని నిర్ణయించినట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. యూపీఐ ప్రధాన చెల్లింపుల మాధ్యమంగా మారిన తరుణంలో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

యూనియన్ బ్యాంక్‌కు ఐబీఎస్ఐ అవార్డు



ముంబై: ప్రభుత్వ రంగ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2023కి గాను ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ సిస్టమ్ ఇంటెలిజెన్స్ (ఐబీఎస్ఐ) గ్లోబల్ ఫిన్‌టెక్ ఇన్నోవేషన్ అవార్డును దక్కించుకుంది. 'ఉత్తమ డిజిటల్ చానల్/ప్లాట్‌ఫాం' కేటగిరీలో దీన్ని అందుకుంది. ఈ అవార్డు కోసం 49 దేశాలకు చెందిన 106 బ్యాంకుల నుంచి 250 పైగా నామినేషన్లు వచ్చా యి. టెక్నాలజీతో కస్టమర్లకు మెరుగైన సేవలందించడంలో తమ సంస్థకు గల నిబద్ధతకు ఈ పురస్కారం నిదర్శనమని బ్యాంక్ సీఈవో అనిల్ కురిల్ తెలిపారు.

పరిశ్రమలు రయ్.. ధరలు షాక్!

- అక్టోబర్‌లో పారిశ్రామిక వృద్ధి 11.7 శాతం
- 16 నెలల గరిష్ట స్థాయి
- నవంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.55 శాతం
- మూడు నెలల గరిష్టానికి అప్



న్యూఢిల్లీ: భారత స్థూల ఆర్థిక గణాంకాల విషయంలో రెండు కీలక విభాగాలకు సంబంధించి మంగళవారం వెలువడిన గణాంకాలు మిశ్రమ ఫలితాలను అందించాయి. అక్టోబర్ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) 11.7 శాతం వృద్ధిని (2022 అక్టోబర్ గణాంకాలతో పోల్చి) నమోదుచేసుకుంది. గడచిన 16 నెలల్లో ఇంత అధిక స్థాయిలో (2022 జూన్‌లో 12.6 శాతం తర్వాత) పారిశ్రామిక ఉత్పత్తి సూచీ నమోదుకావడం ఇదే తొలిసారి. కాగా, గత ఏడాది ఇదే నెల్లో (2022 అక్టోబర్) ఐఐపీలో అసలు వృద్ధి లేకపోగా 4.1 శాతం క్షీణించడంతో తాజా సమీక్షానెల భారీ వృద్ధి గణాంకాలు కనబడ్డానికి 'బేస్ ఎఫెక్ట్' కారణమన్న విశ్లేషణలూ ఉన్నాయి. ఇక రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన నిర్ణయానికి ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (పీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం నవంబర్‌లో 5.55 శాతంగా నమోదయ్యింది. గడచిన మూడు నెలల్లో మొదటిసారి ఇంత అధిక స్థాయి రిటైల్ ద్రవ్యోల్బణం నమోదయ్యింది. నిజానికి ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశాల ప్రకారం రిటైల్ ద్రవ్యోల్బణం ప్లస్ 2 లేదా మైనస్ 2తో 4 శాతంగా ఉండాలి. దీని ప్రాతిపదికన ఎగువ దిశలో రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం వరకూ ఉండవచ్చు. అయితే ద్రవ్యోల్బణం పట్ల చాలా అప్రమత్తత అవసరమని, 4 శాతం కట్టడే తమ లక్ష్యమని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ పలు సందర్భాల్లో స్పష్టం చేస్తున్న సంగతి తెలిసిందే. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన ఐఐపీ కీలక విభాగాల గణాంకాల్లో పరిశీలిస్తే..

'బేస్ ఎఫెక్ట్'తో జూమ్!

- భారత్ మొత్తం స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) దాదాపు 28.3% వాటా కలిగిన పారిశ్రామిక రంగం ఉత్పత్తి 11.7% పెరిగితే, అందులో దాదాపు 70% వాటా కలిగిన తయారీ రంగం పురోగతి సమీక్షా నెల్లో 10.4%. గత ఏడాది ఇదే నెల్లో ఈ విభాగంలో అసలు వృద్ధి లేకపోగా 5.8 శాతం క్షీణత నమోదయ్యింది.

ఏప్రిల్–అక్టోబర్ మధ్య 6.9 శాతం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) ఏప్రిల్–అక్టోబర్ మధ్య ఐఐపీ వృద్ధి రేటు 6.9%గా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో వృద్ధి రేటు 5.3%.

ఆహార ధరల తీవ్రత



దిగువబాటలో కొనసాగుతున్న రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) నవంబర్‌లో 'యూ–టర్న్' (సెప్టెంబర్‌లో 5.02 శాతం, అక్టోబర్‌లో 4.87 శాతం) తీసుకుని, 5.55 శాతంగా నమోదయ్యింది. ఆహార ధరల పెరుగుదల దీనికి కారణం. ఉత్పత్తుల బాస్కెట్‌లో ఒక్క ఫుడ్ బాస్కెట్‌ను చూస్తే, 2022 నవంబర్‌లో ద్రవ్యోల్బణం 4.67 శాతం, 2023 అక్టోబర్‌లో 6.61 శాతం ఉంటే, తాజా సమీక్షా నెల నవంబర్‌లో ఇది 8.7 శాతానికి ఎగసింది. మొత్తం సీపీఐలో ఫుడ్ బాస్కెట్ వెయిటేజ్ 50 శాతం. ఇందులో రెండంకెల్లో ధరలు పెరిగిన జాబితాలో సుగంధ ద్రవ్యాలు (21.55 శాతం) పప్పు దినుసులు (20.23 శాతం) కూరగాయలు (17.70 శాతం), పండ్లు (10.95 శాతం), తృణ ధాన్యాలు (10.25 శాతం) ఉన్నాయి. ధరలు పెరిగిన మిగిలిన ఉత్పత్తుల్లో చక్కెర, తీపి ఉత్పత్తులు (6.55 శాతం) గుడ్లు (5.90 శాతం), పాలు, పాల ఉత్పత్తులు (5.75 శాతం), ప్రిపేర్డ్ మీల్స్ (4.22 శాతం), నాన్ ఆల్కాహాలిక్ బేవరేజెస్ (3.58 శాతం) ఉన్నాయి. ఆయిల్, ఫ్యాట్స్ ధరలు మాత్రం 15.03 శాతం తగ్గాయి. ఇక ఫుడ్ అండ్ బేవరేజెస్ ధరల పెరుగుదల 8.02 శాతంగా ఉంది.

రూ. 800 కోట్లతో బ్యాటరీ ఫాయిల్ ప్లాంటు

ఒడిశాలో ఏర్పాటుపై హిందాల్కో కసరత్తు


న్యూఢిల్లీ: అల్యూమినియం తయారీ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్ తాజాగా బ్యాటరీ ఫాయిల్ ఉత్పత్తి కోసం ఒడిశాలోని సంబల్‌పూర్‌లో ప్లాంటు ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ. 800 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. 2025 జూలై నాటికి ఈ ప్లాంటు అందుబాటులోకి వస్తుందని సంస్థ తెలిపింది. ఇందులో ప్రాథమికంగా 25,000 టన్నుల అల్యూమినియం ఫాయిల్‌ను తయారు చేయనున్నట్లు వివరించింది. లిథియం అయాన్, సోడియం అయాన్ బ్యాటరీల్లో అల్యూమినియం ఫాయిల్ కీలకంగా ఉంటుంది.



ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ వేగంగా విస్తరిస్తుండటంతో ఫాయిల్‌కు కూడా డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని హిందాల్కో ఎండీ సతీష్ పాయ్ తెలిపారు. 2030 నాటికి దేశీయంగా బ్యాటరీ గ్రేడ్ అల్యూమినియం ఫాయిల్‌కు డిమాండ్ అనేక రెట్లు పెరిగి 40,000 టన్నులకు చేరవచ్చనే అంచనాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర మౌదాలోని బ్యాటరీ ఫాయిల్స్ తయారీ ప్లాంటుకు సంబల్‌పూర్ అనుబంధంగా పని చేస్తుందని పాయ్ చెప్పారు.

'డిస్నీ–స్టార్'పై రిలయన్స్ కన్ను!

- వచ్చే వారం ఒప్పందం కుదుర్చుకునే అవకాశం
- నగదు, స్టాక్ రూపంలో డీల్



న్యూఢిల్లీ: భారత్‌లో డిస్నీ–స్టార్ వ్యాపారాన్ని దక్కించుకోవడంపై రిలయన్స్ ఇండస్ట్రీస్ మరింతగా దృష్టి పెట్టింది. 51% మెజారిటీ వాటా కొనుగోలుకు సంబంధించి వచ్చే వారం ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. నగదు, స్టాక్ రూపంలో ఈ డీల్ ఉండొచ్చని పేర్కొన్నాయి. ప్రస్తుతం ఇంకా చర్చలు జరుగుతున్నాయని, తుది నిర్ణయమేదీ తీసుకోలేదని వివరించాయి. ఒప్పందం కుదుర్చుకున్నాక ఇరు సంస్థలు వ్యాపార మదింపు ప్రక్రియ చేపడతాయని తెలిపాయి. ఒప్పందం సాకారమైతే మీడియా రంగంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ మరింతగా విస్తరించేందుకు దోహదపడనుంది. పలు సవాళ్ల నేపథ్యంలో భారత విభాగాన్ని విక్రయించే యోచనలో ఉన్నట్లు వాల్ట్ డిస్నీ సీఈవో బాబ్ ఐగర్ ఇటీవల సంకేతాలిచ్చిన నేపథ్యంలో తాజా డీల్ వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

కన్సాలిడేషన్ దిశగా ..

ఇప్పటికే జీ ఎంటర్‌టైన్‌మెంట్, కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ (గతంలో సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా) విలీన ప్రక్రియ జరుగుతుండగా కొత్తగా రిలయన్స్, డిస్నీ–స్టార్ డీల్ కూడా కుదిరితే దేశీయంగా మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాల్లో కన్సాలిడేషన్ జరిగే అవకాశం ఉందని ఎలారా క్యాపిటల్ ఎస్‌వీపీ కరణ్ తౌరానీ తెలిపారు. రెండు మీడియా దిగ్గజాలకు (సోనీ/రిలయన్స్) టీవీ/ఓటీటీ మార్కెట్లో సింహభాగం వాటా ఉంటుందని పేర్కొన్నారు. డిస్నీ–స్టార్ భారత వ్యాపార విభాగంలో స్టార్ ఇండియా తదితర టీవీ చానళ్లు, డిస్నీప్లస్ హాట్‌స్టార్ ఓటీటీ ప్లాట్‌ఫాం ఉన్నాయి. డీల్ అనంతరం డిస్నీ–స్టార్‌కు దేశీ వ్యాపారంలో మైనారిటీ వాటాలు ఉంటాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఒప్పందం అమలైతే విలీన సంస్థ దేశంలోనే అతి పెద్ద మీడియా సంస్థల్లో ఒకటిగా ఆవిర్భవించనుంది. రిలయన్స్ అనుబంధ సంస్థ వయాకామ్ 18కి చెందిన 38 చానళ్లు, స్టార్ ఇండియాకి ఎనిమిది భాషల్లో ఉన్న చానళ్లతో కలిపి మొత్తం 70 టీవీ చానళ్లు ఉంటాయి. వాటితో పాటు 2 స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు–డిస్నీప్లస్‌హాట్‌స్టార్, జియోసినిమా కూడా ఉంటాయి. 2019లో స్టార్‌ను ట్వెంటీఫస్ట్ సెంచరీ ఫాక్స్ నుంచి డిస్నీ కొనుగోలు చేసింది.

గణాంకాల ముందు అప్రమత్తత

- రికార్డుల ర్యాలీకి బ్రేక్
- సెన్సెక్స్ నష్టం 378 పాయింట్లు
- నిఫ్టీ 91 పాయింట్లు డౌన్



ముంబై: భారత్, అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాల వెల్లడికి ముందు స్టాక్ మార్కెట్లో అప్రమత్తత చోటు చేసుకోవడంతో సూచీల రికార్డు ర్యాలీకి మంగళవారం బ్రేక్ పడింది. మెటల్, ఐటీ, మీడియా మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్ 378 పాయింట్లు నష్టపోయి 69,551 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 91 పాయింట్లు క్షీణించి 20,906 వద్ద నిలిచింది. ప్రారంభంలోనే సెన్సెక్స్ 106 పాయింట్లు పెరిగి 70,034 వద్ద, నిఫ్టీ 41 పాయింట్లు బలపడి 21,038 వద్ద కొత్త రికార్డు స్థాయిలను నమోదు చేశాయి. కీలక స్థూల ఆర్థిక గణాంకాల వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు రికార్డు స్థాయిల వద్ద ఆయిల్ అండ్ గ్యాస్, రియల్టీ, ఇంధన, యుటిలిటీ, వినిమయ, క్యాపిటల్ గూడ్స్, మౌలిక రంగాల షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను ప్రభావితం చేసే అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు అంచనాలకు తగ్గట్లే వెల్లడి కావొచ్చనే ఆశలతో ప్రపంచ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- రిలయన్స్ 1.50%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1%, ఇన్ఫోసిస్ 1% నష్టపోయి సూచీలను రికార్డు గరిష్టాల నుంచి వెనక్కి లాగాయి.
- క్యూఐపీ ద్వారా రూ.750 కోట్ల నిధుల సమీకరణకు బోర్డు ఆమోదం తెలపడంతో జమ్మూఅండ్‌కాశ్మీర్ షేరు 7% లాభపడి రూ.134 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 12% ర్యాలీ చేసి రూ.140 వద్ద ఏడాది గరిష్టాన్ని అందుకుంది.
- మినిరత్న కంపెనీ ఐఆర్ఈడీఏ షేరు 20% లాభపడి రూ.102 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

13-12-2023	
విశాఖ	583–00
చిత్తూరు	585–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	576–00
విజయవాడ	576–00
రిటైల్ ధర (డజను)	72.00
12-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	555–00
వరంగల్	557–00
రిటైల్ ధర	6.15

జాబ్ పాయింట్

ఐడీబీఐ బ్యాంక్‌లో 86 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టులు

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ).. స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 86
» **పోస్టుల వివరాలు:** మేనేజర్ గ్రేడ్ బి–46, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఏజీఎం) గ్రేడ్‌సి–39, డిప్యూటీ జనరల్ మేనేజర్(డీజీఎం)గ్రేడ్ డి–01
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, ఎంబీఏ, సీఎఫ్ఏ, ఎఫ్ఆర్ఎం, ఐసీడబ్ల్యూఏ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.11.2023 నాటికి మేనేజర్ పోస్టులకు 25 నుంచి 35 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు 28 నుంచి 40 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టులకు 35 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.76,010 నుంచి రూ.89,890, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు రూ.63,840 నుంచి రూ.78,230, మేనేజర్‌కు రూ.48,170 నుంచి రూ.69,810.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, పని అనుభవం, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.12.2023
» **వెబ్‌సైట్:** www.idbibank.in

బ్యాంక్ ఆఫ్ బరోడా, ముంబైలో 250 సీనియర్ మేనేజర్ పోస్టులు

ముంబైలోని బ్యాంక్ ఆఫ్ బరోడా.. ఎంఎస్ఎంఈ విభాగంలో రెగ్యులర్ ప్రాతిపదికన సీనియర్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 250
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ లేదా పీజీ/ఎంబీఏ(మార్కెటింగ్ అండ్ ఫైనాన్స్)ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.12.2023 నాటికి 28 నుంచి 37 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు రూ.63,840 నుంచి రూ.78,230.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, సైకోమెట్రిక్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ, వైద్య పరీక్ష, ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.12.2023
» **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

ట్రిపుల్ ఐటీ శ్రీ సిటీ చిత్తూరులో 18 ఫ్యాకల్టీ పోస్టులు

చిత్తూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శ్రీ సిటీ(ఐఐఐటీఎస్).. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 18
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ప్రొఫెసర్–08, అసోసియేట్ ప్రొఫెసర్–06, ప్రొఫెసర్–04.
» **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మ్యాథమేటిక్స్, ఇంగ్లిష్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ, ఎంఫిల్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, పని అనుభవం, సెమినార్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.01.2024.
» **వెబ్‌సైట్:** iiits.ac.in

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 363 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. ఏడాది అప్రెంటిస్‌షిప్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 363
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్–250, డిప్లొమా/టెక్నీషియన్ అప్రెంటిస్–113.
» **విభాగాలు:** ఈసీఈ, సీఎస్ఈ, మెకానికల్, ఈఈఈ, సివిల్, ఈఐఈ.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 31.12.2023 నాటికి 25 ఏళ్లు మించకూడదు.
» **స్టైపెండ్:** నెలకు జీఈఏలకు రూ.9000, టీఏ అభ్యర్థులకు రూ.8000.
» **శిక్షణ కాలం:** ఒక సంవత్సరం.
» **ఎంపిక విధానం:** డిప్లొమా, బీఈ, బీటెక్ పరీక్షల్లో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **డాక్యుమెంట్ వెరిఫికేషన్ స్థలం:** ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, కార్పొరేట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, నలంద కాంప్లెక్స్, టీఐఎఫ్ఆర్ రోడ్, ఈసీఐఎల్, హైదరాబాద్.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.12.2023
» **ధ్రువపత్రాల పరిశీలన తేదీలు:** 21.12.2023, 22.12.2023.
» **వెబ్‌సైట్:** www.ecil.co.in

స్టెమ్.. కెరీర్ షైనింగ్!

» స్టెమ్ కోర్సులతో విస్తృత విద్య, ఉద్యోగావకాశాలు
» విదేశాల్లో మన స్టెమ్ నిపుణులకు డిమాండ్
» స్టెమ్ ప్రోగ్రామ్స్‌లో చేరేందుకు విద్యార్థుల ఆసక్తి

సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్.. సంక్షిప్తంగా స్టెమ్! వీటిల్లో ఎందులో నైపుణ్యం సాధించినా.. కెరీర్‌కు ఢోకా ఉండదు. ప్రోగ్రామింగ్ నుంచి పరిశోధనల వరకూ.. నచ్చిన కెరీర్‌ను ఎంచుకోవచ్చు. అమెరికా మొదలు ఆస్ట్రేలియా దాకా.. ఎక్కడైనా అవకాశాలు అందుకోవచ్చు. అందుకే మన విద్యార్థులు దేశవిదేశాల్లో స్టెమ్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో.. స్టెమ్ ప్రోగ్రామ్స్‌తో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై ప్రత్యేక కథనం..



కెరీర్ గైడెన్స్

స్టెమ్.. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్‌లను సమ్మిళితం చేస్తూ.. అమెరికాలో వీటిని ప్రత్యేక ప్రోగ్రామ్స్‌గా పరిగణిస్తున్నారు. మన దేశంలోనూ ఈ కోర్సులకు ప్రాధాన్యం పెరుగుతోంది. కారణం.. ఆవిష్కరణలకు ఊతమిచ్చే సైన్స్ మొదలు నేటి డిజిటల్ యుగంలో ఏఐ వరకూ.. స్టెమ్ స్కిల్స్ కీలకంగా మారుతుండడమే! ఆయా విభాగాల్లో ఆసక్తి ఉన్న వారు అకడమిక్ స్థాయి నుంచే వీటిపై పట్టు సాధిస్తే.. ఉజ్వల అవకాశాలు సొంతం చేసుకోవచ్చు.

స్టెమ్ ప్రోగ్రామ్స్

సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్.. ఈ నాలుగు విభాగాలను కలిపి సంక్షిప్తంగా స్టెమ్ ప్రోగ్రామ్స్‌గా పిలుస్తున్నారు. కారణం..ఈ నాలుగు విభాగాలు ఒకదానికొకటి అనుసంధానంగా ఉండటమే. ఉదాహరణకు లేటెస్ట్ టెక్నాలజీస్‌ను ఆవిష్కరించే క్రమంలో సైంటిస్ట్‌లు.. సైన్స్, మ్యాథమెటిక్స్ సూత్రాలను అన్వయించాల్సి ఉంటుంది.ఇదే విధంగా ఇంజనీరింగ్‌కు మూలం సైన్స్, మ్యాథ్స్ సిద్ధాంతాలే. దీంతో.. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనల్లో స్టెమ్ ప్రోగ్రామ్స్‌కు ప్రాధాన్యం ఏర్పడింది.

నిపుణుల కొరత

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్టెమ్ విభాగాల్లో నిపుణుల కొరత ఉన్నట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. యూఎస్, యూకే, కెనడా, జర్మనీ, చైనా, భారత్.. ఇలా అన్ని దేశాల్లోనూ స్టెమ్ నిపుణులకు డిమాండ్ నెలకొంది. నేటి ఏఐ, రోబోటిక్స్ టెక్నాలజీ యుగంలో పరిశోధనలు, ఆవిష్కరణలకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. ఫలితంగా స్టెమ్ నిపుణుల సేవల అవసరం పెరుగుతోంది. జర్మనీలో స్టెమ్ విభాగంలో దాదాపు 2.5 లక్షల మంది నిపుణుల అవసరం ఉన్నట్లు అంచనా. అమెరికాలో దాదాపు 10 లక్షల మంది నిపుణులకు డిమాండ్ నెలకొంది. అదే విధంగా..యూకేలోనూ ఈ ఏడాది చివరి నాటికి 6.5 లక్షల మంది స్టెమ్ నిపుణుల అవసరం ఉంటుందని అంచనా.

సైన్స్, మ్యాథమెటిక్స్

ప్రస్తుతం ఎక్కువ మంది టెక్నాలజీ, ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరుతున్నారు. కారణం.. ఈ విభాగాల్లో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు లభిస్తుండటమే! ఫలితంగా ప్యూర్ సైన్సెస్, మ్యాథమెటిక్స్‌లో అడుగుపెట్టే వారి సంఖ్య తక్కువగా ఉంటోంది. దీంతో సైన్స్, మ్యాథమెటిక్స్‌లలో నిపుణుల కొరత సమస్యగా మారింది. అంతేకాకుండా ఇంజనీరింగ్, టెక్నాలజీ కోర్సులు పూర్తి చేసుకున్నప్పటికీ.. పరిశ్రమ అవసరాలకు తగ్గ స్కిల్స్ ఉన్న వారి సంఖ్య ఆశించిన స్థాయిలో లేదు. ముఖ్యంగా ఆధునిక టెక్నాలజీలుగా పేర్కొంటున్న ఏఐ, బిగ్ డేటా, ఐఓటీ వంటి విభాగాల్లో నిపుణుల కొరత దాదాపు 40 శాతం మేరకు ఉంది.

పెరుగుతున్న ఆసక్తి

స్టెమ్ ప్రోగ్రామ్స్‌పై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. మన దేశంలో గత కొన్నేళ్లుగా స్టెమ్ ప్రోగ్రామ్స్‌లో చేరే వారి సంఖ్య గణనీయంగా ఉంది. సైన్స్, టెక్నాలజీ విభాగాల్లో ఉపాధి అవకాశాలతో పాటు రీసెర్చ్ అభ్యర్థులకు ప్రభుత్వాలు పలు ప్రోత్సాహకాలు అందించడమే ఇందుకు కారణం. అంతర్జాతీయంగా కూడా అమెరికా, రష్యా, యూకే, కెనడా వంటి దేశాలు స్టెమ్ ప్రోగ్రామ్స్‌లో పరిశోధనలకు పెద్దపీట వేస్తున్నాయి. దీంతో అక్కడ కూడా ఉపాధి అవకాశాలు అందుకునేందుకు వీలవుతుంది.

స్కూల్ స్థాయి నుంచే ప్రోత్సాహం

సైన్స్, మ్యాథమెటిక్స్‌లో పరిశోధనలు, ఆవిష్కరణలు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు పలు చర్యలు చేపడుతున్నాయి. అందుకోసం హైస్కూల్ స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు సైన్స్, మ్యాథమెటిక్స్ విద్యార్థులకు పలు ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్నాయి. యూనివర్సిటీ స్థాయిలో పీహెచ్‌డీ విద్యార్థులకు ఇచ్చే ఫెలోషిప్‌లను సైతం ఇటీవల ప్రభుత్వం పెంచింది. స్టెమ్ ప్రోగ్రామ్స్ ద్వారా నైపుణ్యాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ పేరుతో ప్రత్యేక ఇన్‌స్టిట్యూట్స్‌ను నెలకొల్పింది. సెంట్రల్ యూనివర్సిటీలు, ఐఐటీల్లో సైన్స్, మ్యాథమెటిక్స్ మేజర్స్‌గా ప్రత్యేక కోర్సులను సైతం ప్రవేశపెట్టారు.

బిజినెస్ స్కూల్స్.. స్టెమ్ బాట

మేనేజ్‌మెంట్ విద్యను అందించే ఇన్‌స్టిట్యూట్స్ సైతం ఎంబీఏ, పీజీడీఎం స్థాయిలో స్టెమ్ ప్రోగ్రామ్స్‌ను ప్రారంభిస్తున్నాయి. ప్రధానంగా డేటా సైన్స్, డేటా అనలిటిక్స్ కోర్సులను బోధిస్తున్నాయి. వీటితోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ),మెషీన్ లెర్నింగ్‌లకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాయి. కార్పొరేట్ ప్రపంచంలో డేటా అనలిటిక్స్‌కు ప్రాధాన్యం పెరగడం, అనలిటిక్స్‌లో నైపుణ్యానికి టెక్ స్కిల్స్ పునాదిగా నిలవడం ఇందుకు కారణంగా చెప్పొచ్చు. ఎంబీఏ విద్యార్థులకు డేటా సైన్స్, డేటా అనలిటిక్స్, డేటా మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తే.. అటు మేనేజ్‌మెంట్‌తోపాటు ఇటు టెక్ స్కిల్స్ కూడా సొంతమై కార్పొరేట్ వర్గాల నుంచి మరింత ఆదరణ లభిస్తుందని భావిస్తున్నారు.

స్టెమ్‌తో నైపుణ్యాలు

స్టెమ్ ప్రోగ్రామ్స్ పూర్తి చేసుకుంటే లభించే సబ్జెక్ట్, టెక్నికల్ నైపుణ్యాలతోపాటు పలు ఇతర స్కిల్స్ లభిస్తాయని చెప్పొచ్చు. ఇందులో ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, అనలిటికల్ స్కిల్స్, రీసెర్చ్ ఓరియెంటేషన్ స్కిల్స్ ముఖ్యమైనవి. ఫలితంగా ఆయా విభాగాల్లో భవిష్యత్తులో విధుల నిర్వహణపరంగా మెరుగైన పనితీరు కనబరుస్తారని కంపెనీల భావన.

ఆకర్షణీయ వేతనాలు

స్టెమ్ ప్రోగ్రామ్స్ ఉత్తీర్ణులకు కంపెనీలు ఆకర్షణీయమైన వేతనాలు అందిస్తున్నాయి. గ్రాడ్యుయేషన్ స్థాయి కోర్సులు పూర్తిచేసుకున్న వారికి స్కిల్స్ ఉంటే ప్రారంభంలోనే సగటున నెలకు రూ.30 వేల వేతనం లభిస్తోంది. పీజీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు వారి స్పెషలైజేషన్‌కు అనుగుణంగా నెలకు గరిష్టంగా రూ.50 వేల వేతనం అందుతోంది. పీహెచ్‌డీ అభ్యర్థులకు రూ.లక్ష వరకు వేతనం ఇవ్వడానికి సైతం సంస్థలు సిద్ధంగా ఉంటున్నాయి.

అవకాశాలు

స్టెమ్ ప్రోగ్రామ్స్ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలకు కొదవలేదని చెప్పొచ్చు. ముఖ్యంగా ఆర్ అండ్ డీ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఇవే కాకుండా.. మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థలు, బయో మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్, హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్స్, ఐటీ సంస్థల్లోనూ కొలువులు దక్కించుకోవచ్చు. ఇంజనీరింగ్, టెక్నాలజీకి సంబంధించి సాఫ్ట్‌వేర్ సంస్థలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఐఓటీ తదితర విభాగాల్లోనూ ఉజ్వల కెరీర్ అవకాశాలు లభిస్తున్నాయి.

అకడమిక్ మార్గాలెన్నో!

స్టెమ్ కోర్సుల పరంగా.. మ్యాథమెటిక్స్, సైన్స్‌లో బీఎస్సీ, ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌లు; ఇంజనీరింగ్, టెక్నాలజీలో బీటెక్ ప్రోగ్రామ్స్ ముందు వరుసలో ఉన్నాయని చెప్పొచ్చు. సీయూఈటీ–యూజీ, పీజీ ఎంట్రన్స్‌లలో ఉత్తీర్ణత ఆధారంగా.. మ్యాథమెటిక్స్, సైన్స్‌కు సంబంధించి సెంట్రల్ యూనివర్సిటీల్లో అడుగుపెట్టొచ్చు. జేఈఈ, గేట్ ఉత్తీర్ణత ఆధారంగా ఐఐటీలు, ఎన్ఐటీలు వంటి ప్రతిష్టాత్మక టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌తోపాటు మరెన్నో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో బీటెక్, ఎంటెక్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశించొచ్చు.

స్టెమ్ ప్రోగ్రామ్స్.. ముఖ్య సమాచారం

- సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్‌ల సమాహారమే స్టెమ్ ప్రోగ్రామ్స్.
- దేశ, విదేశాల్లో స్టెమ్ నిపుణులకు పెరుగుతున్న డిమాండ్.
- అర్హతలను అనుసరించి రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు వేతనం.
- దేశంలో.. స్టెమ్ ప్రోగ్రామ్స్‌కు కేరాఫ్‌గా ఐఐటీలు, ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లు.
- సీయూఈటీ–యూజీ, పీజీ; జేఈఈ, గేట్ స్కోర్ల ఆధారంగా స్టెమ్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం పొందే అవకాశం.

అది కేవలం క్యాంపు కార్యాలయమే

హైకోర్టులో ప్రభుత్వం అనుబంధ పిటిషన్

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర అభివృద్ధి పర్యవేక్షణ, సమీక్షలు, పాలనా సౌలభ్యం కోసమే విశాఖలో క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేస్తున్నామే తప్ప కార్యాలయాలను తరలించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం హైకోర్టుకు నివేదించింది. క్యాంపు కార్యాలయం ఏర్పాటునకు, కార్యాలయాల తరలింపునకు తేడా ఉందని పేర్కొంది. ఇప్పటివరకు అసలు కార్యాలయాల స్థలాలకు కేటాయింపులే మొదలు పెట్టలేదని తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి పోలా భాస్కర్ ఒక అనుబంధ పిటిషన్‌ను కోర్టు ముందుంచారు. విశాఖపట్నంలో ప్రభుత్వ క్యాంప్ కార్యాలయాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తిస్తూ ఉన్నతాధికారుల కమిటీ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా ప్రభుత్వం జారీ చేసిన జీవో 2283ని సవాల్ చేస్తూ అమరావతి రైతులు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను త్రిసభ్య ధర్మాసనం మాత్రమే విచారించాల్సి ఉంటుందని హైకోర్టుకు నివేదించారు. 2020లో పలు వ్యాజ్యాలపై విచారణ జరిపిన త్రిసభ్య ధర్మాసనం కార్యాలయాల తరలింపుపై విచారణను వాయిదా వేసిందని గుర్తు చేశారు. ఆ సమయంలోనే కార్యాలయాల తరలింపుపై చర్యలు చేపడితే తమను ఆశ్రయించాలని పిటిషనర్లకు త్రిసభ్య ధర్మాసనం స్వేచ్ఛనిచ్చిందని సింగిల్ జడ్జి దృష్టికి తెచ్చారు. తాజా వ్యాజ్యం కూడా త్రిసభ్య ధర్మాసనం ముందుకే వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. ఈ అనుబంధ పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు వి.మహేశ్వర్‌రెడ్డి, చింతల సుమన్‌లు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కోర్టు తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

- హైకోర్టును ఆశ్రయించిన ఐపీఎస్ అధికారి కృపానంద్ ఉజేలా

సాక్షి, అమరావతి: మంగళగిరి టౌన్ పోలీసులు గత ఏడాది జూలైలో నమోదు చేసిన ఓ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ అదనపు డైరెక్టర్ జనరల్ (రోడ్ సేఫ్టీ) కృపానంద్ త్రిపాఠి ఉజేలా హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం విచారించిన హైకోర్టు.. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని పోలీసులను ఆదేశించింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

అంగన్‌వాడీలపై సానుకూలం

ప్రభుత్వం దృష్టికి వచ్చిన పలు సమస్యలను పరిష్కరిస్తూ నిర్ణయాలు

- యూనియన్లతో చర్చల అనంతరం పలు అంశాలకు ఆమోదం
- సమ్మెతో అణగారిన వర్గాలకు పౌష్టికాహారం నిలిచిపోయే ప్రమాదం
- వెంటనే విరమించాలని విజ్ఞప్తి.. లేదంటే విధులకు గైర్హాజరైనట్లు పరిగణన

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సమస్యలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తన దృష్టికి వచ్చిన వాటిని సంబంధిత శాఖ ద్వారా పరిశీలించి పలు అంశాల పట్ల సానుకూల నిర్ణయం తీసుకుంది. సంబంధిత యూనియన్లతో విస్తృతంగా చర్చించిన అనంతరం మేలు చేసేలా ప్రభుత్వం కొన్ని నిర్ణయాలను తీసుకున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి జి.జయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్చల ద్వారా పలు అంశాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. అంగన్‌వాడీల సమ్మె కారణంగా అత్యంత అణగారిన వర్గాలకు చెందిన బాలింతలు, పసిపిల్లలు, చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం నిలిచిపోయే ప్రమాదం ఉన్నందున వెంటనే ఆందోళన విరమించుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. లేని పక్షంలో విధులకు గైర్హాజరైనట్లుగా భావించి సంబంధించిన జీవోల ప్రకారం కలెక్టర్లు చర్యలు తీసుకుంటారని పేర్కొంది.

ఆమోదం తెలిపిన అంశాలివీ..

- అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల గరిష్ట వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచాలని నిర్ణయం.
- అంగన్‌వాడీ కార్యకర్తలకు తమ సర్వీసు చివరి నాటికి బెనిఫిట్ ఇప్పుడున్న రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచేందుకు నిర్ణయం.
- హెల్పర్లకు సర్వీసు చివరి నాటికి బెనిఫిట్ రూ.20 వేల నుంచి రూ.40 వేలకు పెంచుతూ నిర్ణయం.
- సహాయకులకు అంగన్‌వాడీ కార్యకర్తలుగా అవకాశం కల్పించేందుకు గరిష్ట వయో పరిమితి 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచేందుకు అంగీకారం.
- టీఏ, డీఏలు రాష్ట్ర ప్రభుత్వం నిధుల నుంచి విడుదల చేయడానికి ఆమోదం.
- రాష్ట్రంలో అవకాశం ఉన్న మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చేందుకు నిర్ణయం.

మేలు చేసిన సీఎం జగన్

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు మేలు చేస్తూ పలు చర్యలు తీసుకుంది. అందులో కొన్ని ఇవీ.. గత అసెంబ్లీ ఎన్నికలకు ఆర్నెళ్ల ముందు వరకూ టీడీపీ హయాంలో అంగన్‌వాడీల జీతం నెలకు రూ.7 వేలు మాత్రమే. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే అంగన్‌వాడీల జీతాలను పెంచుతూ జీఓ 18 జారీ చేసింది. అంగన్‌వాడీల జీతాలను రూ.11,500కి పెంచుతూ 2019 జూన్ 26న జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేసింది. గత నాలుగేళ్లుగా పెంచిన వేతనం అమలవుతోంది.
- అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు మినీ అంగన్‌వాడీ వర్కర్లకు కూడా గత ఎన్నికలకు 6 నెలల ముందు వరకూ రూ.4,500 మాత్రమే ఉన్న జీతాన్ని సీఎం జగన్ రూ.7 వేలకు పెంచారు.
- సహాయకులకు గత ఎన్నికలకు ముందు వరకు రూ.4,500 మాత్రమే ఉన్న జీతాన్ని సీఎం జగన్ రూ.7 వేలకు పెంచారు. వీటిని జీవో 18 ద్వారా ప్రభుత్వం వెంటనే అమల్లోకి తెచ్చింది.
- టీడీపీ హయాంలో 2019 వరకూ అంగన్‌వాడీ కార్యకర్తలకు సగటున రూ.6,950, అంగన్‌వాడీ సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు సగటున రూ.3,900 మాత్రమే చెల్లించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అందరి జీతాలు పెంచి అందించింది.
- మంచి పనితీరు కనబర్చిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు ప్రోత్సాహకంగా నెలకు రూ.500 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. ఏడాదికి సుమారు రూ.27.8 కోట్లు ప్రోత్సాహకాలుగా ప్రభుత్వం చెల్లిస్తోంది.
- 2013 నుంచి అంగన్‌వాడీలకు పదోన్నతులు (ప్రమోషన్లు) ఇవ్వలేదు. గత సర్కారు దీన్ని పట్టించుకోలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే ప్రమోషన్లు ఇచ్చింది. 560 గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేసింది.
- సూపర్‌వైజర్ పోస్టుల పరీక్షలు రాసే వారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. తొమ్మిదేళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్న వారికి వయో పరిమితి పెంపు ఎంతో ఉపయోగపడింది.
- ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి రూ.1,313 కోట్లు అందించింది. జగనన్న విద్యాదీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, ఆరోగ్యశ్రీ తదితర పథకాలను వారికీ వర్తింపజేసింది. రూ.85.47 కోట్లతో 56,984 స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేసి వారికి అందించింది. డేటా ఛార్జీలను ప్రభుత్వమే భరిస్తూ అదనంగా డేటా కూడా ఇస్తోంది. 2023 జూలై 1 నుంచి ఇది అమలవుతోంది. డేటా కోసం ఏడాదికి రూ.12 కోట్లు చెల్లిస్తోంది.
- ఈ ఏడాది నుంచి వర్కర్లు, హెల్పర్లకు జీవిత బీమాను వర్తింపచేస్తూ ప్రమాద బీమాగా రూ.2 లక్షల వరకూ చెల్లిస్తోంది.
- అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు రూ.16 కోట్ల విలువైన యూనిఫాం శారీలు అందించింది.
- నాడు-నేడు ద్వారా అంగన్‌వాడీల్లో సౌకర్యాలను మెరుగుపరుస్తోంది.
- గర్భిణులు, బాలింతలు, పిల్లలకు హోం రేషన్ పద్ధతిని అమలు చేస్తోంది. 2023 నుంచి డ్రై రేషన్ అందిస్తోంది.

రూ.659 కోట్లు కరువు సాయం అందించండి

- కేంద్ర బృందానికి రాష్ట్రం తరఫున ఖరీఫ్ పంటనష్టం నివేదిక
- 'అనంత' నుంచి మొదలైన కేంద్ర కరువు బృందం పర్యటన


కరువు పరిస్థితుల గురించి కేంద్ర బృందం లీడర్ పంకజ్ యాదవ్‌కు వివరిస్తున్న అనంతపురం కలెక్టర్ ఎం. గౌతమి

అనంతపురం అగ్రికల్చర్: వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ పంటలు దెబ్బతినడంతో కరువు నివారణ చర్యల కోసం కేంద్రం నుంచి రూ. 659 కోట్లు సాయం అందేలా చూడాలని రాష్ట్ర ప్రకృతి విపత్తుల విభాగం (ఏపీఎస్‌డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాల యంత్రాంగం పంటనష్టం అంచనాలు, కరువు సహాయక చర్యల కోసం కేంద్రానికి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ (డీఏఎఫ్‌డబ్ల్యూ) జాయింట్ సెక్రటరీ పంకజ్ యాదవ్ నేతృత్వంలో పది మంది బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు రాష్ట్రానికి వచ్చింది. మంగళవారం కేంద్ర బృందంతో అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లో సమావేశమైన ఏపీఎస్‌డీఎంఏ ఎండీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కరువు పరిస్థితులను వివరించారు. అలాగే అనంతపురం కలెక్టర్ ఎం.గౌతమి జిల్లా కరువు పరిస్థితుల గురించి తెలియజేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు జిల్లాల పరిధిలో ప్రకటించిన 103 కరువు మండలాల్లో పంట నష్టం గురించి కేంద్ర బృందం స్వయంగా తెలుసుకుంటుందని చెప్పారు. అనంతపురం జిల్లా నుంచి మొదలు పెట్టి 13, 14 తేదీల్లో మిగతా ఆరు జిల్లాల్లోనూ పర్యటిస్తుందని తెలిపారు. 15వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో కేంద్ర బృందం సమావేశమవుతుందని, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనల గురించి చర్చిస్తుందని తెలిపారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తారన్నారు. రాష్ట్రం తరఫున పంటనష్టం, కరువు సహాయక చర్యల కోసం రూ. 659 కోట్లు కోరుతూ నివేదిక అందించామన్నారు. రాష్ట్రంలోని కరువు మండలాల పరిధిలో 7.14 లక్షల మంది రైతులకు సంబంధించి 5.99 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతినగా.. రూ. 534.83 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించామన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో మిరప, ఉల్లి పంటల నష్టం రూ.129.15 కోట్లు ఉందని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కేంద్ర బృందం అనంతపురం రూరల్, ఆత్మకూరు, కళ్యాణదుర్గం, గుమ్మఘట్ట, గుత్తి, పామిడి మండలాల్లో పంట పొలాలు పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాను ఆదుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు కేంద్ర బృందానికి విన్నవించారు.

తుపాను ప్రభావిత ప్రాంతాలకు కేంద్ర బృందం రాక

సాక్షి, అమరావతి: మిచాంగ్ తుపాను ప్రభావిత జిల్లాల్లో బుధవారం కేంద్ర బృందం పర్యటించనుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర రత్నూ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం రెండు రోజులపాటు పర్యటించనున్నట్టు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. తుపాను వల్ల జరిగిన నష్టాలను అంచనా వేయడానికి ఈ బృందం బుధవారం కృష్ణా, బాపట్ల జిల్లాల్లోను, గురువారం పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోను పర్యటిస్తుందన్నారు.

ఇంధన భద్రత అందరి బాధ్యత

రేపటి నుంచి రాష్ట్రంలో జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలు



సాక్షి, అమరావతి: భవిష్యత్ తరాలకు విద్యుత్ వెలుగులను అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇంధన పరిరక్షణకు శ్రీకారం చుట్టింది. శిలాజ ఇంధనాలు తరిగిపోతున్న తరుణంలో పునరుత్పాదక విద్యుత్‌కు పెద్దపీట వేస్తోంది. ఇంధన సంరక్షణ, ఇంధన సామర్థ్య కార్యక్రమాలను రాష్ట్ర అభివృద్ధిలో ఒక ముఖ్య అంశంగా పరిగణిస్తోంది. ఇంధన డిమాండ్‌ను తగ్గించడం ద్వారా బొగ్గు, చమురు, గ్యాస్ దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించి, విద్యుత్ రంగం సుస్థిరతను సాధించవచ్చని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇంధన భద్రత అందరి బాధ్యత అని గుర్తుచేస్తూ గురువారం (ఈ నెల 14వ తేదీ) జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆ రోజు నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలో వారోత్సవాలు నిర్వహించనుంది. ఆంధ్రప్రదేశ్ ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) ఆధ్వర్యంలో మెగా ఈవెంట్‌గా జరగనున్న ఈ వారోత్సవాల్లో విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు), కలెక్టర్లకు భాగస్వామ్యం కల్పించనున్నారు. కళాశాల విద్యార్థులకు, రైతులకు విద్యుత్ ఆదాపై అవగాహన వర్క్‌షాప్‌లు, విద్యుత్ సర్కిల్ కార్యాలయాల పరిధిలో అవగాహన ర్యాలీలు, ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డుల పోటీ, షార్ట్ వీడియో పోటీ నిర్వహించనున్నారు. ఇంధన సామర్థ్యం, పరిరక్షణ ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, గ్లోబల్ వార్మింగ్‌పై దృష్టి సారించడం, ఇంధన వనరులను ఆదాచేసే ప్రయత్నాలను ప్రోత్సహించడం కోసం ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చెప్పారు. జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల ఏర్పాట్లపై ఏపీ డిస్కంలు, ఏపీఎస్ఈసీఎంతో ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర విద్యుత్‌శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సహకారంతో ఏపీఎస్ఈసీఎం పలు కార్యక్రమాలను నిర్వహించనుందని చెప్పారు. ఈ వారోత్సవాల్లో విద్యార్థులు, రైతులు, పారిశ్రామిక, స్వచ్ఛందసంస్థలు పాల్గొనేలా చూడాలని డిస్కంల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మ జనార్దనరెడ్డి, కె.సంతోషరావు, ఏపీఎస్ఈసీఎం సీఈవో బి.ఎ.వి.పి.కుమారరెడ్డిలను ఆయన కోరారు.

కర్ణాటక రాజ్‌భవన్‌కు బాంబు బెదిరింపు

శివాజీనగర: బెంగళూరులో రాజ్‌భవన్‌కు బాంబు బెదిరింపు కాల్ రావడంతో కొంతసేపు ఆందోళన నెలకొంది. సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో ఎన్ఐఏ కంట్రోల్ రూంకి ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి, రాజ్‌భవన్‌లో బాంబు పెట్టినట్లు చెప్పాడు. ఎన్ఐఏ సిబ్బంది నగర పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు, బాంబు స్క్వాడ్, జాగిలాలతో రాజ్‌భవన్‌కు చేరుకుని గాలింపు నిర్వహించారు. ఈ సమయంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ రాజ్‌భవన్‌లోనే ఉన్నారు. ఎలాంటి బాంబు లభించకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఉత్తుత్తి బెదిరింపు కాల్‌గా నిర్ధారణ అవడంతో విధాన సౌధ పోలీసులు కేసు నమోదు చేసి ఫోన్ చేసిన వ్యక్తి కోసం విచారణ చేపట్టారు. ఉప్పారపేటలో ఒక అనుమానితున్ని అదుపులోకి తీసుకున్నారు. అతడు మానసిక అస్వస్థుడని భావిస్తున్నారు.

కేసులపై బయటెక్కడా మాట్లాడొద్దు

- చంద్రబాబుకు సుప్రీంకోర్టు ఆదేశం
- స్కిల్ కేసుతోపాటు ఫైబర్‌నెట్ కేసుకూ ఇది వర్తిస్తుంది
- ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వచ్చే నెల 17కి వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ అధినేత చంద్రబాబు తనపై ఉన్న కేసుల గురించి బహిరంగంగా ఎక్కడా మాట్లాడవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాకు సూచించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసే కాకుండా ఫైబర్‌నెట్ కేసుకు కూడా ఇది వర్తిస్తుందని తేల్చిచెప్పింది. ఫైబర్‌నెట్ కుంభకోణానికి సంబంధించి చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బెయిల్ విషయాన్ని ప్రస్తావించారు. 'స్కిల్' కేసులో తానెలాంటి రాజకీయ ప్రకటన చేయనని చెప్పిన చంద్రబాబు డిసెంబర్ 8న దాన్ని ఉల్లంఘించారని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఇలాంటివి ఏమున్నా రికార్డు రూపంలో కోర్టుకు అందజేయాలని ధర్మాసనం పేర్కొంది. ఈ సమయంలో సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు గురించి చెప్పాల్సింది చాలా ఉందన్నారు. అనంతరం ఫైబర్‌నెట్ కేసు విచారణను జనవరి 17కి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. కోర్టు మౌఖికంగా గతంలో చెప్పింది (ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబుని అరెస్టు చేయబోమని) కొనసాగుతుందా అని లూథ్రా ధర్మాసనాన్ని కోరగా అవునని తెలిపింది. ఈ దశలో రంజిత్ కుమార్ జోక్యం చేసుకొని అయితే కేసులపై చంద్రబాబు ఎలాంటి ప్రకటన చేయరాదని కోరారు. ఈ బాధ్యత లూథ్రాదేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమకు బాధ కలిగించేది కాబట్టే ఇలా అడుగుతున్నామని రంజిత్ కుమార్ కోర్టు దృష్టికి తెచ్చారు. ''మీ క్లయింట్ కేసు గురించి ఎలాంటి ప్రకటన చేయకూడదు'' అని లూథ్రానుద్దేశించి జస్టిస్ బోస్ వ్యాఖ్యానించారు. 'స్కిల్' కేసులో పరిమిత ఆదేశాలు ఉన్నాయని.. వాటిని గౌరవిస్తున్నామని లూథ్రా పేర్కొన్నారు. ఏదేమైనప్పటికీ దగ్గరలో ఎన్నికలు లేవు కదా అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఏపీ అదనపు అడ్వొకేట్ జనరల్ కేసు గురించి ప్రకటనలు చేయడమే కాకుండా హైదరాబాద్, ఢిల్లీలో విలేకరుల సమావేశం నిర్వహించారని, తన గురించి కూడా మాట్లాడారని లూథ్రా కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే రికార్డు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసులో తీర్పు కోసం ఎదురుచూడడానికి వాయిదా పడిన మరో కేసులో సంయమనంతో ఉండాలని లూథ్రా అంటున్నారని రంజిత్ కుమార్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రెండువైపులా జంటిల్‌మెన్ వ్యవహారం ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

ఎమ్మెల్యేల వాగ్వాదంతో దద్దరిల్లిన అసెంబ్లీ

- గాలి జనార్దనరెడ్డి వర్సెస్ నారా భరత్‌రెడ్డి
- విధానసభ సమావేశంలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం


ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి


ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి

సాక్షి,బళ్లారి: గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన రెడ్డి, బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఇద్దరూ అసెంబ్లీలో తీవ్రంగా వాగ్వాదం చేసుకున్నారు. మంగళవారం బెళగావిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఇరువురు ఎమ్మెల్యేలు ఏకవచనంతో సంబోధించుకుని ఒకరిపై మరొకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడంతో వారి వ్యాఖ్యలు పతాకస్థాయికి చేరాయి. బళ్లారిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు సాకుతో నాడు రైతులపై కాల్పులు జరిపి అప్పటి బీజేపీ ప్రభుత్వ హయాంలో బలవంతంగా భూములను స్వాధీనం చేసుకున్నారని, బ్రాహ్మణి స్టీల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తామని భూములు కొనుగోలు చేసి, మళ్లీ అమ్ముకున్నారని నగర ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. బళ్లారి వాస్తవాలను తెలియజేసి అసెంబ్లీలో మీ అవినీతి చిట్టాను విప్పుతానని, పరిశ్రమల స్థాపన పేరిట భూములు స్వాధీనం చేసుకుని రైతులను మోసం చేశారని ఘాటుగా ఆరోపణలు చేశారు. దీనిపై ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి స్పందిస్తూ నారా భరత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

సెంటు భూమి ఉన్నా చూపాలని సవాల్

తనకు గాని, తన కుటుంబ సభ్యులకు గాని ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల ఒక సెంటు భూమి ఉన్నా చూపించాలని సవాల్ విసిరారు. తల, తోక లేకుండా మాట్లాడుతున్నారని భరత్‌రెడ్డిపై మండిపడ్డారు. అసెంబ్లీలో మాటల యుద్ధం పతాకస్థాయికి చేరుకుని ఇరువురు ఎమ్మెల్యేలు ఒకరిపై ఒకరు ఏకవచనంతో సంబోధించుకోవడంతో స్పీకర్ కలగజేసుకుని ఇరువురు ఎమ్మెల్యేలకు నచ్చజెప్పి కూర్చోవాలని, ఏకవచనంతో సంబోధించుకోకూడదని సూచించారు. గాలి జనార్దన రెడ్డి మాట్లాడుతూ సుప్రీంకోర్టులో ఉన్న విషయాలపై అసెంబ్లీలో మాట్లాడుతున్నారని, బళ్లారి నగర ఎమ్మెల్యేను కట్టడి చేయాలని స్పీకర్‌కు విన్నవించారు. ఇంతలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర కలగజేసుకుని మాట్లాడుతూ ప్రతి ఒక్క ఎమ్మెల్యే తన హయాంలో అభివృద్ధి చేయాలని భావిస్తారన్నారు. ప్రస్తుతం తాము అధికారంలో ఉన్నందున ఇచ్చితంగా బళ్లారిని సర్వతోముఖాభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. అయితే వ్యక్తిగత ఆరోపణలు చేసుకోవడం సరికాదని, ఈ విషయంలో స్పీకర్ కలగజేసుకుని తగిన విధంగా సూచించాలని కోరారు. దీంతో వ్యక్తిగతంగా ఒకరిపై మరొకరు వ్యాఖ్యలు చేసుకోకూడదని స్పీకర్ ఖాదర్ ఘాటుగా హెచ్చరించారు.

హంపీలో జిల్లాధికారి ఆకస్మిక తనిఖీ


హంపీని సందర్శిస్తున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: హంపీకి వచ్చే పర్యాటకులకు కనీస సౌకర్యాలు లేవని ఫిర్యాదులు అందడంతో మంగళవారం విజయనగర జిల్లాధికారి దివాకర్ ఆకస్మికంగా హంపీని సందర్శించి పరిశీలించారు. హంపీ విజయవిఠల దేవస్థానం వద్ద ఉన్న బ్యాటరీ వాహనాలను తనిఖీ చేశారు. రిపేరుకు వచ్చిన బ్యాటరీ వాహనాలను వెంటనే మరమ్మతు చేయించాలని సూచించారు. ఉన్న మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం హంపీలో పర్యాటకుల సందడి పెరగడంతో వచ్చే పర్యాటకులకు అన్ని విధాలుగా మౌలిక సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

టూరిస్ట్ గైడ్లు శిక్షణలో రాటుదేలాలి

హంపీలో టూరిస్ట్ గైడ్లు శిక్షణలో రాటుదేలాలని జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ సూచించారు. మంగళవారం కమలాపురలోని హోటల్ మయూర భువనేశ్వరిలో 179 మంది హంపీ టూరిస్ట్ గైడ్‌లకు ఏర్పాటు చేసిన శిక్షణా సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. హంపీ రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో పర్యాటక గైడ్‌లను కలిగి ఉందన్నారు. చారిత్రాత్మక హంపీని సందర్శించే పర్యాటకులకు నాణ్యమైన చరిత్రను అందించడానికి గైడ్ల కోసం ఈనెల 12 నుంచి 14 వరకు పునరుజ్జీవన శిక్షణ సదస్సును నిర్వహిస్తున్నారన్నారు. పర్యాటకులకు సరైన సేవలను అందించాలన్నారు. టూరిజం శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రభులింగ తలకేరి, రిటైర్డ్ ఏఎస్పై టీఎం కేశ్, హంపీ సీఐ శివరాజ్, ఇతర అధికారులు, టూరిస్ట్ గైడ్స్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

వేసవిని తలపిస్తున్న తాగునీటి ఎద్దడి


తాగునీటి కోసం ట్యాంకర్ వద్ద గుమికూడిన ప్రజలు

రాయచూరు రూరల్: నగరంలో తాగునీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వేసవిని తలపించే రీతిలో ఎదురైన తాగునీటి సమస్య నివారణకు ప్రభుత్వం, నగరసభ యంత్రాంగం చర్యలు తీసుకుంటామని ఒక వైపు చెబుతుండగా మరోవైపు నీటి ఎద్దడి మరింత అధికమైంది. నగరంలో జలనిర్మల పథకం కింద రూ.వందల కోట్లు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయింది. నగరంలో ఐదు రోజులకొకసారి తాగునీటిని వదులుతున్నారు. 1వ వార్డు నుంచి 10వ వార్డుకు తుంగభద్ర ఎడమ కాలువ నీటిని రాంపూర్ జలాశయం నుంచి విడుదల చేస్తారు. 11వ వార్డు నుంచి 33వ వార్డు వరకు కృష్ణా నది నుంచి నేరుగా చిక్కసూగూరు నీటి ట్యాంక్‌కు నీరు వదులుతారు. నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో 16వ వార్డు నగరసభ సభ్యురాలు గాయత్రి స్వంత ఖర్చుతో మంగళవారం వార్డు ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరడంతో కాంగ్రెస్ నేతలు ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని నగరసభ కమిషనర్ గురుసిద్దయ్యతో చర్చించారు.

మానవ హక్కులపై ప్రతిజ్ఞ


ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ శివరాజ్, సిబ్బంది

కంప్లి: మరొకరి స్వాతంత్య్రాన్ని గౌరవించి బతికేదే మానవ హక్కుల మూల ఉద్దేశం అని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. తాలూకా కార్యాలయ సభాంగణంలో ఏర్పాటు చేసిన మానవ హక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కులు, వాటి రక్షణ గురించి వివరించారు. అనంతరం ప్రతిజ్ఞావిధిని బోధించి మానవ హక్కుల జాగృతి, శిక్షణ, ఆశ్రయంపై తహసీల్దార్‌కు సమాచారం అందించారు.

సంగీతాభిమానుల రారాజు


రాజు(కుడి)ను అభినందిస్తున్న హంసలేఖ(ఫైల్)

కంప్లి: జిల్లాలోని ఎమ్మిగనూరు అనే కుగ్రామానికి చెందిన రాజు అనే సంగీతకారుడు సంగీతాభిమానుల మన్ననలు పొందాడు. ఎమ్మిగనూరు గ్రామంలో బయలాట కళాకారుడు బసవరాజ్, హులిగమ్మ దంపతుల రెండో కుమారుడు రాజుతో పాటు అతడి సోదరుడిని వారి తండ్రి బసవరాజ్ బయలాటల్లో నటించి ఇద్దరు కుమారులను బయలాట కళాకారులుగా తీర్చిదిద్దారు. బసవరాజ్ రెండో కుమారుడు రాజు 1వ తరగతి నుంచి ఎమ్మిగనూరు గ్రామంలోనే విద్యాభ్యాసం చేశాడు. బాల్యం నుంచే సంగీత పాఠాలు నేర్చుకుంటూ ప్రాథమిక, హైస్కూల్, పీయూసీతో పాటు డిగ్రీ విద్యనభ్యసించడంతో పాటు సంగీత అభ్యాసాన్ని గదగ్ వీరేశ్వర పుణ్యాశ్రమ గురువులు పంచాక్షరి అణ్ణిగేరి వద్ద 12 ఏళ్ల పాటు హిందూస్తానీ, సుగమ సంగీతం, నేర్చుకున్నారు. ధార్వాడ యూనివర్శిటీలో ఎంఏ పూర్తి చేశారు. ఉపన్యాసకులు శ్రీపాద హెగ్డే వద్ద భావగీతరాగ సంయోజనం నేర్చుకున్నారు. అనంతరం బెంగళూరు పాఠశాలలో సంగీత ఉపాధ్యాయునిగా పని చేస్తుండగా ప్రేమలోక అనే కన్నడ చిత్రంతో యువత మనసు దోచుకున్న స్వరమాంత్రికుడు హంసలేఖ దృష్టిలో పడ్డాడు. భావతీరపు కెరటాలు, భావభక్తి మాధుర్యం, ఆల్బమ్‌సాంగ్ తయారు చేసి సంగీత ప్రియుల హృదయాల్లో నిలిచారు. ఇక పుట్టరాజ గవాయి శిష్యునిగా సంగీతంలో మరింత పేరు గడించి చివరికి బెంగళూరులో జీ కన్నడ సరిగమ వేదిక జ్యూరీమెంబర్‌గా పదవిని అలంకరించారు. జిల్లాలోని కుగ్రామమైన ఎమ్మిగనూరు నుంచి ఇలాంటి సంగీత కుసుమం వికసించి ఎంతో మంది సంగీత ప్రియులకు చేరువయ్యారు. భవిష్యత్తులో రాజు మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనసారా కోరుకుందామా మరి.

రంగస్థల కళను కాపాడుకోవాలి


నాటక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రముఖులు

గంగావతి: రంగస్థల కళ కనుమరుగు కాకుండా కాపాడుకుంటూ వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నేత కేఎం. సయ్యద్ పేర్కొన్నారు. ఆయన సోమవారం రాత్రి కొప్పళ తాలూకాలోని ఆగళకేరా గ్రామంలో మహారుద్రేశ్వర కార్తీక మహోత్సవాన్ని పురస్కరించుకోవడం సతీ సంసారజ్యోతి అనే నాటక ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. రంగస్థల కళల్లో కుల మత ప్రాంతీయ భేదాలు లేకుండా మానవత్వాన్ని ఎత్తి చూపే విలువ కలిగిన సారాంశం నాటకాల ద్వారా ప్రదర్శిస్తారన్నారు. మత సామరస్యాన్ని కాపాడేది రంగస్థల కళలే అన్నారు. నేటి సినిమా పోటీల్లో ఇలాంటి కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత తమ అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కనకరాయ, నాగరాజ్, వలీసాబ్ పోలీస్ పాటిల్, గిరీష్ హిరేమఠ తదితరులు పాల్గొన్నారు.

తరగతులు బహిష్కరించి నిరసన


కళాశాల గేట్ ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు

హొసపేటె: అతిథి అధ్యాపకుల డిమాండ్లను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని ఒత్తిడి చేస్తూ తరగతులను బహిష్కరించి సోమవారం వేలాది మంది శంకర్ ఆనంద్‌సింగ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు కాలేజీ ముందు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కాలేజీ అతిథి ఉపన్యాసకులు తమకు సేవా భద్రత కల్పించాలని తరగతులను బహిష్కరించి ధర్నా చేపట్టడంతో తరగతుల్లో పాఠాల బోధన నిలిచిపోయిందన్నారు. గత 15 రోజులుగా తరగతులు జరగడం లేదని మండిపడ్డారు. విద్యార్థులు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

విధుల్లోకి తీసుకోవాలని ధర్నా


రైల్వే స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న కూలి కార్మికులు

హొసపేటె: రైల్వే సఫాయి కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైల్వే స్టేషన్ వద్ద కార్మికులు ధర్నాకు దిగారు. కార్మికురాలు రంగమ్మ మాట్లాడుతూ గత 8 ఏళ్ల నుంచి కాంట్రాక్టు కింద స్వచ్ఛత పనులను నిర్వహిస్తున్నామన్నారు. గత నెల నుంచి జీతంలో సగం డబ్బులు మాత్రమే ఇచ్చారన్నారు. ఈ విషయమై అధికారులను అడిగితే 17 మంది ఔట్ సోర్సింగ్ క్లీనింగ్ సిబ్బందిని ఆకస్మికంగా తొలగించారన్నారు. తమ కళ్ల ముందు జరుగుతున్న అన్యాయాన్ని ఖండిస్తూ పారిశుద్ధ్య కార్మికులకు సీఐటీయూ సంస్థ మద్దతు తెలిపిందన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. చాలా ఏళ్లుగా హొసపేటె రైల్వే స్టేషన్‌లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ క్లీనింగ్ వర్కర్లను విధుల్లో నుంచి తొలగిస్తే తాము ఎక్కడికి వెళ్లాలి? అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎంపీని తొలగించాలని ర్యాలీ


నిరసన ప్రదర్శనలో పాల్గొన్న బీజేపీ నేతలు, కార్యకర్తలు

హొసపేటె: కాంగ్రెస్ నేత, ఒడిశా ఎంపీ ధీరజ్ సాహు ఇంట్లో రూ.350 కోట్లకు పైగా అక్రమాస్తులు బయటపడడాన్ని నిరసిస్తూ బీజేపీ కార్యాలయం నుంచి పునీత్ రాజ్‌కుమార్ సర్కిల్ వరకు బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎస్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఒడిశా ఎంపీని వెంటనే పదవీచ్యుతుడిని చేసి, ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఒత్తిడి చేశారు. బీజేపీ నేతలు అశోక్ జీరే, బీటీ దయానంద, మల్లికార్జున, జిల్లా రైతు మోర్చా ఉపాధ్యక్షుబడు సూగూరు చిదానంద, మండల అధ్యక్షుడు కాశెట్టి ఉమాపతి, సాలిసిద్దయ్య స్వామి, మండల ప్రధాన కార్యదర్శి శంకర్ మేటి, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వివాహ సేవలో హిజ్రా

- భిక్షాటనతో సంపాదించిన సొమ్ము సేవా కార్యక్రమానికి ఖర్చు


సామూహిక వివాహాల్లో పాల్గొన్న జంటలు, హిజ్రా జమున

గంగావతి: భిక్షాటనతో కూడబెట్టుకున్న సొమ్ముతో పేదలకు ఉచిత సామూహిక వివాహాలను నాలుగేళ్ల పాటు ఓ హిజ్రా చేస్తుండటం గౌరవించదగ్గ విషయం. కారటగి తాలూకాలోని బెన్నూరు గ్రామానికి చెందిన జమున అనే హిజ్రా ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాదే చేపట్టారు. రెండు నవ జంటలకు తాళిబొట్లు, వస్త్రాలు, భోజన సదుపాయాలను తన ఖర్చుతో కల్పించి వివాహం చేశారు. ప్రతి ఏటా ఇలాగే భిక్షాటన చేసి సంపాదించిన సొమ్ముతోనే ఇలాంటి సేవకు పూనుకోవడం శ్లాఘనీయం అని ప్రముఖులు తెలిపారు. ఈ సందర్భంగా జమున మాట్లాడుతూ తమకు ఎలాగూ వివాహం చేసుకొనే భాగ్యం దేవుడు కల్పించలేదన్నారు. వివాహాలు చేసుకోవాలంటే కనీస ఖర్చులకు నోచుకొని పేదలకైనా ఇలాంటి సేవను అందించాలని నిర్ణయించుకొన్నట్లు తెలిపారు. తమకు ఇప్పటికీ సమాజంలో మచ్చ ఉందన్నారు. తాము బస్సు ఎక్కి కూర్చుంటే చుట్టుపక్కల వారు వివక్షగా చూస్తుండటాన్ని చిన్న చూపుగా తాము భావిస్తున్నామన్నారు. సమాజంలో సేవాకాంక్షతో పని చేస్తే ఎలాంటి వారన్న భేదాభిప్రాయం లేదని జమున నిరూపించారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జమున పోటీ చేసి కేవలం కొద్ది ఓట్ల తేడాతోనే ఓడిపోయారు. చివరిగా ఆమె ప్రజల సహకారం ఉంటే మరిన్ని సేవలు అందిస్తానన్నారు.


భగీరథ రథయాత్రకు ఘన స్వాగతం


రథయాత్రలో పాల్గొన్న ఉప్పార సమాజ బాంధవులు

బళ్లారిఅర్బన్: దేశ వ్యాప్తంగా ఉప్పార సమాజాన్ని ఏకం చేసేందుకు ఉత్తర భారతంలోని అయోధ్య గంగోత్రి నుంచి ఈ నెల 8న భగీరథ మహర్షి అఖిల భారత ఉప్పార సమాజ జనకళ్యాణ రథయాత్రను ప్రారంభించినట్లు ఆ సమాజ ప్రముఖుడు ఉప్పార మల్లప్ప తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక మున్సిపల్ మైదానానికి జన కళ్యాణ రథయాత్ర చేరుకున్న సందర్భంగా భగీరథ పీఠానికి చెందిన పురుషోత్తమానందపురి మహాస్వామీజీ, సమాజ బాంధవులతో కలిసి రథయాత్రకు స్వాగతం పలికి మాట్లాడారు. అనంతరం నగరంలోని మున్సిపల్ మైదానం, రాయల్ సర్కిల్, బెంగళూరు రోడ్డు, తేరు వీధి, కాళమ్మ బజార్ మీదుగా ఫుట్‌బాల్ సభాంగణం వరకు యాత్ర కొనసాగింది. తర్వాత ఫుట్‌బాల్ సభాంగణంలో ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని స్వామీజీ ప్రారంభించి మాట్లాడారు. ఉప్పార సమాజాన్ని ఐక్యం చేసి ముందుకు తీసుకెళ్లాలన్నారు. విద్యా, రాజకీయ రంగాల్లో రాణించాలని, ఈ యాత్రను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీరాములు, కాంగ్రెస్ ప్రముఖుడు వెంకటేష్ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ కేఎస్ దివాకర్, ఉప్పార సమాజ ప్రముఖులు యూ.వెంకోబ, ఎర్రిస్వామి, హనుమేష్, దుర్గేష్, నాగరాజు, వీరేష్, ఆంజనేయలు, ఉరుకుంద మల్లప్ప, గోవర్ధన్, కవిత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

బళ్లారిఅర్బన్: కార్తీకమాసం ముగింపు అనంతరం నగరవాసులు మంగళవారం ఆలయాల్లో అమావాస్య పూజలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నగర ప్రజల ఆరాధ్య దైవం కనకదుర్గమ్మ ఆలయంలో అమావాస్య కలిసి రావడంతో అమ్మవారికి వెండి ఆభరణాల అలంకరణ పూజలు నిర్వహించినట్లు దేవస్థానం ఈఓ హనుమంతప్ప, ధర్మకర్త రాజశేఖర్ తెలిపారు. కాగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు బారులు తీరారు. అల్లీపుర మహదేవ తాత ఆలయంలో తాతకు విశేష అలంకరణ, దర్శనం కల్పించి, భక్తులకు అన్నదానం చేశారు. మిల్లర్‌పేట మల్నాడు దుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ పూజలు, మహామంగళారతి, భజనలు చేసి ప్రసాదం పంపిణీ నిర్వహించారు. తాలూకాలోని దమ్మూరు వెంకప్ప తాతకు అమావాస్య పూజలు జరిపారు. అలాగే నగరంలోని వివిధ ఆలయాల్లో కూడా అమావాస్య పూజలు నెరవేర్చారు.


బళ్లారి కనకదుర్గమ్మకు వెండి ఆభరణాల అలంకరణ


మిల్లర్‌పేట మల్నాడు దుర్గమ్మకు ఆభరణాలు, పూలతో అలంకరణ


అల్లీపుర మహదేవతాతకు అరటి కాయలతో అలంకరణ


దమ్మూరు వెంకప్ప తాతకు పూలతో అలంకరణ

క్లుప్తంగా

కనకదాస ప్రతిమ ఊరేగింపు


కనకదాస ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

సిరుగుప్ప: తాలూకాలోని బాగేవాడి గ్రామంలో మంగళవారం దాస శ్రేష్ఠ కనకదాస జయంతిని నిర్వహించారు. ముందుగా కనకదాస ప్రతిమతో గ్రామంలోని ప్రముఖ వీధుల్లో డోలు, తప్పెట్లను వాయిస్తూ కనకదాస కీర్తనలు ఆలపించి, భజన చేసిన కళాబృందాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, హాలుమతస్తులు, కురబ సమాజ సోదరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం


మాట్లాడుతున్న అయ్యన్న

రాయచూరు రూరల్: రాయచూరు థర్మల్ విద్యుత్ కేంద్రం(ఆర్‌టీపీఎస్)లో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న కార్మికులకు అన్యాయం జరిగిందని కాంట్రాక్ట్ కార్మికుల సంఘం అధ్యక్షుడు అయ్యన్న పేర్కొన్నారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25–30 ఏళ్ల పాటు కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయడానికి నియమించిన ఉప సమితి నేడు చేతులెత్తేసిందని ఆరోపించారు. పీఎఫ్, జీపీఎఫ్ వంటివి ఇచ్చిన పాలక మండలి నేడు వారిని పర్మినెంట్ చేసుకునే అవకాశం లేదని చెప్పడంతో వారి కుటుంబాలు వీధిన పడతాయన్నారు. రాజకీయ నాయకుల కుట్రలతో కార్మికుల భవిష్యత్తు అంధకారం అయిందన్నారు.

తాగునీటిని అందించరూ


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరవాసులకు సక్రమంగా తాగునీటిని అందించడంలో నగరసభ విఫలమైందని, నగరంలో తాగునీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని దళిత సంఘర్ష సమితి పేర్కొంది. మంగళవారం నగరసభ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి సమితి సంచాలకుడు నరసింహులు మాట్లాడారు. తాలూకాలో కృష్ణా, తుంగభద్ర నదులు ప్రవహిస్తున్నా నగరసభ తాగునీటిని సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. నగర ప్రజలకు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతూ నగరసభ కమిషనర్ గురుసిద్దయ్యకు వినతిపత్రం సమర్పించారు.

జ్వరంతో బాలిక మృతి


రోషిణి మృతదేహం

గుత్తి రూరల్: మండలంలోని ఊటకల్లు గ్రామంలో తీవ్ర జ్వరంతో రోషిణి (11) అనే బాలిక మృతి చెందింది. బాలిక కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బళ్లారికి చెందిన జాఫర్‌వలి అనే వ్యక్తి కుటుంబసభ్యులతో కలసి ఊటకల్లు గ్రామంలో జరిగే బంధువుల దినకర్మకు వచ్చాడు. అయితే వారు బళ్లారి నుంచి వచ్చేటప్పటికే రోషిణికి జ్వరం ఉండేది. దీంతో సోమవారం ఉదయం గ్రామంలో ఓ వైద్యునితో చికిత్స చేయించి సూది వేయించారు. రాత్రి 10 గంటల సమయంలో రోషిణిని తల్లిదండ్రులు నిద్రలేపగా ఎంతకీ లేవలేదు. అనుమానం వచ్చిన వారు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రోషిణి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రోషిణి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

తపాలా ఉద్యోగుల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

రాయచూరు రూరల్: తపాలా ఉద్యోగుల వేతన బకాయిలను చెల్లించాలని భారతీయ గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం ప్రధాన తపాలా శాఖ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు దొడ్డయ్యస్వామి మాట్లాడారు. ప్రధానంగా రోజుకు 5 గంటలు పని, పెన్షన్, సీనియారిటీ, పీఎఫ్, జీపీఎఫ్ అమలు చేయాలన్నారు. బీమా పాలసీ పరిమితిని రూ.5 లక్షల వరకు పెంచాలని, కింది స్థాయి ఉద్యోగులపై పని భారాన్ని తగ్గించాలని, వైద్య ఖర్చులు భరించాలని కోరుతూ తపాలా శాఖాధికారికి వినతిపత్రం సమర్పించారు.

మనిషికి స్వార్థం తగదు


పుస్తకాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: బలిష్ట సమాజ నిర్మాణానికి మానవుడు స్వార్థాన్ని విడనాడాలని కలబుర్గి సీనియర్ సాహితీవేత్త ఆర్.జి.హుడికి పేర్కొన్నారు. మంగళవారం కన్నడ భవనంలో పురుషోత్తం కలాల్ బండి స్మరణార్థం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పుస్తకాన్ని విడుదల చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కళలను ప్రోత్సహించాలన్నారు. సామాజిక, విద్యా, సంగీత రంగానికి చేసిన సేవలను గుర్తించాలన్నారు. సమావేశంలో పురుషోత్తం కలాల్ బండి అభిమానుల సంఘం అధ్యక్షుడు బసవరాజ్ కళస, బసవరాజ్, రాఘవేంద్ర కుష్టిగి, మీనాక్షి బాళే, రమేష్, దేవేంద్రగౌడ తదితరులున్నారు.

అధికారిని సస్పెండ్ చేయండి


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా సాంఘీక సంక్షేమ శాఖ హాస్టల్‌లో భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యేందుకు కారకుడైన సాంఘీక సంక్షేమ శాఖాధికారిని సస్పెండ్ చేయాలని దళిత సంఘర్ష సమితి డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు శరణప్ప దిన్ని మాట్లాడారు. విద్యార్థుల సంక్షేమం పట్ల సాంఘీక సంక్షేమ శాఖాధికారి మహేష్ పోతేదార్ నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. గతంలో రాయచూరు, లింగసూగూరు తాలూకాల్లో ఇలాంటి సంఘటనలు జరిగినా సరిగా స్పందించక పోవడాన్ని తప్పుబట్టారు. విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు సమకూర్చడంలో అసమర్థుడైన అలాంటి అధికారిని సస్పెండ్ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం


మాట్లాడుతున్న మమతా పాటిల్

రాయచూరు రూరల్: రక్తహీనత బారిన పడిన యువత, బాలింతలకు పౌష్టికాహారం అవసరమని కలబుర్గి వైద్య కళాశాల రక్తనిధి అధికారిణి మమతా పాటిల్ అభిప్రాయపడ్డారు. మంగళవారం కలబుర్గిలోని వీరమ్మ గంగసిరి మహిళా జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తహీనత రహిత పౌష్టిక కర్ణాటక అనే చర్చాగోష్టిని ప్రారంభించి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలను అపౌష్టికత బారిన పడకుండా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సిద్దరామ, ప్రిన్సిపాల్ సంగమేశ, ఎస్ఎస్ఎస్ అధికారి మహేష్, సుష్మ, సుమతి, నందిని, లక్ష్మీకాంత్, మోహన్‌రాజ్, రేణుక, జ్యోతిలున్నారు.

లింగాధారిత హింస అరికట్టండి


అభియాన్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

హొసపేటె: లింగాధారిత హింసను అరికట్టేందుకు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ముమ్మర ప్రచారం చేయాలని టీపీ ఈఓ ఎం.ఉమేష్ తెలిపారు. సోమవారం లింగాధారిత హింస నిరోధక అభియాన్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. సమాజంలో స్త్రీలు దోపిడీకి గురి కాకుండా ఆర్థికంగా, విద్యాపరంగా సాధికారత సాధించి ఒకరికొకరు సాయపడాలన్నారు. ఈ నేపథ్యంలో లింగాధారిత హింసను నిరోధించడానికి సంజీవిని–స్కీమ్‌ను తాలూకా పంచాయతీ ద్వారా ప్రచారం ప్రారంభించామన్నారు. తాలూకాలోని 14 జీపీ యూనియన్లలో ఈ ప్రచారాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎన్ఆర్ఎల్ ఎం సంజీవిని స్కీమ్ అసిస్టెంట్ డైరెక్టర్లు, మేనేజర్లు, తాలూకా ప్రోగ్రాం మేనేజర్లు, జోనల్ సూపర్‌వైజర్లు, యువత, మహిళలు పాల్గొన్నారు.